


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00

సంపుటి: 18
సంచిక: 181

ఆదివారం 21-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



చైనా మాస్టర్స్ టోర్నీ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడీ


షెన్‌జెన్ (చైనా): భారత అగ్రశ్రేణి జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి వరుసగా రెండో టోర్నీలో ఫైనల్లోకి దూసుకెళ్లింది. చైనా మాస్టర్స్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం టైటిల్ పోరుకు అర్హత సంపాదించింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో ఎనిమిదో సీడ్ భారత జోడీ వరుస సెట్లలో మాజీ ప్రపంచ చాంపియన్స్, రెండో సీడ్ ఆరోన్ చియా-సో వూయిక్ (మలేసియా) జంటపై అద్భుత విజయం సాధించింది. సాత్విక్-చిరాగ్ ద్వయం 21-17, 21-14తో మలేసియన్ ప్రత్యర్థి జంటను ఓడించింది. రెండు సార్లు ఒలింపిక్ పతకాలు నెగ్గిన ప్రత్యర్థి జంట ఈ సెమీస్ మ్యాచ్‌కు ముందు భారత ద్వయంపై 11-4 తేడాతో ఆధిపత్యంలో ఉంది. అలాంటి జోడీపై సాత్విక్-చిరాగ్‌లు ఈ సెమీస్‌లో మాత్రం చెలరేగారు. కేవలం 41 నిమిషాల్లోనే ప్రత్యర్థి ఆట కట్టించి విజయం సాధించారు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో హాంకాంగ్ ఓపెన్ బరిలోకి దిగిన భారత జంట రన్నరప్‌గా నిలిచింది. ఇప్పుడు ఇదే ఉత్సాహంతో టైటిల్‌పై కన్నేసింది. నేడు జరిగే ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడీ టాప్ సీడ్ కిమ్ వోన్ హో-సియో సియంగ్ జే జంటతో తలపడుతుంది.

'నో షేక్ హ్యాండ్' తర్వాత
మరో సమరం

- నేడు భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్
- అన్ని రంగాల్లో పటిష్టంగా టీమిండియా
- ప్రతీకారంపై పాక్ దృష్టి
- రా.గం.8.00 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



సూర్యకుమార్



సల్మాన్ ఆగా

దుబాయ్: ఆసియా కప్‌లో సరిగ్గా వారం రోజుల తర్వాత మళ్లీ భారత్, పాకిస్తాన్ మధ్య మరో మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. టోర్నీ సూపర్-4 దశలో భాగంగా జరిగే పోరులో ఇరు జట్లు మళ్లీ తలపడుతున్నాయి. ఏకపక్షంగా సాగిన గత మ్యాచ్‌లో భారత్ అలవోక విజయం సాధించి తమ స్థాయిని ప్రదర్శించింది. అయితే ఓటమి అనంతరం పాక్ క్రికెటర్లతో మన ఆటగాళ్లు 'షేక్ హ్యాండ్' ఇచ్చేందుకు నిరాకరించడం, తదనంతర పరిణామాల్లో పాక్ తీవ్ర అసంతృప్తి ప్రదర్శించి వివాదానికి దారి తీయడం జరిగాయి. ఈ నేపథ్యంలో దాయాది జట్ల పోరు సహజంగానే ఆసక్తిని రేపుతోంది. లీగ్ దశలో పాక్ ఆటతీరు చూస్తే టీమిండియాకు మళ్లీ ఎదురు ఉండకపోవచ్చు. దుబాయ్‌లో రికార్డు, పరిస్థితి బట్టి చూస్తే టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవచ్చు. మరో వైపు పాక్ అభ్యంతరాలను పట్టించుకోకుండా ఐసీసీ ఈ మ్యాచ్‌కు కూడా ఆండీ పైక్రాఫ్ట్‌నే రిఫరీగా ఎంపిక చేయడం విశేషం.

అక్షర్ దూరం!

ఒమన్‌తో మ్యాచ్‌లో భారత్ ఇద్దరు కీలక ఆటగాళ్లు బుమ్రా, వరుణ్ చక్రవర్తిలకు విశ్రాంతినిచ్చింది. వీరిద్దరు పాక్‌తో మ్యాచ్‌కు అందుబాటులోకి రావడం ఖాయం. అయితే ఫీల్డింగ్ చేస్తూ తలకు దెబ్బ తగిలిన అక్షర్ పటేల్ ఆడటం సందేహంగానే ఉంది. కాబట్టి అర్ష్‌దీప్, హర్షిత్ రాణాలలో ఒకరు తమ స్థానాన్ని నిలబెట్టుకోవచ్చు. మిగతా తుది జట్టు కూర్పులో మాత్రం ఎలాంటి మార్పు ఉండదు. అభిషేక్ శర్మ దూకుడును నిలువరించడం పాక్‌కు కష్టం కావచ్చు. అయితే వైస్ కెప్టెన్ శుబ్‌మన్ వరుస వైఫల్యం ఒక్కటే జట్టులో ఆందోళన కలిగించే అంశం. మూడు మ్యాచుల్లోనూ అతను విఫలమయ్యాడు. గత మ్యాచ్‌లో పరిస్థితిని బట్టి నెమ్మదిగా ఆడినా...సత్తా చాటే స్థాయి సామ్సన్‌కు ఉంది. సూర్యకుమార్, పాండ్యా, దూబే, తిలక్ వర్మ బ్యాటింగ్ పదును కలిసొస్తే టీమిండియాకు ఎదురుండదు. బుమ్రా, కుల్దీప్, వరుణ్‌లు ప్రత్యర్థిని కుప్పకూల్చగల సమర్థులు.

గెలిపించేదెవరు!

బలహీన జట్లపై కూడా వంద పరుగులు దాటేందుకు పాకిస్తాన్ తిప్పలు పడుతోంది. ఇలాంటి స్థితిలో భారత్‌పై గెలిచి ప్రతీకారం తీర్చుకోవాలని పట్టుదలగా ఉన్నా... అది అంత సులువు కాదు. ప్రధాన బ్యాటర్ అయిన అయూబ్ మూడు మ్యాచ్‌లలో డకౌట్ కాగా, ఒక్కరు కూడా దూకుడుగా ఆడలేకపోతున్నారు. అసలు ఏ బ్యాటర్ నుంచి కూడా టి20 తరహా మెరుపులు రావడం లేదు. ఫర్హాన్, హసన్, హారిస్ ప్రభావం చూపక పోగా, కెప్టెన్ సల్మాన్ ఆగాలో కూడా అలాంటి ధాటి లేదు. బౌలింగ్‌లో షాహిన్ అఫ్రిది మాత్రమే కాస్త ఫర్వాలేదనిపిస్తుండగా... మిగతా బౌలర్లలో ఎలాంటి పదును లేదు. రవూఫ్, అబ్రార్‌లను భారత్ సునాయాసంగా ఎదుర్కోగలదు. ఈ స్థితిలో పాక్ ఎలా కోలుకుంటుందో చూడాలి.

ఆసియా కప్
శ్రీలంకపై బంగ్లాదేశ్ విజయం
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

స్మృతి రికార్డు సెంచరీతో
చెలరేగినా...!

మూడో వన్డేలో 43 పరుగులతో భారత మహిళల జట్టు ఓటమి

ఆస్ట్రేలియా **412**

భారత్ **369**

- 2-1తో సిరీస్ ఆసీస్ వశం
- బెత్ మూనీ భారీ సెంచరీ



'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' స్మృతి

ఆహా... ఏమా ఆట... ఏమా పోరాటం! బంతి బెంబేలెత్తిపోయేలా... బౌండరీలు చిన్నబోయేలా సాగిన పోరులో టీమిండియా పరాజయం పాలైనా... తమ ఆటతీరుతో అభిమానులను ఆకట్టుకుంది. బెత్ మూనీ భారీ సెంచరీతో ఆఖరి వన్డేలో ఆస్ట్రేలియా రికార్డు స్కోరు చేయగా... స్మృతి మంధాన వీరవిహారం చేయడంతో ఒక దశలో గెలుపు సులువే అనిపించినా... ఆఖరికి భారత మహిళల జట్టుకు ఓటమి తప్పలేదు. హర్మన్‌ప్రీత్ బృందం సిరీస్ కోల్పోయినా.. వన్డే ప్రపంచకప్‌నకు ముందు అవసరమైన ఆత్మవిశ్వాసాన్ని అందుకుంది!

న్యూఢిల్లీ: పరుగుల వరద పారిన పోరులో భారత మహిళల క్రికెట్ జట్టు పోరాడి ఓడింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన ఆఖరి వన్డేలో హర్మన్‌ప్రీత్‌కౌర్ సారథ్యంలోని భారత జట్టు 43 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. దీంతో ఆసీస్ 2-1తో సిరీస్ చేజిక్కించుకుంది. మొదట ఆస్ట్రేలియా 47.5 ఓవర్లలో 412 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బెత్‌మూనీ (75 బంతుల్లో 138; 23 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ సెంచరీతో విజృంభించగా... జార్జియా వాల్ (68 బంతుల్లో 81; 14 ఫోర్లు), ఎలీస్ పెర్రీ (72 బంతుల్లో 68; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. ఛేదనలో భారత జట్టు 47 ఓవర్లలో 369 పరుగులకు ఆలౌటైంది. స్మృతి మంధాన (63 బంతుల్లో 125; 17 ఫోర్లు, 5 సిక్స్‌లు) సుడిగాలి సెంచరీతో ప్రత్యర్థిని వణికించగా... దీప్తి శర్మ (58 బంతుల్లో 72; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (35 బంతుల్లో 52; 8 ఫోర్లు) హాఫ్‌సెంచరీలతో మెరిశారు. చివర్లో స్నేహ్ రాణా (35; 3 ఫోర్లు) పోరాడినా... టీమిండియా లక్ష్యానికి 43 పరుగుల దూరంలో నిలిచిపోయింది. మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించేందుకు ఈ మ్యాచ్‌లో భారత జట్టు గులాబీ రంగు జెర్సీలు ధరించి ఆడింది.

సూపర్ స్మృతి ...

ఆస్ట్రేలియాపై ఇప్పటి వరకు వన్డే సిరీస్ గెలవని భారత జట్టు... కొండంత లక్ష్యం ముందున్నా ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. ప్రతీక రావల్ (10), హర్లీన్ డియోల్ (11) విఫలమైనా... స్మృతి మంధాన చెలరేగిపోయింది. మూడో ఓవర్‌లో 'హ్యాట్రిక్' ఫోర్లు బాదిన మంధాన... ఐదో ఓవర్‌లో 6, 4 కొట్టింది. ఆరో ఓవర్‌లో 4, 4, 6.. తదుపరి ఓవర్‌లో మరో రెండు ఫోర్లతో 23 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకుంది. జోరుమీదున్న మంధానకు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ తోడవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఈ క్రమంలో మంధాన 50 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకుంది. మరో వైపు 32 బంతుల్లో హర్మన్ హాఫ్‌సెంచరీ పూర్తైంది. దీంతో 20 ఓవర్లు ముగిసే సరికి భారత్ 204/2తో నిలిచింది. ఇక గెలుపు సులభమే అనుకుంటుండగా... హర్మన్ అవుటైంది. కాసేపటికి స్మృతి కూడా వెనుదిరగ్గా... రిచా ఘోష్ (6) దురదృష్టవశాత్తు రనౌటైంది. ఒక దశలో టీమిండియా 289/7తో ఓటమి అంచులో నిలిచింది. ఈ సమయంలో స్నేహ్ రాణా అండతో దీప్తి శర్మ పోరాడింది. 48 బంతుల్లో 61 పరుగులకు చేయాల్సిన దశలో దీప్తి అవుట్ కావడంతో జట్టుకు పరాజయం తప్పలేదు.



2 మహిళల అంతర్జాతీయ వన్డేల్లో వేగవంతమైన (50 బంతుల్లో) సెంచరీ చేసిన రెండో ప్లేయర్‌గా స్మృతి నిలిచింది. ఆసీస్ ప్లేయర్ లానింగ్ (45 బంతుల్లో; న్యూజిలాండ్‌పై) అగ్రస్థానంలో ఉంది. భారత జట్టు తరఫున ఇదే వేగవంతమైన శతకం కాగా... గతంలో ఆమె 70 బంతుల్లో చేసిన సెంచరీ ఇప్పుడు రెండో స్థానానికి చేరింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా మహిళల ఇన్నింగ్స్: హీలీ (సి) హర్మన్‌ప్రీత్ (బి) క్రాంతి 30; జార్జియా (సి) (సబ్) ఉమ 81; పెర్రీ (సి) క్రాంతి (బి) అరుంధతి 68; మూనీ (రనౌట్) 138; గార్డ్‌నర్ (సి) రాధ (బి) రేణుక 39; తహిలా (ఎల్బీ) (బి) దీప్తి 14; గ్రేస్ (సి అండ్ బి) దీప్తి 1; జార్జియా (సి) హర్మన్‌ప్రీత్ (బి) రేణుక 16; అలానా (సి) స్నేహ్ రాణా (బి) అరుంధతి 12; గార్త్ (సి అండ్ బి) అరుంధతి 1; షుట్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (47.5 ఓవర్లలో ఆలౌట్) 412. వికెట్ల పతనం:** 1-43, 2-150, 3-256, 4-338, 5-378, 6-379, 7-380, 8-399, 9-406, 10-412. **బౌలింగ్:** క్రాంతి 6-0-56-1; రేణుక 9-0-79-2; స్నేహ్ రాణా 10-0-68-1; అరుంధతి 8.5-0-86-3; దీప్తి 10-0-75-2; రాధ 4-0-48-0.

భారత మహిళల ఇన్నింగ్స్: ప్రతీక (సి) మూనీ (బి) గార్త్ 10; స్మృతి (సి) గార్డ్‌నర్ (బి) గ్రేస్ 125; హర్లీన్ (సి) మూనీ (బి) షుట్ 11; హర్మన్‌ప్రీత్ (ఎల్బీ) (బి) గార్త్ 52; దీప్తి (సి) (సబ్) నాట్ (బి) తహిలా 72; రిచ (రనౌట్) 6; రాధ (సి) వాల్ (బి) జార్జియా 18; అరుంధతి (ఎల్బీ) (బి) గార్డ్‌నర్ 10; స్నేహ్ రాణా (స్టంప్డ్) హీలీ (బి) షుట్ 35; క్రాంతి (నాటౌట్) 8; రేణుక (సి) వాల్ (బి) గార్త్ 2; ఎక్స్‌ట్రాలు 20; **మొత్తం (47 ఓవర్లలో ఆలౌట్) 369. వికెట్ల పతనం:** 1-32, 2-85, 3-206, 4-216, 5-231, 6-261, 7-289, 8-354, 9-364, 10-369. **బౌలింగ్:** షుట్ 7-1-53-2; కిమ్ గార్త్ 9-1-69-3; గార్డ్‌నర్ 8-0-80-1; తహిలా 7-0-44-1; అలానా 7-0-60-0; గ్రేస్ హ్యారిస్ 2-0-20-1; జార్జియా 7-0-42-1.

సాక్షి సినిమా

మాస్ డ్యాన్స్



● బాలకృష్ణ

బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'అఖండ 2: తాండవం'. సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపి ఆచంట ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబరులో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో జరుగుతోంది. బాలకృష్ణ పాల్గొనగా భాను మాస్టర్ కొరియోగ్రఫీలో 600 మంది డ్యానర్లతో ఈ పాటను చిత్రీకరిస్తున్నారు. ''బాలయ్య మాస్ డ్యాన్స్ మూమెంట్స్‌తో అదరగొడుతున్నారు. థియేటర్స్‌లో ప్రేక్షకులను అలరించేలా ఈ పాట ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్.


సంబరాలు వాయిదా



● సాయి దుర్గాతేజ్


సాయి దుర్గాతేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. ఈ చిత్రంలో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తున్నారు. రోహిత్ కేపీ దర్శకత్వంలో కె. నిరంజన్‌రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఈ నెల 25న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ గతంలో ప్రకటించారు. కానీ 'సంబరాల ఏటిగట్టు' సినిమా రిలీజ్‌ను వాయిదా వేశామని, త్వరలోనే కొత్త విడుదల తేదీ ప్రకటిస్తామని శనివారం ఓ నోట్‌ను విడుదల చేశారు మేకర్స్. ''సినీ కార్మికుల సమ్మె, కీలకమైన సీజీ వర్క్ పెండింగ్... వంటి కారణాల వల్ల మా సినిమా రిలీజ్‌ను వాయిదా వేస్తున్నాం. క్వాలిటీ పరంగా రాజీ పడాలనుకోవడం లేదు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ధర్మంగా వర్ధిల్లు



● జగదీష్, సాహితి, బుచ్చిబాబు, శంకర్, త్రినాథ్

త్రినాథ్ కఠారి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'ఇట్లు మీ ఎదవ'. 'వెయ్యేళ్ళు ధర్మంగా వర్ధిల్లు' అనేది ట్యాగ్‌లైన్. తెలుగమ్మాయి సాహితీ అవాంచ హీరోయిన్‌గా నటించారు. బళ్లారి శంకర్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌ని డైరెక్టర్ బుచ్చిబాబు సానా రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''ఇట్లు మీ ఎదవ' గ్లింప్స్ వినోదాత్మకంగా ఉంది. ప్రతి అబ్బాయికి ఈ టైటిల్ చిన్నప్పటి నుంచి కెరీర్‌లో సెటిల్ అయ్యాకా అలాగే ఉంటుంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం హిట్టై, టీమ్‌కి మంచి పేరు రావాలని కోరుకుంటున్నా'' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్, కెమెరా: జగదీష్ చీకటి.



శివ అలాంటి చిత్రమే

– హీరో నాగార్జున

''సినిమాకి తరాలు మించి జీవించే శక్తి ఉందని నాన్నగారు ఎప్పుడూ నమ్మారు. అలాంటి ఒక చిత్రం 'శివ'. ఈ సినిమాను నవంబరు 14న కొత్త అవతార్‌లో 4కే డాల్బీ అట్మాస్‌తో మళ్ళీ బిగ్ స్క్రీన్‌పైకి తీసుకురావడం అనేది కథలను ఎప్పటికీ సజీవంగా ఉంచాలనే నాన్నగారి కలకు నివాళి'' అని నాగార్జున అన్నారు. నాగార్జున హీరోగా రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'శివ' (1989). అమల హీరోయిన్‌గా నటించారు. అన్నపూర్ణ స్టూడియోస్‌పై అక్కినేని వెంకట్, సురేంద్ర యార్లగడ్డ నిర్మించిన ఈ చిత్రం 1989 అక్టోబరు 5న విడుదలై, బ్లాక్‌బస్టర్ కావడంతో పాటు ఓ ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. కాగా మోనో మిక్స్‌లో ఉన్న 'శివ' సౌండ్‌ను ఆధునిక ఏఐ టెక్నాలజీతో రీ-మాస్టర్ చేసి,అడ్వాన్స్ డాల్బీ అట్మాస్‌లోకి మార్చారు. 'శివ'ను 4కె డాల్బీ అట్మాస్ వెర్షన్‌తో నవంబరు 14న రీ రిలీజ్ చేయనున్నట్లుగా దివంగత ప్రముఖ నటులు అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతి (సెప్టెంబరు 20) సందర్భంగా మేకర్స్ శనివారం ప్రకటించారు. ''ఈసారి ప్రేక్షకులు ఇంతకుముందెప్పుడూ వినని విధంగా, పూర్తిగా కొత్త అనుభూతిని పొందుతారు'' అన్నారు రామ్‌గోపాల్ వర్మ.

అదే ఆకాంక్షతో వెళుతున్నాను


– నందిని



''నటన, మోడలింగ్ అంటే నాకు ఇష్టం. అలాగే సేవా కార్యక్రమాలు చేయడమంటే ఇంకా ఇష్టం. 'మిస్ యూనివర్స్ ఇంటర్నేషనల్ 2025' పోటీలో తెలుగు అమ్మాయిని అయిన నేను విజేతగా నిలిచినందుకు గర్వంగా ఉంది. 'కొంచెం హట్కే, ఆస్కార్ మిస్సింగ్' వంటి చిత్రాల్లో నటిస్తున్నాను. నటిగానూ రాణించాలనే ఆకాంక్షతో ముందుకు వెళుతున్నాను'' అని నందిని చన్నగిరి అన్నారు. ఇటీవల గోవాలో జరిగిన 'మిస్ యూనివర్స్ ఇంటర్నేషనల్ 2025' పోటీల్లో 20 దేశాల నుండి పోటీదారులు పాల్గొనగా నందిని చన్నగిరి విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ– ''మోడలింగ్‌పై ఇష్టంతో విజయవాడ నుంచి హైదరాబాద్ వచ్చాను. ఇప్పటికే ఎన్నో అవార్డులు సాధించాను. 'అమృతహస్తం చారిటబుల్ ట్రస్ట్, అన్నసంతర్పణ సమితి చారిటబుల్ ట్రస్ట్'లకు డైరెక్టర్‌గా ఉంటూ పేదలకు సేవ చేస్తున్నాను. ప్రస్తుతం రెండు సినిమాలు, రెండు వెబ్ సిరీస్‌ల్లో నటిస్తున్నాను'' అని పేర్కొన్నారు.

ఎగిరెగిరి ఇక్కడికే రావాలి!

ధనుష్ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'ఇడ్లీ కడై' (ఇడ్లీ కొట్టు). నిత్యా మీనన్ హీరోయిన్‌గా నటించారు. ఆకాశ్ భాస్కరన్, ధనుష్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 1న విడుదల కానుంది. శ్రీ వేదాక్షర మూవీస్‌పై రామారావు చింతపల్లి 'ఇడ్లీ కొట్టు' సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. శనివారం ఈ సినిమా తెలుగు, తమిళ ట్రైలర్స్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో



● అరుణ్ విజయ్, ధనుష్

మురళి పాత్రలో ధనుష్, కల్యాణి పాత్రలో నిత్యా మీనన్ నటించినట్లుగా తెలుస్తోంది. 'మిషన్లతో అన్నీ చేసేయొచ్చంటారు... కానీ రుచి అనేది మాత్రం మనసు పెడితేనే వస్తుంది', 'జీవితంలో మనం చేసే పనిని ఆదాయం కోసం మాత్రమే కాదు.., ఆస్వాదిస్తూ కూడా చేయాలి. వ్యాపారంలో దొరకని తృప్తి వ్యాపకంలో దొరుకుతుంది', 'కానీ మన బిడ్డ వారసత్వాన్ని వదిలి వలస వెళ్లిపోయాడు కదమ్మా..!', 'అయినా వాడు ఎక్కడికి వెళ్తాడు... ఎగిరెగిరి ఇక్కడికే రావాలి!' వంటి డైలాగ్స్ 'ఇడ్లీ కొట్టు' ట్రైలర్‌లో ఉన్నాయి.

హాలీవుడ్‌లో కింగ్ బుద్ధ

తెలుగు నటుడు–దర్శక–నిర్మాత సత్యా రెడ్డి ఓ భారీ బడ్జెట్ చిత్రంతో హాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''పాన్ వరల్డ్ సినిమాస్' పేరుతో బ్యానర్ రిజిస్టర్ చేయించాను. హాలీవుడ్ స్థాయిలో నిర్మించే ఈ సినిమాకి అన్ని భాషల్లో 'కింగ్ బుద్ధ' టైటిల్‌ని ఖరారు చేశాం. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గద్దర్‌గారితో 'ఉక్కు సత్యాగ్రహం' చిత్రం నిర్మించి, ప్రపంచంలోని పలు భాషల్లోకి అనువదించాను. గద్దర్‌గారు ఇచ్చిన ప్రేరణతో బుద్ధిజం పై హాలీవుడ్‌లో ఓ సినిమా నిర్మించాలనుకున్నాను. 'ఉక్కు సత్యాగ్రహం' సినిమా కోసం రష్యా, అమెరికాకి చెందిన హాలీవుడ్ యాక్టర్లతో పని చేస్తున్నప్పుడు నా తర్వాతి ప్రాజెక్ట్‌ని హాలీవుడ్ స్థాయిలో చేయాలని నిర్ణయించుకున్నాను. ఈ మేరకు 'కింగ్ బుద్ధ' షూటింగ్ లొకేషన్ల కోసం ఇప్పటికే అమెరికా, చైనా, టిబెట్, నేపాల్, థాయ్‌ల్యాండ్, సింగపూర్, మలేసియా వంటి దేశాలు పర్యటించాను. ప్రస్తుతం నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక జరుగుతోంది. త్వరలో అన్ని వివ రాలు ప్రకటిస్తాను'' అని తెలిపారు.



● సత్యా రెడ్డి

ఓటీటీ — ఇది చూడొచ్చు

అనుమానం పెనుభూతం

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం రవీంద్ర నీ ఎవిడే ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

నేటి సమాజంలో నమ్మకం అనేది దూరంగా ఉన్న స్నేహితుడిలాంటిదైతే, అనుమానమనేది దగ్గరగా ఉన్న శత్రువులాంటిది. ఎందుకంటే అనుమానం వస్తే పోదు, నమ్మకం అంత తేలిగ్గా రాదు. ఇదే నేపథ్యంలో వచ్చిన సూపర్ కామెడీ సినిమా 'రవీంద్ర నీ ఎవిడే'. అంటే... రవీంద్ర నీవెక్కడ అని అర్థం. ఇదో మలయాళ సినిమా కానీ తెలుగులోనూ హాట్ స్టార్ వేదికగా లభ్యమవుతోంది. ముందు చెప్పినట్టు ఈ సినిమా మొత్తం అనుమానం మీదే నడుస్తుంది. ప్రేక్షకులను నవ్విస్తుంది. ఈ సినిమా కథాంశానికొస్తే... కథానాయకుడు రవీంద్రన్ వాతావరణ శాఖలో ప్రజలకు అత్యవసర హెచ్చరికలు జారీ చేసే కీలక బాధ్యతలు నిర్వర్తిస్తుంటాడు. రవీంద్రన్‌కి ఓ భార్య, కూతురు. చిన్న కుటుంబం, చింతలేని ఆనందం అని అనుకుంటున్న తరుణంలో రవీంద్రన్‌కి అనుకోకుండా తన భార్య మీద ఓ అనుమానం వస్తుంది. తన భార్య ఇంకెవరితోనో సంబంధం పెట్టుకుందని భావిస్తాడు రవీంద్రన్. తన అనుమానాన్ని నివృత్తి చేసుకోవడానికి ఓసారి ఊరు వెళ్తున్నానని చెప్పి ఇంట్లోనే ఓ మారుమూల గదిలో ఉండిపోతాడు. కాకపోతే ఆ గదిలో ఎవరూ లేరని అతని భార్య జాన్ కుట్టీ తాళం వేసి, తన అమ్మవాళ్ళ ఊరు వెళిపోతుంది. ఇక అక్కడి నుండి కథ మొదలవుతుంది. రవీంద్రన్ భార్య తన అమ్మవాళ్ళ దగ్గర నుండి ఫోన్ చేసినా అతను ఎత్తకపోయేసరికి భయం వేసి, తన భర్త కనిపించట్లేదని కంగారు పడుతుంది.



ఇంతలో ఊళ్ళో ఇదో పెద్ద న్యూస్ అయి, మొత్తం హాట్ టాపిక్‌గా మారిపోతుంది. మరి... రవీంద్రన్ ఆ గది నుండి బయటకు వస్తాడా? తనకు భార్య మీదున్న అనుమానాన్ని నివృత్తి చేసుకుంటాడా? లేదా అన్నది మాత్రం 'రవీంద్ర నీ ఎవిడే' సినిమాలోనే చూడాలి. కృష్ణ పూజాపుర అందించిన ఈ కథకు మనోజ్ పాలోడన్ దర్శకత్వం వహించారు. అనూప్ మీనన్, ధ్యాన్ శ్రీనివాసన్ ప్రధాన పాత్రలలో నటించిన ఈ సినిమా ఆద్యంతం రక్తి కట్టిస్తుందనే చెప్పాలి. మస్ట్ వాచ్ ఫర్ ది వీకెండ్.

– హరికృష్ణ ఇంటూరు



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 | సంచిక: 181

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

SUNDAY Special

ఆదివారం 21-9-2025



కీలెంచి మేలెంచండి!

మోకాలు లేదా ఇతరత్రా కీళ్లలో (జాయింట్స్‌లో) నొప్పిగానీ ఇబ్బంది గానీ వచ్చేందుకు కారణాలూ, అలా సమస్య కనిపించినప్పుడు ఏం చేయాలన్న అంశంపై అవగాహన కలిగించేందుకు డాక్టర్లు చెబుతున్న అంశాలేమిటంటే.. - 16లో



పువ్వులా పరిమళిద్దాం

"పువ్వు పరిమళిస్తుంది. వాడిపోయి రాలిపోతుంది. పూల జీవన తాత్పర్యం అదే. మనిషి కూడా మంచి చేయకున్నా పర్వాలేదు. చెడు చేయకూడదు. ఇలా ఓ మంచి సందేశం ఇచ్చే పండుగ బతుకమ్మ" అంటున్నారు ప్రముఖ రచయిత సుద్దాల అశోక్ తేజ. - 16లో



శివధర్ రెడ్డి | సీవీ ఆనంద్

పోలీస్ కొత్త బాస్ ఎవరు?

రేసులో శివధర్ రెడ్డి, సీవీ ఆనంద్

- తదుపరి డీజీపీ ఎవరన్న అంశంపై చర్చ
- శిఖాగోయల్ కూడా పోటీలో..
- శివధర్ రెడ్డి వైపే ప్రభుత్వం మొగ్గు!
- ఆనంద్‌కు విజిలెన్స్ డీజీ ఇచ్చే అవకాశం
- నెలాఖరున డీజీ జితేందర్ రిటైర్‌మెంట్
- ఇంటెలిజెన్స్ డీజీగా సజ్జనార్?
- దసరాకు ముందే భారీగా బదిలీలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ తదుపరి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) ఎవరన్నదానిపై పోలీస్ శాఖలో చర్చ జోరందుకుంది. ప్రస్తుత డీజీపీ డా.జితేందర్ ఈ నెలాఖరున పదవీ విరమణ పొందనున్నారు. ఆయన తర్వాత డీజీపీ (హెచ్‌ఓపీఎఫ్-హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్) పోస్టుకు ప్రధాన పోటీ సీనియర్ ఐపీఎస్‌లు సీవీ ఆనంద్, బి శివధర్‌రెడ్డి మధ్యే నెలకొంది. ఇద్దరిదీ ఒకే సామాజిక వర్గం. ఇద్దరూ తెలంగాణ రాష్ట్రానికి చెందినవారే కావడంతో ప్రభుత్వం ఎవరిని ఎంపిక చేసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. ఇంటెలిజెన్స్ డీజీగా ఉన్న శివధర్‌రెడ్డివైపే ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. శివధర్‌రెడ్డి 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి కాగా.. ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న సీవీ ఆనంద్

మిగతా 14వ పేజీలో ▶

లక్ష డాలర్ల బాంబు

హెచ్-1బీ వీసా వార్షిక రుసుము రూ. 88 లక్షల పైమాటే



కొత్తవాళ్లకు మాత్రమే

'హెచ్1బీ' ఫీజు పెంపుపై వైట్‌హౌస్ అధికారి: న్యూయార్క్ టైమ్స్

వారు వెంటనే తిరిగి రావాల్సిన పని లేదని అమెరికా ఉన్నతాధికారి చెప్పినట్లు ఏఎన్‌ఐ వార్తాసంస్థ వెల్లడి

న్యూయార్క్/వాషింగ్టన్: హెచ్1బీ వీసాల వార్షిక రుసుము పెంపుపై సర్వత్రా గగ్గోలు రేగిన నేపథ్యంలో ఈ పెంపు కేవలం కొత్త హెచ్1బీ దరఖాస్తుదారులకే వర్తిస్తుందని 'వైట్ హౌస్' అధికారి ఒకరు తెలిపినట్లు 'న్యూయార్క్ టైమ్స్' శనివారం

మిగతా 2వ పేజీలో ▶

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం

ఉత్తర్వుపై సంతకం.. నేటి నుంచే అమల్లోకి..

- విదేశాల్లో ఉన్న వీసాదారులు అమెరికాకు చేరుకోవాలని కంపెనీల ఆదేశం
- ఉద్యోగుల పరుగులతో రద్దీగా ఎయిర్‌పోర్టులు.. భారీగా పెరిగిన విమాన చార్జీలు
- హెచ్-1బీ వీసా కార్యక్రమం దుర్వినియోగం అవుతోందని ట్రంప్ ఆగ్రహం
- అమెరికా పౌరులకు అన్యాయం జరుగుతున్నట్లు ఆక్షేపణ
- ప్రతిభావంతులైన నిపుణులను తాత్కాలికంగా నియమించుకోవచ్చని సూచన
- తమ నిర్ణయం పట్ల టెక్ కంపెనీల సీఈఓలు కచ్చితంగా సంతోషిస్తారని వెల్లడి
- ప్రస్తుతం రూ.4.40 లక్షల దాకా ఉన్న హెచ్-1బీ వీసా రుసుము
- ఇకపై విదేశీ ఉద్యోగిని నియమించుకోవాలంటే ఏటా రూ.88 లక్షలు చెల్లించాలి
- అమెరికా కంపెనీలపై పెనుభారం.. స్థానికులకే ప్రాధాన్యం ఇచ్చే అవకాశం
- భారతీయ టెక్నాలజీ నిపుణులకు నష్టమేనంటున్న నిపుణులు

న్యూయార్క్/వాషింగ్టన్: అమెరికా నుంచి వలసదారులను బయటకు పంపించి, అమెరికన్ల మనసులు గెలుచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో పెద్ద బాంబు పేల్చారు. విదేశీ వృత్తి నిపుణులు అమెరికా గడ్డపై ఉద్యోగాలు చేసుకోవడానికి వీలు కల్పిస్తున్న హెచ్-1బీ వీసా వార్షిక రుసుమును ఏకంగా లక్ష డాలర్లకు (రూ. 88 లక్షలకుపైగా) పెంచేశారు. ఈ మేరకు 'నాన్-ఇమిగ్రెంట్ ఉద్యోగుల ప్రవేశంపై ఆంక్షలు' పేరిట సంబంధిత ఉత్తర్వుపై శుక్రవారం సంతకం చేశారు. అమెరికా కాలమానం ప్రకారం ఈ నెల 21వ తేదీ నుంచి ఇది అమల్లోకి వస్తుందని తేల్చిచెప్పారు. ప్రతిఏటా హెచ్-1బీ వీసాలు పొందుతున్నవారిలో 70% మంది భారతీయులే కావడంతో వారిపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా డాలర్ డ్రీమ్స్ వదులుకోవాల్సి రావొచ్చని

మిగతా 2వ పేజీలో ▶



మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీజేను సీఎం సత్కరించారు

న్యాయవ్యవస్థలో వసతుల కల్పనకు సిద్ధం: సీఎం

2లో

వచ్చేవారమే 'స్థానిక' నోటిఫికేషన్?

ఎన్నికలకు వెళ్లటానికే ప్రభుత్వం మొగ్గు


మంత్రులతో సమావేశంలో సీఎం కీలక నిర్ణయం

- నేడు జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై త్వరలో జీవో!
- ఆ వెంటనే ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ జారీ

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకే ప్రభుత్వం మొగ్గుచూపింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసి.. వెంటనే వచ్చేవారంలోనే ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ కూడా జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పలువురు మంత్రులతో జరిగిన సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. సెప్టెంబర్ 30వ తేదీలోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో.. ఎన్నికలు వాయిదా వేయడం కంటే ముందుకు వెళ్లడమే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవడంతో ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదివారం ఉదయం 11 గంటలకు అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎన్నికల సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని నిర్ణయించారు. విశ్వసనీయ సమాచారం మేరకు వచ్చే గురువారం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

మెజారిటీ అభిప్రాయం మేరకే..: గ్రామ పంచాయతీలకు దాదాపు 20 నెలలు, జెడ్పీటీసీ,

మిగతా 2వ పేజీలో ▶



పరాధీనతే ప్రబల శత్రువు

విశ్వబంధువైన భారత్‌కు పెద్ద శత్రువులే లేరు

6లో

- ఇతర దేశాలపై ఆధారపడటమే మనకున్న అతిపెద్ద శత్రువు
- హెచ్-1బీ వీసాల దరఖాస్తు రుసుము పెంచిన నేపథ్యంలో ప్రధాని మోదీ స్పందన
- పరాశ్రయానికి ఆత్మనిర్భరతే అసలైన పరిష్కారమని హితబోధ



రణమా... శరణమా?

- సాయుధ పోరాటంపై మావోయిస్టు పార్టీలో భిన్నాభిప్రాయాలు
- మావోయిస్టులకు డెడ్‌లైన్ విధించిన హోంమంత్రి అమిత్ షా
- 2026 మార్చి 31 తర్వాత సాయుధ పోరాటం ఉండేనా ?
- సీపీఐ (మావోయిస్టు) ఏర్పాటై నేటితో 21 వసంతాలు పూర్తి

- వివరాలు 14లో

విమాన టికెట్ల ధరలకు రెక్కలు!

- ఉన్నపళంగా వెనక్కి వచ్చేయాలన్న కార్పొరేట్ సంస్థలు
- అమెరికాకు వెళ్లే విమానాలకు అమాంతం పెరిగిన బుకింగ్స్
- అమెరికా ఎయిర్‌పోర్టులలో ఆగిపోయిన పలువురు..



- వివరాలు 6లో

భారతీయులకు శరాఘాతమే!

- హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుము పెంపుతో నష్టం
- అమెరికాలో భారతీయులకు తగ్గిపోనున్న ఉద్యోగ అవకాశాలు
- హఠాత్తుగా ఆగిపోయిన స్వదేశీ ప్రయాణాలు



- వివరాలు 2లో

మోహన్‌లాల్‌కు దాదాసాహెబ్ ఫాల్కే



- మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించింది. సినీ రంగంలో దేశంలోనే అత్యున్నతమైన అ అవార్డును 2023 సంవత్సరానికి గాను మోహన్‌లాల్‌కు ప్రదానం చేయనున్నట్లు కేంద్ర సమాచార ప్రసారశాఖ శనివారం 'ఎక్స్' ద్వారా తెలిపింది. ఈ నెల 23న 71వ జాతీయ సినీ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో మోహన్‌లాల్‌కు ఈ అవార్డును ప్రదానం చేస్తారు. మోహన్‌లాల్‌కు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిష్టాత్మక అవార్డు లభించటంపట్ల మోహన్‌లాల్ ఆనందం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. - 16లో

పాత్రికేయ కుతంత్రం

పచ్చ మైకంలో.. ఈనాడు అచ్చోసిన అబద్ధాలు

మాజీ సీఎం వైఎస్ జగన్ సతీమణి భారతిపై దుష్ప్రచారం

సిట్ తనిఖీలు చేసిన కంపెనీల్లో ఆమె డైరెక్టర్ అంటూ అసత్య ప్రచారం

- ఆ సంస్థల్లో వైఎస్ జగన్ సతీమణి భారతి డైరెక్టర్‌గా ఎన్నడూ లేరు
- స్పష్టం చేస్తున్న రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ రికార్డులు
- చంద్రబాబు క్షుద్ర రాజకీయం.. ఈనాడు విష ప్రచారం
- పచ్చ మూక కలిసి పన్నిన కుట్ర బట్టబయలు
- ఈ అక్రమ కేసులో మొదటినుంచి సిట్ తీరు అంతే..
- ఎంపీ మిథున్‌రెడ్డి నుంచి సునీల్‌రెడ్డి వరకు అదే కుట్ర.. అసలు మద్యం డాన్ చంద్రబాబే
- ఆధారాలతో నిరూపించిన సీఐడీ
- ఆ కేసులో ఇప్పటికీ బెయిల్ పైనే ఉన్న చంద్రబాబు
- దానిని కప్పిపుచ్చేందుకు రెడ్‌బుక్ కేసు కుట్ర



వైఎస్ అనిల్‌రెడ్డి కంపెనీల్లో సిట్ సోదాలు

చెన్నైలో సిట్ సోదాలు చేసింది ఈ భవనంలోనే

ఆయన జగన్ పెదనాన్న కుమారుడు

ఆ కంపెనీల్లో గతంలో డైరెక్టర్‌గా ఉన్న జగన్ సతీమణి భారతి

మద్యం ముడుపుల సొమ్ము రూటింగ్‌కు ఈ కంపెనీలను వాడుకున్నట్లు సిట్ అనుమానం

చెన్నై, హైదరాబాద్‌లో మొత్తం 10 చోట్ల తనిఖీలు

వైఎస్ అనిల్‌రెడ్డి కంపెనీల్లో జగన్ సతీమణి భారతి డైరెక్టర్‌గా ఉన్నారని విషం చిమ్మిన ఈనాడు

15లో

బరాజ్‌ల పునరుద్ధరణకు గ్లోబల్ టెండర్లు



- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై ఈఓఐ టెండర్లు
- అంతర్జాతీయ సంస్థల నుంచి తక్షణమే ఆహ్వానించండి
- రెండు వారాల్లో కన్సల్టెన్సీని ఎంపిక చేయాలి
- నీటిపారుదల శాఖపై సమీక్షలో మంత్రి ఉత్తమ్ ఆదేశం - 7లో

నక్సలైట్లు, టెర్రరిస్టులు ఒకటే



ఉగ్రవాదులు, మావోయిస్టులు ఒకటేనని, వారితో చర్చల ప్రసక్తే లేదని బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు స్పష్టంచేశారు. గతంలో కాంగ్రెస్ నక్సలైట్లతో జరిపిన చర్చలు ఎందుకు విఫలమయ్యాయో సీఎం చెప్పాలన్నారు. - 8లో

యువతను విస్మరిస్తే ఉద్యమాలు



- యువత ఆకాంక్షలను పాలకులు పట్టించుకోవాలి
- తెలంగాణలో రీకాల్, రీగ్రెట్, రివోల్ట్ నడుస్తోంది
- ఎన్డీటీవీ యువ -2025లో కేటీఆర్

17లో

ఇదండీ వరస



కంప్రెషన్ బ్యాండ్‌తో..

కత్తిలాంటి ఫేస్‌కట్!?



- నాజూకైన నగుమోముకు సరికొత్త ట్రెండ్
- ముఖాన్ని 'షేప్' చేసుకునేందుకు మహిళల ఆసక్తి
- నాణ్యమైనవి కాకుంటే ప్రమాదమంటున్న వైద్యులు

సాక్షి, స్పెషల్ డెస్క్

ముఖ సౌందర్యాన్ని పెంచడానికి ఫ్యాషన్ స్పెషలిస్టుల దగ్గర 'ఫేషియల్ యోగా' మొదలు 'గ్వాషా' మసాజ్, ఫేషియల్ కప్పింగ్ వరకు ఎన్నో విద్యలు ఉంటాయి. అలాంటి వాటిలో ఇప్పుడు 'ఫేషియల్ కంప్రెషన్ బ్యాండ్స్' (ముఖాన్ని పట్టి ఉంచే పట్టీలు) ట్రెండింగులోకి వచ్చాయి. నిపుణుల సహాయం లేకుండా ఎవరికి వారుగా వీటిని ధరించే సౌలభ్యం ఉండటంతో వీటిపై మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారు.

'చెవులు, దవడల మీదుగా నిలువుగా ముఖం చుట్టూ కంప్రెషన్ బ్యాండ్‌ను అమర్చుకుని కొన్ని గంటల తర్వాత తొలగిస్తే చాలు. ముఖం బక్కచిక్కి చక్కనమ్మల్ని చేస్తుంది. నాజూకు నగుమోము మీ సొంతమవుతుంది' అంటూ ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రకటనలు కనిపిస్తున్నాయి. కంప్రెషన్ బ్యాండ్స్‌నే ఫేస్ స్లిమ్మింగ్ బ్యాండ్స్, వి-లైన్ లిఫ్టింగ్ బ్యాండ్స్ / మాస్క్ అని కూడా అంటున్నారు. అయితే, ముఖంలో షేప్ తీసుకురావటానికి ధరించే ఈ ఎలాస్టిక్ పట్టీలు నిజంగానే ముఖాన్ని నాజూకుగా మార్చేస్తాయా అంటే.. పూర్తిగా కాదు అంటున్నారు కాస్మెటాలజిస్టులు.

బ్యాండ్స్ ఏం చేస్తాయి?

ముఖాన్ని కంప్రెషన్ బ్యాండ్ పట్టి ఉంచుతుంది. అంటే ముఖాన్ని బిగించేస్తుంది. ఈ ఒత్తిడి కారణంగా ముఖం ఉబ్బడం తగ్గుతుంది. చర్మంలో ఉబ్బుకు కారణమయ్యే కణజాల ద్రవాన్ని తిరిగి ప్రసరణలోకి పంపే లింఫటిక్

మిగతా 14వ పేజీలో ▶

క్లుప్తంగా...

గవర్నర్, సీఎం బతుకమ్మ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: బతుకమ్మ పర్వదినం సందర్భంగా రాష్ట్ర మహిళలందరికీ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి తల్లిని ఆరాధిస్తూ బతుకునే సంబురంగా జరుపుకొంటారన్నారు. తెలంగాణ ఆడబిడ్డలందరికీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎంగిలి పూల నుంచి సద్దుల వరకూ తొమ్మిది రోజులు బతుకమ్మ ఆట పాటలతో వైభవంగా పండుగను జరుపుకోవాలన్నారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి సీతక్క టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కూడా మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థిక శాఖ అధికారుల తప్పిదంతోనే 'వేతన' సమస్య

మీడియాతో మంత్రి అడ్లూరి



సాక్షి, హైదరాబాద్: ఆర్థిక శాఖ అధికారుల తప్పిదంతోనే మైనార్టీ గురుకుల కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల ఉత్తర్వుల్లో పొరపాట్లు తలెత్తాయని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఉద్యోగుల సమస్యను గుర్తించి వెంటనే స్పందించానని, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతో ప్రత్యేకంగా మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశానన్నారు. సాయంత్రంలోగా సవరణ ఉత్తర్వులు జారీ చేయించినట్లు వెల్లడించారు. శనివారం సచివాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తన పరిధిలోని సంక్షేమ శాఖల్లోని ఉద్యోగులను కాపాడుకునే బాధ్యత తనపైన ఉందన్నారు. ఉద్యోగుల పదోన్నతులు ఇతర అంశాలను తన దృష్టికి తీసుకురావాలని, ప్రమోషన్ పాలసీ అమలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. మైనార్టీ గురుకులాల్లోని ఉద్యోగుల వేతనాలు తగ్గించే ప్రసక్తే లేదన్నారు.

నిజామాబాద్-జగ్దల్‌పూర్ సెక్షన్‌లో 7 బ్లాక్‌స్పాట్‌ల సవరణ

సాక్షి, హైదరాబాద్: మంచిర్యాల జిల్లా పరిధిలోని జాతీయ రహదారి (ఎన్‌హెచ్-63)కి సంబంధించి నిజామాబాద్-జగ్దల్‌పూర్ సెక్షన్‌లో ఏడు బ్లాక్‌స్పాట్‌ల (ప్రమాదకరమైన ప్రాంతాలు)ను శాశ్వతంగా సరిచేసేందుకోసం (4 వరుసలుగా వెడల్పు చేసేందుకు) 2.995 హెక్టార్ల అటవీ భూమిని మళ్లిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పీసీసీఎఫ్ ద్వారా వచ్చిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించగా.. దీనికి కేంద్ర ప్రభుత్వం తుది ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర అటవీ శాఖ కూడా తుది ఆమోదం తెలిపింది. శనివారం ఈ మేరకు అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్ ఉత్తర్వులు జారీచేశారు.

పేదల కడుపు కొడుతున్న కేంద్రం: నారాయణ



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మోదీ పాలన కేవలం అదానీ వంటి కార్పొరేట్ శక్తుల కోసమే సాగుతోందని, దేశంలోని వ్యవస్థలన్నింటినీ గుప్పిట్లో పెట్టుకుని ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. చండీగఢ్‌లో ఆదివారం నుంచి ఐదు రోజుల పాటు జరగనున్న సీపీఐ జాతీయ మహాసభల వివరాలను ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో వెల్లడించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. దేశంలో అవినీతి, నిరుద్యోగం పెరిగిపోవడంతో నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో యువత తిరగబడిందన్నారు. మన దేశంలోనూ అదే పరిస్థితి ఉందని హెచ్చరించారు. సీపీఐలో 75 ఏళ్ల వయోపరిమితి అమలుపై ఈ మహాసభల్లో చర్చిస్తామని తెలిపారు. మోదీ ప్రభుత్వం పూర్తిగా అదానీకి కొమ్ముకాస్తోందని, సెబీ వంటి సంస్థలతో అదానీ గ్రూప్‌కు క్లీన్ చిట్ ఇప్పించారని ఆరోపించారు. చండీగఢ్‌లో జరిగే జాతీయ మహాసభలకు దేశవ్యాప్తంగా 750 మంది ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు.

భారతీయులకు శరాఘాతమే!



హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుము పెంపుతో నష్టం

లక్ష డాలర్లు అంటే వార్షిక వేతనం కంటే ఎక్కువే

అమెరికాలో భారతీయులకు తగ్గిపోనున్న ఉద్యోగ అవకాశాలు

హఠాత్తుగా ఆగిపోయిన స్వదేశీ ప్రయాణాలు

వాషింగ్టన్: హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుమును ఏకంగా లక్ష డాలర్లకు పెంచడం భారతీయ టెక్నాలజీ ఉద్యోగులకు శరాఘాతమేనని నిపుణులు అంటున్నారు. అమెరికాలో ఉద్యోగాలు పొందడం ఇకపై అంత సులభం కాకపోవచ్చని చెబుతున్నారు. అత్యంత ప్రతిభావంతులపై ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు. వారి సేవలు తప్పనిసరిగా అవసరమని అమెరికా కంపెనీలు భావిస్తే ఎంత ఖర్చు పెట్టడానికైనా సిద్ధపడొచ్చు. 'అమెరికా ఫస్ట్' ఎజెండాను అధ్యక్షుడు ట్రంప్ పాటిస్తున్నారు. అమెరికన్లకే ప్రథమ ప్రాధాన్యం అంటున్నారు. వీసా రుసుమును లక్ష డాలర్లకు పెంచడాన్ని 'ప్రాజెక్టు ఫైర్‌వాల్'గా అమెరికా కార్మిక శాఖ అభివర్ణించింది. అమెరికన్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు రక్షణఛత్రం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. వీసా ఫీజు లక్ష డాలర్లుఅంటే అది సాధారణ హెచ్-1బీ ఉద్యోగ వార్షిక వేతనంతో సమానం, కొందరి విషయంలో అంతకంటే ఎక్కువే కావడం గమనార్హం. వీసా కోసమే ఏటా లక్ష డాలర్లు చెల్లించి భారతీయులను నియమించుకోవడం చాలా కంపెనీలకు తలకు మించిన భారమే. 2023లో 1.91 లక్షల మంది, 2024లో 2.07 లక్షల మంది భారతీయులు హెచ్-1బీ వీసాలు పొందారు. ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో తదితర భారతీయ ఐటీ కంపెనీలు జూనియర్ లేదా మిడ్-లెవెల్ ఐటీ ఉద్యోగులను అమెరికాకు పంపించకపోవచ్చు. మరోవైపు వీసా రుసుము పెంపు వల్ల విదేశీ ఉద్యోగుల కంటే అమెరికా కంపెనీలే ఎక్కువగా నష్టపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. అమెరికా టెక్నాలజీ పరిశ్రమ ప్రధానంగా విదేశీయులపై ఆధారపడుతోంది. వారి రాకను అడ్డుకుంటే నవీన ఆవిష్కరణలు, ప్రగతికి ఆటంకం కలగొచ్చు. అంతిమంగా అమెరికాకే నష్టం జరుగుతుంది.

అది తెలివైన నిర్ణయం కాదు

భారతీయులను లక్ష్యంగా చేసుకోవడాన్ని కాటో ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఆఫ్ ఇమిగ్రేషన్ స్టడీస్ డేవిడ్ బియర్ తప్పుపట్టారు. ఇండియన్ హెచ్-1బీ వీసాదారులు అమెరికా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నారని తెలిపారు. వారు పన్నుల రూపంలో ప్రతిఏటా బిలియన్ల డాలర్లు చెల్లిస్తున్నారని గుర్తుచేశారు. శాంతి కాముకులు, కష్టపడి పనిచేసే ప్రతిభావంతులు, చట్టాలను చక్కగా గౌరవించే భారతీయులను దూరం పెట్టడం సమంజసం కాదని తేల్చిచెప్పారు. మొత్తం అమెరికాకే వన్నె తెస్తున్న భారతీయులను బయటకు పంపించాలని అనుకోవడం తెలివైన నిర్ణయం కాదని పేర్కొన్నారు. కేవలం భారత్‌లో జన్మించారన్న కారణంతో వివక్ష చూపడం, వారి సేవలు వదులుకోవడం ఏమిటని ప్రశ్నించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన ఆక్షేపించారు. ఈ మేరకు డేవిడ్ బియర్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

భారత్‌కు ప్రయాణాలు బంద్

హెచ్-1బీ వీసాలపై లక్ష డాలర్ల వార్షిక రుసుమును డొనాల్డ్ ట్రంప్ ప్రకటించగానే అమెరికాలోని భారతీయులు ఆందోళనకు గురయ్యారు. స్వదేశానికి పయనమైన చాలామంది హఠాత్తుగా ప్రయాణాలు వాయిదా వేసుకున్నారు. పండుగలు, బంధుమిత్రుల వివాహాల కోసం భారత్‌కు వెళ్లాల్సిన వారు ఆగిపోయారు. విమానాలు ఎక్కాల్సిన వారు కూడా వెనక్కి వెళ్లిపోవడం గమనార్హం. ఇండియాకు వెళ్తే మళ్లీ తిరిగి వస్తామో లేదోనన్న ఆందోళన వారిలో కనిపించింది. త్వరలో జరగాల్సిన ప్రయాణాలను సైతం కొందరు రద్దు చేసుకున్నారు. అమెరికాలోని భారతీయుడికి పెళ్లి కుదిరింది. త్వరలో భారత్‌లోనే పెళ్లి జరగాల్సి ఉంది. శుక్రవారం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న అతడు ట్రంప్ ప్రకటన తెలిసి ఏం చేయాలో అర్థంకాక వెనక్కి మళ్లాడు. అంటే అతడి పెళ్లి ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఇప్పటికే ఇండియాలో ఉన్న హెచ్-1బీ వీసాదారుల్లో సందిగ్ధత నెలకొంది. పెరిగిన వీసా రుసుములు చెల్లించాలా లేదా అని ఆరా తీస్తూ కనిపించారు. అమెరికాలోని టెక్ కంపెనీలు తమ విదేశీ ఉద్యోగులకు అంతర్గత ఆదేశాలు జారీ చేశాయి. ఇప్పట్లో స్వదేశాలకు వెళ్లే ఆలోచన చేయొద్దని, అమెరికాలోనే ఉండిపోవాలని సూచించాయి. బయట ఉన్నవారు వెంటనే రావాలని ఆదేశించాయి. దసరా, దీపావళి పండుగలకు ముందు ట్రంప్ నుంచి ఈ ఆదేశాలు రావడం భారతీయులను నిరాశకు గురిచేసింది. ఇండియాలో కుటుంబ సభ్యుల మధ్య ఆనందంగా గడపాలని ఆశించామని, ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకున్నామని, ట్రంప్ ప్రకటనతో తమ ఆనందం ఆవిరైపోయిందని ఓ భారతీయుడు ఆవేదన వ్యక్తంచేశాడు. చాలామంది తమ మనసులోని బాధను సోషల్ మీడియా పోస్టుల్లో వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలోని భారతీయుల్లోనూ ఇప్పుడు ఇదే అంశంపై చర్చ జరుగుతోంది. ఇప్పుడు హెచ్-1బీ వీసాల ఫీజులు పెంచేశారని, ఇతర వీసాలను ట్రంప్ వదిలిపెట్టబోడని వారు ఆందోళనకు గురవుతున్నారు. ట్రంప్ నిర్ణయాలను కోర్టులు నిలిపివేయొచ్చని మరికొందరు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

అధ్యయనం చేస్తున్నాం: రణధీర్ జైశ్వాల్



హెచ్-1బీ వీసా ఫీజు పెంపుతో భారతీయ కుటుంబాల్లో కొన్ని పర్యవసానాలు తలెత్తే అవకాశం ఉందని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఈ సమస్య సానుకూలంగా పరిష్కారం అవుతుందని తాము ఆశిస్తున్నట్లు చెప్పారు. వీసా ఫీజు పెంపు వల్ల ఏర్పడే పరిణామాలపై భాగస్వామ్య పక్షాలతో కలిసి అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిభావంతులు ఇక దేశం నుంచి మరో దేశానికి వెళ్లడం వల్ల దేశాల ఆర్థిక వ్యవస్థలకు మేలు జరుగుతుందన్నారు. భారతీయ స్కిల్డ్ వర్కర్లతో అమెరికా లబ్ధి పొందుతోందని గుర్తుచేశారు. భారత్, అమెరికాల మధ్య ప్రతిభావంతుల బదిలీ అనేది సహజంగా జరుగుతోందని వివరించారు. రెండు దేశాల ప్రజల మధ్య బలమైన సంబంధాలు ఉన్నాయని స్పష్టంచేశారు.

కొత్తవాళ్లకు మాత్రమే

▶ మొదటి పేజీ తరువాయి

పేర్కొంది. 'హెచ్1బీ ఫీజు పెంపునకు చట్టపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ఒకవేళ ఆ సవాళ్లను అధిగమిస్తే అంతర్జాతీయ వృత్తి నిపుణులను తీసుకొనే కంపెనీలు ఒక్కో ఉద్యోగిపై ఏటా లక్ష డాలర్ల ఫీజు చొప్పున ఆరేళ్లపాటు చెల్లించాల్సి వస్తుంది. అయితే ఈ ఫీజు కేవలం కొత్త హెచ్1బీ దరఖాస్తుదారులకే వర్తిస్తుంది' అని 'వైట్‌హౌస్' ఉన్నతాధికారి పేర్కొన్నట్లు 'న్యూయార్క్ టైమ్స్' కథనం ప్రచురించింది. మరోవైపు స్వదేశాలకు వెళ్లిన ప్రస్తుత హెచ్1బీ వీసాదారులు నిర్దేశిత గడువులోగా హడావుడిగా తిరిగి అమెరికా చేరుకోవాల్సిన అవసరం లేదని అమెరికా ఉన్నతాధికారి ఒకరు చెప్పినట్లు ఏఎన్ఐ వార్తాసంస్థ పేర్కొంది.

భారత టెక్ కంపెనీలపై ఎఫెక్ట్!
సాక్షి ప్లస్
బిజినెస్ ఈ-పేపర్‌లో..

భారత ఐటీ పరిశ్రమ ఏఐ విధానానికి అడ్జస్ట్ కావాలి



హెచ్-1బీ వీసా ఫీజు భారీగా పెరుగుదల నేపథ్యంలో భారత ఐటీ పరిశ్రమ ప్రాథమికంగా భవిష్యత్ ఏఐ ఆధారిత ఐటీ ల్యాండ్‌స్కేప్‌కు అడ్జస్ట్ కావాల్సి ఉంది. ఇప్పటికే భారత కంపెనీలు హెచ్1-బీ వీసాలపై ఆధారపడటం తగ్గించాయి. అమెరికాలో స్థానికంగా అందుబాటులో ఉన్న వారినే ఎక్కువగా తీసుకుంటున్నాయి. అంతేకాకుండా ఆటోమేషన్, ఆఫ్‌షోర్, గ్లోబల్ డెలివరీ మోడళ్లను పెంచుతోంది. ఇది ఐటీ సర్వీసుల్లో ఏఐను అడాప్ట్ చేసుకోవడం, ఆటోమేషన్‌కు మారడానికి దోహదపడుతుంది. ఒకసారి రోజువారీ కార్యకలాపాల ఆటోమేషన్ జరిగితే ఆన్‌సైట్‌లో అధిక సాంకేతిక పరిజ్ఞానమున్న (హై వాల్యూ వర్క్) నిపుణుల అవసరం పరిమితంగానే ఉంటుంది. అందుకే భారత ఐటీ పరిశ్రమలు ఏఐ, మెషీన్ లెర్నింగ్, ఆటోమేషన్ టెక్నాలజీలలో పెట్టుబడులు పెంచాలి. ఈ చర్యలు ఉత్పాదకతను పెంచడంతో పాటు వీసా ఆధారిత లేబర్ ఇంటెన్సివ్ మోడళ్లపై ఆధారపడటాన్ని తగ్గిస్తాయి. భవిష్యత్తులో క్లయింట్ల ప్రాజెక్టుల కోసం ఆన్‌సైట్‌లో అధిక మొత్తం బడ్జెట్ ఖర్చయ్యే నిపుణుల నియామకాలకు బదులు ఏఐ ఆధారిత ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఆఫ్‌షోర్ డెలివరీ సెంటర్లు, రిమోట్ వర్క్ అవకాశాలు పెరుగుతాయి. మొత్తంగా హెచ్-1బీ వీసా పాలసీ మార్పు భారత ఐటీ కంపెనీలకు ఒక 'కాటలిస్ట్'గా మారనుంది.

– 'సాక్షి'తో వెంకారెడ్డి, చీఫ్ పీపుల్ ఆఫీసర్, క్వాలీ జీల్ ఇన్‌కార్పొరేషన్ (ఐఎన్‌సీ)

అమెరికాకే ఎక్కువ నష్టం..

ట్రంప్ నిర్ణయం భారత్ కంటే అమెరికాకే ఎక్కువ నష్టం కలిగించే అవకాశం ఉంది. భారతీయ ఐటీ సంస్థలు ఇప్పటికే అమెరికాలో 50–80% స్థానికులను నియమించుకుంటున్నాయి. కాబట్టి ఈ చర్య కొత్త ఉద్యోగాలను సృష్టించదు. బదులుగా, ఇది స్థానికులను నియమించుకోవడం కంటే భారతీయులను ఆన్‌సైట్‌లో నియమించడం ఖరీదైనదిగా చేస్తుంది. ఐదేళ్ల అనుభవం ఉన్న ఐటీ మేనేజర్ అమెరికాలో 1.2 లక్షల డాలర్ల నుంచి 1.5 లక్షల డాలర్లు సంపాదిస్తారు. ఈ భారీ రుసుమును ఎదుర్కొనే సంస్థలు ఆఫ్ షోరింగ్‌ను వేగవంతం చేస్తాయి. భారత్ నుంచి రిమోట్‌గా ఎక్కువ పనిచేస్తాయి. అంటే తక్కువ హెచ్-1బీ పిటిషన్లు, తక్కువ స్థానిక నియామకం జరుగుతుంది. అలాగే యూఎస్ క్లయింట్లకు ప్రాజెక్ట్ ఖర్చులు పెరిగి నూతన ఆవిష్కరణల వేగం తగ్గుతుంది. అమెరికా రక్షణాత్మక అడుగును భారత్ డిజిటల్ స్వరాజ్ మిషన్‌కు దీర్ఘకాలిక ప్రోత్సాహకంగా మార్చుకోవాలి. తద్వారా సాఫ్ట్‌వేర్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీలో దేశీయ సామర్థ్యాన్ని పెంపొందించడానికి తిరిగి వచ్చే ప్రతిభను ఉపయోగించుకోవడం వీలవుతుంది. ఈ దిశగా కేంద్రం ప్రణాళిక రచించాలి.

– గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్

న్యాయవ్యవస్థలో వసతుల కల్పనకు సిద్ధం

సీజే జస్టిస్ ఏకే సింగ్‌కు తెలిపిన సీఎం రేవంత్



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో హైకోర్టు సీజే జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ శామ్‌కోషి, జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో న్యాయవ్యవస్థకు మౌలిక సదుపాయాల కల్పన, కోర్టుల్లో సిబ్బంది నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. జిల్లా కోర్టుల నిర్మాణానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ సూచనలిస్తే స్వీకరిస్తామని చెప్పారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం రేవంత్, జస్టిస్ ఏకే సింగ్ శనివారం భేటీ అయ్యారు. కొత్త జిల్లాల్లో కోర్టు భవనాలు, మౌలిక వసతుల కల్పనతో పాటు అవసరమైన సిబ్బంది నియామకాలను త్వరితగతిన చేపట్టాలని జస్టిస్ ఏకే సింగ్ కోరారు. దీనిపై పలు ప్రతిపాదనలను సీఎం దృష్టికి తెచ్చారు. న్యాయవ్యవస్థ సూచనల మేరకు అవసరమైన వసతులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ తెలియజేశారు. ఈ సమావేశంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శామ్‌కోషి, జస్టిస్ అభినంద్ కుమార్ షావిలితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ట్రంప్ ఆలోచన మోదీకి తప్ప ఎవరికీ అర్థంకాదు

హెచ్-1బీ వీసా సమస్యపై కేంద్రం ఎందుకు మౌనం?

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆలోచనాతీరు ఆయన ప్రియ మిత్రుడు ప్రధాని నరేంద్ర మోదీకి తప్ప ఎవరికీ అర్థం కాదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హెచ్-1బీ వీసాపై ఏటా లక్ష డాలర్ల రుసుం విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై కేంద్రం ఎందుకు మౌనం పాటిస్తోంది? దీని వెనుకున్న మర్మమేంటి? అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. హెచ్-1బీ వీసాలు పొందే దేశాల్లో భారత్‌దే మొదటి స్థానమని, ట్రంప్ నిర్ణయ ప్రభావం మనపైనే ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయంపై ముందస్తుగా అమెరికాతో సంప్రదింపులు జరిపి సమస్యను పరిష్కరించడంలో కేంద్రం విఫలమయ్యిందని విమర్శించారు. 'కనీసం ప్రస్తుతం ఉన్న అమెరికాలో ఉన్న హెచ్- 1బీ వీసాదారులకు మినహాయింపులను సాధించడంలోనూ కేంద్రం విఫలమయ్యింది. భారత్‌కు నష్టం చేకూర్చేలా ట్రంప్ ఇప్పటికే 50 శాతం టారిఫ్ విధించారు. ఇప్పుడేమో హెచ్-1బీ వీసా ఫీజును పెంచారు. అయినా మోదీ ఎందుకు స్పందించడం లేదు? ట్రంప్ నిర్ణయం వల్ల అధికంగా ప్రభావం పడే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్రానికి లేఖ రాస్తాం. సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపకుండా.. ఇది మన మంచికే అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరం' అని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

వచ్చే వారమే 'స్థానిక' నోటిఫికేషన్?

▶ మొదటి పేజీ తరువాయి

ఎంపీటీసీలకు దాదాపు 14 నెలల కిందట కాలపరిమితి ముగిసింది. ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని భావించి ఇంతకాలం ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేస్తూ వచ్చింది. ఓబీసీలకు రిజర్వేషన్ల కల్పనకు అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి గవర్నర్‌కు పంపగా, దానిని ఆయన రాష్ట్రపతి అనుమతి కోసం పంపించారు. ఇప్పుడు ఆ బిల్లు రాష్ట్రపతి వద్దనే పెండింగ్‌లో ఉంది. దీంతో మరో ప్రయత్నంగా పంచాయతీరాజ్ చట్టంలో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా పరిమితి విధించిన నిబంధనను తొలగిస్తూ అసెంబ్లీలో బిల్లును ఆమోదించి గవర్నర్‌కు పంపించింది. ఆ బిల్లు కూడా ప్రస్తుతం గవర్నర్ దగ్గర పెండింగ్‌లోనే ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఢిల్లీలో మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాష్ట్రపతి, గవర్నర్లు బిల్లులను ఆపే అధికారంపై సుప్రీంకోర్టులో ఉన్న కేసు తేలిన తరవాతే ఎన్నికలకు వెళ్తామని చెప్పారు. కానీ, శనివారం సాయంత్రం ఆయన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ తదితర అందుబాటులో ఉన్న మంత్రులతోపాటు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తోనూ సమాలోచనలు జరిపారు. అనంతరం ఎన్నికలకు వెళ్లడానికే మొగ్గు చూపినట్లు తెలిసింది. హైకోర్టు విధించిన గడువులోగా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాలని నిర్ణయించినట్లు సమాచారం. రిజర్వేషన్ల జీవో జారీ చేసిన తరువాత న్యాయస్థానాలకు వెళ్లే సమయం ఇవ్వకుండా నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉందని తెలిసింది.

లక్ష డాలర్ల బాంబు

▶ మొదటి పేజీ తరువాయి

అంటున్నారు. అమెరికా కేంద్రంగా పనిచేస్తూ విదేశీయులను నియమించుకొనే కంపెనీలు వారికి హెచ్-1బీ వీసాలు జారీ చేయడానికి ప్రతి సంవత్సరం రూ.88 లక్షలకుపైగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ భారాన్ని మోయలేని కంపెనీలు విదేశీ ఉద్యోగులను పక్కనపెట్టి, స్థానిక అమెరికన్లకే ప్రాధాన్యం ఇవ్వొచ్చు. సరిగ్గా ట్రంప్ ఆశిస్తున్నది కూడా ఇదే. ట్రంప్ ప్రభుత్వ నిర్ణయం వెంటనే ప్రభావం చూపింది. గడువు దాటితే రూ.88 లక్షలు చెల్లించక తప్పని పరిస్థితి ఉండడంతో ప్రస్తుతం విదేశాల్లో ఉన్న హెచ్-1బీ వీసాదారులు, వారి కుటుంబ సభ్యులు తక్షణమే అమెరికాకు చేరుకోవాలని కంపెనీలు ఆదేశించాయి. దాంతో విమానాశ్రయాల్లో ఒక్కసారిగా రద్దీ పెరిగింది. టికెట్ల ధరలకు రెక్కలొచ్చాయి. ఉత్తర్వు అమల్లోకి వచ్చే నిర్దేశిత గడువులోగా అమెరికాలో అడుగుపెట్టడానికి హెచ్-1బీ వీసాలు కలిగిన విదేశీ ఉద్యోగులు పరుగులు తీశారు.

ఏమిటీ హెచ్-1బీ వీసా?

విదేశీ నిపుణులను అమెరికాలోని కంపెనీలు ఉద్యోగాల్లో నియమించుకోవడానికి వీలుగా 1990వ దశకంలో అమెరికా ప్రభుత్వం ఇమిగ్రేషన్ చట్టం ద్వారా హెచ్-1బీ వీసాలను ప్రవేశపెట్టింది. ఈ వీసాలతో లక్షలాది మంది విదేశీయులు అమెరికాలో ఉద్యోగాలు సంపాదించారు. ఇక్కడే స్థిరపడ్డారు. క్రమంగా పౌరసత్వం కూడా పొందారు. హెచ్-1బీ వీసా దరఖాస్తు ఫీజు ప్రస్తుతం 2 వేల డాలర్ల నుంచి 5 వేల డాలర్ల (రూ.1.76 లక్షలు- రూ.4.40 లక్షలు) దాకా ఉంది. తొలుత మూడేళ్ల కాలానికి హెచ్-1బీ వీసా జారీ చేస్తారు. అవసరాన్ని బట్టి మరో మూడేళ్లు పొడిగిస్తారు. ఈ వీసాలతో అత్యధికంగా ప్రయోజనం పొందుతున్నది భారత నిపుణులే. ఆ తర్వాత చైనా నిపుణులు ఉంటున్నారు. భారత్‌లో ఇంజనీరింగ్ విద్య అభ్యసించిన విద్యార్థుల కల హెచ్-1బీ వీసా అంటే అతిశయోక్తి కాదు. దీని గురించి తెలియనివాళ్లు దాదాపు ఉండరు. సాధారణంగా హెచ్-1బీ వీసా దరఖాస్తు ఫీజుతోపాటు ఇతర రుసుములను కంపెనీలే భరిస్తాయి. ఇకపై దీనికోసం ఏటా ఒక్కో విదేశీ ఉద్యోగిపై రూ.88 లక్షలకుపైగా చెల్లించాల్సి రావడం అమెరికా సంస్థలకు పెనుభారమే. అది పరోక్షంగా విదేశీ ఉద్యోగులకు.. ముఖ్యంగా భారతీయులకు నష్టం చేకూర్చనుంది. కంపెనీల అవసరాలు తీర్చేలా అత్యధిక ప్రతిభాపాటవాలు ఉంటే తప్ప హెచ్-1బీ వీసాతో అమెరికాలో ఉద్యోగం పొందడం దుర్లభమేనని అంటున్నారు.

అమెరికా జాతీయ భద్రతకు ముప్పు: ట్రంప్

అత్యంత నైపుణ్యం కలిగిన విదేశీ ఉద్యోగులను మాత్రమే అమెరికాలోకి అనుమతించాలన్నదే తమ విధానమని డొనాల్డ్ ట్రంప్ స్పష్టంచేశారు. హెచ్-1బీ వీసా కార్యక్రమం అమెరికా జాతీయ భద్రతకు ముప్పుగా మారిందని ఆయన ఆక్షేపించారు. నైపుణ్యంతో కూడిన పనులు చేయడానికి విదేశాల నుంచి తాత్కాలిక ఉద్యోగులను తీసుకురావడానికి ఉద్దేశించిన ఈ వీసా దుర్వినియోగం అవుతోందని అన్నారు. అమెరికా ఉద్యోగుల స్థానంలో తక్కువ వేతనం, తక్కువ నైపుణ్యాలు కలిగిన విదేశీయులను నియమించుకోవడానికి హెచ్-1బీని ఒక అస్త్రంగా వాడుకుంటున్నారని విమర్శించారు. అంతేకాకుండా ఈ వీసాలపై ఆధారపడిన ఔట్‌సోర్సింగ్ కంపెనీలు వీసా మోసాలు, మనీ లాండరింగ్, ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నట్లు తమ దర్యాప్తు సంస్థలు గుర్తించాయని చెప్పారు. విదేశీయులను అడ్డదారుల్లో అమెరికాకు చేరవేస్తున్నట్లు కనిపెట్టాయని పేర్కొన్నారు. ఈ అక్రమాలను అరికట్టడానికి కంపెనీలపై వీసా దరఖాస్తు ఫీజులు పెంచక తప్పడం లేదని వివరించారు. విదేశీ నిపుణుల్లో అత్యంత ప్రతిభావంతమైన నిపుణులను తాత్కాలికంగా నియమించుకోవడానికి కంపెనీలకు అనుమతి ఇస్తున్నామని, అందుకు ఎలాంటి అడ్డంకులు లేవని ప్రకటించారు. తమ నిర్ణయం పట్ల టెక్ కంపెనీల సీఈఓలు కచ్చితంగా సంతోషిస్తారని ట్రంప్ వ్యాఖ్యానించారు. వీసాల ముసుగులో కొనసాగుతున్న విచ్చలవిడి వలసలకు కళ్లెం వేయక తప్పదని పరోక్షంగా తేల్చిచెప్పారు. కంప్యూటర్ సంబంధిత రంగాల్లో కంపెనీలు హెచ్-1బీ వీసాలతో విదేశీయులకు ఉద్యోగాలు ఇస్తూ అమెరికన్లకు అన్యాయం చేస్తున్నాయని తప్పుపట్టారు. 2003లో హెచ్-1బీలు పొందిన విదేశీయుల్లో ఐటీ ఉద్యోగులు 32 శాతం మంది ఉండగా, ఇప్పుడు వారి సంఖ్య 65 శాతానికి చేరడం గమనార్హం. ట్రంప్ తాజా నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు స్వాగతిస్తుండగా, మరికొందరు వ్యతిరేకిస్తున్నారు. నిపుణులైన విదేశీ మానవ వనరులను అమెరికాకు దూరంచేసే ప్రయత్నం మానుకోవాలని ట్రంప్ ప్రత్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతిభలేనివారు మనకెందుకు?: హోవార్డ్ లుట్నిక్

అమెరికాలో ప్రస్తుతం అమల్లో ఉన్న ఇమిగ్రేషన్ వ్యవస్థలో హెచ్-1బీ నాన్-ఇమిగ్రెంట్ వీసా కార్యక్రమం అత్యధికంగా ఉల్లంఘనకు గురవుతోందని వైట్‌హౌస్ స్టాఫ్ సెక్రెటరీ విల్ స్కార్ఫ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ వీసా అసలు ఉద్దేశం నెరవేరడం లేదన్నారు. అమెరికా కామర్స్ సెక్రెటరీ హోవార్డ్ లుట్నిక్ మాట్లాడుతూ.. అమెరికన్ల అవకాశాలు దోచుకొనేవారు తమకు అవసరం లేదన్నారు. అత్యధిక నైపుణ్యాలు కలిగినవారికే అమెరికాలో ఉద్యోగాలు దక్కాలని చెప్పారు. అలాంటి నిపుణులు అమెరికాలో వ్యాపారాలు చేసి, ప్రతిభతో అమెరికన్ల కోసం కొత్త ఉద్యోగాలు సృష్టించగలరని తెలిపారు. దీనివల్ల అమెరికా ఖజానాకు 100 బిలియన్ డాలర్ల మేర లబ్ధి కలుగుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఒక విదేశీ ఉద్యోగి కచ్చితంగా అవసరమని భావిస్తే అతడి కోసం ఏటా లక్ష డాలర్లు ప్రభుత్వానికి చెల్లించాలని, లేకపోతే అమెరికా పౌరుడినే నియమించుకోవాలని కంపెనీలకు సూచించారు. ప్రతిభ లేని విదేశీయులు మనకెందుని ప్రశ్నించారు. స్థానికులకే శిక్షణ ఇచ్చి, ఉద్యోగాల్లో చేర్చుకోవాలని కంపెనీలకు స్పష్టంచేశారు. హెచ్-1బీ వీసాల రెన్యువల్స్‌తోపాటు కొత్త దరఖాస్తులకు కూడా లక్షల డాలర్ల రుసుము వర్తిస్తుందని హోవార్డ్ లుట్నిక్ వెల్లడించారు. మరోవైపు ఒక విదేశీ ఉద్యోగి గ్రీన్‌కార్డు పొందడం కోసం కంపెనీ ఇప్పటికే స్పాన్సర్ చేస్తే అతడి వీసాను రెన్యువల్ చేయడానికి ఏటా లక్ష డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. అది భారంగా భావిస్తే రెన్యూవల్ చేయడం ఆపేయొచ్చు. ఫలితంగా గ్రీన్‌కార్డు ఆశలు సైతం వదులుకోవాల్సిందే. గ్రీన్‌కార్డుల కోసం ఇప్పటికే వేలాది మంది విదేశీయులు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారు.

హెచ్-1బీతో వేలాది ఉద్యోగాలు

అమెరికాలో పుట్టిన కంపెనీలతోపాటు అమెరికా కేంద్రంగా పని చేస్తున్న విదేశీ కంపెనీలు హెచ్-1బీ వీసాలతో ఎక్కువ మంది ఉద్యోగులను నియమించుకుంటున్నాయి. ఈ ఏడాది ఇప్పటిదాకా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) 5,505 మందిని ఈ వీసాలతోనే నియమించుకుంది. అమెజాన్ సంస్థ అత్యధికంగా 10,044 మందికి ఉద్యోగాలు ఇచ్చింది. యూఎస్ సిటిజన్‌షిప్, ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) గణాంకాల ప్రకారం.. మైక్రోసాఫ్ట్ 5,189 మందిని, మెటా 5,123, యాపిల్ 4,202, గూగుల్ 4,181, డెలాయిట్ 2,353, ఇన్ఫోసిస్ 2,004, విప్రో 1,523, టెక్ మహీంద్రా 951 మందిని హెచ్-1బీ వీసాలతో నియమించుకున్నాయి. ట్రంప్ ఉత్తర్వు అమల్లోకి వస్తే ఈ సంఖ్య భారీగా పడిపోవడం ఖాయం.

కొందరికి మినహాయింపు

ట్రంప్ సంతకం చేసిన అధికారిక ఉత్తర్వులోని సెక్షన్ 1(సీ) క్లాజ్ ప్రకారం.. పెంచిన హెచ్-1బీ వీసా రుసుము విషయంలో కొందరికి మినహాయింపు ఇచ్చారు. అమెరికా జాతీయ ప్రయోజనాలతో ముడిపడి ఉన్న, అమెరికా భద్రతకు విఘాతం కలిగించని హెచ్1-బీ స్పెషాలిటీ ఆక్యుపేషన్ వర్కర్లపై ఈ రుసుము విధించాలా? వద్దా? అనే దానిపై విచక్షణాధికారాన్ని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శికి కట్టబెట్టారు. అలాంటి కార్మికుల వీసా దరఖాస్తుల ఫీజుపై హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి సొంతంగా నిర్ణయం తీసుకోవచ్చు. అలాగే సబ్‌సెక్షన్ (సి) ప్రకారం.. ఆరోగ్య సంరక్షణ, రక్షణ కాంట్రాక్టర్లు, కృత్రిమ మేధ(ఏఐ), సైబర్ సెక్యూరిటీ, సెమీకండక్టర్లు, క్లౌడ్ ఇన్‌ఫ్రా, విశ్వవిద్యాలయాలు, పరిశోధన కేంద్రాల్లో పనిచేసే హెచ్1-బీ వీసాదారులకు ఈ రుసుము నుంచి మినహాయింపు ఇచ్చినట్లు సమాచారం.


TATA MOTORS
Connecting Aspirations
TATA
FESTIVAL OF GST GREATEST SAVINGS FROM TATA MOTORS
ఈ పండగ సీజన్లో,
లెజెండ్ అవండి, డీజిల్ ఎంచుకోండి
ఎంచుకోండి అధిక టార్క్‌ని, మేలైన పర్ఫార్మెన్స్‌తో
బుక్ చేసుకోండి ఇవాళే
మీ పండగ డెలివరీని రిజర్వ్ చేసుకునేందుకు. ₹1.55 Lakh** వరకు 100% GST ప్రయోజనాలు
India's most fuel-efficient: 24.07 KMPL Diesel SUV – Nexon
Get 53% more pull for quicker overtakes
India's only Diesel engine with DCA - Curvv
Made for real performance
Cleaner drives with lower CO2 emissions
LEGENDS DRIVE DIESEL
HARRIER
SAFARI
THE FULLY-LOADED HARRIER ADVENTURE X
₹17.96 Lakh
₹1.24 Lakh
THE FULLY-LOADED SAFARI ADVENTURE X
₹18.90 Lakh
₹1.20 Lakh
HARRIER
Current Starting Price ₹14.99 Lakh
Estimated Starting Price after GST 2.0
₹14.18 Lakh
CURVV
Current Starting Price ₹11.49 Lakh
Estimated Starting Price after GST 2.0
₹11.10 Lakh
NEXON
Current Starting Price ₹9.99 Lakh
Estimated Starting Price after GST 2.0
₹8.99 Lakh
SAFARI
Current Starting Price ₹15.49 Lakh
Estimated Starting Price after GST 2.0
₹14.66 Lakh
ALTROZ
Current Starting Price ₹8.99 Lakh
Estimated Starting Price after GST 2.0
₹8.09 Lakh
Choose from the widest range of body style of Diesel cars from TATA Motors.
book TATA Motors
BHARAT NCAP
GLOBAL NCAP
ORANGE AUTO
Attapur: 9167473372; Erragadda: 7506025174; Kharkana: 7506025493; Medchal: 8291244717; Medak: 9619938527
Banjara Hills: 8291058022; Boduppal: 9000979494; Financial District (Near Q City): 9167090503
SELECT CARS
Alkapuri: 7506025176; Begumpet: 7506025220; Karmanghat: 9619083948
SELECT CARS
Chandanagar: 7506025180; Miyapur,Bachupally: 9167413840
JASPER INDUSTRIES
SD Road, Secunderabad: 9619024718; Narsingi: 8879152707; Chandrayangutta: 9167450755; Kompally: 9619973314
TEJASWI AUTOMOBILES
HiTech City Madhapur: 7506025271, Sangareddy: 8879187409, Siddipet: 8879187436, Zaheerabad: 8879194145; Tolichowki: 8879186915
VENKATARAMANA MOTORS
Gachibowli, Shankarpally, Shamshabad : 7506025311; Kukatpally: 8879221046
VVC AUTOWORLD
Vanastalipuram, Ibrahimpatnam: 7506025358; Jubilee Hills: 8879334329; ECIL, Kushaiguda: 7506025339
MALIK AUTOWORLD
Malakpet: 7506025166; Himayathnagar, Beeramguda : 7506025158; Bowenpally: 7506025486; Shadnagar: 8291106052
Service: Attapur, Autonagar, Beeramguda, Bowenpally, Champapet, ECIL, Hafeezpet, Hi-tech City, Kompally, Kondapur, Kothapet, L.B. Nagar, Miyapur, Nacharam, Sanathnagar, Sangareddy, Secunderabad, Siddipet, Tadbund, Tellapur, Tolichowki, Uppal, Y Junction
Images and Illustrations are indicative and for information purposes only. All features/specifications are not available in all variants and may vary for different variants. Specifications/features are subject to change without prior information. Colours may vary due to printing limitations. Mass Segment. **Please confirm the exact price of your preferred car/SUV variant from an authorized Tata Motors showroom near you. ^^Estimated ex-showroom New Delhi price, after GST 2.0, effective 22nd September. ~~Price mentioned is Nexon Smart MT Petrol, ex showroom Delhi Local taxes extra. Nexon GNCAP test in Feb' 24 & BNCAP tested in Oct 24. Nexon is available in petrol, Diesel, CNG and EV in India. ARAI certified mileage of 24.07 KMPL for Nexon Diesel AMT under standard test conditions. The mileage figures quoted 24.07 KMPL for the Nexon diesel AMT are ARAI certified test figures under controlled conditions. Actual mileage may vary significantly as per driving conditions. Considered in the compact SUV segment. ~~Price mentioned is Harrier and Safari Smart MT, ex-showroom Delhi Local taxes extra. Harrier and Safari GNCAP test in 2023 & BNCAP tested in 2023. Harrier is available in Diesel and EV in India. Safari is available in Diesel in India. ^^Price mentioned is Curvv Smart MT, ex-showroom Delhi Local taxes extra. ~~Altroz price mentioned Pure Diesel MT, ex showroom Delhi. T&C apply. Altroz is 5-star Bharat NCAP rated hatchback as per 2025 test. Altroz is the only hatchback to get 5-star rating across powertrain of Petrol, Diesel and CNG. As per Bharat NCAP results. T&C apply.

"దేవుడు చేయు పనులన్నియు శాశ్వతములని నేను తెలిసికొంటిని; దాని కేదియు చేర్చబడదు దాని నుండి ఏదియు తీయబడదు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** అమావాస్య రా.12.14 వరకు, తదుపరి ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి, **నక్షత్రం:** పుబ్బ ఉ.9.55 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** సా.5.20 నుండి 7.11 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.21 నుండి 5.09 వరకు, **అమృత ఘడియలు:** రా.3.40 నుండి 5.21 వరకు, **మహాలయ అమావాస్య.**

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం : 5.57
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

ప్రహ్లాద్ కక్కడ్ (యాడ్ ఫిల్మ్స్ డైరెక్టర్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఇరవై అంటే ఇరవయ్యే నిముషాల ఇంటర్వ్యూ కోసమని నన్ను నమ్మించి తన స్టూడియోకి రప్పించుకున్నాడు విక్కీ లల్వాని! గంటా ఇరవై నిముషాలు అయింది. ఎంతకూ వదలడు. రెండో ప్రశ్న వెయ్యడు.

"ఒక్కమాట చెప్పండి ప్రహ్లాద్‌జీ! ఐశ్వర్యా రాయ్, అభిషేక్ బచ్చన్ ఏ క్షణమైనా విడిపోవచ్చునంటారా?" అంటాడు.

ఏ క్షణమైనా జరిగేవి లోకంలో కొన్ని మాత్రమే ఉంటాయి. విలయాలు, విపరీతాలు, ప్రళయాలు, ప్రకంపనాలు! ఆ జాబితాలోనే ఇప్పుడు ఐశ్వర్యా రాయ్, అభిషేక్ బచ్చన్‌ల విడాకులను కూడా చేర్చినట్లున్నాడు అతడు.

"చెప్పండి ప్రహ్లాద్‌జీ, వాళ్లిద్దరూ విడిపోకుండా ఏ శక్తీ ఆపలేదంటారా?" అన్నాడు మళ్లీ!

నా డెబ్బై ఐదేళ్ల వయసులో ఇలాంటి ఒక ప్రశ్నకు నేను సమాధానం ఇవ్వవలసిన భాగ్యం నాకు దక్కుతుందని విధి నన్ను ముందే ఆశీర్వదించి కిందికి పంపిందా?!

బాంద్రాలోని లామెర్ బిల్డింగులో ఐశ్వర్య తల్లి బృందా రాయ్ ఉండే ఫ్లాట్ పక్కనే నేనుండే ఫ్లాటు ఉంటుంది. అందుకే నన్నతడు పట్టి పీడిస్తున్నాడు.



"వాళ్లు విడిపోతారని మీకెందుకు అనిపిస్తోంది విక్కీ? వారిలో మీరు చూడకూడనిది ఏం చూశారు? చూడవలసినది ఏం చూడకుండా ఉండిపోయారు?" అని అడిగాను.

"ప్రహ్లాద్‌జీ! ఈమధ్య ఐశ్వర్య తన అత్తగారిల్లు జుహులో కాకుండా, బాంద్రాలోని తన తల్లిగారి ఇంట్లోనే ఎక్కువగా కనిపిస్తున్నారని విన్నాను" అన్నాడు విక్కీ.

తల్లి గారింట్లో ఎక్కువగానా! తల్లిగారింట్లో ఎంత ఎక్కువ మాత్రం ఎక్కువవుతుంది కూతురికి!

ఐశ్వర్య ప్రతి రోజూ ఆరాధ్యను అంబానీ స్కూల్లో డ్రాప్ చేసి, తిరిగి ఒంటిగంటకు పికప్ చేసుకోటానికి మళ్లీ స్కూల్‌కి వెళ్తుంది. ఆ మధ్యలో మూడు గంటలు గడవాలి కనుక ఆ మూడు గంటలూ, ఆ దగ్గర్లోనే ఉండే తల్లితో ఉంటుంది. ఆ విషయమే చెప్పాను విక్కీకి.

విక్కీ కడుపు నిండినట్లు లేదు.

"మరి ఐశ్వర్య, అభిషేక్ ఎందుకని బయటెక్కడా కలిసి కనిపించటం లేదు ప్రహ్లాద్‌జీ?" అంటాడు!

భార్యాభర్తలు అనేవాళ్లు కలిసి జీవిస్తారు కానీ, కలిసి కనిపించరు. ఇంట్లో కూడా ఒకరు హాల్లో ఉంటే, ఒకరు బాల్కనీలో ఉంటారు. ఒకరు టీవీ ముందు ఉంటే ఇంకొకరు కిచెన్‌లో ఉంటారు. ఇక బయటైనా వాళ్లెందుకు కలిసి కనిపించాలి? ఐశ్వర్య, అభిషేక్ కూడా భార్యాభర్తలే కదా!

అయితే విక్కీతో నేనామాట అనలేదు. అన్నానంటే – "వాళ్లు విడిపోతున్న మాట నిజమేనన్న మాట!" అని సంతృప్తిగా నా కళ్లలోకి చూస్తాడు. అతడికి ఆ సంతృప్తిని నేను ఇవ్వదలుచుకోలేదు.

"ఐశ్వర్య, అభిషేక్ కలిసి కనిపించకుండా ఎప్పుడున్నారు విక్కీ! ఈ మధ్యే కదా కూతురుతో కలిసి వాళ్ల 18వ పెళ్లి రోజును కూడా జరుపుకొన్నారు" అన్నాను.

విక్కీ తన ఆశలు కోల్పోలేదు.

"మరైతే ప్రహ్లాద్‌జీ, 'డివోర్స్' మీద ఎవరిదో ఆర్టికల్‌కు సోషల్ మీడియాలో అభిషేక్ ఎందుకు లైక్ కొట్టారంటారు?" అన్నాడు.

నీరసంగా మూలిగాన్నేను.

ఎవరు ఏ పోస్టుకు ఎందుకు లైక్ కొడతారో ఎవరు చెప్పగలరు! నేను అనుకోవటం అభిషేక్ లైక్ కొట్టింది ఆ ఆర్టికల్‌కి అయివుండదు. ఆ ఆర్టికల్‌కు ఇన్‌పుట్స్ ఇచ్చిన డాక్టర్ జిరక్ మార్కర్‌కి అయివుంటుంది. జిరక్ ఐశ్వర్య స్నేహితుడు. ఇద్దరూ జై హింద్ కాలేజ్‌లో కలిసి చదువుకున్నారు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు ప్రహ్లాద్‌జీ? అభిషేక్ ఆ పోస్ట్‌కి లైక్ ఎందుకు కొట్టారంటారు?"– విక్కీ వదలటం లేదు.

పైకి కనిపించే లైక్‌లను మాత్రమే లోకం చూడగలదు. బహుశా ఆ లైక్... ఐశ్వర్యకు అభిషేక్ – ఎవరికీ కనిపించకుండా కొట్టిన లైక్ ఎందుకు అయివుండ కూడదు?!

గద్దల రాజ్యం ప్రైవేట్ లిమిటెడ్!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

''నెహ్రూ ఒక ఫ్యూడల్. ఆయనకు బాగా డబ్బులున్నాయి. లండన్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు ఆయన ఏ గేట్ దగ్గరికి వెళ్తే అక్కడికో కారు వచ్చేది. ఆయన అనుసరించిన విధానాల వలన సింగపూర్‌తో మనం పోటీపడలేకపోయాము. సింగపూర్ తొలి ప్రధాని లీ క్వాన్ యూ పోటీదారి ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టి అభివృద్ధి చేశారు. నెహ్రూ వల్ల మనం సింగపూర్‌తో పోటీపడలేకపోయాము.'' ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేసినట్టు ఆయనకు బాకా ఊదే మీడియాలో రిపోర్టయింది.

బ్రిటిష్ వలస పాలన సంకెళ్లు తెగగొట్టడానికి మొట్టమొదటిసారిగా లాహోర్ కాంగ్రెస్ సభలో 'పూర్ణ స్వరాజ్' శంఖారావం చేసినవాడు నెహ్రూ. తొలి ప్రధానిగా పంచవర్ష ప్రణాళికలు వేసి నవభారత సౌధ నిర్మాణానికి ఇటుకలు పేర్చినవాడాయన. అంతర్జాతీయ వేదికపై రష్యా – అమెరికా కూటములకు దీటుగా ప్రవర్ధ స్వతంత్ర దేశాలను కూడగట్టి 'అలీనోద్యమా'న్ని నిర్మించిన ప్రపంచస్థాయి నేత నెహ్రూ. అటువంటి నెహ్రూ గురించి ఐఏఎస్ శిక్షణ పొందిన వారికి తాను చెప్పేది తప్ప ఇంకేమీ తెలియకపోవచ్చనుకోవడం బాబు ఆత్మవిశ్వాసానికి ఓ మచ్చుతునక అనుకోవాలి.

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి అనేక గేట్లుంటాయి. ఆయన ఏ గేటులోంచి బయటికి వస్తారో తెలియదు గనుక ప్రతి గేటు దగ్గరా ఒక కారుండేదని బాబు చెబుతున్నారు. అంత డబ్బున్నవాడు గనుక ఆయన 'ఫ్యూడల్' అంటున్నారు. బాగా డబ్బున్న వాళ్లను 'ఫ్యూడల్స్' అనాలేమో! ఈ థియరీ ప్రకారం బోలెడంత డబ్బున్న ఎలాన్ మస్క్, అంబానీ వంటి వాళ్లంతా పెద్దపెద్ద ఫ్యూడల్స్ అనుకోవాలి. బాబు ప్రేమించే సింగపూర్‌లో పెద్దసంఖ్యలో బిలియనీర్లు, మిలియనీర్లు ఉన్నారు కాబట్టి అక్కడున్నది ఫ్యూడల్ వ్యవస్థేమో! సరే, ఈ జ్ఞానామృత సేవనాన్ని పక్కన బెడితే... నిజంగానే నెహ్రూ సంపన్నుడు. ఆయన తండ్రి మోతీలాల్ నెహ్రూ ఒక విజయవంతమైన న్యాయవాదిగా రెండు చేతులా ఆర్జించారు. అలహాబాద్ (ప్రస్తుత ప్రయాగ్‌రాజ్)లో ప్యాలెస్ లాంటి 'ఆనందభవన్'ను నిర్మించుకున్నారు. అనంతర కాలంలో ఆ ప్యాలెస్ స్వాతంత్ర్యోద్యమానికీ, కాంగ్రెస్ కార్యకలాపాలకూ కేంద్ర స్థానంగా మారింది.

లండన్‌లో నెహ్రూ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రతిష్ఠాత్మకమైన హారో స్కూల్‌లో జరిగింది. కాలేజీ చదువు ట్రినిటీ కాలేజీలో! ఇది కేంబ్రిడ్జి యూనివర్సిటీలో భాగం. ఆక్స్‌ఫర్డ్ కాదు. తర్వాత బారిస్టర్ శిక్షణ కూడా నెహ్రూ తీసుకున్నారు. చంద్రబాబు చెప్పిన 'గేటుకో కారు' అనే చందమామ కథను ఎక్కడి నుంచి సంగ్రహించారో తెలియదు. ప్రామాణిక గ్రంథాల్లో ఈ కథ ఎక్కడైనా ఉన్నదేమో అది చదివినవాళ్లే చెప్పాలి. బాబు జ్ఞానబోధ విన్న ఐఏఎస్‌లు, అధికారులంతా చరిత్ర ప్రసిద్ధిగన్న నెహ్రూ ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' పాఠాన్ని చదివే ఉంటారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి అర్ధరాత్రి జాతినుద్దేశించి ఆయన ప్రసంగించారు. 'అర్ధరాత్రి ప్రపంచమంతా నిద్రిస్తున్న వేళ స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాల సాధన కోసం భారత్ మేల్కొంటున్నది. పేదరికం లేని, అసమానతలకు తావు లేని, రోగాలు రొష్టులెరుగని, అజ్ఞానాన్ని పారదోలే వ్యవస్థను నిర్మించుకోవడమే జాతి లక్ష్యమ'ని నెహ్రూ ప్రకటించారు. ఇందులో 'ఫ్యూడలిజం' ఎక్కడ ఉన్నదో, పెత్తందారీతనమెక్కడ ఉన్నదో అధికారులే వెతికి పట్టుకోవాలి. సువిశాలమైన, వైవిధ్యభరితమైన, బహుళ సంస్కృతుల నిలయమైన, అత్యధిక జనాభా కలిగిన భారత్ అభివృద్ధి గమనాన్ని ఒక చిన్న సిటీ స్టేట్ సింగపూర్‌తో పోల్చడం ఏ రకంగా విధాయకమో విజ్ఞులైన అధికారులు గ్రహించే ఉంటారు.

ప్రభుత్వ ఉద్దేశాలను వివరించడానికి, ప్రభుత్వ నిర్ణయాల అమలుకు కార్యోన్ముఖులను చేయడానికి కలెక్టర్ల సమావేశాలను ఏర్పాటు చేస్తుంటారు. ఇటువంటి అధికారిక సమావేశాలను రాజకీయ వేదికలుగా మార్చడం తగునా? దేశ తొలి ప్రధానిని కించపరిచే ఉపన్యాసాలు చేయడం సమంజసమేనా? నెహ్రూ అమలు చేసిన డెమోక్రటిక్ సోషలిస్టు విధానాలు ప్రైవేట్ వ్యాపారులకు ఊడిగం చేసే నేటి పాలకులకు నచ్చకపోవచ్చు. కానీ, వారసత్వంగా వచ్చిన విలాసవంతమైన జీవితాన్ని కాలదన్నుకొని స్వాతంత్ర్యోద్యమంలో ఒక ముఖ్య సేనానిగా పాల్గొని పదేళ్లకు పైగా జైలు జీవితం గడిపిన త్యాగధనుడిగానైనా ఆయన్ను గుర్తించి గౌరవించాలి కదా! 'సంఘ్ పరివార్'కు ఆది నుంచి నెహ్రూతో సిద్ధాంతపరమైన విభేదాలున్నాయి. చాలా కాలంగా అధికారంలో ఉండి అన్ని హంగులూ అమర్చుకున్నందువల్ల నెహ్రూ వ్యక్తిత్వ హనన కార్యక్రమాన్ని కేంద్ర సర్కార్ పెద్దయెత్తున చేపట్టింది.

వాళ్లను సంతృప్తి పరిచే కార్యక్రమంలో భాగంగా ఆంధ్రా ఎన్డీఏ కూటమిలోని భాగస్వాములు ఒకరితో ఒకరు పోటీపడుతున్నట్టున్నారు. బీజేపీ వాళ్లను మించి వీర సనాతనవాదిగా చలామణీ కావడానికి ఇటీవల పవన్ కల్యాణ్ పడిన పాట్లను కూడా గుర్తుకు తెచ్చుకోవాలి. నెహ్రూ విధానాల మీద నిందా ప్రచారం చేయడానికి బీజేపీ వాళ్లు రకరకాల వేదికల్ని ఉపయోగించుకున్నారే గాని, చంద్రబాబు మాదిరిగా ఐఏఎస్‌ల సమావేశాన్ని మాత్రం ఉపయోగించుకున్నట్టు లేదు. ఈ రకంగా బాబు వాళ్లకు ఓ కొత్త దారిని చూపించాడనుకోవాలి. చంద్రబాబు పార్టీతో అంటకాగే అలవాటున్న ఆంధ్ర, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వాళ్లు కూడా చంద్రబాబు వ్యాఖ్యల్ని ఖండించకపోవడం పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు.

ఇంతకూ బాబు చెబుతున్నట్టు దేశంలో అభివృద్ధి రాహిత్యానికి కారణమైన నెహ్రూ విధానాలేమిటి? రెండు శతాబ్దాల వలస దోపిడీ అనంతరం భారత్ ఆర్థికంగా చిక్కి శల్యమైంది. యూరప్ పారిశ్రామిక విప్లవం తర్వాత దేశంలో కొత్తగా పరిశ్రమలు రాకపోగా పాతకాలపు పరిశ్రమలు, చేతివృత్తులు మూలపడ్డాయి. బ్రిటన్‌కు ముడిసరుకుల పంపిణీ చేసే దేశంగా మిగిలిపోయింది. ఫలితంగా స్వదేశీ పెట్టుబడిదారీ వర్గం అభివృద్ధి చెందలేదు. అందువల్ల భారీ పరిశ్రమల్ని, రైల్వేలు, నీటిపారుదల ప్రాజెక్టుల వంటి వాటిని ప్రభుత్వమే తలకెత్తుకోవలసి వచ్చింది. స్వదేశీ పెట్టుబడిదారీవర్గం నిర్వహించగలిగిన పరిశ్రమల స్థాపనకు వారికి అనుమతులివ్వడం జరిగింది. ప్రభుత్వ రంగం, ప్రైవేట్ రంగం పక్కపక్కనే పనిచేయడం వల్ల ఉద్యోగులు, కార్మికుల ఉద్యోగ భద్రత పెరిగింది. మెరుగైన వేతనాలు, సౌకర్యాలు పెరిగాయి. ప్రభుత్వ రంగ సంస్థల వల్ల ఒక కొత్త మధ్యతరగతి వర్గం తయారైంది.

కాలక్రమంలో ప్రైవేట్ రంగంలో పరిశ్రమల స్థాపనకు లైసెన్స్‌రాజ్, రెడ్ టేపిజమ్ ఆటంకంగా మారాయనే విమర్శలు మొదలయ్యాయి. నిజంగానే ఆ కాలంలో (1947–1991) ఆర్థిక వృద్ధి రేటు నాలుగు శాతానికి మించి పెరగలేదు. ఫలితంగా ఉద్యోగాల కల్పన మందగించింది. అయితే ఇందుకు ప్రభుత్వ రంగం కారణం కాదు. కాలానుగుణంగా ప్రభుత్వాలు వ్యవహరించి ఎగుమతి దిగుమతుల్లో ప్రొటెక్షనిస్టు పద్ధతులను సంస్కరించి, కొంతమేరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించి, లైసెన్స్ రాజ్ – రెడ్ టేపిజాలను నియంత్రించి ఉంటే సరిపోయేదనే అభిప్రాయాలున్నాయి. కానీ ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తర్వాత విచ్చలవిడిగా ప్రైవేటీకరణ చేయడమే అభివృద్ధి రహస్యమన్నట్టుగా కొందరు దళారీ రాజకీయవేత్తలు పరుగులు తీస్తున్నారు. వీళ్లకు చైనా విజయగాథ వినిపించదు. ప్రభుత్వ రంగమే ఆధిపత్యం వహిస్తూ ప్రభుత్వ నియంత్రణకు లోబడి ప్రైవేట్ పెట్టుబడి పనిచేస్తున్న ఈ ఆర్థిక వ్యవస్థ సృష్టించిన అద్భుతాలు చంద్రబాబు వంటి వారికి కనిపించవు.

ప్రైవేటీకరణ అనేది భారీగా కమీషన్లు పిండుకునే కామధేనువుగా సంస్కరణానంతర కాలపు రాజకీయవేత్తల్లో కొందరికి కనిపించింది. చంద్రబాబు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే (1995–2004) ఏకంగా 56 ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారు. ఇందులో 20 సంస్థల్లోనే 400 కోట్లు వెనకేసుకున్నారని ఆ రోజుల్లోనే సీపీఎం పార్టీ ఆధారాలతో సహా నిరూపించింది. ఇది పాతికేళ్ల కిందటి సంగతి. ఇప్పుడా విలువ ఎంత ఉంటుందో ఊహించుకోవచ్చు. ఆల్విన్ భూములు, రిపబ్లికన్ ఫోర్జ్, నిజాం షుగర్స్ నాలుగు యూనిట్లు, మరో అరడజన్ షుగర్ మిల్లులు, నూలు మిల్లులు అస్మదీయులకు కారుచౌకగా కట్టబెట్టిన జాబితాలో ఉన్నాయి. రాష్ట్ర విభజన తర్వాత కూడా చంద్రబాబు వైఖరిలో ఏ మార్పూ రాలేదు. ఇప్పుడు ఏకంగా పది మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు ఆయన తెగబడ్డారు.

ఒక్కో కాలేజీకి ఖరీదైన 50 ఎకరాల స్థలంతోపాటు నిర్మాణాలు కూడా వివిధ దశల్లో ఉన్నాయి. ఏటా ఐదువేల రూపాయల నామమాత్రపు ధరకు 66 ఏళ్లపాటు వాటిని బినామీలకు లేదా కమీషన్లకు కట్టబెట్టబోతున్నారు. ఇది ప్రైవేటీకరణ కాదు. పీపీపీ మోడల్ అని ప్రభుత్వ పెద్దలు బుకాయించే ప్రయత్నం చేస్తున్నారు. పేరులోనే తేడా! సారం మాత్రం ఒకటే. ఆ కాలేజీలు ప్రభుత్వ రంగంలోనే ఉన్నట్టయితే పేద, మధ్యతరగతి విద్యార్థులు వారి డాక్టర్ చదువుల కలను సాకారం చేసుకొని ఉండేవారు. ఇప్పుడు లక్షలు పోసి కొనగలిగిన వారికే మెడికల్ సీట్లు. అనుబంధంగా ఏర్పడే పెద్దాసుపత్రుల్లో పేదలకు, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా ఉన్నత స్థాయి వైద్యం లభించేది. ఇప్పుడా వైద్యాన్ని కూడా కొనుక్కోవాలి. ఇటువంటి ప్రజా వ్యతిరేక చర్యను కూడా ఎన్డీఏ ప్రభుత్వం, యెల్లో మీడియా అభివృద్ధికర చర్యగా ప్రచారం చేసుకోవడాన్ని బరితెగింపు వ్యవహారంగానే పరిగణించాలి.

ఆర్థిక సంస్కరణల తర్వాత పెరిగిన జీడీపీ వృద్ధి రేటు గురించి, ఉద్యోగాల గురించి పుంఖానుపుంఖాలుగా ప్రచార సాహిత్యం అందుబాటులో ఉన్నది. నిజమే, జీడీపీ వృద్ధి రేటు అంతకుముందున్న 4 శాతం నుంచి 6 శాతానికి ఎగబాకింది. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించడం వల్లనే ఇది సాధ్యమైందనే దండోరా కూడా వేస్తున్నారు. మరి పెరుగుతున్న ఆర్థిక అసమానతల సంగతి? అసమానతలు పెరగడం అభివృద్ధికి సూచిక అనుకోవాలా? మానవాభివృద్ధి సూచీలో మనం ఎక్కడున్నాం?

> ప్రైవేటీకరణ అనేది భారీగా కమీషన్లు పిండుకునే కామధేనువుగా సంస్కరణానంతర కాలపు రాజకీయవేత్తల్లో కొందరికి కనిపించింది. చంద్రబాబు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే (1995-2004) ఏకంగా 56 ప్రభుత్వ రంగ సంస్థ లను కారుచౌకగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారు. ఇందులో 20 సంస్థల్లోనే 400 కోట్లు వెనకేసుకున్నారని ఆ రోజుల్లోనే సీపీఎం పార్టీ ఆధారాలతో సహా నిరూపించింది. ఇది పాతికేళ్ల కిందటి సంగతి. ఇప్పుడా విలువ ఎంత ఉంటుందో ఊహించుకోవచ్చు. ఆల్విన్ భూములు, రిపబ్లికన్ ఫోర్జ్, నిజాం షుగర్స్ నాలుగు యూనిట్లు, మరో అరడజన్ షుగర్ మిల్లులు, నూలు మిల్లులు అస్మదీయులకు కారుచౌకగా కట్టబెట్టిన జాబితాలో ఉన్నాయి. రాష్ట్ర విభజన తర్వాత కూడా చంద్రబాబు వైఖరిలో ఏ మార్పూ రాలేదు. ఇప్పుడు ఏకంగా పది మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు ఆయన తెగబడ్డారు.
> ఒక్కో కాలేజీకి ఖరీదైన 50 ఎకరాల స్థలంతోపాటు నిర్మాణాలు కూడా వివిధ దశల్లో ఉన్నాయి. ఏటా ఐదువేల రూపాయల నామమాత్రపు ధరకు 66 ఏళ్ల పాటు వాటిని బినామీలకు లేదా కమీషన్లకు కట్టబెట్ట బోతున్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో, 1950 దశకం ఆరంభంలో మన దేశంలో ఉన్న అగ్రశ్రేణి 1 శాతం (జనాభాలో) శ్రీమంతుల సంపద మొత్తం జాతి సంపదలో 13 శాతంగా ఉండేది. మూడు దశాబ్దాల తర్వాత (1982) అది 5 శాతానికి పడిపోయింది. ఈ ఒక్కశాతం శ్రీమంతులకు వారి దిగువశ్రేణిలో మరో 10 శాతం సంపన్నులను కలిపితే జాతి సంపదలో వారి వాటా 37 శాతంగా (1952) ఉండేది. మూడు దశాబ్దాల తర్వాత అది 30 శాతానికి తగ్గింది. అదే సమయంలో జనాభాలోని అట్టడుగు 50 శాతం జనాభా వాటా స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల్లో 5 శాతంగా ఉంటే ముప్పయ్యేళ్ల తర్వాత అది 9 శాతానికి ఎగబాకింది. ఇది అభివృద్ధి నిరోధక పరిణామం?!


ప్రైవేటీకరణల కాలం లెక్కలు కూడా చూద్దాం. ఈ లెక్కలన్నీ ప్రపంచ అసమానతల డేటా బేస్ (డబ్ల్యూఐడీ)లోవి. ఇప్పుడు మన అగ్రశ్రేణి ఒక్క శాతం శ్రీమంతుల సంపద జాతి సంపదలో 40 శాతానికి చేరింది. ఇది కదా అభివృద్ధి! వీరికి తర్వాత శ్రేణిలోని పది శాతం సంపన్నులను కూడా కలిపితే వారి ఉమ్మడి సంపద 66 శాతానికి చేరుకున్నది. ఇక మిగిలిన అట్టడుగు 50 శాతం జనాభా ఉమ్మడి వాటా జాతి సంపదలో 3 శాతానికి పడిపోయింది. రెండు శతాబ్దాల బ్రిటిష్ వలస దోపిడీ అనంతరం ఈ వాటా 5 శాతంగా ఉండేది. ఈ పరిణామాన్ని కూడా అభివృద్ధే అందామా?

తెలుగువారి సెంటిమెంట్స్‌తో ముడిపడి ఉన్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు రాష్ట్ర సర్కార్ పూర్తిగా సహకరిస్తున్నది. తాజాగా 22 కీలక విభాగాలను ప్రైవేటీకరించడమే దానికి తార్కాణం. పాడి రైతులకు మేలు చేస్తున్న 'అమూల్'కు పొమ్మనకుండా పొగబెట్టారు. ప్రభుత్వ రంగంలో ఉన్న 22 టూరిజం హోటళ్లను ప్రైవేటీకరిస్తున్నారు. ఆ శాఖ పరిధిలో ఉన్న పదివేల కోట్ల ఆస్తులను కూడా కట్టబెడుతున్నారు. ఇకమీదట రాష్ట్ర పరిధిలోని రోడ్లను కూడా పీపీపీ మోడ్‌లో అభివృద్ధి చేస్తారట! అంటే పల్లె రోడ్ల మీద కూడా టోల్ కట్టాలన్నమాట. దేవాలయాల భూముల్ని కూడా వదిలిపెట్టడం లేదు. కాకుల్ని కొట్టి గద్దల్ని మేపే సిద్ధాంతకర్తలు గద్దెలపై కూర్చున్నారు. జాతి సంపదలో నానాటికీ తమ వాటాను కోల్పోతున్న పేద ప్రజల కోసం 'ఇంటికో జోలె' పథకాన్ని అమలు చేస్తారట. దానికి 'నాలుగు పీ'ల పథకంగా నామకరణం చేశారు. కొంతమంది సంపన్నుల ఇళ్లను వారికి కేటాయిస్తారు. కేటాయించిన ఇళ్ల ముందే పేదలు అడుక్కోవాలి. బౌండరీలు దాటకూడదు. పేదల జీవితాలను, ఆత్మగౌరవాన్ని కూడా ప్రైవేటీకరిస్తున్నారు. బహుజనులారా... బహుపరాక్!

vardhelli1959@gmail.com

పడి లేచి... మళ్లీ పడిన కెరటం

కామెంట్



కరణ్ థాపర్

బ్రిటిష్ వార్తలు అమితాసక్తితో చదివే వారైతే తప్ప మీకు పీటర్ మ్యాండెల్సన్ ఎవరో తెలిసే అవకాశం లేదు. ఆయన మూడుసార్లు ఉన్నత ప్రభుత్వ పదవి అలంకరించి, ఆ మూడు సార్లూ ఎంతో అవమానకరంగా వైదొలగిన వ్యక్తి. నాకు తెలిసిన అలాంటి రాజకీయవేత్త ఆయన ఒక్కడే! చివరిసారి, అమెరికాలో బ్రిటన్ రాయబారి పదవి నుంచి సెప్టెంబర్ 11న డిస్మిస్ అయ్యాడు. ఎంతో కష్టపడి అధిరోహించిన విజయ శిఖరం నుంచి అమాంతం జారిపోయాడు. ఇది ఆయనకు కొత్తేం కాదు. అయితే ఎందుకిలా జరుగుతోంది? ఈ ప్రశ్న నన్ను ఆలోచనలో పడేస్తోంది. ఒకానొకప్పుడు ఆయన నాకు మంచి మిత్రుడు.

సెక్స్ నేరగాడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో దోస్తీ ఆయన తాజా ఎపిసోడ్‌కు ముగింపు నిచ్చింది. రాయబారిగా నియమితుడయ్యే సమయంలో ఈ మైత్రీబంధం ఎలాంటిదో ఆయన వివరించినట్లు లేదు. 18 ఏళ్లు నిండని బాలికను వ్యభిచారానికి ప్రేరేపించినట్లు 2008లో నేరం రుజువు అయిన తర్వాత, తన 'ప్రియ మిత్రుడు' ఎప్‌స్టీన్‌కు అదే ఏడాది జూలైలో పీటర్ ఒక లేఖ రాశారు. ''నీ ప్రపంచం గురించి ఆలోచించాను. జరిగిన దానికి నాకు కోపం వస్తోంది, నిరాశా కలుగుతోంది'' అని ఈ లేఖలో ఉంది. ''నీ మిత్రులు నీతోనే ఉంటారు, నిన్ను ప్రేమిస్తారు''.

ఈ లేఖ బయట పడిన గంటల వ్యవధిలోనే బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్ ఆయనకు ఉద్వాసన పలికారు.

మళ్లీ మళ్లీ రాజీనామాలు

మ్యాండెల్సన్‌ను దురదృష్టం వెన్నాడటం ఇది మూడోసారి. డిసెంబర్ 1998లో అప్పటి ప్రధాని టోనీ బ్లెయిర్ మంత్రి మండలిలో వాణిజ్యం, పరిశ్రమల మంత్రిగా ఉన్నప్పుడు మొదటిసారి దెబ్బ తిన్నాడు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న 'ప్రభుత్వ చెల్లింపుల ముఖ్య అధికారి' (పే మాస్టర్ జనరల్) జ్యాఫ్రీ రాబిన్సన్ నుంచి 3,73,000 పౌండ్ల అన్‌సెక్యూర్డ్ రుణం తీసుకున్నట్లు బయటపడటంతో ప్రధాని ఆయనతో రాజీనామా చేయించారు.

ఇది జరిగిన రెండేళ్లలోనే పీటర్ మళ్ళీ ఉన్నత పదవి అలంకరించ గలిగాడు. ఈసారి ఉత్తర ఐర్లాండ్ వ్యవహారాల మంత్రిగా నియమితులయ్యాడు. శ్రీచంద్ హిందూజాకు బ్రిటిష్ పౌరసత్వం ఇప్పించేందుకు



అమెరికాలో బ్రిటన్ రాయబారిగా ఇటీవల ఉద్వాసనకు గురైన పీటర్ మ్యాండెల్సన్

అధికార దుర్వినియోగం చేశాడని ఆరోపణలు రావడంతో 2001 జనవరిలో మ్యాండెల్సన్ మళ్లీ రాజీనామా చేయవలసి వచ్చింది.

ఏమయినప్పటికీ, అంతటి దురదృష్టం కూడా పీటర్ రాజకీయ జీవితాన్ని అంతం చేయలేకపోయింది. యూరోపియన్ యూనియన్‌లో బ్రిటన్ కమిషనర్‌గా పని చేశాడు. ఆ తర్వాత గోర్డాన్ బ్రౌన్ కేబినెట్‌లో బిజినెస్ సెక్రటరీగా చేరాడు. ఫస్ట్ సెక్రటరీ(ఉప ప్రధాన మంత్రి)గా పదోన్నతి కూడా పొందాడు. ఆయనకు దేవుడి ఆశీస్సులు, సాతాను శాపాలు... రెండూ ఉన్నట్టుంది. ఒకరు శిఖరం మీదకు చేర్చితే, మరొకరు పాతాళానికి లాగేస్తారు.

నాకాయన తెలిసున్న రోజుల్లో ఇలాంటి ఆటుపోట్లు ఏవీ లేవు. అది 1980ల నాటి విషయం. ఆయన వయస్సు 30 పైన ఉంటుంది. మేం అప్పుడు లండన్ వీకెండ్ టెలివిజన్‌లో టీవీ ప్రొడ్యూసర్లుగా పని చేస్తున్నాం. బహుశా బ్రిటన్‌లో బాగా పేరు పొందిన 'వీకెండ్ వరల్డ్' కరెంట్ ఎఫైర్స్ అనే ప్రోగ్రామ్ చేసే వాళ్ళం. లెజెండరీ బ్రియాన్ వాల్డెన్ దానికి యాంకర్.

ఆ రోజుల్లో పీటర్ పొడవుగా సన్నగా ఉండి కులీనుడిలా కనబడే వాడు. పీటర్ తాత క్లెమెంట్ అట్లీ మంత్రివర్గంలో సభ్యుడిగా ఉన్నాడు. కొంతమంది పీటర్‌ను అహంభావి అనుకునేవారు. మితభాషి కావడంతో ఆ అపవాదు వచ్చి ఉంటుంది. ఒకటి మాత్రం వాస్తవం... ఆయన అంత త్వరగా దగ్గరయ్యే మనిషి కాదు. చాలామందిని దూరంలో ఉంచేవాడు.

అప్పట్లో జరిగిన ఒక సంగతి చెబుతాను. ఏదో వివరించే ప్రయత్నం చేస్తూ, ఆ ఉత్సాహంలో పీటర్ తన కుడి చేతిని విసురుగా కదిలించాడు. అంతే... అది కాస్తా కాఫీ కప్పును తాకింది. కాఫీ ఒలికిపోయింది. నేను రాస్తున్న స్క్రిప్ట్ తడిసిపోయింది. అతడు చేసింది ఘోర తప్పిదం. ప్రోగ్రామ్ ఎయిర్ అయ్యేందుకు ఎంతో సమయం లేదు.

పీటర్ తక్షణం క్షమాపణలు చెప్పాడు. ఇరకాటంలో పడినందుకో, తన మీద తనకే వచ్చిన కోపంతోనో... ముఖం కందగడ్డ అయ్యింది. తనే టైప్ చేసి పెట్టాడు. పూర్తి చేసి ఇచ్చేసరికి అర్ధరాత్రి దాటింది. టైప్ చేస్తూ కొన్ని మార్పులు కూడా చేశాడు. స్క్రిప్ట్ మరింత బాగా వచ్చింది.

విజయం ఆయన్ను అత్యున్నత శిఖరాలకు చేర్చింది. అంత ఎత్తున నిలిచిన పీటర్‌ను నిశితంగా చూడగలిగినవారు, ఆయన ఆత్మీయ స్వభావం గుర్తించగలిగిన వారు... ఎంతమంది ఉంటారు? నేను మాత్రం ఆయన్ని ఆత్మీయ వ్యక్తిగానే గుర్తు చేసుకుంటాను. ఆయన ఎప్పటి లాగా ఉవ్వెత్తున ఎగిసి మరో విజయ శిఖరం అందుకుంటాడు... ఇది నా నమ్మకం. పీటర్‌ను మరోసారి అదృష్టం వరిస్తుందనీ, త్వరలోనే మేం కలుసుకుంటామనీ ఆశిస్తున్నాను.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

మా తల్లీ బతుకమ్మా!

తెలుగువారి పండుగల్లో బతుకమ్మ పండుగకు ఉన్న ప్రత్యేకతే వేరు. దేవతార్చనకు పూలను ఉపయోగించడం భారతీయ సంస్కృతిలో సాధారణ విషయం. కానీ తెలంగాణ ప్రజలు పూలతోనే 'బతుకమ్మ'ను పేర్చి పూజించడం అరుదైన సంగతి.



అందుకే బతుకమ్మ తెలంగాణకు ప్రత్యేక గౌరవాన్ని తీసుకు వచ్చిన పండుగ. సాధారణంగా ప్రతి పండుగను వ్యక్తిగతంగా ఎవరి ఇళ్ళల్లో వారు కుటుంబ సభ్యులతో కలిసి చేసుకుంటారు. కానీ బతకమ్మ పండుగ మాత్రం ఊరి ఆడపడుచులంతా కులమతాలకు అతీతంగా సామూహికంగా జరుపుకొనే విశిష్టమైన పండుగ. తమ బాధలను, సంతోషాలను ఈ సందర్భంగా ఆటపాటలతో ఒకరితో ఒకరు పంచుకుంటారు. ప్రచారంలో ఉన్న పురాణం కథలను బట్టి లక్ష్మీదేవియే బతుకమ్మ.

తంగేడు, గట్టి, గునుగు, గోరంట, రుద్రాక్ష, కట్ల, గుమ్మడి, సీత జడ, కలువ వంటి అనేక పూలను బతుకమ్మను పేర్చడానికి ఉపయోగిస్తారు. ప్రకృతి పచ్చగా కళకళ లాడితేనే ఈ పూలన్నీ లభిస్తాయి. అందుకే ఈ పండుగ మనం ప్రకృతిని రక్షించుకోవలసిన అవసరాన్ని తెలియజేస్తోంది. బతుకమ్మ పండుగ నిజానికి నాలుగు పండుగల కలయిక. బొడ్డెమ్మ పండుగ, పెద్దల పండుగ, బతుకమ్మ పండుగ, దసరా పండుగ నాలుగూ వరుసగా జరగడం వల్ల ఒకరోజు సంబరం కాకుండా దాదాపు నెల పండుగగా జరుపుకుంటారు.

ఇప్పుడు తెరమరుగవుతున్న బొడ్డెమ్మ పండుగను కూడా ముందు తరాలకు అందించవలసిన బాధ్యత మనపై ఉంది. భాద్రపద శుద్ధ బహుళ పంచమి రోజున పుట్టమన్ను తెచ్చి తడిపి ఒక చిన్న పీట మీద చతురస్రాకారంలో అంతరాలను పేర్చుతూ చివరకు గుడి గోపురం వలె చేస్తారు. దీన్నే 'బొడ్డెమ్మ'అంటారు. దీని చుట్టూ రంధ్రాలు చేసి రంగు రంగుల రుద్రాక్ష, గోరింట, కట్ల వంటి రంగు పూలతో అలంకరిస్తారు. సాయంత్రం వేళ వాకిలిలో నడుమ పేడతో అలికి ముగ్గులు వేస్తారు. మధ్యలో బొడ్డెమ్మ పీటను పెట్టి పెళ్లి కాని ఆడపిల్లలు దాని చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ పూజిస్తారు. బతుకమ్మ సాక్షిగా ఆడపిల్లలను పుట్టనిద్దాం, బతకనిద్దాం, చదవనిద్దాం, ఎదగనిద్దాం. బంగారు భవితనిద్దాం. రేపటి తరానికి బతుకమ్మను అందిద్దాం.

– డా॥ సుంకరనేని నాగవాణి
ఫైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్ పర్సన్, మహబూబాబాద్ జిల్లా

క్లుప్తంగా...

24న బీసీ బతుకమ్మ సంబరాలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): ఈ నెల 24న సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ పార్కులో బీసీ బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బీసీ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన బీసీ బతుకమ్మ సంబరాల వాల్‌పోస్టర్‌ను శనివారం రవీంద్రభారతిలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా వేలాది మంది మహిళలతో బతుకమ్మ సంబరాలు నిర్వహించతలపెట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బీసీ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మణిమంజరి తదితరులు పాల్గొన్నారు.

ఆ గంజాయి విలువ మొత్తం రూ.12 కోట్లు

- దుబాయ్ నుంచి హైడ్రోపోనిక్ గంజాయిని తీసుకు వచ్చిన మహిళ అరెస్టు
- తొలుత 6 కిలోలు, తర్వాత లగేజీలో మరో 6 కిలోలు స్వాధీనం



సాక్షి, శంషాబాద్(హైదరాబాద్): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం రాత్రి ఒక మహిళ వద్ద స్వాధీనం చేసుకున్న గంజాయి మొత్తం విలువ రూ. 12 కోట్ల వరకు ఉంటుందని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) వర్గాలు తెలిపాయి. విశ్వసనీయ సమాచారం మేరకు దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఆ మహిళ నుంచి తొలుత దుస్తుల మాటున దాచిన 6 కిలోల అత్యంత నాణ్యమైన హైడ్రోపోనిక్ (మట్టిలేకుండా నీటితోనే పండించే) గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తర్వాత ఆమెను విచారించగా తాను తీసుకు వచ్చిన లగేజీలో ఒక బ్యాగ్ మిస్ అయినట్టు చెప్పిందని, అనంతరం ఆ బ్యాగ్‌ను కూడా గుర్తించి అందులో తనిఖీ చేయగా మరో 6 కిలోల హైడ్రోపోనిక్ గంజాయి లభ్యమైందని శనివారం హైదరాబాద్ జోనల్ యూనిట్ డీఆర్ఐ అధికారులు తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో ఈ గంజాయి ఒక్కో కిలో రూ.కోటి వరకు విలువ చేస్తుందని చెప్పారు. ఆ మహిళను అరెస్టు చేశామని, కేసు దర్యాప్తులో ఉందని వెల్లడించారు.

ఉత్తమ అంతర్జాతీయ టూర్ ఆపరేటర్‌గా కేసరి టూర్స్

న్యూఢిల్లీ: ఇండియా ట్రావెల్ అవార్డ్స్ 2025లో భాగంగా.. కేసరి టూర్స్ సంస్థ ప్రతిష్టాత్మక 'ఉత్తమ అంతర్జాతీయ టూర్ ఆపరేటర్' అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు న్యూఢిల్లీలోని హోటల్ లీ మెరిడియన్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో.. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ ఈ అవార్డును.. కేసరి టూర్స్ డైరెక్టర్ హిమాన్షు కేసరి పాటిల్‌కు ప్రదానం చేశారు. పర్యాటక రంగంలో అత్యున్నత ప్రతిభను ప్రదర్శించిన సంస్థలకు ఏటా ఇండియా ట్రావెల్ అవార్డులను ప్రదానం చేస్తారు. కార్యక్రమంలో పర్యాటక మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ సుమన్ బిల్లా, ప్రధానమంత్రి మ్యూజియం, లైబ్రరీ డైరెక్టర్ అశ్వని లోహాని, భారత్‌లో బ్రిటిష్ హై కమిషనర్ లిండీ కామెరాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హిమాన్షు కేసరి పాటిల్ మాట్లాడుతూ.. ప్రయాణికులు, తమ సంస్థ భాగస్వాములు, కేసరి బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

రిలయన్స్ డిజిటల్‌లో ఆపిల్ ఐఫోన్ 17 సిరీస్

సాక్షి, హైదరాబాద్: ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆపిల్ ఐఫోన్ 17 సిరీస్‌ను దేశవ్యాప్తంగా ప్రారంభించినట్లు ప్రముఖ ఎలక్ట్రానిక్స్ రిటైల్ చైన్ రిలయన్స్ డిజిటల్ ప్రకటించింది. రిలయన్స్ డిజిటల్ సాంకేతికత ఎల్లప్పుడూ వినియోగదారుల ఆకాంక్షలను నెరవేర్చడంలో ముందుంటుందని సంస్థ స్పష్టం చేసింది. ఈ సీజన్‌లో.. రిలయన్స్ డిజిటల్ ఐఫోన్ 16 ప్లస్, ఐఫోన్ 16ఈ ఫోన్లను అత్యల్ప ధరకు అందుబాటులో ఉంచడం ద్వారా పండుగల సందడి ముందే వచ్చేలా చేసింది. మొదటిసారిగా, ఐఫోన్ 16 ప్లస్ ఫోన్ రూ.57,990 ధరకు, ఐఫోన్ 16e ఫోన్ కేవలం రూ.42,990 ధరకు అందుబాటులో ఉన్నాయి. ఐఫోన్ 16 ప్లస్ పెద్ద స్క్రీన్ వీడియోలను తిలకించడంలో, ఆటలు ఆడటంలో మల్టీ టాస్కింగ్‌లో అద్భుతమైన అనుభవాన్ని అందిస్తుంది. ఐఫోన్ 16 e అత్యల్ప ధర కలిగిన ఆపిల్ ఇంటెలిజెన్స్–ఆధారిత ఐఫోన్. ఇది అధునాతన ఆవిష్కరణలను మిలియన్ల మంది భారతీయులకు మరింత అందుబాటులోకి తెస్తుంది. ఈ ఫోన్లపై ఆఫర్లు స్టాక్ ఉన్నంత వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయని రిలయన్స్ డిజిటల్ స్పష్టం చేసింది.



ముందస్తు బతుకమ్మ వేడుకలు

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ముందస్తు బతుకమ్మ వేడుకలను జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని బాలయేసు పాఠశాలలో శనివారం సాయంత్రం ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల యాజమాన్యం జనగామ–సూర్యాపేట రహదారిపై భారీ బతుకమ్మ శకటాలను ప్రదర్శించింది. అంబేడ్కర్ చౌరస్తాలో బతుకమ్మలను ఉంచి ఉపాధ్యాయినులు, విద్యార్థినులు ఆడిపాడారు. – దేవరుప్పుల

నెలాఖరులోగా మరో 1.17 ఎల్ఎంటీ యూరియా

అదనపు యూరియా సరఫరా చేయాలన్న రాష్ట్రం విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్రం

- రవాణాలో 60 వేల టన్నుల యూరియా.. వచ్చే వారంలోగా చేరుకోనున్న మిగిలిన 50 వేల టన్నులు
- ఈ నెలలో ఇప్పటివరకు 1.44 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని రైతులు యూరియా కొరతను ఎదుర్కొంటున్న నేపథ్యంలో అదనపు యూరియా సరఫరా చేయాలన్న ప్రభుత్వ విజ్ఞప్తికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి ఈ మేరకు చేసిన విజ్ఞప్తుల నేపథ్యంలో ఈ నెలలో రాష్ట్రానికి అదనంగా 1.17 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది. ఇందులో భాగంగా అదనంగా కేటాయించిన యూరియాలో 60,000 మెట్రిక్ టన్నులు రవాణాలో ఉండగా మరో 50,000 మెట్రిక్ టన్నులు వచ్చే వారంలోగా రాష్ట్రానికి చేరుకునే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ తెలిపింది.

ఈనెలలో ఇప్పటికే 1.44 ఎల్ఎంటీ యూరియా

రాష్ట్రానికి ఈ సీజన్‌లో కేటాయించిన 8.90 ఎల్ఎంటీ యూరియాలో కేంద్ర ఎరువుల మంత్రిత్వ శాఖ ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ప్రతినెలా కొంత మేర కోత విధిస్తూ సరఫరా చేసింది. దీంతో ఆగస్టు నెలాఖరు నాటికే 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కోత పడింది. ఈ ప్రభావం రాష్ట్రంపై పడటంతో రైతులు రోడ్డెక్కి ఆందోళనలకు దిగారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రతిరోజూ 5 వేల నుంచి 10 వేల మెట్రిక్ టన్నుల వరకు సరఫరా చేస్తూ వచ్చింది. అయినా చాలా జిల్లాల్లో కొరత తీరకపోవడంతో వ్యవసాయ మంత్రి తుమ్మల ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులతోపాటు ఎరువుల శాఖ అధికారులను కలిసి క్షేత్రస్థాయి పరిస్థితిని వివరించారు. దీంతో ఇప్పటివరకు ఈ నెలలోనే 1.44 ఎల్ఎంటీ యూరియాను సరఫరా చేసిన కేంద్రం మరో 1.17 ఎల్ఎంటీ విదేశీ యూరియా పంపించేందుకు అంగీకరించింది. ఈ కేటాయింపులో భాగంగా కాకినాడ, విశాఖపట్నం, గంగవరం, మంగళూరు, జైగఢ్, కృష్ణపట్నం వంటి ప్రధాన నౌకాశ్రయాల ద్వారా యూరియా రాష్ట్రానికి చేరనుంది. ఇందులో కాకినాడ నుంచి 15,900 మెట్రిక్ టన్నులు, విశాఖ నుంచి 37,650 మెట్రిక్ టన్నులు, గంగవరం నుంచి 27,000 మెట్రిక్ టన్నులు, మంగళూరు నుంచి 8,100 మెట్రిక్ టన్నులు, జైగఢ్ నుంచి 16,200 మెట్రిక్ టన్నులు, కృష్ణపట్నం నుంచి 13,000 మెట్రిక్ టన్నులు సరఫరా కానున్నాయి. కేంద్రం అదనంగా కేటాయించిన విదేశీ యూరియాలో ప్రస్తుతం 30,000 మెట్రిక్ టన్నులు లోడింగ్‌లో ఉండగా రాబోయే వారంలో మరో 50,000 మెట్రిక్ టన్నులు లోడింగ్ పూర్తి కానున్నాయి. అలాగే 30,000 మెట్రిక్ టన్నులు ఇప్పటికే రవాణాలో ఉన్నాయి.

త్వరలో రామగుండం కేంద్రం పునరుద్ధరణ

రాష్ట్రానికి యూరియా సరఫరా చేసే ప్రధాన వనరుల్లో రామగుండం ఎరువుల కర్మాగారం (ఆర్ఎఫ్‌సీఎల్) కీలకమైనది. గత 90 రోజులుగా ప్లాంట్ షట్‌డౌన్ కారణంగా ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో రాష్ట్ర రైతులకు యూరియా అందించే పరిస్థితి లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల కేంద్ర రసాయనాల మంత్రి, కార్యదర్శిని కలిసి రామగుండం యూనిట్‌ను త్వరితగతిన పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేయగా దీనిపై కేంద్రం సానుకూలంగా స్పందించినట్లు వ్యవసాయ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో త్వరలోనే ఆర్ఎఫ్‌సీఎల్ పునరుద్ధరణ జరుగనుందని మంత్రి తుమ్మల ఒక ప్రకటనలో తెలిపారు.

రైలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి

- మరో వ్యక్తికి తీవ్రగాయాలు
- అర్ధరాత్రి రైలుపట్టాలపై నడుస్తుండగా ప్రమాదం
- బొల్లారం బజార్ రైల్వే స్టేషన్ వద్ద ఘటన
- మృతులు మాదక ద్రవ్యాలు సేవించినట్టు అనుమానం



కార్తీక్



మల్లికార్జున్

సికింద్రాబాద్: శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత సికింద్రాబాద్ సమీపంలోని బొల్లారం బజార్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడని సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. మచ్చబొల్లారంకు చెందిన కొండగళ్ల కార్తీక్ (19), టంగుటూరు మల్లికార్జున్ (20) బాల్యమిత్రులు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత వీరిద్దరు సిగరెట్ కాల్చేందుకు ఇళ్ల నుంచి బయటకు వెళ్లారు. అదే ప్రాంతానికి చెందిన శివానంద్ అనే మరో వ్యక్తితో కలిసి శనివారం తెల్లవారుజామున 2.50 గంటల సమయంలో రైలు పట్టాలపై నడుస్తూ వెళ్తుండగా అకోలా–తిరుపతి రైలు ఆ మార్గంలో వెళ్తోంది. వారిని గమనించిన రైలు లోకోపైలట్ పలుమార్లు హారన్ మోగించినా వారు పక్కకు జరగలేదు. దీంతో రైలు వారిని ఢీకొట్టిందని లోకోపైలట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కార్తీక్, మల్లికార్జున్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ శివానంద్‌ను పోలీసులు గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. శివానంద్ (35)కు ఇద్దరు పిల్లలు ఉండగా, ప్రస్తుతం భార్య గర్భవతి. ప్రమాద సమయంలో ఆ ముగ్గురు మాదక ద్రవ్యాలు సేవించినట్లు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలకు గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పది రూపాయల నాణెం గొంతులో ఇరుక్కొని...

- అస్వస్థతకు గురై విద్యార్థిని మృతి



నిహారిక

భూదాన్‌పోచంపల్లి: రూ.10 కాయిన్ గొంతులో ఇరుక్కొని ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం అస్వస్థతకు గురై ఓ విద్యార్థిని మృతిచెందింది. ఈ ఘటన శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని భీమనపల్లి గ్రామంలో చోటుచేసుకొంది. భీమనపల్లి గ్రామానికి చెందిన శేఖర్, జ్యోతి దంపతుల కుమార్తె నిహారిక (11) స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతోంది. ఈ నెల 18న సాయంత్రం పొరపాటున రూ.10 కాయిన్ నోట్లో వేసుకొంది. అది గొంతులో ఇరుక్కోవడంతో వెంటనే తల్లిదండ్రులు స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్ల సలహా మేరకు అదేరోజు రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్లు కాయిన్‌ను తొలగించారు. మరుసటి రోజు శుక్రవారం డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపించారు. ఆరోగ్యంగా కనిపించిన నిహారిక రోజుమాదిరిగానే రాత్రి నిద్రపోయింది. శనివారం ఉదయం తల్లిదండ్రులు నిహారికను లేపడానికి ప్రయత్నించగా ఎలాంటి స్పందనాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెంటనే నిహారికను తిరిగి అదే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందిందని డాక్టర్లు చెప్పారు. అయితే డాక్టర్లు అనస్థీషియా డోసు ఎక్కువ ఇవ్వడం వల్లనే నిహారిక కోమాలోకి వెళ్లిందని, డాక్టర్ల నిర్లక్ష్యం వల్లనే తన కుమార్తె మృతిచెందిందని ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు.

ఆర్ఎంపీ వైద్యం వికటించి బాలుడి మృతి

- వైద్యుడిపై పోలీసులకు బాలుడి తండ్రి ఫిర్యాదు
- సంగారెడ్డి జిల్లాలో ఘటన



ప్రశాంత్

నారాయణఖేడ్: ఆర్ఎంపీ వైద్యం వికటించి ఓ బాలుడు మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా మనూరు మండలం శెల్గిర గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. బేగరి లక్ష్మణ్ రెండో కుమారుడు ప్రశాంత్ (14)కు ఈనెల 17వ తేదీన దగ్గు, జ్వరం రావడంతో గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుడు యూనుస్ వద్దకు తీసుకెళ్లారు. ఆయన రెండు ఇంజెక్షన్లు, మందు గోలీలు ఇచ్చి ఇంటికి పంపించారు. జ్వరం తగ్గకపోవడంతో 18వ తేదీన మళ్లీ తీసుకువెళ్లగా సెలైన్ పెట్టి ఇంటికి పంపించారు. అయితే ఫలితం లేకపోవడంతో 19వ తేదీన మళ్లీ ఆయన వద్దకే తీసుకెళ్లగా ఇన్‌ఫెక్షన్ అయిందని, వేరే ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పాడు. దీంతో మెరుగైన చికిత్స కోసం బీదర్‌కు తీసుకు వెళుతుండగా మార్గమధ్యలో తన కొడుకు మృతి చెందాడని తండ్రి లక్ష్మణ్ తెలిపారు. ఆర్ఎంపీ డాక్టర్ నిర్లక్ష్యం వల్లనే తన కుమారుడు మృతి చెందాడని, అతనిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని లక్ష్మణ్ మనూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై కోటేశ్వరరావు గ్రామానికి వెళ్లి విచారణ చేశారు. పోలీసులు బాలుడి మృతదేహాన్ని నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పాపను నేలకేసి కొట్టిచంపిన తండ్రి

సూర్యాపేటటౌన్: పసిపాపను తండ్రి మద్యం మత్తులో నేలకేసి కొట్టి చంపాడు. సూర్యాపేట జిల్లా నాగారం మండలం డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన గైగుళ్ల వెంకటేశ్వర్లుకు రెండేళ్ల క్రితం నాగమణితో వివాహమైంది. వెంకటేశ్వర్లుకు 11 నెలల కూతురు భవిజ్ఞ ఉంది. వెంకటేశ్వర్లు స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ సూర్యాపేట పట్టణంలోని ప్రియాంక కాలనీలో భార్య, కూతురుతో కలిసి ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. అయితే, శుక్రవారం రాత్రి మద్యం సేవించి ఇంట్లోకి వచ్చిన వెంకటేశ్వర్లు.. అర్ధరాత్రి సమయంలో భార్యతో ఘర్షణకు దిగాడు. అప్పటికే నిద్రలో ఉన్న చిన్నారి భవిజ్ఞ వారి గొడవతో లేచి ఏడ్చుకుంటూ తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. దీంతో ఏడవొద్దంటూ వెంకటేశ్వర్లు పాప నోరు మూయడంతో.. పాపకు ఊపిరాడదు విడిచిపెట్టని నాగమణి గట్టిగా అరిచింది. దీంతో వెంకటేశ్వర్లు నాగమణిని గొంతుపట్టి నెట్టివేయడంతో ఆమె పక్కన పడిపోయింది. ఆవేశంలో ఉన్న వెంకటేశ్వర్లు తన కూతురు రెండు కాళ్లు పట్టి నేలకేసి రెండుసార్లు కొట్టడంతో పాప అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే తల్లి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. సంఘటన స్థలాన్ని శనివారం ఉదయం పట్టణ సీఐ వెంకటయ్య తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. పాప తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. నిందితుడు వెంకటేశ్వర్లు పరారీలో ఉన్నట్టు చెప్పారు.

పనిచేయని ఫ్రీజర్.. కుళ్లిన మృతదేహం

- హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో దారుణం

హుజూరాబాద్: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రి మార్చురీలో ఫ్రీజర్ పనిచేయకపోవడంతో మృతదేహం కుళ్లిపోయింది. శుక్రవారం శంకరపట్నం మండలం కొత్తగట్టులో గుండెపోటుతో చనిపోయిన లారీ డ్రైవర్ మృతదేహాన్ని పోలీసులు హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన కుల్దీప్ సింగ్‌గా గుర్తించారు. శనివారం ఉదయం మృతుని బంధువులు ఆస్పత్రికి వచ్చి మృతదేహం దుస్థితిని చూసి నిర్ఘాంతపోయారు. ఫ్రీజర్ పనిచేయకపోవడంతో మృతదేహం కుళ్లిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఫ్రీజర్ టెంపరేచర్ సరిగ్గానే చూపిస్తున్నప్పటికీ, అది పనిచేయడం లేదని తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

దేశానికి దిక్సూచి సిద్దిపేట పామాయిల్ పరిశ్రమ

- త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- నర్మేట పామాయిల్ పరిశ్రమను సందర్శించిన మంత్రి తుమ్మల



గింజల నుంచి వస్తున్న పామాయిల్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సాక్షి, సిద్దిపేట: ఆధునిక సాంకేతికతతో సిద్దిపేట నర్మేటలో నిర్మాణమైన పామాయిల్ పరిశ్రమ భవిష్యత్తులో దేశానికి దిక్సూచిగా నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నర్మేటలో రూ.300 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పామాయిల్ పరిశ్రమను శనివారం రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డితో కలిసి తుమ్మల సందర్శించారు. ట్రయల్ రన్‌లో భాగంగా తీసిన పామాయిల్‌ను పరిశీలించారు. మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. త్వరలో పరిశ్రమ ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారని, లక్ష మంది ఆయిల్‌పామ్ రైతులతో బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. పామాయిల్ గింజల పిప్పితో 4 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయనున్నామని తెలిపారు. దేశంలో 13 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు అయితే, తెలుగు రాష్ట్రాల్లోనే 10 లక్షల ఎకరాల్లో సాగవుతోందన్నారు. టన్ను పామాయిల్ గెలలకు రూ.25 వేల ప్రైస్ గ్యారంటీ ఇవ్వాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, జిల్లా కలెక్టర్ హైమావతి, ఆయిల్ ఫెడ్ ఎండీ శంకరయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ లాయర్లు సరిగ్గా వాదించడం లేదు

- దేవుడి భూముల కేసులపై మంత్రి కొండా సురేఖ అసంతృప్తి



సాక్షి, హైదరాబాద్: కబ్జాలో ఉన్న దేవాదాయశాఖ భూములను తిరిగి స్వాధీనం చేసుకునే విషయంలో ప్రభుత్వ న్యాయ సహాయ బృందం తీరు సరిగా లేదని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అసంతృప్తి వ్యక్తం చేశారు. దేవుడి భూముల విషయంలో తనవద్ద గట్టిగా మాట్లాడే జీపీలు న్యాయస్థానాల్లో మాత్రం గట్టిగా వాదిస్తున్నట్టు లేదని వ్యాఖ్యానించారు. తాను దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఈ రెండేళ్లలో దేవుడి మాన్యానికి సంబంధించి ఎన్ని కేసులు గెలిచామో తెలియని అయోమయం నెలకొందని పేర్కొన్నారు. శనివారం ఆమె దేవాదాయ శాఖ భూములకు సంబంధించి న్యాయస్థానాల్లో ఉన్న కేసులపై న్యాయవాదులు, అధికారులతో సమీక్షించారు. ఆ భూముల కేసులు పర్యవేక్షిస్తున్న న్యాయవాదుల తీరుపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక నుంచి ఆయా కేసుల పురోగతిపై ప్రతి ఆరు నెలలకోసారి సమావేశం ఏర్పాటు చేస్తానని, కేసుల వివరాలు వెల్లడించాలని ఆదేశించారు. దేవుడి మాణ్యాన్ని ఆక్రమించేవారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

పరాధీనతే ప్రబల శత్రువు

విశ్వబంధువైన భారత్‌కు విరోధులు లేరు

- ఇతర దేశాలపై ఆధారపడటమే మనకున్న అతిపెద్ద అడ్డంకి
- హెచ్‌–1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచిన నేపథ్యంలో ప్రధాని మోదీ స్పందన
- ఆత్మనిర్భరతే అసలైన పరిష్కారమని హితబోధ

భావ్‌నగర్(గుజరాత్): హెచ్‌–1బీ వీసాల దరఖాస్తు ఫీజును ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ భారతీయుల నెత్తిన భారీ పిడుగు పడేసిన నేపథ్యంలో భారత ప్రధాని మోదీ హిత బోధ ధోరణిలో స్పందించారు. శనివారం గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో రూ.34,200 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసి తర్వాత 'సముద్రం నుంచి సమృద్ధిదాకా'కార్యక్రమంలో మాట్లాడారు. ''విశ్వబంధు భావనతో భారత్‌ దూసుకుపోతోంది. అందరితో మిత్రత్వం, సత్సంబంధాలు కోరుకునే, కొనసాగించే భారత్‌కు ప్రపంచంలో ప్రత్యేకంగా శత్రువంటూ ఎవరూ లేరనే చెప్పాలి. కానీ ఇతర దేశాలపై ఆధారపడటం అనే వైఖరి మనకు పెద్ద శత్రువులా తయారైంది. ఇలా మనపై పైచేయి సాధిస్తున్న పరాధీనతను మనందరం కలసికట్టుగా ఓడిద్దాం. విదేశాలపై అతిగా ఆధారపడితే అంతగా స్వదేశం విఫలమవుతుంది. విశ్వశాంతి, శ్రేయస్సు, సుస్థిరత కోసం పాటుపడే దేశం కచ్చితంగా స్వయంసమృద్ధిని సాధించాలి. స్వావలంబన సాధించకుండా ఇతర దేశాలపై ఆధారపడితే జాతీయ ఆత్మగౌరవం అనేది దెబ్బతింటుంది''అని మోదీ అన్నారు.

140 కోట్ల ప్రజల భవిష్యత్తును పణంగా పెట్టబోం

''140 కోట్ల ప్రజల భవిష్యత్తును విదేశీ శక్తుల చేతుల్లో పెట్టబోం. విదేశీ పరాధీనత అనేది మన జాతీయాభివృద్ధిని నిర్దేశిస్తుందంటే అస్సలు అంగీకరించబోం. మన భావితరాల భవిష్యత్తును ఇతరుల చేతికి అందించబోం. ఏకంగా 140 కోట్ల జనాభా ఉన్న దేశం ఇతర దేశాలపై ఆధారపడితే జాతి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టినట్లే లెక్క. ఒక సామెత లాగా చెప్పాలంటే 100 సమస్యలకు ఒకే పరిష్కారం ఉన్నట్లు.. భారత్‌ ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు పరిష్కారం ఉంది. అదే ఆత్మనిర్భరత''అని మోదీ ఉద్ఘాటించారు.

కాంగ్రెస్‌పై మళ్లీ విమర్శల నిప్పులు

పనిలోపనిగా ప్రధాని మోదీ కాంగ్రెస్‌ పార్టీలపై, గత ప్రభుత్వాలపై విమర్శలు గుప్పించారు. ''భారత్‌లో నిగూఢంగా దాగి ఉన్న సామర్థ్యాలను వెలికితీసే ప్రయత్నాలు స్వాతంత్ర్యం వచ్చాక ఆరేడు దశాబ్దాలదాకా జరగనేలేదు. గత కాంగ్రెస్‌ ప్రభుత్వాలు పెంచిపోషించిన లైసెన్స్‌రాజ్‌ వ్యవస్థలో దేశాభివృద్ధి పడకేసింది. లైసెన్స్‌–కోటా రాజ్యంలో భారత్‌ విశ్వవిపణిలోకి అడుగుపెట్టలేక ఒంటరిగా మిగిలిపోయింది. ఆ తర్వాత ప్రపంచీకరణ శకం మొదలైనప్పుడు గత ప్రభుత్వాలు తప్పిదాలే చేశాయి. దేశావసరాలు తీర్చుకునేందుకు స్వావలంబన సాధించాల్సిందిపోయి కేవలం దిగుమతుల పైనే దృష్టిపెట్టాయి. దీంతో వేల కోట్ల రూపాయల కుంభకోణాలు సర్వసాధారణమయ్యాయి. తప్పుడు విధానపర నిర్ణయాల కారణంగా ప్రభ కోల్పోయిన రంగాల్లో నౌకల తయారీ పరిశ్రమ కీలకమైంది. గతంలో భారతీయ తయారీ నౌకలనే మనం ఉపయోగించేవాళ్లం. ఇప్పుడు విదేశాలపై ఆధారపడుతున్నాం. అప్పట్లో ఎగుమతిదిగుమతి సరుకుల్లో 40 శాతం భారతీయ నౌకల్లో జరిగేవి. ఇప్పుడు కేవలం 5 శాతం నౌకల్లో జరుగుతోంది. మిగతావన్నీ విదేశీ నౌకలే. అందుకే ఏటా ఏకంగా రూ.6 లక్షల కోట్లను వినియోగ ఖర్చుల కింద విదేశీ నౌకల కంపెనీలకు చెల్లించాల్సి వస్తోంది. ఈ లెక్కన ఏడు దశాబ్దాల్లో ఎంత చెల్లించామో లెక్కేసుకోండి. ఇంత సొమ్ము విదేశాలకు వెళ్లడంతో ఆయా దేశాల్లో ఉపాధి పెరిగింది. ఇదే సొమ్ములో కొంత అయినా దేశీయంగా పెట్టుబడిగా మార్చి ఉంటే ఎన్ని లక్షల మందికి ఉపాధి అవకాశాలు పెరిగేవో ఊహించుకోండి. దేశీయ నౌకలనే వినియోగించి ఉంటే ఏటా భారత్‌ లక్షల కోట్ల ఆదాయాన్ని చవిచూసేది''అని మోదీ వివరించారు.

షిప్‌ అయినా చిప్‌ అయినా ఇక్కడిదై ఉండాలి

చిప్‌(సెమీకండక్టర్‌) కావొచ్చు షిప్‌ కావొచ్చు. ఏదైనా భారత్‌లోనే తయారుకావాలి. వాటిని మనమే తయారుచేద్దాం. సముద్రవిపణిలో అగ్రగామిగా మారితే అంతర్జాతీయంగా పరపతి ఇనుమడిస్తుంది. ఇందుకు దేశీయనౌకాశ్రయాలే వెన్నుముక. దేశీయ సముద్రనౌకారంగం నవతరం సంస్కరణల దిశగా దూసుకుపోతోంది. పలు రకాల డాక్యుమెంట్లు, పత్రాల సమర్పణ, తనిఖీ వంటి సుదీర్ఘ ప్రక్రియకు దేశంలోని అన్ని ప్రధాన నౌకాశ్రయాల్లో చెల్లుచీటీ రాసేశాం. దీంతో ఒకే దేశం–ఒకే డాక్యుమెంట్, ఒకే దేశం–ఒకే నౌకాశ్రయం విధానంలో వాణిజ్యం, వ్యాపారం సులభతరమవుతుంది''అని అన్నారు.



భావ్‌నగర్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

రుణాలు ఇక సులువు

''నౌకల తయారీ సంస్థలకు ఇప్పుడు సులభంగా రుణాలు లభిస్తున్నాయి. తక్కువ వడ్డీ రేట్లకే బ్యాంక్‌ల నుంచి రుణాలను పొందగల్గుతున్నాయి. మౌలికవసతుల ఫైనాన్సింగ్‌ సదుపాయం ఇప్పుడు అన్ని నౌకలతయారీ సంస్థలకు అందుబాటులోకి వచ్చింది. మరో మూడు కీలక పథకాలపై ఎన్‌డీఏ సర్కార్‌ దృష్టిసారించింది. భారత్‌ను సముద్రయాన శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం. రుణలభ్యతతో నూతన సాంకేతికత, ఆధునిక డిజైన్, అత్యున్నత ప్రమాణాలను సంస్థలు అందిపుచ్చుకుంటాయి. త్వరలో ఈ రంగంలో ప్రభుత్వం రూ.70,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది''అని మోదీ అన్నారు. కార్యక్రమాల్లో భాగంగా రూ.7,870 కోట్ల విలువైన సముద్రయానసంబంధ అభివృద్ధి ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపనలు చేశారు. వీటికితోడు గుజరాత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టబోయే రూ.26,354 కోట్ల విలువైన ఇతర ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లోనూ మోదీ పాల్గొన్నారు. అహ్మదాబాద్‌కు 100 కిలోమీటర్ల దూరంలోని గ్రీన్‌ఫీల్డ్‌ పారిశ్రామికప్రాంతమైన ధోలేరా స్పెషల్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ రీజియన్‌లో హెలికాప్టర్‌లో విహంగవీక్షణం చేశారు. అహ్మదాబాద్‌లోని లోథల్‌లో భారతీయ సముద్రయాన వారసత్వాన్ని చాటే నేషనల్‌ మారిటైమ్‌ హెరిటేజ్‌ కాంప్లెక్స్‌ నిర్మాణపనులనూ మోదీ పర్యవేక్షించారు. అంతకుముందు ఆయన భావ్‌నగర్‌కు చేరుకోగానే రోడ్‌షోలో పాల్గొన్నారు.

బలహీన ప్రధాని

హెచ్‌–1బీపై లక్ష డాలర్ల రుసుమును మోదీ అడ్డుకోలేకపోయారని కాంగ్రెస్‌ విమర్శ

న్యూఢిల్లీ: అమెరికా ప్రభుత్వం హెచ్‌–1బీ వీసాదారుల వార్షిక ఫీజును ఏకంగా లక్ష డాలర్లకు పెంచినా మౌనంగా ఉండిపోయిన ప్రధాని మోదీ నిజంగానే బలహీన ప్రధాని అని కాంగ్రెస్‌ పార్టీ విమర్శించింది. ఈ మేరకు కాంగ్రెస్‌ అగ్రనేతలు రాహుల్‌ గాంధీ, మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో కాంగ్రెస్‌ డిప్యూటీ నేత గౌరవ్‌ గొగోయ్‌ తమతమ సామాజిక మాధ్యమ 'ఎక్స్‌'ఖాతాల్లో పోస్ట్‌లు పెట్టారు. 'నేను మరోసారి చెబుతున్నా. భారత్‌కు ఉన్నది కేవలం బలహీన ప్రధాని మాత్రమే'అని రాహుల్‌ విమర్శించారు. 'మోదీజీ.. పుట్టినరోజునాడు జన్మదిన శుభాకాంక్షలు చెప్పేందుకు ట్రంప్‌ నుంచి మీకు ఫోన్‌కాల్‌వచ్చింది. కానీ రిటర్న్‌ గిఫ్ట్‌గా లక్ష డాలర్ల రుసుం భారం భారతీయులపై పడింది'అని ఖర్గే అన్నారు. ''నాడు అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్‌ తరఫున పాల్గొని 'మరోసారి ట్రంప్‌ సర్కార్‌'అని మీరే నినదించారు. అందుకే రిటర్న్‌ గిఫ్ట్‌గా లక్షడాలర్ల వార్షిక ఫీజు భారం భారతీయ టెక్‌ ఉద్యోగులపై పడింది.ఇప్పటికే 50 శాతం టారిఫ్‌ పడుతోంది. దీంతో 10 కీలక రంగాల్లో భారత్‌ రూ.2.17 లక్షల కోట్ల ఆదాయాన్ని నష్టపోతోంది. ఇవి చాలవన్నట్లు భారత్‌పై 100 శాతం టారిఫ్‌ మోపాలని ఐరోపా సమాఖ్యను ట్రంప్‌ ఉసిగొల్పుతున్నారు. విదేశీ అగ్రనేతలు కనబడగానే గట్టిగా ఆలింగనాలు చేసుకోవడం, ప్రాసలు వినిపించేలా నినాదాలు ఇవ్వడం, పెద్ద సభలు ఏర్పాటుచేయడం, ఆ సభల్లో మోదీ, మోదీ అని బిగ్గరగా నినాదాలు ఇప్పించుకోవడం సరైన విదేశాంగ విధానం అనిపించుకోదు'అని మోదీపై ఖర్గే విమర్శలు గుప్పించారు. 'భారతీయ ప్రతిభావంతులు, అత్యున్నత నైపుణ్యాలున్న సిబ్బంది భవిష్యత్తును అమెరికా ప్రభుత్వం నాశనం చేస్తోంది. ఇంతటి రుసుముల భారం మోపినా మోదీ మౌనంగా ఉండటం ఆయన బలహీనతను రుజువుచేస్తోంది'అని గౌరవ్‌ గొగోయ్‌ అన్నారు. 'నేరుగా చర్చల వేళ హెచ్‌–1బీ వీసాల విషయంలో నాటి ట్రంప్‌ ప్రభుత్వం ఆనాడు మోదీకి ఎలాంటి హామీ ఇవ్వలేదని 2017లోనే రాహుల్‌గాంధీ బయటపెట్టారు. ఇప్పుడు అది నిజమని నిరూపితమైంది'అని కాంగ్రెస్‌ నేత పవన్‌ ఖేడా అన్నారు.

విమాన టికెట్ల ధరలకు రెక్కలు!

ఉన్నపళంగా వెనక్కివచ్చేయాలన్న కార్పొరేట్‌ సంస్థలు

- నేరుగా అమెరికాకు వెళ్లే విమానాలకు అమాంతం పెరిగిన బుకింగ్స్‌
- ఆఖరి నిమిషంలో అమెరికా ఎయిర్‌పోర్ట్‌లలో ఆగిపోయిన మరికొందరు

న్యూఢిల్లీ/ముంబై: హెచ్‌–1బీ వార్షిక ఫీజు లక్ష డాలర్లకు పెంచడంతోపాటు తాము పనిచేస్తున్న కార్పొరేట్‌ సంస్థల యాజమాన్యాల నుంచి వచ్చిన సందేశాలతో భారతీయ హెచ్‌–1బీ వీసాదారుల గుండె రైళ్లు పరుగెడుతున్నాయి. 21వ తేదీ నుంచి నిర్ణయం అమలుచేస్తానని ట్రంప్‌ ప్రకటించడంతో ఆ తేదీనాటికి హెచ్‌–1బీ వీసాదారులంతా అమెరికా గడ్డ మీదనే ఉండిపోవాలేమోనని కార్పొరేట్‌ కంపెనీలు భావించాయి. సొంత పనుల స్వదేశాలకు వెళ్లిన తమ ఉద్యోగులను తక్షణం అమెరికాకు వచ్చేయాలని మెమోలు పంపాయి. అమెజాన్, మైక్రోసాఫ్ట్, జేపీమోర్గాన్‌ వంటి కీలక సంస్థలన్నీ తమ ఉద్యోగులకు ఇలాంటి సందేశాలు చేరవేశాయి. దీంతో శరన్నవరాత్రులు, దసరా కోసం భారత్‌కు వచ్చిన హెచ్‌–1బీ వీసాదారులు ఉన్నపళాన ఎయిర్‌పోర్ట్‌లకు పరుగెత్తారు. నేరుగా అమెరికా ప్రయాణానికి విమాన టికెట్లు బుక్‌ చేసుకుంటున్నారు. దీన్ని పౌరవిమానయాన సంస్థలు తమకు అనుకూలంగా మార్చుకుని ధరలను అమాంతం పెంచేశాయి. న్యూఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌ నుంచి న్యూయార్క్‌లోని జాన్‌ ఎఫ్‌. కెన్నడీ అంతర్జాతీయ విమానాశ్రయానికి నేరుగా విమాన టికెట్‌ ధరను అదనంగా రూ.37వేల నుంచి రూ.80 వేలదాకా పెంచేశారు. పెరిగిన ధరలతో ఒక టికెట్‌ ధర ఇప్పుడు ఏకంగా 4,500 డాలర్లు అంటే దాదాపు రూ. 3,96,000కు చేరుకుందని ఒక యూజర్‌ తన 'ఎక్స్‌'ఖాతాలో ఒక పోస్ట్‌పెట్టారు.

విమానాల నుంచి బయటకు పరుగోపరుగు

భారత్‌లో కుటుంబసమేతంగా పండుగలు జరుపుకునేందుకు న్యూయార్క్, ఇతరత్రా అమెరికా విమానాశ్రయాల్లో విమానం ఎక్కిన హెచ్‌–1బీవీసాదారులు ట్రంప్‌ ప్రకటన వార్త తెల్సిన మరుక్షణమే వెంటనే విమానాల నుంచి బయటకు దిగిపోయారు. రన్‌వేపై ఉన్న విమానం నుంచి సైతం హఠాత్తుగా భారతీయులు గగ్గోలుపెట్టిమరీ విమానాన్ని ఆపించేసి కిందకు దిగిపోయినట్లు వార్తలొచ్చాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్‌గా మారాయి. ''శుక్రవారం ఉదయం ఎమిరేట్స్‌ ఎయిర్‌లైన్స్‌ విమానం శాన్‌ఫ్రాన్సిస్కో ఎయిర్‌పోర్ట్‌ నుంచి భారత్‌కు వెళ్లాల్సి ఉంది. ప్రయాణికులంతా విమానం ఎక్కేశారు. ఇంకొన్ని సెకన్లలో విమానం బయల్దేరుతుందనగా కొందరు లేచి గోల చేశారు. మేం విమానం దిగిపోతాం అని అరుపులు మొదలెట్టారు. అసలేం జరుగుతుందో అర్థమయ్యేలోపే చాలా మంది విమానం తలుపు దగ్గర గుమిగూడారు. వీళ్లంతా దిగిపోయి అంత సద్దుమణగడానికి మూడు గంటలు సమయం పట్టింది''అని విమానప్రయాణికుడు మసూద్‌ రాణా 'ఎక్స్‌'లో ఒక పోస్ట్‌పెట్టారు. ''శాన్‌ఫ్రాన్సిస్కో ఎయిర్‌పోర్ట్‌లోనూ ఇదే పరిస్థితి ఉంది. బోర్డింగ్‌ పాస్‌లు ఇచ్చే ప్రాంతంలో, బేఏరియాలోనూ హెచ్‌–1బీ వీసాదారులు తమ భారత ప్రయాణాలను రద్దుచేసుకుని వేగంగా ఎయిర్‌పోర్ట్‌ నుంచి బయటకు పరుగెత్తడం చూశా''అని చార్టర్డ్‌ అకౌంటెంట్‌ కౌస్తవ్‌ మజుందార్‌ అనే మరో యూజర్‌ తన 'ఎక్స్‌'ఖాతాలో పోస్ట్‌చేశారు. ''దుబాయ్‌ విమానాశ్రయంలోనూ ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. అమెరికా నుంచి దుబాయ్‌కు చేరుకున్న వీసాదారులు ముంబైకి వెళ్లే విమానం కోసం ఎదురుచూస్తున్నారు. ట్రంప్‌ వార్త వినగానే భారత్‌కు వెళ్లడాన్ని విరమించుకుని అదే దుబాయ్‌ ఎయిర్‌పోర్ట్‌లో నేరుగా అమెరికా టికెట్ల కోసం కౌంటర్‌ వద్ద క్యూ కట్టారు''అని మరో యూజర్‌ 'ఎక్స్‌'లో పోస్ట్‌ చేశారు. భారతీయులు ఇంతచేసినా ట్రంప్‌ విధించిన డెడ్‌లైన్‌ను చేరుకోవడం కష్టమేనని తెలుస్తోంది. ఈ వార్త తెలిసేటప్పటికి భారత్‌లో ఉన్న వీసాదారులకు కేవలం 10 గంటల సమయమే మిగిలిఉంది. అప్పటికప్పుడు ఢిల్లీ లేదా ముంబై నుంచి డైరెక్ట్‌ ఫ్లయిట్‌లో బయల్దేరినా అమెరికాకు చేరుకోవడానికి 15 గంటలకుపైనే సమయం పడుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.

ఓటర్ల తొలగింపుపై కర్నాటకలో సిట్‌

బెంగళూరు: 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కలబురిగి జిల్లా అలండ్‌ నియోజకవర్గం పరిధిలో ఓటరు జాబితాలో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లను తొలగించారన్న ఆరోపణలపై కర్నాటక ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్‌)ను ఏర్పాటు చేసింది. 2023 ఎన్నికల్లో అలండ్‌ నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో అవకతవకలు జరిగాయని, ఓటు దొంగలకు ప్రధాన ఎన్నికల కమిషనర్‌ జ్ఞానేశ్‌ కుమార్‌ అండగా ఉన్నారని కాంగ్రెస్‌ నేత రాహుల్‌ గాంధీ ఆరోపించడం తెల్సిందే. ఈ నేపథ్యంలో కర్నాటకలోని కాంగ్రెస్‌ ప్రభుత్వం శనివారం సిట్‌ ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సీఐడీ అదనపు డీజీపీ సిట్‌కు నేతృత్వం వహిస్తారని, ఆయనకు ఎస్పీ స్థాయి ఇద్దరు అధికారులు సహకరిస్తారని తెలిపింది.ఓటర్ల జాబితా నుంచి 256 పోలింగ్‌ స్టేషన్ల పరిధిలో 6,670 ఓటర్ల పేర్లను తొలగించారంటూ అలండ్‌ ఎమ్మెల్యే బీఆర్‌ పాటిల్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు కూడా.

కేపీ ఓలి అరెస్ట్‌కు జెన్‌ జెడ్‌ డిమాండ్‌

కాఠ్మండు: మాజీ ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలిని వెంటనే అరెస్ట్‌ చేయాలని జెన్‌ జెడ్‌ గ్రూపు శనివారం డిమాండ్‌ చేసింది. ఈనెల 8వ తేదీన ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల్లో పాల్గొన్న వారిపై జరిగిన కాల్పులకు ఓలితోపాటు అప్పటి హోం మంత్రి రమేశ్‌ లేఖక్‌ ప్రమేయం కూడా ఉందని ఆరోపించింది. జెన్‌ జెడ్‌ గ్రూపు సలహాదారులుగా ఉన్న సంబాద్‌ దబాలి, డాక్టర్‌ నికోలస్‌ బుషాల్‌లు మీడియాతో మాట్లాడారు. ఓలి, లేఖక్‌లతోపాటు జిల్లా ప్రధానాధికారి ఛబీ రిజాల్‌ను కూడా అరెస్ట్‌ చేయాలన్నారు. కాల్పులకు ప్రత్యక్షంగా వీరే కారణమన్నారు. అంతేకాదు, 1990 నుంచి అధికారంలో అత్యున్నత స్థానాల్లో కొనసాగుతున్న నాయకులు, ప్రభుత్వ అధికారులు కూడబెట్టిన సంపదపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేయించాలన్నారు.

ఢిల్లీలో 'ఎమ్మెల్యే ఆన్‌ వీల్స్‌'

న్యూఢిల్లీ: ప్రజల సమస్యల పరిష్కారానికిగాను ఢిల్లీ సీఎం రేఖా గుప్తా శనివారం 'ఎమ్మెల్యే ఆన్‌ వీల్స్‌– రేఖా సర్కార్‌ ఆప్కే ద్వార్‌'వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. జనక్‌పురి నియోజకవర్గంలో ఆమె ఈ సంచార కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లే చారిత్రక నిర్ణయమన్నారు. ప్రజలు తమ సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ప్రాముఖ్యత ఉన్న అంశాలు, అత్యవసర సేవలకు సంబంధించిన సమస్యలను అప్పటికప్పుడు స్థానికంగానే పరిష్కారమవుతాయని తెలిపారు. కంప్యూటర్‌ ఆపరేటర్, వై–ఫై, మైక్రోఫోన్స్, 10 మంది వరకు లోపల కూర్చునేందుకు వీలున్న ఈ వాహనం నియోజకవర్గం వ్యాప్తంగా ప్రయాణిస్తుందన్నారు. అందిన ఫిర్యాదులను, సమస్యలను సంబంధిత శాఖకు తక్షణమే అందజేస్తుందని వివరించారు. ఇలాంటి సౌకర్యం దేశంలో మరెక్కడా లేదని జనక్‌పురి ఎమ్మెల్యే, మంత్రి ఆశిష్‌ సూద్‌ చెప్పారు.



గోల్డ్‌ కార్డ్‌ వచ్చేసింది



ఉత్తర్వుపై అధ్యక్షుడు ట్రంప్‌ సంతకం

- వ్యక్తిగతంగా కొనాలంటే 10 లక్షల డాలర్లు
- ఉద్యోగుల కోసం సంస్థ కొనాలంటే 20 లక్షల డాలర్లు
- అమెరికాలో శాశ్వత స్థిరనివాసానికి బాటలువేసే ఖరీదైన కార్డ్‌

న్యూయార్క్‌/వాషింగ్టన్‌: అమెరికాలో శాశ్వత స్థిరనివాసానికి బాటలువేసే అత్యంత ఖరీదైన 'గోల్డ్‌ కార్డ్‌'పథకానికి సంబంధించిన ఉత్తర్వులపై ట్రంప్‌ శుక్రవారం సంతకం చేశారు. ఎవరైనా 10 లక్షల డాలర్లు చెల్లించి ఈ గోల్డ్‌ కార్డ్‌ను తమ వశంచేసుకోవచ్చు. ఎంచక్కా అమెరికాలో స్థిరనివాసం ఏర్పాటుచేసుకోవచ్చు. తమ సంస్థ పురోభివృద్ధికి అక్కరకొస్తారని భావించే అత్యంత నైపుణ్యమున్న సిబ్బంది, ఉన్నతాధికారులను అమెరికాకు తీసుకురావాలని భావించే కార్పొరేట్‌ సంస్థలు మాత్రం ఒక్కో వ్యక్తి కోసం 20 లక్షల డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. ఈమేరకు అమెరికా ప్రభుత్వం కార్యనిర్వాహక ఉత్తర్వును రూపొందించగా దానిపై ట్రంప్‌ సంతకం చేశారు. ద్రవ్యలోటును తగ్గిస్తూ అమెరికా ఖజానాకు వందల కోట్ల డాలర్లను జమచేసే ఈ కీలక పథకాన్ని స్వయంగా ట్రంప్‌ రూపొందించారని తెలుస్తోంది. గత మూడు దశాబ్దాలుగా అమల్లో ఉన్న పెట్టుబడి వీసా(ఈబీ–5)కి ప్రత్యామ్నాయంగా ఈ గోల్డ్‌ కార్డ్‌ను తాజాగా తీసుకొచ్చారు. హెచ్‌–1బీ వీసాదారులు మొదలు ఎలాంటి వీసాల కోసం దరఖాస్తుచేసుకున్నవాళ్లయినా నేరుగా అమెరికా స్థిరనివాసం కావాలంటే ఈ గోల్డ్‌కార్డ్‌ను కొనుగోలు చేసుకోవచ్చు. ఇన్నాళ్లూ ప్రపంచంలోని ఏ దేశంలోని సంపన్నులైనా అమెరికాలో శాశ్వత స్థిరనివాస హోదా సంపాదించాలంటే వీసా పొంది తర్వాత గ్రీన్‌కార్డ్‌ కోసం ఆతర్వాత పౌరసత్వం కోసం నెలలు, సంవత్సరాల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేది. అలాంటి సంపన్నులు, లక్షల డాలర్లు గుమ్మరించే స్తోమత ఉన్న ఉన్నతాధికారుల కోసమే ప్రత్యేకంగా ఈ గోల్డ్‌కార్డ్‌ను అమెరికా ప్రభుత్వం తీసుకొచ్చింది.

ఖజానాకు ఆదాయ వరద

కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేశాక ట్రంప్‌ శ్వేతసౌధంలోని ఓవెల్‌ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడారు. ''గోల్డ్‌కార్డ్‌ సాయంతో ఇకపై మేం వందల కోట్ల డాలర్లను ఒడిసిపట్టబోతున్నాం. ఖజానాకు గోల్డ్‌కార్డ్‌ ఆదాయ వరదను పారించనుంది. తమకు అత్యంత కీలకమైన ఉన్నతాధికారులు, నిపుణులు అనుకున్న వాళ్లను కంపెనీలు ఈ గోల్డ్‌కార్డ్‌తో అమెరికాకు రప్పించుకోవచ్చు. గోల్డ్‌కార్డ్‌ అనేది నిజంగా అత్యద్భుతం. ఈ కార్డ్‌ల విక్రయాలతో వచ్చే నగదుతో మా ద్రవ్యలోటు భారం తగ్గిపోతుంది. ఖజానా నిండిపోతే మేం పన్నులు కూడా తగ్గిస్తాం. అప్పుల గుదిబండను కాస్తంత దించుకుంటాం. గోల్డ్‌కార్డ్‌ కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్లు ప్రాసెసింగ్‌ ఫీజు చెల్లించాలి. అడిగిన ప్రతి డాక్యుమెంట్‌ను సమయానికి ఇవ్వాలి. కార్డ్‌ మంజూరైతే 10 లక్షల డాలర్లను ప్రభుత్వానికి బహుమతిగా ఇవ్వాలి. అమెరికాకు ప్రయోజనం చేకూరేలా మసలుకుంటామని మాటివ్వాలి''అని ట్రంప్‌ చెప్పారు. ''కార్డ్‌ పొందిన వాళ్లు చట్టబద్ధ శాశ్వత స్థిరనివాస హోదా పొందేందుకు అర్హత సాధిస్తారు. వీసా అందుబాటులో ఉంటుంది. గోల్డ్‌కార్డ్‌దారులు ఇచ్చే 10 లక్షల డాలర్లను వాణిజ్యమంత్రి ప్రభుత్వ ఖజానాలో జమచేస్తారు. ఈ నగదును అమెరికా వాణిజ్యం, దేశీయ పారిశ్రామికాభివృద్ధి కోసం ఖర్చుపెడతారు. అమెరికాలో స్థిరపడాలనుకునే సంపన్న పెట్టుబడిదారులు, అంకుర సంస్థల అధినేతలు, నైపుణ్య సిబ్బందికి గోల్డ్‌కార్డ్‌ సులువైన చక్కటి మార్గం''అని ట్రంప్‌ అన్నారు. పౌరసత్వానికి గోల్డ్‌కార్డ్‌ అనేది సుగమం చేస్తుందని గతంలో వాణిజ్యమంత్రి హోవర్డ్‌ లుట్నిక్‌ అన్నారు. అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, రష్యా, చైనా అనే తేడాలేకుండా లక్షలు చెల్లించే ఏ దేశ పౌరునికైనా ఈ కార్డ్‌ను అమెరికా విక్రయించి స్థిరనివాసానికి సాదరస్వాగతం పలుకుతోంది. ట్రంప్‌ నిర్ణయంతో సంపన్న భారతీయులకు వేగంగా యూఎస్‌ పౌరసత్వం లభించే అవకాశాలు బాగా మెరుగుపడతాయి. కార్డ్‌ వస్తే వెంటనే పౌరసత్వం ఇచ్చినట్లుగా భావించకూడదని ప్రభుత్వం గతంలోనే స్పష్టంచేసింది.

క్షిపణులు, డ్రోన్లతో చెలరేగిన రష్యా

ఉక్రెయిన్‌ వ్యాప్తంగా దాడులు.. ముగ్గురు మృతి

కీవ్‌: రష్యా మరోసారి ఉక్రెయిన్‌ వ్యాప్తంగా భారీ దాడులకు తెరతీసింది. శనివారం ఉదయం పెద్ద సంఖ్యలో క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడటంతో ముగ్గురు చనిపోగా డజన్లకొద్దీ జనం గాయపడ్డారు. రష్యా 579 డ్రోన్లు, 8 బాలిస్టిక్‌ మిస్సైళ్లు, 32 క్రూయిజ్‌ మిస్సైళ్లను ప్రయోగించగా 552 డ్రోన్లను, రెండు బాలిస్టిక్‌ క్షిపణులను, 29 క్రూయిజ్‌ మిస్సైళ్లను కూల్చివేసినట్లు ఉక్రెయిన్‌ ఎయిర్‌ ఫోర్స్‌ ఒక ప్రకటనలో తెలిపింది. నిప్రోపెట్రోవిస్క్, మైకోలైవ్, చెర్నిహివ్, జపొరిఝియా, పోల్టావా, కీవ్, ఒడెసా, సుమీ, ఖార్కివ్‌.. మొత్తం 9 ప్రాంతాల్లోని మౌలికవసతులు, నివాస ప్రాంతాలు, సంస్థలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. పౌరులను రెచ్చగొట్టి, మౌలిక వసతులను దెబ్బతీసేందుకే రష్యా ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దాడుల కారణంగా నిప్రోపెట్రోవిస్క్‌లో పలు బహుళ అంతస్తుల భవనాలు, నివాసాలు దెబ్బతిన్నాయని, కనీసం 30 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. కీవ్‌ ప్రాంతంలోని బుచా, బొరిస్పిల్, ఒబుఖివ్‌లపై దాడులు జరిగాయి. ఒక ఇల్లు, కొన్ని కార్లు దెబ్బతిన్నాయి. లివివ్‌ ప్రాంతంలో రెండు క్రూయిజ్‌ క్షిపణులను కూలిచ్చేశామని గవర్నర్‌ మాక్సిమ్‌ చెప్పారు. శత్రువు ప్రయోగించిన క్షిపణులను అడ్డుకోవడంలో ఎఫ్‌–16 యుద్ధ విమానాలు కీలకంగా మారాయన్నారు. కాగా, దీర్ఘశ్రేణి క్షిపణులను రష్యా ప్రయోగించడంతో ఉక్రెయిన్‌తో సరిహద్దులు పంచుకుంటున్న పోలెండ్‌ అప్రమత్తత ప్రకటించింది. పోలెండ్, నాటో యుద్ధ విమానాలు ఆ ప్రాంతంలో పహారాను ముమ్మరం చేశాయి. తమ గగనతలంలోకి రష్యా డ్రోన్‌ ప్రవేశించడంతో అడ్డుకునేందుకు రొమేనియా కూడా గత వారం ఎఫ్‌–16 జెట్లను పంపించింది.



కీవ్‌లో రష్యా దాడిలో దగ్ధమవుతున్న కార్లు

ఎస్టోనియా గగనతలాన్ని అతిక్రమించలేదు: రష్యా

ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా శుక్రవారం రష్యాకు చెందిన మూడు యుద్ధ విమానాలు తమ గగనతలంలోకి ప్రవేశించి, 12 నిమిషాలపాటు చక్కర్లు కొట్టాయని నాటో సభ్యదేశం ఎస్టోనియా చేసిన ఆరోపణలను రష్యా ఖండించింది. ఎస్టోనియా సరిహద్దుకు మూడు కిలోమీటర్ల దూరంలో బాల్టిక్‌ సముద్రంపై ఉన్న తటస్థ జోన్‌లోనే తమ యుద్ధ విమానాలున్నాయని రష్యా రక్షణ శాఖ వివరించింది.

భారత్‌ దాడి చేస్తే.. సౌదీ మాకు అండగా వస్తుంది

పాక్‌ రక్షణ మంత్రి ఖవాజా వెల్లడి

న్యూఢిల్లీ: సౌదీ అరేబియాతో చేసుకున్న రక్షణ ఒప్పందం ఫలితంగా భారత్‌ తమపై దాడి చేసిన పక్షంలో ఆ దేశం రంగంలోకి దిగుతుందని పాక్‌ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్‌ తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేదని స్పష్టం చేశారు. 'ఈ ఒప్పందం ఏ ఒక్క దేశాన్నో లక్ష్యంగా చేసుకున్నది కాదు. ఉమ్మడి రక్షణకు కుదిరిన అంగీకారం. దురాక్రమణ కోసం దీనిని వాడుకోబోం'అని ఆయన జియో టీవీకిచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. 'మా అణు విధానం ప్రత్యేకంగా భారత్‌నుద్దేశించిందే అయినప్పటికీ సౌదీ అరేబియా అత్యవసరమైన పక్షంలో మా అణు పాటవం సహా సైనిక సామర్థ్యాలను అన్నింటినీ వాడుకునేందుకు ఈ సమగ్ర ఒప్పందంలో ఏర్పాట్లున్నాయి'అని ఆయన వివరించారు. రెండు దేశాల్లో ఏ ఒక్క దేశంపై దురాక్రమణ జరిగినా దానిని ఉమ్మడి దురాక్రమణగా పరిగణించేందుకు ఈ ఒప్పందంలో నిబంధనలున్నాయన్నారు. ఇలా ఉండగా, పాక్‌ ఆర్మీతో మరో దఫా తలపడాల్సి వస్తే భారత్‌ ఇప్పుడు సౌదీ అరేబియాను సైతం ఎదుర్కోవాల్సి ఉంటుందని భౌగోళిక రాజకీయ విశ్లేషకుడు ఇయాన్‌ బ్రెమ్మర్‌ చెబుతున్నారు.

జార్ఖండ్‌లో కుర్మీల రైల్‌ రోకో

వందకుపైగా రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం

రాంచీ: జార్ఖండ్‌లో శనివారం కుర్మీలు ఇచ్చిన రైల్‌ రోకో పిలుపు ప్రభావం 100కు పైగా రైళ్ల రాకపోకలపై పడింది. ఆగ్నేయ రైల్వే రాంచీ డివిజన్, తూర్పు సెంట్రల్‌ రైల్వే ధన్‌బాద్‌ల పరిధిలోని వేర్వేరు స్టేషన్ల పరిధిలో కుర్మీల ఆందోళన కొనసాగుతోంది. నిషేధం ఉత్తర్వులను సైతం ఉల్లంఘిస్తూ ఆందోళనకారులు పట్టాలపై బైటాయించారు. తమ కుర్మలీ భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని, కుర్మీలకు షెడ్యూల్‌ తెగల హోదా ఇవ్వాలని వీరు డిమాండ్‌ చేస్తున్నారు. రాత్రి వేళ కూడా ఆందోళన కొనసాగుతుందని, డిమాండ్లు నెరవేర్చేదాకా విరమించేది లేదని ఆదివాసీ కుర్మీ సమాజ్‌ నేత ఓపీ మహతో స్పష్టం చేశారు. కుర్మీలను 1931లో ఎస్టీల జాబితా నుంచి తొలగించారని, అప్పటి నుంచి పోరాడుతున్నా డిమాండ్‌ నెరవేరలేదని సంఘం మరో నేత శీతల్‌ ఓహదార్‌ చెప్పారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతున్నామంటూ సమర్థించుకున్నారు. వీరికి పలు రాజకీయ పార్టీలు సైతం మద్దతు ప్రకటించాయి. ఆందోళనల కారణంగా తూర్పు సెంట్రల్‌ రైల్వే ధన్‌బాద్‌ డివిజన్‌ పరిధిలో 25 ప్రయాణికుల రైళ్లను రద్దు చేశామని, మరో 24 రైళ్లను దారి మళ్లించామని అధికారులు తెలిపారు. ఆగ్నేయ రైల్వే రాంచీ డివిజన్‌ పరిధిలో వందేభారత్, రాజధాని ఎక్స్‌ప్రెస్‌ సహా 12 రైళ్లను రద్దు చేసి, 11 రైళ్లను దారి మళ్లించామన్నారు. మరికొన్ని రైళ్ల గమ్యస్థానాలను కుదించామన్నారు. ఆందోళనల కారణంగా రైళ్లు నిలిచిపోవడంతో వేలాదిగా ప్రయాణికులు ఎక్కడివారక్కడే చిక్కుబడిపోయారు. టాటా–పట్నా వందేభారత్‌ రైలులోని వందలాది మంది ప్రయాణికులు రాంచీలోని మురి స్టేషన్‌లో ఉండిపోయారు. ఈ రైలును అధికారులు రద్దు చేసిన విషయం తెలిసి ప్రయాణికులు గగ్గోలు మొదలుపెట్టారు. కాగా, కుర్మీల నిరసన చట్ట విరుద్ధం, అప్రజాస్వామికమంటూ వివిధ గిరిజన సంఘాలు రాంచీలోని రాజ్‌భవన్‌ ఎదుట నిరసన తెలిపాయి. అసలైన గిరిజనుల హక్కులను లాక్కునేందుకు కుర్మీలు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాయి.



రాంచీ జిల్లాలోని మురీ రైల్వేస్టేషన్‌లో రైల్‌రోకో చేపట్టిన ఆందోళనకారులు

వధువు కావలెను



SC మాల/కట్న ప్రసక్తి లేదు/B.Tech/ Govt. ట్యాక్స్ ఆఫీసర్/ ట్యాక్స్ Dept/ 90,000/-PM/5'10"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-15521]

SC మాల & క్రిస్టియన్/కట్న ప్రసక్తి లేదు/ B.Tech, IIT / Govt. A.E.E / ట్రాన్స్‌కో/18 Lakhs PA/ 5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-15521]

యాదవ/కట్న ప్రసక్తి లేదు/B.Tech/ Govt. బ్యాంక్ క్లర్క్ & క్యాషియర్/కెనరా బ్యాంక్/ 40,000/-PM/5'10"ఎత్తు/29 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 7075953400 [HA-15521]

గౌడ/కట్న ప్రసక్తి లేదు/B.Tech/C.Govt. మెకానికల్ ఇంజినీర్/రైల్వే/80,000/-PM/ 5'10"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 7075953400 [HA-15521]

క్రిస్టియన్ మాల/ B.Tech / C.Govt. Sr.Asst/LIC / 60,000/-PM / 5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-15521]

SC హిందూ మాదిగ/M.Tech, IIT/C. Govt. Exq. ఇంజినీర్/NTPC/1,50,000/-PM/5'11"ఎత్తు/30 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-15521]

37 సం. గల బిజినెస్ చేసే వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు. కుల ప్రసక్తి లేదు. నో డౌరీ. Ph: 6301943220 [H-783678]

ముస్లిం, 50 సం॥లు, షుగర్ పేషెంట్, వరుడుకి 35 సం॥లు వయస్సుపై బడిన విడో వధువు కావలెను. కందుకూరు, నెల్లూరు. Ph: 9398058081 [H-783678]

దాసరి / 33/5'10"/B.Tech., M.B.A., (IIM Rohtak) ప్రాజెక్ట్ మేనేజర్, Electronics Co. Bangalore, 23 LPA, Own House / Property 3 cr. Srikakulam. 97015 83202, 85009 16150 [SCA25008315]

★

రెడ్డి/లేట్ మ్యారేజ్/38y/1L PM/Hyd లో సొంత ఇల్లు, వికేబీలో 5 ఎ. వ్యవసాయ భూమి గల Well Settled హైదరాబాద్ వరుడికి ట్వీ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ/విడో OK. కుల ప్రసక్తి లేదు. డైరెక్ట్ Ph: 7989079290 [HA-15522]

★★

Reddy / 41Yrs / 5'.10" / MBA / 70,000 P.M అందమైన వరుడికి అమ్మాయి కావలెను. సంప్రదించండి సెల్: 98482 30725. [T-2355]

వరుడు కావలెను



బ్రాహ్మిన్/విడో/V.Fair / 5'3" / 50 / గవర్నమెంట్ టీచర్ /2 సొంత ఇల్లు గల వధువుకి వరుడు కావలెను. 9392791032. [H-821212]

రెడ్డి/విడో/45y/Govt. రైల్వే Job, రెంట్స్, కమర్షియల్ బిల్డింగ్ గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం ఓకే) అన్ని వయస్సులు వారికి 1st, 2nd మ్యారేజిలు మా వద్ద కలవు/కుల ప్రసక్తి లేదు. Ph: 9121516873 [H-783642]

రెడ్డి/2nd (కుల-అస్తి) పట్టింపు లేదు, 30Y, B.Com/ Job, Own Business & Well Property's/ కలిగిన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం) OK. అన్ని వయస్సుల వారికి 1వ లేదా 2వ సంబంధాలు కలవు. 9573002847 [H-783642]

SC మాల/1st మ్యారేజ్, 42Y/5'4"/B.Tech, MBA, (Phd), SAP, కాంట్రాక్ట్ లెక్చరర్, Hyd వధువుకు వరుడు కావలెను. పిల్లలు లేని 2వ పెళ్లి వారు కూడా సంప్రదించండి. 9490186138 [H-783642]

బ్రాహ్మిన్/48విడో/5'5"/MBA, బ్యాంక్ ఎంప్లాయ్ / ఫ్యామిలీ పెన్షన్/VRS/80K PM/సొంత స్కూలు/6L PM రెంట్స్/15 ఎ. పొలం/20 కోట్ల ప్రాపర్టీ గల వధువుకి వరుడు కావలెను. పిల్లలు ఉన్నా ఇల్లరికం ఓకే. 6309480414 [H-783642]

ఎవరు లేని వధువుకి వరుడు కావలెను/ఆస్తి, కుల పట్టింపు లేదు/50y/విడో/గవర్నమెంట్ లెక్చరర్/80,000 Rs/సొంత ఇల్లు/కోచింగ్ సెంటర్/పిల్లలు లేరు. Ph: 8121487795 [H-783642]

రజక/B.Tech / SWE / 60,000/-PM/ 5'4"ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 7075953400 [HA-15521]

క్రిస్టియన్ మాదిగ/ఏకైక కుమార్తె/ B.Tech/ Govt. Asst. ఇంజినీర్/ ట్రాన్స్‌కో/65000/-PM/ 5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-15521]

కుల ప్రసక్తి లేదు/2వ పెళ్లి/M.Sc/ Govt. Sr. Asst./రెవెన్యూ Dept/60,000/-PM/5'4" ఎత్తు/ 32 సం॥ల పిల్లలు లేని వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9550166072 [HA-15521]

SC హిందూ మాల/B.Tech/Govt.Jr. Asst. ZP / 52000/- PM / 5'4" ఎత్తు /26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-15521]

రెండవ పెళ్లి/విడో/50y/Fair/గుంటూరు/Own Complex(రెంట్స్)/ ల్యాండ్/1 పాప, USAలో సెటిల్డ్ ఏ బాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8519803423 [H-783678]

కుల పట్టింపు లేదు/21y&22y&24y&25y &26y&27y&28y&29y&30y&31y& 33y&34y& 36y& 37y&39y&40y&41y&42y&43y&45y&47y&48y&49y & 50y / "మా సేవ" (Since1998) Ph: 9291503949 [H-783678]

★★

మాల, హిందూ 2nd మ్యారేజ్, వయస్సు 40, H-5'3" M-Tech., లక్ష రూ॥ జీతం వధువుకి వరుడు సాఫ్ట్‌వేర్/ప్రైవేట్ ఎంప్లాయి కావలెను. 2nd మ్యారేజ్‌లు చూడబడును. ✆ : 77949 11019 [R-1256369]

వేదికలు



కుల పట్టింపు లేని అన్ని కులాల వారికి 1st/2nd/లేట్ విడో/పెన్షనర్స్/స్త్రీ/పు. లకు సంబంధాలు కలవు. స్త్రీలకు ఫ్రీ సర్వీస్, పు.లకు సర్వీస్ ఛార్జ్. # Ph: 9581120134 [H-783678]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matchesకై సంప్రదించండి. 9704656103, 9533608887 (Whatsapp) [HA-1703]

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహవేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

శ్రీశైలానికి నిలకడగా వరద ప్రవాహం


శ్రీశైలంలో ఎనిమిది గేట్ల నుంచి నీటి ప్రవాహం

దోమలపెంట: శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నిలకడగా కొనసాగుతోంది. శనివారం రాత్రి 7 గంటల సమయంలో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు 31 క్రస్టు గేట్లు ఎత్తి 2,14,582, విద్యుదుత్పత్తి చేస్తూ 28,734, సుంకేసుల నుంచి 8,958, హంద్రీ నుంచి 250.. మొత్తం 2,52,524 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు ఎనిమిది గేట్లను ఒక్కొక్కటి పదడుగుల మేర పైకెత్తి.. స్పిల్‌వే ద్వారా 2,22,032 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. మరోవైపు ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,575.. మొత్తం 65,890 క్యూసెక్కుల నీళ్లు అదనంగా సాగర్‌కు విడుదలవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 884.3 అడుగుల నీటిమట్టం వద్ద 211.4759 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గడిచిన 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 5,000, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,429 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.929 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 15.377 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

జీఐ ట్యాగ్‌కు అడుగు దూరంలో ఆర్మూర్ పసుపు

- దరఖాస్తును ఆమోదించిన చెన్నైలోని జీఐ రిజిస్ట్రీ
- డాక్టర్ పిడిగం సైదయ్య నేతృత్వంలో పరిశోధన, దరఖాస్తు
- జీఐ గుర్తింపుతో ఆర్మూర్ పసుపునకు అంతర్జాతీయ ఖ్యాతి
- ఉద్యాన వర్సిటీ వీసీ డా.దండ రాజిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బాగా ప్రాచుర్యం పొందిన ఆర్మూర్ పసుపు.. భౌగోళిక సూచిక (జీఐ) గుర్తింపు కోసం చేసుకున్న దరఖాస్తును చెన్నైలోని జియోగ్రాఫికల్ ఇండికేషన్ రిజిస్ట్రీ ఆమోదించింది. ఇక అధికారికంగా ఆర్మూర్ పసుపునకు జీఐ గుర్తింపు ఇస్తూ ప్రకటన చేయడమే మిగిలింది. ఆర్మూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్- మంథని, ప్రైమరీ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ – ఆర్మూర్ పేరిట జీఐ రిజిస్ట్రీలో దరఖాస్తు దాఖలు చేశారు. తెలంగాణ హార్టికల్చరల్ విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ పిడిగం సైదయ్య నాబార్డ్ మద్దతుతో ఈ భౌగోళిక గుర్తింపు ప్రాజెక్టుకు ప్రధాన పరిశోధకుడిగా ఉన్నారు. ఆర్మూర్ పసుపు ఆవిర్భావ మూలం, రకాల లక్షణాలు, జీవరసాయన ప్రొఫైలింగ్, సాగు పద్ధతులు, డీఎన్ఏ ట్యాగింగ్, నిజామాబాద్ జిల్లాలో పండించిన ఆర్మూర్ పసుపు రకం ప్రత్యేక పాత్ర, భౌగోళిక లింకుల గురించి ఆయన కీలక సమాచారాన్ని సేకరించారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి చెందిన హ్యూమన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ రజనీకాంత్ రైతుల తరఫున జీఐ టెక్నికల్ ఫెసిలిటేటర్‌గా వ్యవహరించి ఈ దరఖాస్తును దాఖలు చేశారు. జీఐ కోసం దరఖాస్తు చేసుకున్న 7వ పసుపు రకం ఆర్మూర్ పసుపు. ఈరోడ్ మంజల్ (ఈరోడ్ పసుపు), వైగావ్ పసుపు, సాంగ్లి పసుపు, లకాడాంగ్ పసుపు, వాస్మత్ హల్దీ (పసుపు)లకు ఇప్పటికే జీఐ ట్యాగ్ లభించింది. జార్ఖండ్‌కు చెందిన ఖర్సావన్ పసుపు దరఖాస్తు ముందస్తు పరీక్షలో ఉంది. ఆర్మూర్ పసుపు ఈ ప్రాజెక్టుకు నాయకత్వం వహించిన డాక్టర్ సైదయ్య మాట్లాడుతూ.. ఇది జీఐ రక్షణ, స్వదేశీ పంటల సాగును ప్రోత్సహిస్తుందని తెలిపారు. జీవవైవిధ్యాన్ని కాపాడటానికి సహాయపడుతుందని చెప్పారు.

జీఐ గుర్తింపుతో అంతర్జాతీయ ఖ్యాతి

ఆర్మూర్ పసుపునకు జీఐ రిజిస్ట్రేషన్ లభించటం ఆ పసుపు పండించే రైతులకు గేమ్–ఛేంజర్ కానుందని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. జీఐ గుర్తింపు వల్ల ప్రీమియం ధర, మార్కెట్, ఎగుమతి సామర్థ్యం వంటి ఆర్థిక, మార్కెట్ ప్రయోజనాలు ప్రభావితమవుతాయని తెలిపారు. మరో 15 పంటలకు జీఐ ట్యాగ్ కోసం దరఖాస్తు చేయనున్నట్లు తెలిపారు. నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ కె. ఉదయభాస్కర్ మాట్లాడుతూ.. జీఐ ట్యాగ్‌లు అంతర్జాతీయ గుర్తింపును పెంచుతాయని, నిజమైన ఉత్పత్తిదారులకు ప్రయోజనం లభిస్తుందని అన్నారు.

జీపీవోల కేడర్ స్ట్రెంగ్త్‌కు వినతి

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖలో ఇటీవల నియమితులైన గ్రామ పాలనాధికారులకు (జీపీవో) రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కేడర్ స్ట్రెంగ్త్ నిర్ణయించాలని జీపీవోల రాష్ట్ర అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు శనివారం సచివాలయంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు వింజమూరి ఈశ్వర్ తదితరులు.. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాను కలిసి వినతిపత్రం అందజేశారు. కాగా, తమ వినతిపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సానుకూలంగా స్పందించారని, సీసీఎల్ఏ నుంచి ప్రతిపాదనలు వచ్చిన వెంటనే ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్టు ఈశ్వర్ వెల్లడించారు.

బరాజ్‌ల పునరుద్ధరణకు గ్లోబల్ టెండర్లు

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై ఈఓఐ టెండర్లు
- అంతర్జాతీయ సంస్థల నుంచి తక్షణమే ఆహ్వానించండి
- రెండు వారాల్లో కన్సల్టెన్సీని ఎంపిక చేయాలి
- నీటిపారుదల శాఖపై సమీక్షలో మంత్రి ఉత్తమ్ ఆదేశం


సమీక్షలో మాట్లాడుతున్న ఉత్తమ్. చిత్రంలో మంత్రులు పొంగులేటి, తుమ్మల, భట్టి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణకు డిజైన్లతోపాటు ఇతర సాంకేతిక సహకారం కోసం అంతర్జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ)ను ఆహ్వానిస్తూ తక్షణమే గ్లోబల్ టెండర్లను పిలవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రెండు వారాల్లోగా టెండర్లను పూర్తిచేసి అత్యంత నైపుణ్యం గల సంస్థను కన్సల్టెంట్‌గా ఎంపిక చేయాలని సూచించారు. నీటిపారుదల శాఖపై శనివారం ఆయన సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల పునరుద్ధరణ విషయంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ చేసిన సిఫారసులను తు.చ. తప్పకుండా పాటిస్తూ ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. డిజైన్ల తయారీలో ఐఐటీ చెన్నై తరహా సంస్థల సేవలను వినియోగించుకోవాలని కోరారు.

సమ్మక్క కోసం ఛత్తీస్‌గఢ్ వెళ్తా

సమ్మక్క సారక్క బరాజ్‌కి 47 టీఎంసీల నీటి కేటాయింపులపై ఈ నెల 25న కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) కీలక సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో ఆలోపే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి ఆ ప్రాజెక్టుకు నిరభ్యంతర పత్రం తీసుకోవడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ అన్నారు. ఇందుకోసం ఈ నెల 22న స్వయంగా తాను ఛత్తీస్‌గఢ్ వెళ్లి ఆ రాష్ట్ర సీఎంను కలిసి విజ్ఞప్తి చేస్తానన్నారు. సమ్మక్క బరాజ్‌తో ఛత్తీస్‌గఢ్‌లో ఏర్పడనున్న ముంపుపై ఐఐటీ ఖరగ్‌పూర్ సమర్పించిన అధ్యయన నివేదిక ప్రకారం పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చి ఆ రాష్ట్రం నుంచి సూత్రప్రాయ సమ్మతి తీసుకుంటామన్నారు. సీతమ్మసాగర్, మోడికుంటవాగు, చనాకా-కొరాటా డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ నుంచి సత్వరం ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్‌లు పొందడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. క్లియరెన్స్ లభించిన వెంటనే ఆయా ప్రాజెక్టులకి ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) కింద కేంద్ర నిధుల కోసం దరఖాస్తు చేయాలని ఆదేశించారు.

ట్రిబ్యునల్ ముందు బలంగా వాదించాలి

ఉమ్మడి ఏపీకి కేటాయించిన కృష్ణా జలాల్లో తెలంగాణకు 904 టీఎంసీల వాటా కోరుతూ ఈ నెల 23న ఢిల్లీలో జరగనున్న కృష్ణా ట్రిబ్యునల్–2లో రాష్ట్రం తరఫున బలంగా వాదనలు వినిపించాలని మంత్రి ఉత్తమ్ సూచించారు. ఈ విచారణకు తాను స్వయంగా హాజరై రాష్ట్ర న్యాయ నిపుణుల బృందానికి మద్దతుగా నిలుస్తానని తెలిపారు. ప్రాణహిత–చెవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణానికి సత్వరం కొత్త డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. తుమ్మిడిహెట్టి బరాజ్ ప్రతిపాదిత స్థలంతో పాటు ప్రాజెక్టు కింద ఇప్పటికే తవ్విన కాల్వలను సందర్శించి పరిస్థితులను అధ్యయనం చేయాలని ఇరిగేషన్ శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను మంత్రి ఆదేశించారు. బరాజ్‌ను ఎంత ఎత్తులో నిర్మిస్తే మహారాష్ట్రలో ఎంత ముప్పు ఉంటుందో నిర్ధారించాలని, ఆ రాష్ట్ర సమ్మతి కోసం చర్చలు జరపడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు అలైన్‌మెంట్, రూట్‌ను ఖరారు చేయాలని కోరారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల పునరుద్ధరణకు హెలికాప్టర్ ద్వారా నిర్వహించాల్సిన సర్వేకు అనుమతుల కోసం డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్‌తో సంప్రదింపులు జరపాలని సూచించారు. దేవాదుల, డిండి ప్రాజెక్టులను గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ అధికారుల తీరుపై మంత్రి ఉత్తమ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. పలు అంశాల్లో ఆశించిన పురోగతి కనిపించకపోవడం, సమీక్షలకు సన్నద్ధతతో రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం.

సీతారామపై స్టే ఎత్తివేతకి చర్యలు

సీతారామ–సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణంపై ఎన్జీటీతో పాటు సుప్రీంకోర్టు విధించిన స్టేను సత్వరం తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ఉత్తమ్ ఆదేశించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ఈ ప్రాజెక్టుపై సచివాలయంలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. త్వరగా అనుమతులు పొందాలని ఆదేశించారు.

పిచ్చికుక్క స్వైర విహారం

- జడ్చర్లలో 16 మందిపై దాడి.. ఆస్పత్రికి ఒకరి తరలింపు


పిచ్చికుక్క దాడిలో వృద్ధుని కాలికి గాయం

జడ్చర్ల టౌన్/ మరికల్: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట ఆటోస్టాండ్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు శనివారం సాయంత్రం ఒక పిచ్చికుక్క స్వైరవిహారం చేసి 16 మందిని గాయపరిచింది. గాయపడిన వారిలో మాసయ్య అనే వ్యక్తి మోకాలి కింది భాగంలో.. తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆటోస్టాండ్ వద్ద ఒక వ్యక్తిని గాయపరిచిన కుక్క.. రోడ్డుపై పరుగెడుతూ కనిపించిన వారందరినీ గాయపరిచింది. స్థానికులు రాళ్లతో దాని వెంబడించగా.. ఫ్రీజన్ కాలనీ వైపు పరుగు తీసింది. గాయపడిన వారిలో రఘు, రాహుల్, మధుజెన్, అహ్మద్, వాల్య, రెడ్యా, విశ్వ, సాధిక్, రాజన్, శ్రీనికరు, జరీనాబేగం, మొగులయ్య, ఉస్మాన్ తదితరులు స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందారు.

మరికల్‌లో పిచ్చికుక్క దాడి..

నారాయణపేట జిల్లా మరికల్‌లో శుక్రవారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్, బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో పిచ్చికుక్క 11 మందిని గాయపరిచింది. శనివారం మరికల్, కన్మనూర్‌లో మరో ఇద్దరిని కుక్క కరిచింది. బాధితులందరికీ మరికల్‌లోని ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసిన తర్వాత.. మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

తిరుమల వేదికగా టీడీపీ దిగజారుడు రాజకీయం

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండిపాటు
- పరకామణి దొంగను పట్టుకున్నది వైఎస్సార్‌సీపీ హయాంలోనే
- అప్పట్లోనే గిఫ్ట్ రూపంలో తిరిగి టీటీడీకి రూ.14.43 కోట్ల ఆస్తులు
- లోకేశ్‌కు అబద్ధాలు చెప్పడం అలవాటైపోయింది

సాక్షి, అమరావతి: రాజకీయ ప్రయోజనాలకు తిరుమల క్షేత్రాన్ని వాడుకోవడం, దుష్ప్రచారం చేయడం చంద్రబాబుకు, లోకేశ్‌కు ఒక అలవాటుగా మారిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండిపడింది. శ్రీవారి ఆలయాన్ని అడ్డుపెట్టుకుని దిగజారుడు రాజకీయం చేస్తోందని ధ్వజమెత్తింది. రూ.వంద కోట్ల పరకామణి దొంగ వెనుక వైఎస్సార్‌సీపీ నేతలున్నారని, గత ప్రభుత్వ పాలనలో అవినీతి రాజ్యమేలిందని మంత్రి లోకేశ్ 'ఎక్స్'లో పోస్టు చేయడం దుర్మార్గం అని ఆగ్రహం వ్యక్తం చేసింది. 'వేంకటేశ్వరస్వామి సాక్షిగా అబద్ధాలు, విష ప్రచారాలు చేయడం వారిద్దరికీ అలవాటే. సిగ్గు, శరం వదిలేసి బరి తెగించి దుష్ప్రచారం చేయడంలో ఇద్దరూ హేమాహేమీలే. పరకామణిలో చోరీ విషయంలో లోకేశ్ చెబుతున్నవి పచ్చి అబద్ధాలు. దశాబ్దాలుగా పరకామణిలో చోరీకి పాల్పడుతున్న రవికుమార్‌ను పట్టుకున్నది 2023 ఏప్రిల్‌లో. నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పోలీసులు నిశిత విచారణ జరపడంతో రవికుమార్ కుటుంబ సభ్యులు పశ్చాత్తాపం చెంది రూ.14.43 కోట్ల విలువైన ఆస్తులను టీటీడీకి గిఫ్టు రూపంలో ఇచ్చేశారు. ఇదంతా చట్ట ప్రకారం కోర్టులు నిర్దేశించిన న్యాయ సూత్రాల ప్రకారం పారదర్శకంగా జరిగింది. లోకేశ్.. నువ్వైతే పంచాయతీ చేసి, ఈ ఆస్తులను కొట్టేసి, దొంగ పెట్టుబడుల రూపంలో ఏ దుబాయికో తరలించే వాడివి. రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పటికే ఓ స్లోగన్ నడుస్తోంది. క్యాష్.. సూట్‌కేసు.. రాజేష్.. లోకేష్.. అని. ఈ ప్రభుత్వంలోని అలీబాబా అరడజను దొంగల్లో నువ్వూ ఒకడివి'అంటూ వైఎస్సార్‌సీపీ శనివారం ఎక్స్‌లో పోస్టు చేసింది. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను కూడా ఆ పోస్టుకు జత చేసింది.

మానాలలో అటవీశాఖ అధికారుల నిర్బంధం

- అటవీ భూముల ఆక్రమణపై జనాగ్రహం
- నీలగిరి చెట్ల నరికివేతపై మండిపడ్డ గ్రామస్తులు


మానాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్బంధంలో అటవీ అధికారులు

రుద్రంగి(వేములవాడ): అటవీశాఖ అధికారుల అవినీతి.. లంచగొండితనం వల్లే అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయంటూ వారిని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. శనివారం మానాలలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. రాజన్నసిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల శివారులోని మల్లన్న ఆలయం ఆవరణలో 18 ఎకరాల్లో నీలగిరి తోటను అటవీశాఖ పెంచింది. గతంలో ఈ భూమి ఆక్రమణకు గురికావడంతో అటవీశాఖ స్వాధీనం చేసుకుని నీలగిరి తోటను పెంచగా.. శుక్రవారం రాత్రి మూడు ఎకరాల్లోని సుమారు వెయ్యి నీలగిరి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసి, భూమి చదును చేసేందుకు యత్నించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టేందుకు శనివారం వేములవాడ అటవీ రేంజ్ అధికారి ఖలీలొద్దీన్, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, అటవీశాఖ సిబ్బంది మొత్తం 12 మంది మానాలకు చేరుకున్నారు. వారిని గ్రామస్తులు అడ్డుకొని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. అటవీశాఖ అధికారుల అవినీతితో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని ఆరోపించారు. అటవీ భూములు ఆక్రమణకు గురవుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సమాచారం అందుకున్న చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, రుద్రంగి ఎస్ఐ శ్రీనివాస్ పోలీసు బలగాలతో మానాల చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. డీఎఫ్‌వో వచ్చి అటవీ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. డీఎఫ్‌వోతో ఫోన్‌లో పోలీసులు మాట్లాడించడంతో సమస్య సద్దుమణిగింది. మానాల గ్రామస్తులు నిర్బంధించిన అటవీశాఖ సిబ్బందిని పోలీసులు విడిపించారు.

క్లుప్తంగా...

వ్యాధులకు అనుగుణంగా వైద్య వ్యవస్థ మారాలి

దయాలసిస్ సెంటర్ల ఏర్పాటుపై జరిగిన సమీక్షలో మంత్రి దామోదర



సాక్షి, హైదరాబాద్: మారుతున్న జీవనశైలి ప్రభావంతో వ్యాధులు కూడా రూపాంతరం చెందుతున్నాయని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఒకప్పుడు అంటువ్యాధుల సమస్య ఎక్కువగా ఉండేదని, ఇప్పుడు జీవనశైలి వ్యాధుల ప్రభావం పెరిగిందని అన్నారు. ఇందుకు అనుగుణంగా వైద్య వ్యవస్థలో కూడా మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కొత్త డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో శనివారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో కిడ్నీ వ్యాధులతో డయాలసిస్ పేషెంట్ల సంఖ్య పెరుగుతున్న తీరును అధికారులు మంత్రికి వివరించారు. కిడ్నీ, క్యాన్సర్ వ్యాధులు పెరుగుతుండడంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో, రాష్ట్రంలో ఒకప్పుడు అధికంగా ఉన్న అంటువ్యాధుల సమస్యకు అనుగుణంగానే మన వైద్య రంగం రూపొందిందని, ఇప్పుడు పరిస్థితి తారుమారైందని, అంటు వ్యాధులు తగ్గిపోయి, నాన్ కమ్యూనికేబుల్ వ్యాధులు (ఎన్‌సీడీ) పెరిగిపోయాయన్నారు. డయాలసిస్ రోగులు మానసికంగా, శారీరకంగా ఎంతో ఇబ్బంది పడుతుంటారని, వారికి పెన్షన్ అందించి కొంతవరకు ఆర్థికంగా బాసటగా నిలుస్తున్నట్లు మంత్రి దామోదర చెప్పారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా వైద్య వ్యవస్థ మారాలని, ఈ అంశంపై అధ్యయనం చేయాలని సూచించారు. సమావేశంలో ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ, ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్‌కుమార్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డి, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే మినీ డీఎస్సీ

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



నిజామాబాద్ సిటీ: త్వరలోనే తెలంగాణలో మినీ డీఎస్సీ నిర్వహించనున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. పోలీసులు, ఉపాధ్యాయులు తదితర వివిధ విభాగాల్లో ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. ఆయన శనివారం నిజామాబాద్ జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయాన్ని పరిశీలించి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో మాట్లాడారు. గ్రంథాలయాన్ని ఆధునీకరిస్తామన్నారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి ఉన్నారు.

వసతుల కల్పనపై సీఎంకు శ్రద్ధ లేదు

మాజీ ఎమ్మెల్యే గండ్ర



సాక్షి, హైదరాబాద్: గ్రామాల్లో వసతుల కల్పనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కనీస శ్రద్ధ లేదని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించక.. పల్లెల్లో చీకట్లు అలముకున్నాయన్నారు. ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌తో కలిసి గండ్ర వెంకట రమణారెడ్డి శనివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇసుక దోపిడీ విచ్చలవిడిగా జరుగుతోందని, ఇందిరమ్మ ఇళ్ల పేరిట అక్రమంగా తరలిస్తున్నారని 'గండ్ర' ఆరోపించారు. భూపాలపల్లి నియోజకవర్గంతో పాటు గోదావరి పరీవాహక ప్రాంతమంతా.. కాంగ్రెస్ నేతల ప్రోద్బలంతో జరుగుతున్న ఇసుక దోపిడీతో తమ ప్రాంతం ఎడారిగా మారుతోందన్నారు. పార్టీ ఫిరాయింపులపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ విమర్శించారు.

కృత్రిమ మేధ (ఏఐ).. ఇప్పుడు ప్రపంచాన్ని శాసించే సాంకేతికత. ఇది ఉద్యోగులకే కాదు.. అన్ని తరగతుల విద్యార్థులకు కూడా గొప్ప ఆయుధంగా అవతరించింది. వివిధ అంశాలను నేర్చుకునే విషయంలో సౌలభ్యమేకాదు.. క్రమశిక్షణా అలవాట్లను ఏర్పరచుకోవడం, సమయ పాలనా నిర్వహణ, సృజనాత్మకతను పెంపొందించుకోవడం వంటి ఎన్నో అంశాల్లో ఏఐ సాధనాలు విద్యార్థులకు దోహదపడుతున్నాయి. చాట్‌జీపీటీ, జెమినైతోపాటు అత్యంత ఉపయోగకరమైన ఏఐ టూల్స్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్



స్టూడెంట్స్ మీకోసం ఏఐ టూల్స్!

సమయ పాలన

రీక్లెయిమ్.ఏఐ: క్యాలెండర్‌ను ఆటోమేటిక్‌గా నిర్వహించే షెడ్యూలింగ్ సాధనం. అసైన్‌మెంట్స్‌ను ఎప్పుడు సవరించాలి, రాయాలో మాన్యువల్‌గా ప్లాన్ చేయడానికి బదులుగా.. విద్యార్థి ప్రస్తుత తరగతులు, క్రీడలు, అభిరుచులు, వ్యక్తిగత కార్యక్రమాలను స్కాన్ చేసి, అందుబాటులో ఉన్న ఖాళీ సమయంలో అధ్యయన సెషన్స్‌ను నిర్ణయిస్తుంది.

నోషన్ ఏఐ: నోట్స్, టాస్క్‌లు, ప్రాజెక్టులు, విజ్ఞానాన్ని ఒకే చోటుకు తీసుకొస్తుంది. డాక్యుమెంట్లలో ఉన్న సమాచారాన్ని క్యాప్చర్ చేయడానికి, వాటిని సారాంశాలుగా మార్చడానికి, అసైన్‌మెంట్స్‌ను ట్రాక్ చేయడానికి, సమాచారాన్ని శోధించడానికి , నవీకరణకు సులభంగా అర్థమయ్యేలా స్టడీ డాష్‌బోర్డ్‌ను ఉంచడంలో సహాయపడుతుంది.

పరిశోధన, రచనలు

పర్‌ప్లెక్సిటీ.ఏఐ: విశ్వసనీయమైన వేదికలు (సోర్సులు), సంక్షిప్త సూచనలతో.. మన ప్రశ్నలకు సమాధానమిచ్చే పరిశోధన ఇంజిన్. గూగుల్‌లో స్క్రోల్ చేయడానికి బదులుగా వ్యాసాలు, నివేదికలు, ప్రాజెక్టులలో ఉదహరించగల ప్రత్యక్ష, విశ్వసనీయ విషయాలను నేరుగా పొందవచ్చు.

నోట్‌బుక్ ఎల్ఎమ్ (గూగుల్): క్లాస్ నోట్స్, పాఠ్యపుస్తకాలు, పీడీఎఫ్‌లను అప్‌లోడ్ చేసి ఈ మెటీరియల్‌కు సంబంధించిన ప్రశ్నలను అడగవచ్చు. విద్యార్థులు ఇచ్చే సిలబస్‌ను ఆధారం చేసుకుని శిక్షణ పొందిన ట్యూటర్ పాత్రనూ పోషిస్తుంది.

అధ్యయనం- అభ్యాసం

క్విజ్‌లెట్: నోట్స్‌ను సంక్షిప్త సమాచార ఫ్లాష్‌కార్డ్స్, ప్రాక్టీస్ పరీక్షలు, స్టడీ గేమ్స్‌గా మారుస్తుంది. విద్యార్థులు మెటీరియల్‌ను ఎంత బాగా గుర్తుంచుకుంటున్నారో దానికి అనుగుణంగా తనను తాను మార్చుకుంటుంది. తద్వారా పాఠాలు తిరిగి చదవడం ఒక పనిలాగా, ఆసక్తి లేని విషయంగా కాకుండా ఆసక్తికరంగా మారుతుంది.

వూల్ఫ్రమ్ ఆల్ఫా: ఇది కేవలం కాలిక్యులేటర్ మాత్రమే కాదు.. సమాధానాలను గణిస్తుంది. ఫంక్షన్స్‌ను గ్రాఫ్ చేస్తుంది. దశలవారీ గణిత, సైన్స్ పరిష్కారాల ద్వారా ముందుకు నడిపిస్తుంది. చేసిన పనిని ఒకటికి రెండుసార్లు తనిఖీ చేయడానికి, భావనలను మరింత లోతుగా అన్వేషించడానికి ఉపయోగపడుతుంది.

ఆటర్.ఏఐ (ఓటీటీఈఆర్): ఆడియో, వీడియోల కంటెంట్‌ను టెక్స్ట్‌గా మార్చే ట్రాన్‌స్క్రిప్షన్ సాధనం. ఉపన్యాసాలు, సమావేశాలు, గ్రూప్ డిస్కషన్స్‌ను రికార్డ్ చేసి వాటిని సర్చ్ చేయదగిన టెక్స్ట్‌గా మారుస్తుంది. నోట్స్ రాసే వ్యక్తిగత సహాయకుడిగా ఉంటుంది.

అధ్యయన విధానాన్ని మారుస్తున్న సాధనాలు
- సృజనాత్మకతను పెంపొందించడంలో సాయం
- సమర్థవంతమైన సమయపాలనకూ దోహదం

కంటెంట్ సృష్టి - ప్రజెంటేషన్

కాన్వా: డ్రాగ్-అండ్-డ్రాప్ టెంప్లేట్స్‌తో పోస్టర్లు, స్లైడ్లు, ఇన్ఫోగ్రాఫిక్స్, వీడియోలను సులభంగా రూపొందించవచ్చు. ఇతర ఏఐ సాధనాలు కేవలం టెక్స్ట్ వివరణ నుంచి ప్రారంభ స్థాయి డిజైన్స్‌ను మాత్రమే రూపొందించగలవు. కానీ ఇది లే-అవుట్, స్టైలింగ్‌ను వేగవంతం చేస్తుంది. కిండర్‌గార్టెన్ నుంచి ఇంటర్ వరకు అందరి విద్యార్థులకూ ఉపయోగపడుతుంది.

గామా.యాప్: ప్రాంప్ట్‌ల నుంచి పూర్తి స్లైడ్ డెక్‌లు, సులభంగా అర్థమయ్యేలా ఒక పేజీలో డాక్యుమెంట్, సాధారణ సైట్స్‌ను కూడా రూపొందిస్తుంది. వాటికి తుదిమెరుగులు దిద్ది పీపీటీ, గూగుల్ స్లైడ్స్, పీడీఎఫ్‌లోకి మార్చడానికి వీలు కల్పిస్తుంది.

కస్టమైజబుల్ ఏఐ సాధనాలు

జెమినై జెమ్స్: సొంత, తేలికైన ఏఐ సాధనాలను సృష్టించడానికి అనుమతిస్తుంది. కథనాలను సంక్షిప్తంగా రూపొందించడం, కేస్ స్టడీస్ విశ్లేషణ, అధ్యయన అంశాలను తయారు చేయడం వంటి నిర్దిష్ట పనులు చేసి పెడుతుంది.

చాట్‌జీపీటీ స్టడీ మోడ్: చాట్‌జీపీటీ కేవలం ప్రశ్నోత్తరాలకే పరిమితమైన సాధనం కాదు. స్టడీ మోడ్ సాయంతో ప్రాజెక్ట్స్, వ్యక్తిగత, ప్రత్యేక జెనరేటివ్ ప్రీ-ట్రెయిన్డ్ ట్రాన్స్‌ఫార్మర్స్‌తో (జీపీటీ) విద్యార్థులకు నిర్మాణాత్మక అధ్యయన సహాయకుడిగా కూడా సాయపడుతుంది.

మళ్లీ రూ.5 వేల కోట్లు

- ఈ నెలలో అప్పు కోసం మరోసారి సిద్ధమైన రాష్ట్ర ప్రభుత్వం
- ఈ నెలలో ఇప్పటికే రెండు విడతల్లో రూ. 7 వేల కోట్ల సమీకరణ
- 23న మరో రూ. 5 వేల కోట్లను సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా పొందేందుకు సన్నద్ధం
- 2025-26 రుణ లక్ష్యం రూ. 64,539 కోట్లలో ఇప్పటికే రూ. 41,400 కోట్ల సేకరణ



2025-26కుగాను ప్రభుత్వం నెలల వారీగా పొందిన రుణం ఇలా.. (రూ. కోట్లలో)

తేదీ	రుణ సమీకరణ	తేదీ	రుణ సమీకరణ
ఏప్రిల్ 15	రూ.1,000	జూలై 15	రూ.2,500
ఏప్రిల్ 29	రూ.1,400	జూలై 29	రూ.3,500
మే 13	రూ.2,500	ఆగస్టు 05	రూ.5,000
జూన్ 03	రూ.1,500	ఆగస్టు 12	రూ.1,000
జూన్ 10	రూ.3,000	ఆగస్టు 26	రూ.2,000
జూన్ 17	రూ.4,000	సెప్టెంబర్ 02	రూ.6,000
జూలై 01	రూ.1,500	సెప్టెంబర్ 16	రూ.1,000
జూలై 08	రూ.1,000	మొత్తం	రూ.36,400

(నోట్: ఈ నెల 23న తీసుకోనున్న రూ.5,000 కోట్లు కలిపితే రూ. 41,400 కోట్లకు చేరుతున్నాయి)

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అప్పు కోసం మరోసారి సిద్ధమైంది. ఆర్‌బీఐ చేపట్టే సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా ఈ నెలలో ఇప్పటికే రూ. 7 వేల కోట్లు సమకూర్చుకున్న ప్రభుత్వం.. ఈ నెల 23న ఇంకో రూ. 5 వేల కోట్ల రుణం కోసం ఆర్‌బీఐకి ఇండెంట్ పెట్టింది. ఈ మొత్తం కలిపితే ఈ ఒక్క నెలలోనే రూ. 12 వేల కోట్లను ఆర్‌బీఐ ద్వారా బహిరంగ మార్కెట్ రుణాల రూపంలో రాష్ట్ర ఖజానాకు సమకూరనున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 64,539 కోట్లను బహిరంగ మార్కెట్ రుణాల రూపంలో సమకూర్చుకుంటామని ప్రభుత్వం బడ్జెట్ ప్రతిపాదనల్లో పేర్కొంది. అందులో తొలి ఐదు నెలల్లో సేకరించిన రూ. 29,400 కోట్లు, ఈ నెలలో సేకరించే మొత్తం రూ. 12 వేల కోట్లు కలిపితే తొలి ఆరు నెలల కాలానికి రాష్ట్ర అప్పు రూ. 41,400 కోట్లు చేరుకుంది. అంటే ఏడాది కాలంలో తీసుకోవాల్సిన అప్పులో 65 శాతానికిపైగా ఆరు నెలల్లోనే ప్రభుత్వం తీసేసుకుంది. గత మూడేళ్ల గణాంకాలను పరిశీలిస్తే 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం తీసుకున్న మొత్తం అప్పు రూ. 49,618 కోట్లు. అంటే 2025-26 సంవత్సరానికిగాను ఆరు నెలల్లో తీసుకున్న దాని కంటే కేవలం రూ. 8 వేల కోట్లు అధికం. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. రూ. 56,940 కోట్లను బహిరంగ మార్కెట్ రుణాల రూపంలో ప్రభుత్వం తీసుకుంది. అంటే అంతకుముందు ఏడాది కంటే రూ. 7 వేల కోట్లు ఎక్కువగా సేకరించింది. ఇప్పుడు ఆరు నెలల కాలంలోనే రూ. 41,400 కోట్లు తీసుకున్న నేపథ్యంలో ఈ ఏడాది అప్పు కనీసం రూ. 70 వేల కోట్లకు చేరుతుందనేది ఆర్థిక నిపుణుల అంచనా. అంటే గత ఏడాది కంటే ఈ ఏడాది రూ. 14 వేల కోట్ల మేర అప్పులు పెరిగే అవకాశాలున్నాయి. ఈ విధంగా ఏటేటా అప్పుల పద్దు పెరగడం ఖజానాను ఆందోళనకర పరిస్థితుల్లోకి నెడుతోంది. అప్పులు పెరిగేకొద్దీ చెల్లింపులు గుదిబండగా మారుతున్నాయని.. అయినా ప్రభుత్వ మనుగడ కోసం అప్పులు అనివార్యమవుతున్నాయని ఆర్థిక శాఖ వర్గాలే అంటున్నాయి.



సమీక్షలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, పొంగులేటి, కొండా సురేఖ, సీతక్క, అడ్లూరి, బలరాం నాయక్, వేం నరేందర్‌రెడ్డి, శైలజా రామయ్యర్

ఈనెల 23న మేడారానికి సీఎం

ఏర్పాట్లపై మంత్రులతో రేవంత్‌రెడ్డి సమీక్ష

సాక్షి, హైదరాబాద్: మేడారం జాతరలో గిరిజన సంప్రదాయాలు ఉట్టిపడేలా అభివృద్ధి కార్యక్రమాలు ఉండాలని, గిరిజన ఆచార వ్యవహారాల్లో ఎలాంటి మార్పులు చేయడానికి వీల్లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో జరిగే మేడారం జాతర ఏర్పాట్లు, అభివృద్ధి కార్యక్రమాలపై ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండ్ సెంటర్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ తదితరులతో కలిసి ముఖ్యమంత్రి శనివారం సమీక్షించారు. మేడారంలోని అమ్మవారి గద్దెలతోపాటు పరిసర ప్రాంతాలను స్వయంగా పరిశీలించిన తరువాతే అభివృద్ధి కార్యక్రమాలను ఖరారు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. అందుకోసం ఈనెల 23వ తేదీన రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులతో కలసి మేడారంను సందర్శించి అక్కడే అభివృద్ధి పనులపై సమీక్షించనున్నారు. పూజారుల సూచనల మేరకు వారి ఆమోదంతో అభివృద్ధిపై డిజైన్లను ముఖ్యమంత్రి ఆరోజు విడుదల చేయనున్నారు. మేడారం జాతర పనులకు సంబంధించి సాంకేతిక కమిటీని ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. పూజారులు కోరిన విధంగా ప్రస్తుతం ఉన్న ఆలయ ఆవరణను మరింత విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తున్న విషయం విదితమే. గద్దెలను యథాతథంగా ఉంచి సంప్రదాయాలను తప్పకుండా గౌరవించాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. గిరిజన సంప్రదాయానికి అనుగుణంగా స్వాగత తోరణం డిజైన్లు ఉండాలని, ఆలయం పరిసర ప్రాంతాల్లో ఆ ప్రాంత సంప్రదాయ వృక్షాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

తొక్కుకుంటూ పోతేనే తొవ్వ దొరుకుతుంది



- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- రాజకీయాల్లో ఎవరూ స్పేస్ ఇవ్వరు.. కల్పించుకోవాలి... కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుపై ఇంకా నిర్ణయానికి రాలేదు
- బీఆర్ఎస్ నేతలతో పాటు అనేక మంది టచ్‌లో ఉన్నారు

సాక్షి, హైదరాబాద్: రాజకీయాలు, ప్రజా జీవితంలో ఎవరూ అవకాశం (స్పేస్) ఇవ్వరని, తొక్కుకుంటూ వెళ్తేనే తొవ్వ దొరుకుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తాను రాజకీయ పార్టీ ఏర్పాటుపై ఇంకా పూర్తి నిర్ణయానికి రాలేదని తెలిపారు. భవిష్యత్తులో రాజకీయంగా ఎలా అడుగులు వేయాలనే అంశంపై వివిధ వర్గాలతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. తాను పార్టీ పెడితే బీసీలకు చట్ట సభల్లో 42 శాతం రిజర్వేషన్లతో పాటు అన్ని వర్గాలకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. శనివారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్ అనంతరం మీడియా ఇష్టాగోష్ఠిలో కవిత వివిధ అంశాలకు సంబంధించి పలు వ్యాఖ్యలు చేశారు. 'నేను ఇప్పుడు ఫ్రీ బర్డ్. నన్ను బీఆర్ఎస్ సహా అనేక మంది నేతలు కలుస్తున్నారు. నేను కూడా పలువురితో సంప్రదింపులు జరుపుతున్నా. కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వస్తున్న వార్తలు నిజం కాదు' అని కవిత వ్యాఖ్యానించారు.

కాళేశ్వరం.. మినహా హరీశ్‌పై కోపం లేదు

'నీటి పారుదల శాఖకు సంబంధించిన ఫైళ్లను సరైన ప్రొసీజర్ పాటించకుండా నేరుగా సీఎంకు పంపడంపై 2016లోనే నేను కేటీఆర్‌ను అప్రమత్తం చేశా. కాళేశ్వరం ప్రాజెక్టు అంశం మినహా మాజీ మంత్రి హరీశ్‌రావుపై నాకు ఎలాంటి వ్యక్తిగత కోపం లేదు. కింది స్థాయిలో అధికారుల పరిశీలన, ఆమోదం లేకుండా ఫైళ్లు కేసీఆర్ వద్దకు వెళ్లాయి. పీసీ ఘోష్ కమిషన్ కూడా ఇదే విషయాన్ని ఎత్తి చూపింది. విచారణ సందర్భంగా అంతా కేసీఆర్ నిర్ణయమే.. అని హరీశ్‌రావు చెప్పినట్లు కమిషన్ నివేదికలో ఉంది' అని కవిత అన్నారు.

కృష్ణాలో క్రికెట్ ఆడుకోవాలి..

'కృష్ణా నదిపై ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచితే తెలంగాణ ప్రాంత వాసులు నదిలో క్రికెట్ ఆడుకోవాల్సిందే. ఆల్మట్టి ఎత్తు పెంపుపై మహారాష్ట్ర అభ్యంతరం చెప్పినా తెలంగాణ ప్రభుత్వం ఏం చేస్తోంది. రేవంత్‌రెడ్డి.. సోనియా ద్వారా కర్ణాటకపై ఒత్తిడి పెంచాలి. బనకచర్లతో పాటు ఆల్మట్టిపైనా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాలి. ఈసారి మా ఊరు చింతమడకలో బతుకమ్మ ఉత్సవాలకు వెళ్తున్నా' అని కవిత పేర్కొన్నారు.

కేసీఆర్ రచించిన 'కవిత'లోని భాగమే..

- జైలుకు వెళ్లొచ్చాక కవిత నీతులు చెబుతున్నారు: మధుయాష్కీ
- అప్పుడు విమలక్కను ఇబ్బందిపెట్టి ఇప్పుడు బీసీల గురించి మాట్లాడుతోంది



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ కుమార్తె కవితకు తొమ్మిదేళ్ల తర్వాత కాళేశ్వరం గుర్తుకు వచ్చిందని, జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత ఆమె నీతులు చెప్పడం, అవినీతి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ విమర్శించారు. పదేళ్లపాటు బడుగులను దోచుకున్న ఆమె ఇప్పుడు బీసీల గురించి మాట్లాడటం ఏంటో అర్థం కావడం లేదన్నారు. ఇటీవల అస్వస్థతకు గురై చికిత్స అనంతరం కోలుకున్న ఆయన శనివారం గాంధీభవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు నేతలు, జర్నలిస్టులు పరామర్శించారు. అనంతరం గాంధీభవన్‌లో విలేకరులతో ఇష్టాగోష్ఠి మాట్లాడుతూ కేసీఆర్ రచించిన కవితలో భాగమే ఈ కవిత అని తాను భావిస్తున్నానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతే ఏం చెప్పాలో అర్థంకాని పరిస్థితుల్లో ఈ డ్రామాకు తెరలేపి ఉంటారని వ్యాఖ్యానించారు. 'తనకు పోటీగా బతుకమ్మ ఆడుతున్నారని విమలక్క ఆఫీసును కవిత ఖాళీ చేయించారు. ఆమె ఆఫీసుకు ఎవరూ అద్దె భవనం ఇవ్వకుండా కక్ష కట్టిన కవిత ఇప్పుడు బీసీల గురించి మాట్లాడుతోంది' అని విమర్శించారు. కవిత వెనుక సీఎం రేవంత్ ఉన్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని, ఆయన ఏది చేసినా ఓపెన్‌గానే ఉంటుందన్నారు. తదుపరి ముఖ్యమంత్రి గురించిన చర్చ అవసరం లేదని, రేవంత్ పాలన బాగుందని చెప్పారు. బీసీల కులగణన చేసి ఆయన చాంపియన్‌గా నిలిచారని చెప్పారు. కేసీఆర్ కుటుంబానికి కాళేశ్వరం ఏటీఎం అని చెప్పిన మోదీ, అమిత్ షాలు ఇప్పుడు సీబీఐ విచారణ ఎందుకు జరిపించడం లేదని మధుయాష్కీ ప్రశ్నించారు.

జీవో 68ను రద్దు చేయాలి: బీజేపీ

సాక్షి, హైదరాబాద్: సీఎం వెంటనే జీవో 68ను రద్దు చేసి అవుట్‌డోర్ మీడియా ఓనర్స్‌కు మద్దతుగా నిలవాలని బీజేపీ డిమాండ్ చేసింది. చిన్న హోర్డింగ్ ఏజెన్సీలు ఇంకా పనిచేస్తున్నా.. ఇతర మున్సిపల్ కార్పొరేషన్లలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆ ఏజెన్సీల హోర్డింగ్‌లను తొలగించడానికి ప్రయత్నిస్తోందని పేర్కొంది. దీంతో సుమారు 50 వేల కుటుంబాల జీవనోపాధి ప్రభావితమైందని తెలిపింది. బీజేపీ కార్యాలయంలో తెలంగాణ అవుట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ (టోమో)తో బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఇతర నేతలు సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీవో 68 రద్దుకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ, చిన్న హోర్డింగ్ ఏజెన్సీల జీవనోపాధికి భరోసా ఇవ్వాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ పరిశ్రమపై ఆధారపడిన కుటుంబాలు జీవనోపాధి కోల్పోకుండా భరోసా కల్పించాలని సూచించారు. 2020లో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 68 ఫలితంగా.. చిన్న ఏజెన్సీల కార్యకలాపాలు రద్దయి జీహెచ్ఎంసీలో వారి సేవలను బహిష్కరించారని తెలిపారు. మూడు పెద్ద ఏజెన్సీల ప్రయోజనాలకే ఈ జీవో రూపొందించారన్నారు.



మహిళా సంఘాలకు చెక్కులు అందజేస్తున్న భట్టి విక్రమార్క. చిత్రంలో వివేక్, పొన్నం, సీతక్క, మేయర్ విజయలక్ష్మి, అజారుద్దీన్ తదితరులు

ఎన్ని కోట్లయినా ఖర్చు చేస్తాం

- మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం
- డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

వెంగళరావునగర్ (హైదరాబాద్): మహిళలు ఆర్థిక సాధికారత సాధించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కోట్లయినా వెచ్చిస్తుందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తెలియజేశారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో శనివారం మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇందిరా మహిళా శక్తి పథకం కింద వడ్డీలేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, మహిళలు పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లాల్సిన పనిలేదని, ఇక నుంచి వడ్డీలేని రుణాలను ప్రభుత్వమే మహిళలకు ఇస్తుందని అన్నారు. నియోజకవర్గంలోని 8,130 మంది మహిళలకు లబ్ధి చేకూరుస్తున్నట్టు ఆయన చెప్పారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, కాంగ్రెస్ అంటేనే పేదల సంక్షేమాన్ని కోరే పార్టీ అని అన్నారు. మహిళలంటే చిన్నచూపు చూసిన కాలంలో ప్రధానమంత్రి ఇందిరాగాంధీ మహిళా సాధికారత కోసం ఎంతో సేవచేసినట్టు చెప్పారు. తెలంగాణ తల్లుల బాధ చూసి ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చి గౌరవించిన మహిళ సోనియమ్మ అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల పట్ల దుర్మార్గంగా వ్యవహరించిందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగ వీడియోలను తయారుచేసి బీఆర్ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని, మహిళలు వాటిని నమ్మవద్దని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, ఎమ్మెల్సీ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నక్సలైట్లు, టెర్రరిస్టులు ఒకటే..

- వారితో చర్చల ప్రసక్తే లేదు
- అప్పుల్లోనే తెలంగాణ రైజింగ్... త్వరలోనే డౌన్ ఫాల్ తథ్యం
- మీడియాతో బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఉగ్రవాదులు, మావోయిస్టులు ఒకటేనని, అందువల్ల టెర్రరిస్టులు లేదా మావోయిస్టులతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు స్పష్టంచేశారు. మావోయిస్టులు ఆయుధాలు విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో కలవాలని చెప్పినా వినకపోవడంతోనే కేంద్రం 'ఆపరేషన్ కగార్'ను చేపట్టిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నక్సలైట్లతో జరిపిన చర్చలు ఎందుకు విఫలం అయ్యాయో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నక్సలైట్లను చర్చలకు పిలిచి ఎన్‌కౌంటర్ చేసిందని, ఇప్పుడు కేంద్రం 'కగార్' నిర్వహిస్తుంటే అభ్యంతరం ఎందుకు చెబుతున్నారని నిలదీశారు. శనివారం బీజేపీ కార్యాలయంలో రాంచందర్‌రావు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. అవినీతి, లోటు బడ్జెట్, అప్పుల్లోనే తెలంగాణ రైజింగ్ అని, వీటన్నింటి ప్రభావంతో త్వరలోనే ఇక్కడి కాంగ్రెస్ సర్కార్ డౌన్ ఫాల్ తథ్యమని జోస్యం చెప్పారు.

హైడ్రోజన్ బాంబు తుస్సుమంది..

రాహుల్‌గాంధీ పేలుస్తానన్న హైడ్రోజన్ బాంబు తుస్సుమందని రాంచందర్‌రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్ ఓట్‌చోరీ ఆరోపణలతో ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నారని చెప్పారు. గతేడాది ఏపీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హైదరాబాద్‌లోని సగానికిపైగా మంది రెండు రాష్ట్రాల్లో ఓట్లేశారని చెప్పారు. అందువల్ల డూప్లికేట్ ఓట్ల తొలగింపు వంటి వాటిని సరళీకరించాల్సి ఉందని పేర్కొన్నారు. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఎవరన్న ప్రశ్నకు రాంచందర్‌రావు జవాబు నవ్వులు పూయించింది. 'అక్కడ టికెట్ కోసం 3,4 దరఖాస్తులు వచ్చాయి. అంతకంటే తమకు పద్మశ్రీ ఇప్పించాలంటూ అప్లికేషన్స్ ఇస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంది' అన్నారు.

రాష్ట్రంలో రాజకీయ శూన్యత...

రాష్ట్రంలో రాజకీయ శూన్యత ఏర్పడిందని, దానిని బీజేపీ అధికారంలోకి రావడం ద్వారా పూరిస్తామని ఒక ప్రశ్నకు రాంచందర్‌రావు బదులిచ్చారు. తమ వద్ద ఇందుకు అవసరమైన రోడ్ మ్యాప్ సిద్ధంగా ఉందన్నారు. మొత్తం కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై, అందులో ముడిపడిన అవినీతిపై, కాంట్రాక్టర్ల పాత్ర ఇలా అన్ని అంశాలపై సీబీఐతో విచారణ కోరాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఫోబియా పట్టుకుందని, అందుకే ఆయనను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారన్నారు. గత పదకొండేళ్లలో గ్రూప్-1 పరీక్షలు సరిగ్గా నిర్వహించలేని కారణంగా రాష్ట్రానికి ఎంతో నష్టం జరిగిందని రాంచందర్‌రావు చెప్పారు.

తెలంగాణలోని 9 పార్టీల రిజిస్ట్రేషన్ రద్దు

- ఆరేళ్లుగా ఎన్నికల్లో పోటీచేయని రిజిస్టర్డ్ పార్టీలపై ఈసీ చర్య
- దేశవ్యాప్తంగా 474 పార్టీలను జాబితా నుంచి తొలగింపు


సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు చెందిన 9 రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలను పార్టీల జాబితా నుంచి కేంద్ర ఎన్నికల సంఘం తొలగించింది. వాటిలో ఆల్ ఇండియా ఆజాద్ కాంగ్రెస్ పార్టీ, ఆల్ ఇండియా బీసీ ఓబీసీ పార్టీ, బీసీ భారతదేశం పార్టీ, భారత్ లేబర్ ప్రజాపార్టీ, లోక్‌సత్తా, మహాజన మండలి పార్టీ, నవభారత్ నేషనల్ పార్టీ, తెలంగాణ ప్రగతి సమితి, తెలంగాణ ఇండిపెండెంట్ పార్టీలున్నాయి. దేశ వ్యాప్తంగా 474 పార్టీలను జాబితా నుంచి తొలగించింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం వరుసగా 6 ఏళ్ల పాటు ఎన్నికల్లో పోటీచేయని గుర్తింపు లేని పార్టీలను రిజిస్టర్ నుంచి తొలగించాల్సి ఉంటుంది. 2019 నుంచి ఎన్నికల్లో పాల్గొనని రాజకీయ పార్టీలపై ఈసీ విచారణ జరిపింది. సంబంధిత రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులు (సీఈఓ) ఆయా పార్టీల ప్రతినిధులను పిలిపించి సంజాయిషీ కోరారు. ఆ తర్వాత ఆయా పార్టీలను రిజిస్టర్ నుంచి తొలగించారు. దీంతో వాటి రిజిస్ట్రేషన్ రద్దయ్యిందని ఎన్నికల సంఘం కార్యదర్శి అశ్వనీ కుమార్ మోహల్ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పీల్ చేసుకోవడానికి ఆ పార్టీలకు నెల రోజుల గడువు ఇచ్చారు. జాబితా నుంచి తొలగించిన పార్టీలకు ఇకపై విరాళాల సేకరణ, ఆదాయ పన్ను మినహాయింపు, ఉమ్మడి ఎన్నికల చిహ్నం, స్టార్ క్యాంపెయినర్ తదితర సదుపాయాలు లభించవు.

మరో 10 పార్టీలకు నోటీసులు

గత మూడు ఆర్థిక సంవత్సరాల ఆదాయ, వ్యయాలకు సంబంధించిన వార్షిక ఆడిట్ నివేదికలతో పాటు గతంలో పోటీ చేసిన ఎన్నికల్లో చేసిన వ్యయాలకు సంబంధించిన నివేదికలను గడువులోగా సమర్పించలేకపోయిన మరో 10 గుర్తింపు లేని రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. వచ్చే నెల 10లోగా వివరణ ఇవ్వాలని కోరింది. నోటీసులు అందుకున్న పార్టీల్లో బహుజన రాష్ట్రమ్ సమితి (హైదరాబాద్), ఇండియన్ రక్షక నాయకుడు పార్టీ (నారాయణపేట), జైమహాభారత్ పార్టీ (జోగుళాంబ గద్వాల్), జై స్వరాజ్ పార్టీ (రంగారెడ్డి), మజ్లిస్ మార్కజీ-ఏ-సియాసీ పార్టీ (హైదరాబాద్), నవప్రజారాజ్యం పార్టీ (ఆదిలాబాద్), న్యూ ఇండియా పార్టీ (పెద్దపల్లి), ప్రజా స్వరాజ్ పార్టీ (రంగారెడ్డి), శ్రమజీవి పార్టీ (మేడ్చల్-మల్కాజిగిరి), తెలంగాణ ఇంటి పార్టీ (నల్లగొండ) ఉన్నాయి.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



'బినామీ' పనులు!

ఒకవైపు విద్యుత్ శాఖలో రూ.లక్షల్లో వేతనాలు పొందుతూనే.. మరోవైపు కుటుంబ సభ్యులు, బంధువులతో బినామీ పనులు చేయిస్తున్నారు కొందరు. -10లో



ఏమేమి పువ్వొప్పనే.. గౌరమ్మ..

బతుకమ్మ సందడి మొదలైంది. తొమ్మిది రోజుల ఉత్సవాలకు నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. వాడవాడలా పూల గోపురాల హడావుడి మొదలైంది. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.0/22.0

నగరంలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వానజల్లు పడవచ్చు. గరిష్ఠంగా 32, కనిష్ఠంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.



ముందే మురిసిన బతుకమ్మ

కూకట్‌పల్లిలో బతుకమ్మ వేడుకలు ఒకరోజు ముందే మొదలయ్యాయి. శనివారం సాయంత్రం హనుమాన్ చౌరస్తా వద్ద ఆనందోత్సాహాలతో బతుకమ్మ ఆడారు. అలాగే.. కుత్బుల్లాపూర్ పరిధిలోని గాజులరామారం శ్రీ చిత్తారమ్మ దేవినగర్‌లోని 'ఎస్.పి.ఆర్ గ్లోబల్ స్కూల్ - సాక్షి' అధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉల్లాసంగా సందడి చేశారు.

- కూకట్‌పల్లి/సుభాష్ నగర్



సాలార్జంగ్ మ్యూజియంలో ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం



ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న వివేక్ అగర్వాల్

బహదూర్‌పురా: సాలార్జంగ్ మ్యూజియంలో ఆపరేషన్ పోలోపై శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫొటో ఎగ్జిబిషన్‌ను భారత మంత్రిత్వ శాఖ కార్యదర్శి వివేక్ అగర్వాల్ ప్రారంభించారు. 1948లో హైదరాబాద్‌ను భారత్ యూనియన్‌లో విలీనం చేసిన అరుదైన, చారిత్రక చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సాలార్జంగ్ మ్యూజియం డైరెక్టర్ ప్రియాంక మేరీ ఫ్రాన్సిస్, బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి ఫిరాసత్ అలీ బాక్రి తదితరులు పాల్గొన్నారు.

నల్లా అక్రమ కనెక్షన్లపై కొరడా

పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి సరఫరా చేస్తున్న మంచినీటి పైపులైన్ నుంచి అక్రమంగా నల్లా కనెక్షన్ పొందిన రెండు బహుళ అంతస్తుల భవన సముదాయాలకు చెందిన సుమారు 48 వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. రెండు రోజుల క్రితం జలమండలి విజిలెన్స్ అధికారులు పక్కా సమాచారంతో ఆకస్మికంగా దాడులు నిర్వహించి నల్లా అక్రమ కనెక్షన్లను గుర్తించారు. జలమండలి ఓఅండ్ఎం డివిజన్ -4, రెడ్‌హిల్స్ హైలెవెల్ సెక్షన్ పరిధిలోని బజార్ ఘాట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో అనుమతి లేకుండా అక్రమంగా 20 ఎంఎం నల్లా కనెక్షన్ పెట్టుకున్నట్లు విజిలెన్స్ అధికారుల తనిఖీలో బయటపడింది. దీంతో సంబంధిత ఫ్లాట్ యజమానులు 40 మందిపై నాంపల్లి పోలీస్ స్టేషన్లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఓఅండ్ఎం డివిజన్ -4, హిందీ నగర్ సెక్షన్ పరిధిలో అఘాపురాలోని అపార్ట్‌మెంట్‌లో రెండు 20ఎంఎం అక్రమ కనెక్షన్లను గుర్తించారు. ఆ భవనంలోని 8 మందిపై హబీబ్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. అనుమతులు లేకుండా నల్లా కనెక్షన్లు తీసుకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జలమండలి అధికారులు హెచ్చరించారు. ఎవరైనా నల్లా అక్రమ కనెక్షన్లు గుర్తించినా, డొమెస్టిక్ కనెక్షన్ తీసుకుని కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్నా.. 99899 98100కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

22 మంది చిన్నారులకు ఉచితంగా గుండె చికిత్సలు

యూకే వైద్య బృందం ఆపరేషన్లు విజయవంతం



ఆపరేషన్ జరిగిన చిన్నారులతో బీరప్ప తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: బ్రిటిష్ వైద్య బృందం సాయంతో ఈ నెల 15 నుంచి 19 వరకు నాలుగు రోజుల పాటు 22 మంది చిన్నారులకు ఉచితంగా గుండె సంబంధిత శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేశామని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తెలిపారు. శనివారం నిమ్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ శిబిరం పూర్తయిన తరువాత కూడా నిమ్స్‌లో గుండె సంబంధిత చికిత్సలు కొనసాగుతాయని పేర్కొన్నారు. యూకేకి చెందిన హీలింగ్ లిటిల్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ నాలుగేళ్లుగా డా.రమణ ఆధ్వర్యంలో పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ ప్రత్యేక శిబిరాల్లో మొత్తం 64 మంది చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్లు నిర్వహించామన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి శిబిరాలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం వైద్యుల బృందాన్ని సన్మానించారు. కార్యక్రమంలో బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, కార్డియాక్ సర్జన్లు రమణ, అమరేశ్వర రావు, వివిధ కార్పొరేట్ ఆసుపత్రులకు చెందిన వైద్యులు, వైద్య సిబ్బంది, చికిత్స పొందిన చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్సవాలు మెరిసేలా..

నగరంలో పండగ నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు

- పనుల్లో నిమగ్నమైన బల్దియా యంత్రాంగం
- 21 నుంచి 30 వరకు ప్రత్యేక కార్యక్రమాలు



మరిన్ని కార్యక్రమాలు..

జీహెచ్ఎంసీలోని ఆరు జోన్లలో ఉన్న అన్ని ముఖ్య కూడళ్లలోనూ ఐదు అడుగుల ఎత్తయిన బతుకమ్మలను ఉంచుతారు. 21వ తేదీన నగర శివార్లలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 22న శిల్పారామంలో బతుకమ్మ ఉత్సవాలు జరుపుతారు. 25 నుంచి 26వ తేదీ వరకు స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో బతుకమ్మపై ప్రత్యేక ఆర్ట్‌క్యాంప్ నిర్వహిస్తారు. 26వ తేదీన నెక్లెస్‌రోడ్‌లో సైకిల్‌ర్యాలీ. 27న నెక్లెస్ రోడ్, ట్యాంక్‌బండ్‌లపై మహిళల బైక్ ర్యాలీ.

సాక్షి, సిటీబ్యూరో

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండగను అత్యంత వైభవంగా, జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల దృష్టిని ఆకర్షించేలా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో అందుకనుగుణంగా తన వంతు పాత్ర పోషించేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. ఈ నెల 27న అంతర్జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శిల్పారామంలో బతుకమ్మ కార్నివాల్ నిర్వహించనున్నారు. ఈ నెల 21 నుంచి వివిధ శాఖల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు జరగనుండగా, 28 నుంచి 30 వరకు జరిగే ముఖ్య కార్యక్రమాలకు జీహెచ్ఎంసీ ఏర్పాట్లు చేస్తోంది.

28న.. 51 అడుగుల ఎత్తయిన బతుకమ్మ.. 10 వేల మందితో..

గతంలో ఓసారి గిన్నిస్ రికార్డుకు ప్రయత్నాలు జరిగినప్పటికీ, వర్షాల అంతరాయంతో సక్సెస్ కాలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆ ప్రయత్నం విఫలం కాగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తనవంతుగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో బతుకమ్మ ఉత్సవాన్ని పదిలం చేసేందుకు గాను ఎల్బీ స్టేడియంలో 51 అడుగుల ఎత్తయిన బతుకమ్మను పేర్చడంతో పాటు పదివేల మందికి పైగా మహిళలు బతుకమ్మ ఆడేలా ఏర్పాట్లు చేస్తోంది. అందుకుగాను జీహెచ్ఎంసీ నుంచి ఆరువేల మందిని సమీకరించాలనే లక్ష్యంతో పనులకు అధికారులు సిద్ధమయ్యారు. జీహెచ్ఎంసీలోని సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల నుంచి 5–7వేల మంది వరకు బస్సుల ద్వారా ఈ కార్యక్రమానికి సమీకరించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. జీహెచ్ఎంసీలోని 30 సర్కిళ్ల నుంచి వీరిని రప్పించేందుకు టార్గెట్లు విధిస్తున్నారు. వీరు బతుకమ్మను పేర్చే పనితో పాటు బతుకమ్మ ఆటలోనూ పాల్గొంటారు.ఇందుకు గాను యూసీడీ విభాగానికి చెందిన వివిధ స్థాయిల్లోని అధికారులు బాధ్యత వహించనున్నారు.

29న.. బతుకమ్మ పోటీలు..

జీహెచ్ఎంసీలోని 30 సర్కిళ్లలో, పీపుల్స్ ప్లాజాలో బతుకమ్మ పోటీలు నిర్వహించనున్నారు. సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ మహిళలు ఈ పోటీల్లో పాల్గొంటారు. విజేతలుగా ఎంపికయ్యే ముగ్గురికి 30వ తేదీన ట్యాంక్‌బండ్ వద్ద జరిగే కార్యక్రమంలో నగదు బహుమతులందజేస్తారు.

30న.. 2500 మంది మహిళలతో గ్రాండ్ ఫ్లోరల్ పరేడ్

అమరవీరుల స్థూపం నుంచి ట్యాంక్‌బండ్ వరకు 2500 మంది సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల మహిళలతో బతుకమ్మలతో గ్రాండ్ ఫ్లోరల్ పరేడ్ నిర్వహిస్తారు. పైనుంచి హెలికాప్టర్ నుంచి పూల వర్షం కురిసేలా కూడా ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నారు. బతుకమ్మ లైటింగ్ ఫ్లోట్స్, జపనీయుల ఇకెబానా ప్రదర్శన, సెక్రటేరియట్‌పై 3డీ మ్యాప్ లేజర్‌షో, తదితరమైనవి ఉంటాయి.

ఆడపడుచులకు చీరల పంపిణీ

హైదరాబాద్ జిల్లా పరిధిలోని 17,486 సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల్లోని 1,74,664 మందికి బతుకమ్మ చీరల పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. గ్రేటర్ పరిధిలోకి వచ్చే నాలుగు జిల్లాల పరిధిలో 4,92,646 చీరలు పంపిణీ చేయనున్నారు. ఎప్పుడు పంపిణీ చేస్తారో తేదీలు మాత్రం ఇంకా ఖరారు కాలేదు.

సర్వే చకచకా..

కేబీఆర్ పార్కు చుట్టూ 582 నివాసాలకు నోటీసులు

- ఆస్తులు కోల్పోతున్న వారికి అవగాహన కార్యక్రమాలు
- విరించి ఆస్పత్రి చౌరస్తా నుంచి అగ్రసేన్ చౌరస్తా వరకు 100 అడుగుల మేర రోడ్డు విస్తరణ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని విరించి ఆస్పత్రి చౌరస్తా నుంచి కమాన్ మీదుగా అగ్రసేన్ చౌరస్తా వరకు 100 అడుగుల మేర విస్తరించనున్న రోడ్డు పనుల సర్వే వేగవంతంగా సాగుతోంది. విరించి చౌరస్తా నుంచి అగ్రసేన్ చౌరస్తా వరకు ప్రస్తుతం కొన్ని చోట్ల 60 అడుగులు, మరికొన్ని చోట్ల 80 అడుగులు ఉండగా, రోడ్డుకు రెండువైపులా 100 అడుగుల మేర విస్తరించనున్నారు. ఇందుకోసం ఆస్తులు కోల్పోయే నివాసితులకు ఏడాది క్రితమే నోటీసులు జారీ చేశారు. ఆగస్టులో భూసేకరణ నోటిఫికేషన్ కూడా జారీ కాగా, ఒక్కో ఇంటికి ఎన్ని గజాలు కోల్పోతున్నారో వాటిని పక్కాగా కొలతలు చేసేందుకు జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్‌కు చెందిన మూడు బృందాలు రంగంలోకి దిగాయి. ముగ్గురు టౌన్‌ప్లానింగ్ ఏసీపీలు, సెక్షన్ ఆఫీసర్లు, చైన్‌మెన్లు బృందాలుగా ఏర్పడి ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ఒక్కో నివాసంలో నోటీసులో పేర్కొన్న విధంగా ఎన్ని గజాలు రోడ్డు విస్తరణలో సేకరిస్తున్నారో ఆ వివరాలను పక్కాగా నమోదు చేస్తూ మార్కింగ్ వేస్తున్నారు. ఇప్పటికే విరించి నుంచి అగ్రసేన్ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణలో ప్రాపర్టీలు కోల్పోతున్న స్టేక్ హోల్డర్స్‌కు జోనల్ కమిషనర్ సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ రోడ్డులో రెండు వైపులా విస్తరణకు 170 నివాసాలకు నోటీసులు ఇవ్వగా.. ఈ స్థలాలను సేకరించనున్నారు.

రోడ్డుకు ఒకవైపే ఆస్తుల సేకరణ..

బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్ల నిర్మాణ పనులకు ఆస్తుల సేకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12 అగ్రసేన్ చౌరస్తా నుంచి మాజీ మంత్రి జానారెడ్డి ఇంటి మీదుగా సినీనటుడు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి నివాసంతో పాటు జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–45 నటుడు బాలకృష్ణ ఇంటితో పాటు జూబ్లీహిల్స్ చెక్ పోస్టు, కేబీఆర్ పార్కు చౌరస్తా, బసవతారకం ఆస్పత్రి చుట్టూ ఆస్తులు కోల్పోయేవారికి ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. అగ్రసేన్ చౌరస్తా నుంచి కేబీఆర్ పార్కు చుట్టూ రోడ్డుకు ఒకవైపే ఆస్తులను సేకరించనున్నారు. కేబీఆర్ పార్కు చుట్టూ 120 అడుగుల మేర రోడ్డును విస్తరించి అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటికే చుట్టూ నివాసితులకు నోటీసులు జారీ చేశారు. గత నెల భూసేకరణ నోటిఫికేషన్ కూడా జారీ అయ్యింది. ముగ్ధ జంక్షన్‌లో మాత్రం 150 అడుగుల మేర రోడ్డును విస్తరించనున్నారు.



బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లో రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోతున్న వారి ఇళ్లను సర్వే చేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

బాలకృష్ణ ఇంట్లో 387 గజాల సేకరణ..

కేబీఆర్ పార్కు చుట్టూ నిర్మించతలపెట్టిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల కోసం 120 అడుగుల మేర రోడ్డును విస్తరించనుండగా, జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–47లోని సినీనటుడు బాలకృష్ణకు ఇప్పటికే రోడ్డు స్థలంలో ఎంత స్థలం కోల్పోతున్నారో నోటీసులు జారీ చేయడమే కాకుండా భూసేకరణ చట్టం ప్రకారం నోటిఫికేషన్‌లో 387 గజాలు సేకరిస్తున్నట్లుగా పేర్కొన్నారు. అలాగే మాజీ మంత్రి జానారెడ్డి ఇంట్లో 410 గజాల స్థలం సేకరిస్తున్నారు. అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి నుంచి 204 గజాల స్థలాన్ని సేకరిస్తున్నారు.

– ఇలా అగ్రసేన్ చౌరస్తా నుంచి కేబీఆర్ పార్కు చుట్టూ రోడ్డుకు ఒకవైపునే ఒక్కో ప్రాపర్టీ నుంచి 200 నుంచి 450 గజాల స్థలం వరకు భూసేకరణలో తీసుకుంటున్నారు. వీరందరికీ సోమవారం స్టేక్‌హోల్డర్స్ సమావేశం నిర్వహించి ఎవరెవరు ఎంత స్థలం కోల్పోతున్నారో అవగాహన కలిగించనున్నారు. భూసేకరణలో భాగంగా ప్రభుత్వం ఇచ్చే పరిహారం కావాలా..? టీడీఆర్ కావాలా..? దేనికి అంగీకరిస్తారో తెలుసుకోనున్నారు. దేనికి అంగీకరించని వారి పరిహార సొమ్మును కోర్టులో జమ చేసి స్థలాలను సేకరించనున్నారు. ప్రస్తుతం సర్వే ముమ్మరంగా సాగుతుండగా మరో రెండు వారాల్లో పూర్తి చేసి నివాసాలు కోల్పోతున్న వారికి పరిహారం లేదా టీడీఆర్ ఇవ్వనున్నారు. ఈ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది.



గండిపేట టు బాపూ ఘాట్ నయా సిటీ

డిసెంబర్‌లో మూసీ పునరుజ్జీవం పనులకు శ్రీకారం

సాక్షి, సిటీబ్యూరో: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్ట్ మూసీ పునరుజ్జీవంలో భాగంగా గండిపేట నుంచి బాపూ ఘాట్ వరకూ సరికొత్త నగరాన్ని అభివృద్ధి చేయనున్నారు. తొలి దశలో జంట జలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూ ఘాట్ వరకూ మూసీ నది సుందరీకరణకు సీఎం నిర్ణయించిన సంగతి తెలిసిందే. సరికొత్త నగరం సమగ్ర మాస్టర్ ప్లాన్ తుది దశకు చేరుకుంది. అభివృద్ధి పనులను డిసెంబర్‌లో ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

మూసీలో బోటింగ్..

మూసీ నదీ గర్భం 100 మీటర్లుగా, నదికి ఇరువైపులా 50 మీటర్ల వరకూ బఫర్ జోన్‌గా నిర్ణయించారు. నదికి ఇరువైపులా రిటైనింగ్ వాల్‌ను నిర్మించి, నదిలో 24/7 నీళ్ల ప్రవహించేలా ఏర్పాట్లు చేస్తారు. గండిపేట నుంచి మూసీ నదికి నీటిని మళ్లిస్తారు. నదిలో బోటింగ్, ఇతరత్రా సౌకర్యాలను కల్పిస్తారు. బఫర్ జోన్‌లో తాత్కాలిక నిర్మాణాలను చేపడతారు. రహదారులు, పార్కులు, వాకింగ్ ట్రాక్స్, ఇతరత్రా వసతులను కల్పిస్తారు. నైట్ ఎకానమీతో ప్రభుత్వానికి అదనపు ఆదాయంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని సీఎం రేవంత్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గండిపేట నుంచి బాపూ ఘాట్‌కు అభివృద్ధి చేయనున్న ఈ కొత్త నగరంలో 24/7 వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు అనుమతి ఇస్తారు.

గాంధీ సరోవర్..

- మూసీ నది పునరుజ్జీవం ప్రాజెక్ట్‌లో భాగంగా బాపూ ఘాట్‌లో ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మూసీ, ఈసా నదుల సంగమం గాంధీ సరోవర్ వద్ద గాంధీ విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం పాట్నాలోని గాంధీ మైదానంలో 72 అడుగులు (22 మీటర్లు) కాంస్య విగ్రహం దేశంలోనే ఎత్తయినది. దీనికంటే ఎత్తయిన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించారు.
- ప్రస్తుతం బాపూ ఘాట్‌లో ధ్యాన భంగిమలో ఉన్న 22 అడుగుల ఎత్తయిన గాంధీ విగ్రహం ఉంది. దీన్ని 1999లో ఏర్పాటు చేశారు. శాంతి, ఐక్యత, విద్యకు చిహ్నంగా నిలిచేలా బాపూ ఘాట్‌ను తీర్చిదిద్దనున్నారు. ఈ ఘాట్‌ను అభ్యాస ప్రదేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఇక్కడ గాంధీ ఆశ్రమాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ కేంద్రం విద్యపై దృష్టి సారిస్తుంది. గాంధీ బోధనలను నుంచి ప్రేరణ పొందిన నీతి, కమ్యూనికేషన్, విలువలపై కోర్సులను అందిస్తారు.

సీఎం చేతులు మీదుగా ప్రారంభం కానున్న ఎస్టీపీలు

ప్రాంతం	సామర్థ్యం (ఎమ్మెల్డీ)	నిర్మాణ వ్యయం (రూ.కోట్లలో)
అంబర్‌పేట–1	212.5	319.43
అత్తాపూర్–1	64	109.24
పాలపిట్ట	7	18.97
మెన్నెలగడ్డ	13	13
శివాలయ నగర్	14	34.13
ముల్లకత్వా	25	44.46

సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన కానున్న అమృత్ 2.0 ఎస్టీపీలు

ప్యాకేజీ	ఎస్టీపీలు	సామర్థ్యం	నిర్మాణ వ్యయం (రూ.కోట్లలో)
ప్యాకేజీ–1	16	493.50	1878.55
ప్యాకేజీ–2	22	471.5	1906.44
పటాన్‌చెరు	1	7	64.11



మురుగుశుద్ధి కేంద్రం

అందుబాటులోకి మరో ఆరు ఎస్టీపీలు

ఇప్పటికే 37 ఎస్టీపీలతో మురుగు శుద్ధి

- మరో 39 అమృత్ ఎస్టీపీలకు శంకుస్థాపన
- ఈ నెల 26న సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేసిన జలమండలి

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంలో వంద శాతం మురుగు శుద్ధిలో భాగంగా మరో ఆరు మురుగు శుద్ధి కేంద్రాలు అందులో బాటులోకి రానున్నాయి. మరోవైపు రాబోయే పదేళ్ల వరకు ఉత్పత్తయ్యే మురుగును సైతం శుద్ధి చేసేందుకు ముందస్తు ప్రణాళికలో భాగంగా అమృత్ 2.0 పథకం కింద మరో 39 ఎస్టీపీల నిర్మాణాలకు రంగం సిద్ధమైంది. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 26న అంబర్‌పేట వద్ద నిర్మాణాలు ఎస్టీపీల ప్రారంభోత్సవాలు, కొత్త ఎస్టీపీలకు శంకుస్థాపనలు చేసేందుకు జలమండలి ఏర్పాట్లు పూర్తి చేసింది. మూడేళ్ల క్రితం గత బీఆర్ఎస్ ప్రభుత్వం వంద శాతం మురుగు శుద్ధి లక్ష్యంతో సుమారు రూ.3,866.21 కోట్ల వ్యయంతో 3 ప్యాకేజీల్లో 5 సర్కిళ్లలో కొత్తగా 31 ఎస్టీపీల నిర్మాణాలకు సిద్ధం కాగా.. స్థలాల సేకరణ, ఇతరత్రా కారణాలతో వాటి సంఖ్యను ఇరవై ఎస్టీపీలకు కుదించి.. సామర్థ్యం తగ్గకుండా పనులు పూర్తి చేసింది. అందులో ఇప్పటికే 12 ఎస్టీపీలు నిర్మాణాలు పూర్తి చేసుకొని మురుగు నీటిని శుద్ధి చేస్తుండగా, తాజాగా మిగిలిన ఎనిమిదింటిలో ఆరు ఎస్టీపీలు నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. మరో రెండు ఎస్టీపీల నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయి.

నిత్యం 1950 ఎమ్మెల్డీలు

ప్రస్తుతం హైదరాబాద్ అర్బన్ ఆగ్లోమెరేషన్ పరిధిలో రోజువారీగా 1950 మిలియన్ లీటర్ గ్యాలన్ల (ఎమ్మెల్డీ) మురుగు నీరు ఉత్పన్నమవుతోంది. ఇందులో జీహెచ్ఎంసీ పరిధిలో 1,650 ఎమ్మెల్డీ ఉంటుంది. ఇప్పటికే 37 ఎస్టీపీల ద్వారా 1,444 ఎమ్మెల్డీ మురుగు నీటిని శుద్ధి చేస్తున్నారు. మరో 332–5 ఎమ్మెల్డీ సామర్థ్యం గల ఆరు ఎస్టీపీలు నిర్మాణ పనులు చేసుకున్నాయి. మరో రెండు పూర్తయితే దాదాపు 1878 ఎమ్మెల్డీల మురుగు శుద్ధి చేయవచ్చు. కేవలం మిగిలిన 72 ఎమ్మెల్డీల మురుగును శుద్ధ్ చేస్తే వంద శాతానికి చేరుకుంటోంది.

రూ.3849.10 కోట్ల వ్యయంతో 39 ఎస్టీపీలు

కేంద్ర ప్రభుత్వ అమృత్ 2.0 పథకం కింద మంజూరైన 39 ఎస్టీపీలను హ్యామ్ మోడ్‌లో నిర్మించనున్నారు. మొత్తం ఎస్టీపీల్లో ఒకటి పీపీపీ మోడ్‌లో.. మిగిలిన 38 హైబ్రిడ్ అన్యూయిటీ మోడల్ (హ్యామ్)విధానంలో నిర్మించనున్నారు. సుమారు రూ.3849.10 అంచనా వ్యయంతో నిర్మించే ఎస్టీపీలతో సుమారు 972 ఎమ్మెల్డీల మురుగును శుద్ధి చేయవచ్చు. వాటి నిర్మాణ పనులు రెండు ప్యాకేజీల్లో పూర్తి చేయనున్నారు. నిర్మాణ సంస్థ ఎస్టీపీలను నిర్మించి 15 ఏళ్లపాటు నిర్వహణకు చేపట్టనుంది రాబోవు పదేళ్లలో మురుగు ఉత్పత్తి 2,815 ఎమ్మెల్డీ కావచ్చని జలమండలి అంచనా వేస్తోంది. అమృత్ 2.0 కింద 39 ఎస్టీపీలు పూర్తయితే 2,850 ఎమ్మెల్డీలను శుద్ధి చేసే అవకాశం ఉంటుందని జలమండలి భావిస్తోంది.

అనుమానం పెనుభూతమై..

- భార్యను కడతేర్చిన భర్త
- కత్తితో గొంతు కోసి పరారీ
- నిందితుడి కోసం గాలింపు..


మంజుల (ఫైల్)


హత్య చేసి పారిపోతున్న శంకర్

కుషాయిగూడ: భార్యపై అనుమానం పెంచుకున్న ఓ వ్యక్తి నిద్రిస్తున్న ఆమెను కత్తితో గొంతు కోసి హత్య చేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని అణుపురంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. యాదాద్రి జిల్లా, అడ్డగూడురు గ్రామానికి చెందిన బోడ శంకర్‌కు అదే మండలం గోవిందపురం గ్రామానికి చెందిన మంజులతో 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. శంకర్ పెళ్లికి ముందు నుంచే ముంబైలోని అక్క ఇంట్లో ఉంటూ ప్లంబర్‌గా పనిచేసేవాడు. వివాహం అనంతరం భార్య మంజులను ముంబై తీసుకెళ్లి అక్కడే కాపురం పెట్టాడు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొన్నాళ్లుగా భార్య ప్రవర్తనపై శంకర్ అనుమానం పెంచుకోవడంతో వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శంకర్ తరచూ భార్యను శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నాడు. అతడి వేధింపులు తాళలేక మంజుల ఈ నెల 14న ముంబై నుంచి ఏఎస్‌రావునగర్, అణుపురం కాలనీలో ఉంటున్న అక్క రాణి ఇంటికి వచ్చింది. దీంతో శంకర్ కూడా తన చిన్న కొడుకును వెంట తీసుకొని ఈ నెల 18న హైదరాబాద్‌కు వచ్చి భార్యను కలిశాడు. శుక్రవారం రాత్రి మంజులకు వరుసకు సోదరుడైన తోటకూర నగేష్ ఇంట్లో పంచాయతీ చేసిన పెద్దలు ఇద్దరికీ సర్దిచెప్పారు. అనంతరం అందరూ కలిసి రాణి ఇంటికి తిరిగి వెళ్లారు. అందరూ నిద్రిస్తుండగా శంకర్ తన పక్కనే పడుకున్న మంజులపై దాడి చేసి కత్తితో గొంతు కోశాడు. మంజుల కేకలు విని కుటుంబ సభ్యులు మేల్కొనడంతో అతను అక్కడి నుంచి పరారయ్యాడు. దీనిపై సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలను సేకరించారు. మృతురాలి సోదరుడు భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా హత్య అనంతరం నిందితుడు ఇంటి నుంచి పారిపోతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. పరారీలో ఉన్న నిందితుడు శంకర్ కోసం గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

‘బినామీ’ పనులు!

- డిస్కం పనుల్లో ఇంజినీర్ల బంధుగణం
- ఆన్‌లైన్ టెండర్లే కాదు ప్రైవేటు వర్కులు వారికే
- ఒక్కో సెక్షన్‌కు ఇద్దరు ముగ్గురు బినామీ కాంట్రాక్టర్లు
- ఏసీబీ దాడులు..సీఎంఓ ఆరాతో ఉక్కిరిబిక్కిరి..

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ‘నానక్‌రాంగూడలోని ఓ కాన్సులేట్ కార్యాలయం విద్యుత్ కనెక్షన్ కోసం ఆరేళ్ల క్రితం కేటగిరి–2 కింద డిస్కంకు దరఖాస్తు చేసుకుంది. ఖరీదైన ఈ పనులను ఎలాగైనా తమ ఖాతాలో వేసుకోవాలని అప్పటి ఇంజనీర్లు భావించారు. ప్రాజెక్ట్స్ విభాగం చేపట్టాల్సిన పనులను నిబంధనలకు విరుద్ధంగా నాటి ఆపరేషన్స్ విభాగం చేజిక్కించుకుంది. అధికారులు ఎక్కడా తెరపై కనిపించకుండా తమ బినామీ కాంట్రాక్టర్‌ను రంగంలోకి దింపారు. నానాక్‌రాంగూడ 33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి 26 కిలో మీటర్లు, గచ్చిబౌలి 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి 12.09 కిలోమీటర్లు యూజీ కేబుల్ వేయాలని నిర్ణయించి..ఆ మేరకు లైన్ ఫీజుబులిటీ, లోడు ను సాకుగా చూపించి అంచనాలను అమాంతం పెంచేశారు. యూజీ కేబుల్స్ కోసం డిగ్గింగ్ వర్క్స్ చేయకుండానే చేసినట్లు రికార్డులు చూపి ంచారు. పనులు చేసేది, పర్యవేక్షించేది అధికారులే కావడంతో ఎవరికీ అనుమానం రాకుండా అదే మార్గంలో ఓ ప్రైవేటు డేటా సెంటర్ కోసం తవ్విన ట్రెంచ్(లైన్) నుంచే సదరు కాన్సులేట్‌కు కేబుళ్లను వేశారు. అప్పట్లో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. డీటీఆర్ చార్జింగ్ ప్రక్రి య కూడా మూడేళ్ల క్రితమే పూర్తైంది. ఇలా మిగిల్చిన దాంటో ‘తిలా పాపం త లా పిడికెడు’ అన్నచందంగా క్షేత్రస్థాయిలోని నాటి డీఈ మొదలు.. ఓ రిటైర్డ్ డైరెక్టర్ స్థాయి అధికారి వరకు భారీగా లబ్ధి పొందినట్లు ఆరోపణలున్నా యి. తీరా కొత్తగా వచ్చిన ఏడీఈ ఈ పనులపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సెక్యూరిటీ డిపాజిట్ రూ.31.61 లక్షలు తిరిగి చెల్లించా లంటే...వేసినట్లు చెబుతున్న భూగర్భలైన్‌ను తవ్వి చూపించాల్సిందేనంటూ పట్టుబట్టారు. తవ్వితే అడుగు లోతులోనే దాగి ఉన్న అధికారుల అక్రమాలు ఎక్కడ బయటపడతాయో? అనే భయంతో సద రు బినామీ కాంట్రాక్టర్ ఆ సెక్యూరిటీ డిపాజిట్ జోలికి కూడా రాక పోవడమే ఇందుకు నిదర్శనం.

రూ.లక్షల్లో వేతనాలు..అయినా అడ్డదారులు

గ్రేటర్ జిల్లాల పరిధిలో మూడు జోన్లు, తొమ్మిది సర్కిళ్లు, 26 డివిజన్లు, 65 ఆపరేషన్స్ సబ్ డివిజన్లు, 213 ఆపరేషన్ సెక్షన్లు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పని చేసే ఆర్టిజన్ కార్మికులు వేతనాలు రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు ఉండగా, రెగ్యులర్ జూనియర్ లైన్ మెన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్ల వేతనాలు సీనియార్టీని బట్టి రూ.లక్ష వరకు ఉన్నాయి. అసిస్టెంట్ ఇంజినీర్ల(ఏఈ) వేతనాలు రూ.లక్ష నుంచి రూ.1.5లక్షల వరకు ఉండగా, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు(ఏడీఈ), డివిజనల్ ఇంజినీర్ల(డీఈ) వేతనాలు రూ.3.5 లక్షల నుంచి రూ.4.5 లక్షల వరకు ఉంటాయి. అదే సూపరింటెండింగ్ ఇంజనీర్లు(ఎస్ఈలు), చీఫ్ ఇంజనీర్ల(సీఈ)ల వేతనం రూ.రూ.7 లక్షలకుపైగా ఉంటోంది. ఒక వైపు వీరంతా ప్రభుత్వ సంస్థ నుంచి రూ.లక్షల్లో వేతనాలు పొందుతూనే.. మరో వైపు గుట్టుగా ప్రైవేటు పనులు చేయిస్తూ రెండు చేతులూ సంపాదిస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులతో బినామీ పనులు చేయిస్తున్నారు. తొలుత నామినేటెడ్ పద్ధతిలో చిన్న చిన్న పనులు కేటాయించి, ఆ తర్వాత తమ అధికారాన్ని అడ్డుపెట్టుకుని భారీ మొత్తంలో పనులను దక్కించుకుంటున్నారు. విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న హైరేజ్ బిల్డింగ్స్, మల్టీ స్టోరేజ్ భవనాలు, పరిశ్రమల యజమానులకు లైన్ ఫీజుబులిటీ, లోడును సాకుగా చూపించి..తక్కువ మొత్తానికి అయ్యే పనులకు ఎక్కువ మొత్తంలో అంచనాలు రూపొందిస్తున్నారు. ఆ తర్వాత తమ బినామీలకు ఆయా దరఖాస్తుదారుల ఫోన్ నంబర్లు, అడ్రస్‌లు ఇచ్చి..రీ ఎస్టిమేషన్ల పేరుతో మళ్లీ అదే పనికి చాలా తక్కువ ఎస్టిమేషన్ వేస్తున్నారు. ఆయా భవనాలు/పరిశ్రమ యజమానులు కూడా వీరికి తలొగ్గక తప్పని పరిస్థితి తలెత్తుతోంది. ఇలా ఆపరేషన్స్ విభాగంలోని ఏఈ, డీఈలే కాదు ఆపరేషన్ విభాగంలో పని చేస్తున్న సాధారణ ఆర్టిజన్ సైతం కోట్లకు పడగెత్తారంటే ఆశ్చర్యపోనవసరం లేదు. ఇలా అడ్డగోలుగా సంపాదనకు అలవాటు పడిన ఇంజినీర్లు..ఆ తర్వాత ఫోకల్ పోస్టులకు భారీగా ఖర్చు చేస్తున్నారు. పోస్టుల కోసం పెట్టిన పెట్టుబడిని తిరిగి సంపాదించేందుకు మళ్లీ అడ్డదారులు తొక్కుతున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన ఇంజినీర్లపై ఏసీబీ దాడులు చేస్తుండటం, సీ ఎంఓ ఆరా తీస్తుండటంతో ఆయా అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.



బినామీ కాంట్రాక్టర్లు చేపట్టిన పనులకే ఎల్సీలు:

అంచనాల రూపకల్పన, ఆన్‌లైన్ టెండర్లు దాఖలు, పనుల కేటాయింపు, ఆ తర్వాత పనుల పర్యవేక్షణ సహా మీటర్ల మంజూరు, డీటీఆర్ చార్జింగ్ ఇలా అన్ని తామే చూసుకుంటామని హామీ ఇస్తుండటంతో ఆయా భవన/ పారి శ్రామిక యజమానులు వీరికి పనులు కట్టబెడుతున్నారు. ఏఈ పరిధిలో సెక్షన్ కాంట్రాక్టర్లు, డీఈ పరిధిలో 33 కేవీ కాంట్రాక్టర్లు పని చేస్తుంటారు. ఆన్‌లైన్ టెండర్ ద్వారా చేపట్టాల్సిన డిపార్ట్‌మెంట్ పనులను సైతం ఎమర్జెన్సీ వర్కుల పేరుతో బినామీలతో చేయిస్తున్నారు. రెండేళ్ల క్రితం వరకు లైసెన్సులు లేని వ్యక్తులు కూడా పనులు చేసుకునే వారు. వీరంతా తమకున్న అనుభవం, అర్హతను బట్టి పనులు చేసేవారు. ఇటీవల ప్రభుత్వం పలు మార్పులు చేసింది. విద్యుత్ పనులు చేయాలంటే ఎలక్ట్రిల్ లైసెన్సింగ్ బోర్డు గుర్తింపు పొందిన వ్యక్తితో మాత్రమే పనులు చేయించాలనే నిబంధన విధించింది. ప్రతి కాంట్రాక్టర్ ఆన్‌లైన్ వెండర్ రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలి. ఇలా డిస్కం పరిధిలో మూడు వేలకుపైగా ప్రైవేట్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు ఉండగా, కేవలం కొద్ది మందికి మాత్రమే పనులు దక్కుతున్నాయి. ఆన్‌లైన్‌లో తక్కువకు కోట్ చేసినా వారికి పనులు ఇవ్వకుండా వివిధ రకాల సాంకేతిక అంశాలను కారణంగా చూపించి, ఆ తర్వాత అవే పనులను తమ బినామీలకు కట్టబెడుతున్నారు. ఇలా ఒక్కో సెక్షన్‌కు ఇద్దరు బినామీ కాంట్రాక్టర్లు ఉన్నట్లు తెలిసింది. బినామీ కాంట్రాక్టర్లకు ఎల్సీలు ఇస్తూ..ఇతరులు చేసిన పనులకు ఇవ్వడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. సకాలంలో డీటీఆర్ ఛార్జింగ్ చేయించకపోవడంతో బిల్డర్లు తమతో ఒప్పందాలు రద్దు చేసుకుంటున్నారు. ఫలితంగా ఏళ్లుగా చిన్న చిన్న పనులు చేసుకుని బతికిన వాళ్లు..ప్రస్తుతం ఈ అధికారిక బినామీలతో పోటీ పడలేకపోతున్నారు.

ట్రేడింగ్ ఫ్రాడ్ కేసులో నిందితుడి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: ట్రేడింగ్‌లో పెట్టుబడులతో అధిక లాభాలు ఆర్జించవచ్చని ఆశ చూపించి, అమాయకులను మోసం చేస్తున్న పంజాబ్‌కు చెందిన గుర్దిత్ సింగ్‌ను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన 64 ఏళ్ల వృద్ధుడికి ఈ ఏడాది ఏప్రిల్‌లో వాట్సాప్‌లో గుర్తు తెలియని వ్యక్తి నుంచి సందేశం వచ్చింది. ఇనిస్టిట్యూషనల్ స్టాక్స్, ఓటీసీ ట్రేడింగ్ పెట్టుబడులతో అధిక రాబడిని అందుకోవచ్చని, ఓటీసీ ట్రేడింగ్‌లో 2–20 శాతం వరకు, ఇనిస్టిట్యూషనల్ స్టాక్స్‌లో 10–80 శాతం వరకు లాభాలు ఆర్జించవచ్చని మెసేజ్‌లోని సారాంశం. దీంతో ఆశ పడిన బాధితుడు సైబర్ కేటుగాళ్లు సూచించిన ఎస్ఎంసీఎస్ యాప్‌లో సొమ్మును డిపాజిట్ చేశాడు. తొలుత బాధితుడిని నమ్మించేందుకు చిన్న మొత్తంలో పెట్టుబడులపై లాభాలను చూపారు. అత్యాశకు పోయిన అతను పలు దఫాలుగా రూ.86.65 లక్షలు డిపాజిట్ చేశారు. లాభాలు కాదు కదా పెట్టిన సొమ్ము ఉపసంహరిచుకునేందుకు ప్రయత్నించగా.. యాప్ పనిచేయలేదు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బ్యాంక్ లావాదేవీలు, సాంకేతిక ఆధారాలతో నిందితుడు గుర్దిత్ సింగ్‌ను అరెస్టు చేశారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు



సికింద్రాబాద్: గంజాయి రవాణా చేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసిన సికింద్రాబాద్ రైల్వే పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి 37.5 కిలోగ గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ డీఎస్‌పీ ఎస్ఎన్ జావెద్, ఇన్‌స్పెక్టర్ బీ.సాయీశ్వర్‌గౌడ్ కథనం ప్రకారం... ఒడిశా రాష్ట్రం, గంజాం జిల్లాకు చెందిన ఆలు సిబా బైక్‌మెకానిక్‌గా పని చేసేవాడు. అతడికి అదే ప్రాంతానికి చెందిన బిక్రమ్ అనే గంజాయి వ్యాపారితో పరిచయం ఏర్పడింది. గంజాయి రవాణాకు రూ.10 వేలు చెల్లించేలా అతడితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. గతంలో పలుమార్లు గంజాయి సరఫరా చేసిన ఆలు సిబా ఈనెల 19న గంజాయి ప్యాకెట్లను తీసుకుని విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలు దేరాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు తన వెంట బంధువులకు చెందిన ఒక బాలుడిని కూడా తీసుకువచ్చాడు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ చేరుకున్న ఆలు సిబా తను గంజాయి అప్పగించాల్సిన మహారాష్ట్రకు చెందిన ఆము అనే వ్యక్తి రాకకోసం వెయిటింగ్ హాల్‌లో ఎదురుచూస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

భారీగా మద్యం పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్ అధికారులు వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 585 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.వీటి విలువ రూ,21.80 లక్షల వరకు ఉంటుందని అంచనా. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డెరైక్టర్ షానవాజ్ ఖాసీం, రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్, అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్ అదేశాల మేరకు దాడులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ధూల్‌పేట్‌లో హైదరాబాద్ సీఐ శిరీష, ధూల్‌పేట్ సీఐ గోపాల్ సిబ్బందితో కలిసి ఓ ఇంట్లో 72 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ సీఐ సౌజన్య సిబ్బందితో కలిసి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో 47 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ ఎస్సై చంద్రకాంత్ ఆధ్వర్యంలో పిస్తా హౌజ్ ప్రాంతంలో 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

రైలు కిందపడి రాజస్థాన్ వాసి ఆత్మహత్య


రాజేంద్రసింగ్ మృతదేహం

సికింద్రాబాద్: రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మౌలాలి రైల్వేస్టేషన్ యార్డులో గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతుడు రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా గుర్తించారు. ఘటనా స్థలంలో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా మృతుడు రాజస్థాన్ రాష్ట్రం , పాలి జిల్లా, డియోటికలాన్‌కు చెందిన రాజేంద ర్‌సింగ్ (55)గా గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి బంధువులకు సమాచారం అందించేందుకు చర్యలు చేపట్టారు.

ప్రాణం తీసిన వేగం

కారు ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం


అబ్దుల్ నజీర్ ఫహద్(ఫైల్)


అబ్దుల్ అహదుద్దీన్ (ఫైల్)

గచ్చిబౌలి: అతి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన శనివారం రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకన్న కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. టోలీచౌకికి చెందిన మహ్మద్ నజీర్ ఫహద్(22) తన స్నేహితుడు మహ్మద్ అబ్దుల్ అహదుద్దీన్ ఖాన్(25)తో కలిసి స్కూటీపై శనివారం తెల్లవారుజామున గచ్చిబౌలి వైపు వెళుతుండగా రాయదుర్గంలోని హనుమాన్ టెంపుల్ సమీపంలో వెనక నుంచి అతి వేగంగా వచ్చిన టయోటా కరోలా అల్టీస్ కారు వారిని ఢీ కొట్టింది. దీంతో స్కూటీపై ఉన్న ఇద్దరూ గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడ్డారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో నజీర్ ఫహద్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అబ్దుల్ అహదుద్దీన్ ఖాన్‌ను సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఇద్దరి మృతదేహాలకు ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కార్తీక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

115 ఫార్మసీలకు షోకాజ్ నోటీసులు

సాక్షి, సిటీబ్యూరో: కార్పొరేట్ ఆసుపత్రుల్లో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న 115 ఫార్మసీలకు షోకాజు నోటీసులు జారీ చేసినట్లు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ షానవాజ్ ఖాసిం తెలిపారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాష్ట్రంలో వివిధ కార్పొరేట్ ఆసుపత్రులు, వాటి అనుబంధంగా ఫార్మసీలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అనేక కార్యకలాపాలను గుర్తించామని తెలిపారు. ప్రధానంగా గడువు ముగిసిన మందులను నిల్వ చేయడం, డ్రగ్ రిజిస్టర్ల నిర్వహణ లోపాలు, నిబంధనల ప్రకారం సిఫార్సు చేసిన థర్మోలేబుల్ ఔషధాలను నిల్వ చేయడంలో వైఫల్యాలను, ఫార్మసీల్లో నిల్వ చేసిన మందులు, కొనుగోలు, అమ్మకం బిల్లుల నిర్వహణలో అవకతవకలు జరిగినట్లు గుర్తించామన్నారు. రిజిస్టర్డ్ ఫార్మాసిస్టు లేనపుడు మందులు సరఫరా చేయడం, మందుల అమ్మకం బిల్లులు, ప్రిస్క్రిప్షన్, వైద్యుల నమూనాలను నిల్వ చేయడం, తదితర అంశాలు వెలుగులోకి వచ్చాయన్నారు. దీంతో నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు అందించినట్లు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా, కొండాపూర్ మండలం, మల్లేపల్లి గ్రామంలో అనధికారికంగా నిల్వ చేసిన మందులను సీజ్ చేసినట్లు ఆయన వివరించారు.

రూ.25 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు ధ్వంసం

రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో స్వాధీనం చేసుకున్న నిషేధిత వస్తువులను శనివారం ధ్వంసం చేశారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో స్వాధీనం చేసుకున్న రూ.25 కోట్ల విలువైన 1,858 కేజీల మాదక ద్రవ్యాలను రంగారెడ్డి జిల్లా, నందిగామ మండలం, ఎదులపల్లెలోని జీజే మల్టిక్లేవ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌లో శనివారం ధ్వంసం చేశారు. సైబరాబాద్ కమిషనరేట్ కమిషనర్ అవినాష్‌మహంతి ఆదేశాలపై డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, డీసీపీ క్రైమ్స్ ఏ ముత్యంరెడ్డి పర్యవేక్షణలో వాటిని ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన వాటిలో 1783.739 కిలోల గంజాయి, 11 గంజాయి మొక్కలు, 37.300 కిలోల గంజాయి చాక్లెట్లు, 17.451 కిలోల హష్ ఆయిల్, 2163 గ్రాముల హెరాయిన్, 467.25 గ్రాముల ఎండీఎంఏ, 995 గ్రాముల అల్ప్రాజోలమ్, 476.9 గ్రాముల కొకైన్, 6.545 కిలోల మెఫెడ్రోన్, 193. గ్రాముల చరస్, 1761 ఏసీబీ పేపర్స్, 12 టాబ్లెట్ల నిట్రావెట్–10, 3.962 కేజీల ఓపియమ్, 5 ఎల్ఎస్‌డీ బ్లాట్స్, 36 గ్రాముల కెటామైన్,45 గ్రాముల మెథఫెటమైన్, 685 ఎంఎల్ లిక్విడ్ మెథఫెటామైన్, 128 ఫెంటాయాలమ్స్, నైట్రాజెపమ్ 34.70 గ్రాముల ట్యాబ్లెట్లు–76 ఉన్నాయి.

జల్సాల కోసం చోరీల బాట

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- రూ. 18 లక్షల సొత్తు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్


శంషాబాద్: ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు బాల్యస్నేహితులు నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో చిన్నాచితకా ఉద్యోగాలు చేస్తున్నారు. తమ సరదాలు తీర్చుకునేందుకు చోరీల బాట పట్టిన వారు పోలీసులకు చిక్కి, కటకటాల పాలయ్యారు. శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్ గౌడ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి..

ఒకే ఊరి నుంచి బతుకుదెరువుకు వచ్చి..

నాగర్ కర్నూల్ జిల్లా, తాడూరు మండలం, బలన్‌పల్లి గ్రామానికి చెందిన గుల్లు శివప్రసాద్, దంగట్ల లోకేష్, మండలి మనోహర్ స్నేహితులు వీరు ముగ్గురు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ కూకట్‌పల్లిలోని హాస్టల్‌లో ఉంటున్నారు. జల్సాలకు అలవాటు పడిన వారు చోరీలు బాటపట్టారు. ఈ నెల 9న స్థానిక రాఘవేంద్రకాలనీలో ఓ ఇంటి తాళం పగలగొట్టి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారు. శుక్రవారం రాత్రి మధురానగర్‌లో తనిఖీలు చేపట్టిన పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా గతంలో ఆర్‌జీఐఏ, కూకట్‌పల్లి తాడూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఐదు చోట్ల బంగారం, వెండి ఆభరణాలతో పాటు మూడు బైక్‌లను చోరీ చేసినట్లు అంగీకరించారు. వారి నుంచి 17 తులాల బంగారం, 50 తులాల వెండి, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసును చేధించిన ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు, పోలీసు సిబ్బందికి ఏసీపీ రివార్డులు అందజేశారు.

వైద్యం వికటించి బాలిక మృతి

- వనస్థలిపురం తన్వి ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం
- ఆసుపత్రిపై కేసు నమోదు


నిహారిక (ఫైల్)

హస్తినాపురం: వైద్యం వికటించి బాలిక మృతి చెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా, పోచంపల్లి మండలం, భీమనపల్లి గ్రామానికి చెందిన డి.శేఖర్, జ్యోతి దంపతుల కుమార్తె నిహారిక (11) ఈ నెల 18న ఆడుకుంటూ నోటిలో రూ.10 బిల్ల వేసుకోవడంతో ప్రమాదవశాత్తు అది గొంతులో ఇరుక్కుపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను హుడా సాయినగర్ కమాన్ సమీపంలోని తన్వి ఆసుపత్రిలో చేర్పించారు. చిన్నారి గొంతులో ఇరుక్కున్న కాయిన్ తొలగించిన వైద్యులు శుక్రవారం ఆసుపత్రి నుండి డిశ్చార్జి చేశారు. అయితే బాలికకు మత్తు మందు ఎక్కువ మోతాదులో ఇవ్వడంతో అపస్మారక స్థితికి చేరుకుంది శనివారం ఉదయం ఎంత లేపినా నిద్ర లేవకపోవడంతో మళ్లీ తన్వి ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆమెను పరీక్షించిన ఆసుపత్రి నిర్వాహకుడు రాము బాలిక అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించాడు. దీంతో ఆగ్రహానికి లోనైన బాలిక తల్లిదండ్రులు ఆసుపత్రిలో డాక్టర్లు ఎవరూ లేరని డాక్టర్‌గా చెలామని అవుతున్న రాము వైద్యం చేయడం వల్లనే తమ కుమార్తె మృతి చెందిందని ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వారి బంధువులు, గ్రామస్తులు పెద్దఎత్తున తరలి రావడంతో ఆసుపత్రి వద్ద ఉద్రిక్తతత నెలకొంది. సమాచారం అందుకున్న వనస్థలిపురం సీఐ మహేశ్, సిబ్బందితో అక్కడికి వచ్చి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. బాలిక తండ్రి డి.శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

పొన్నం ప్రభాకర్.. మార్నింగ్ వాక్



బంజారాహిల్స్: బంజారాహిల్స్ కేబీఆర్ పార్కులో మంత్రి పొన్నం ప్రభాకర్ 'మార్నింగ్ వాక్ విత్ కార్యకర్తలు' కార్యక్రమంలో పాల్గొన్నారు. రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డితో పాటు మరికొంతమంది కార్యకర్తలు మంత్రితో కలిసి మార్నింగ్ వాక్‌లో పాల్గొని వాకర్లతో ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి వాటి అమలు విధానంపై ఆరా తీశారు.

పర్యాటక ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలి



పీపుల్స్ ప్లాజా వద్ద సేకరించిన వ్యర్థాలతో ఐటీపీఐ సభ్యులు

ఖైరతాబాద్: వరల్డ్ క్లీన్ ఆఫ్ డే సందర్భంగా ఐటీపీఐ రాష్ట్ర రీజినల్ చాప్టర్, డెకాథ్లాన్ హైదరాబాద్, ప్రాస్పెరిటీ ప్లానెట్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో శనివారం పీపుల్స్ ప్లాజా వద్ద స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. సభ్యులంతా కలిసి 60కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. పర్యాటక ప్రాంతాల శుభ్రతపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఐటీపీఐ రాష్ట్ర రీజినల్ చాప్టర్ చైర్మన్ ఎస్.దేవేందర్‌రెడ్డి తెలిపారు. డెకాథ్లాన్ హైదరాబాద్‌కు చెందిన మనీష్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో కాంస్యం



తైక్వాండోలో కాంస్యం సాధించిన సాయిసరస్వతీ చిన్నారులు

వెంగళరావునగర్: శ్రీసాయి సరస్వతీ విద్యానికేతన్ స్కూల్ విద్యార్థులు తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ డిస్ట్రిక్ట్ లెవల్ స్కూల్ తైక్వాండో గేమ్స్‌ను ఇటీవల నిర్వహించారు. 50 కిలోల బరువు అండర్-14 ఇయర్స్ పోటీల్లో యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్‌లో ఉన్న శ్రీసాయి సరస్వతీ విద్యానికేతన్ స్కూల్ చిన్నారులు కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా శనివారం స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ శిరీష శంకర్ చిన్నారులను అభినందించారు.

టీటీపీఏ ఆధ్వర్యంలో జీఎస్టీపై సదస్సు

హిమాయత్‌నగర్: తెలంగాణ ట్యాక్స్ ప్రాక్టీషనర్ అసోసియేషన్(టీటీపీఏ) ఆధ్వర్యంలో 'జీఎస్టీ ట్రిబ్యునల్ రోల్ ఆఫ్ టాక్స్ ప్రొఫెషనల్' అంశంపై శనివారం నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథులుగా తెలంగాణ హైకోర్టు జడ్జి వాకిటి రామకృష్ణారెడ్డి, జీఎస్టీ అడిషనల్ కమిషనర్ సంయుక్తారాణి, నల్సార్ యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ డాక్టర్ కె.విద్యుల్లతా రెడ్డి పాల్గొని ప్రసంగించారు. అనంతరం జీఎస్టీ ట్రిబ్యునల్ జ్యుడీషియల్ మెంబర్‌గా నియామకమైన వేమిరెడ్డి భాస్కర్‌రెడ్డితో పాటు అడిషనల్ సొలిసిటీ జనరల్ సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా ద్వారకానాథ్‌ను టీటీపీఏ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

అడ్వకేట్ ముసుగులో మోసాలు

పంజగుట్ట: అడ్వకేట్ ముసుగులో కోట్లు దండుకున్న న్యాయవాది పట్టాను బార్‌కౌన్సిల్ రద్దు చేసిందని, అతడి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాధితులు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు కొమ్మనపల్లి గణపతి, రత్నకుమారి, రమణి మాట్లాడారు. మదనపల్లికి చెందిన కేశాపురం సుధాకర్ అనే అడ్వకేట్ ఎంతో మందివద్ద కేసులు విషయంలో రూ.లక్షలు వసూలు చేసి ఏళ్లు గడుస్తున్నా కోర్టులో కేసులు వేయడం లేదని, ఇదేమిటని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎంటీలో పనిచేసే తనకు ఒక స్థలం ఉండేదని సదరు స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకుంటే తాను న్యాయవాది సుధాకర్‌ను కలిసి కేసు అప్పగించినట్లు బాధితుడు గణపతిరావు తెలిపారు. తనవద్ద లక్షల రూపాయలు తీసుకున్నాడని ఆయన చెప్పారు. కబ్జాకు గురైన తన స్థలంలో అపార్ట్‌మెంట్లు వెలిశాయని, తన కేసు ఏమైందని న్యాయవాదిని అడిగితే అసలు కేసే వెయ్యలేదని చెప్పాడని కబ్జాదారులతో కుమ్మక్కై కేసు వెయ్యకుండా తన రెండున్నర కోట్ల స్థలం కబ్జాకు గురయ్యేలా చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తనలాంటి ఎంతోమంది బాధితులు ఆయన కారణంగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

ఘనంగా దసరా వేడుకలు





బీవీబీపీ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో దసరా వేడుకల్లో చిన్నారులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-45లోని బీవీబీపీ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో శనివారం ఘనంగా దసరా వేడుకలు నిర్వహించారు. రంగురంగుల దుస్తుల్లో చిన్నారులు ముచ్చటగొల్పారు. బాలాత్రిపురసుందరి, గాయత్రీదేవి, సరస్వతీదేవి, దుర్గాదేవి, మహిషాసురమర్దిని, రాజరాజేశ్వరిదేవి.. ఇలా తొమ్మిది అవతారాల్లో చిన్నారులు సందడి చేశారు. దుర్గామాతను స్తుతిస్తూ భజనలు చేశారు. అలాగే తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ చుట్టూ నృత్యం చేస్తూ పాటలు పాడారు.

శ్రీనిధి హైస్కూల్‌లో..



వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీలోని శ్రీనిధి విశ్వభారతి హైస్కూల్‌లో శనివారం దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్కూల్ డైరెక్టర్ కొల్లి లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ గీత, వైస్ ప్రిన్సిపాల్స్ విమల, రాజేశ్వరి, ఇన్‌చార్జిలు సాయి, రావత్ తదితరులు ఉన్నారు.

బంజారాహిల్స్‌లో లోకాయుక్త తనిఖీలు



విచారణ చేస్తున్న లోకాయుక్తా ఎస్పీ మహ్మద్ ఇస్మాయిల్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-14లోని భాగ్యనగర స్టూడియోస్ స్థలంలో నిర్మించిన శ్రీరాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్స్ అపార్ట్‌మెంట్ ఎకరం ప్రభుత్వ స్థలంతో పాటు నాలాను ఆక్రమించి నిర్మించారని, దీనిపై చర్యలు తీసుకోవాలంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం లోకాయుక్తా ఎస్పీ మహ్మద్ ఇస్మాయిల్‌తో పాటు షేక్‌పేట మండల తహసీల్దార్ వై.అనితారెడ్డి, జీహెచ్ఎంసీ సర్కిల్-18 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఈ.శ్రీనివాస్, సర్వేయర్ ఎస్.మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఇక్కడ నిర్మించిన శ్రీరాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్స్ అపార్ట్‌మెంట్ నిబంధనలకు విరుద్ధంగా, సెట్‌బ్యాక్ వదలకుండా, వరద నీటి కాలువను ఆక్రమించి నిర్మించినట్లుగా వెంకన్న, సి.రాంచందర్ అనే ఇద్దరు వ్యక్తులు లోకాయుక్తాకు ఫిర్యాదు చేశారు. ఈ నిర్మాణం పూర్తిగా అక్రమంగా ఉందని, ప్రభుత్వ స్థలంలో నిర్మించారని, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు రద్దు చేయాలని, నిర్మాణ అనుమతులు కూడా రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. దీంతో మండల సర్వేయర్ ఇచ్చిన మ్యాప్ ప్రకారం లోకాయుక్తా ఎస్పీ ఈ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఎంతవరకు ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైందో అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ సమయంలో సదరు నిర్మాణ సంస్థకు నోటీసులు ఇచ్చారా? లేదా? అని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ ప్లాన్ ప్రకారమే ఈ నిర్మాణం జరిగిందా? లేకపోతే ఆక్రమణలు చోటుచేసుకున్నాయా? అనే విషయంలో మరింత లోతుగా విచారణ చేపడతామని అధికారులు తెలిపారు. ఫిర్యాదుదారులను విచారించారు. ఈ నిర్మాణ సంస్థ వరదనీటి కాలువ పైకప్పు నిర్మించి నిబంధనలు ఉల్లంఘించినట్లుగా కూడా తనిఖీల్లో తేలింది. దీంతో ఈ నిర్మాణ రంగ సంస్థకు నోటీసులు జారీ చేసి వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసే దిశగా రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు యోచిస్తున్నారు.

వికలాంగుల హక్కుల కోసం పోరాటం చేస్తాం

కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌ను కలిసిన వికలాంగుల హక్కుల పోరాట సమితి ప్రతినిధులు

ఫిలింనగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ డిమాండ్ చేశారు. వారికి ఇచ్చిన హామీలు అమలుచేసే వరకు వికలాంగుల తరఫున పోరాటం చేస్తామన్నారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి ప్రతినిధులు శనివారం తమ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో తమ పోరాటానికి మద్దతుగా నిలవాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. వికలాంగుల సమస్యలపై ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ పోరాటం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి వికలాంగులకు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికల హామీ మేరకు వికలాంగులకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని, తీవ్ర వైకల్యం గల వికలాంగులకు రూ.15 వేలు ఇవ్వాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో వికలాంగులకు చట్టబద్ధంగా 4 శాతం ఉద్యోగాల భర్తీ చేయాలన్నారు. వికలాంగుల రోస్టర్లు 10లోపు సవరించాలి వంటి తదితర హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నిర్మాణ కార్మికుల ఎక్స్‌గ్రేషియా పెంచడం సంతోషం



మంత్రి వివేక్ వెంకటస్వామిని సత్కరిస్తున్న యూనియన్ నాయకులు

పంజగుట్ట: భవన నిర్మాణ కార్మికుల కోసం దేశంలోనే ఎక్కువగా ఎక్స్‌గ్రేషియా ఇస్తున్న రాష్ట్రం మనదేనని ఐఎన్టీయూసీ అనుబంధ రాజీవ్ గాంధీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు అన్నారు. ఈ మేరకు యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎరగాన్ని నాగన్న గౌడ్, ఐఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ యాదవ్, నాయకులు శనివారం సోమాజిగూడలోని కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో భవన నిర్మాణ, ఇతర నిర్మాణ రంగాల్లోని కార్మికులు 25 లక్షల మంది వర్కర్స్ బోర్డులో నమోదై ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో 17 లక్షల కార్మికుల కుటుంబాలకు మేలు చేసేలా ప్రభుత్వం గతంలో కార్మికుడు మరణిస్తే రూ.6 లక్షలు ఉన్న పరిహారం, ఇప్పుడు రూ.10 లక్షలు చేశారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పెద్దపూర బ్రహ్మయ్య, యూనియన్ అధ్యక్షులు ఇరుగు యాదయ్య, దారముల వెంకటేష్, కిన్నెర లాలయ్య, ఆకారపు రాము, ప్రభాకర్, మహేష్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గెలుపు కోసం ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త శ్రమించాలి



సమావేశంలో మాగంటి సునీత తదితరులు

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త శ్రమించాలని బీఆర్ఎస్ నాయకురాలు, దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత పిలుపునిచ్చారు. డివిజన్‌లోని శ్రీరాంనగర్‌లో మాజీ కార్పొరేటర్ ఎంఏ షఫీ అధ్యక్షతన శనివారం నిర్వహించిన రహమత్‌నగర్ బూత్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రహమత్‌నగర్ డివిజన్‌లో తన భర్త గోపీనాథ్ చేసిన అభివృద్ధి పనులు పార్టీ అభ్యర్థి విజయానికి బాటలు వేస్తాయని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు లీయాకత్ అలీ, కే. ఎన్‌రెడ్డి, అరుణ్‌కుమార్, సయ్యద్ బషీర్, కొండాపురం నాగరాజు, శ్రీనివాస్‌గౌడ్, సురేందర్, ధనూజ, జగ్గు, అష్రఫ్ పాల్గొన్నారు.

డాక్టర్ ఇందిరకు దాసరి కళా సేవా అవార్డు

హిమాయత్‌నగర్: సాంస్కృతిక, సమాజిక కళా సేవా రంగంలో సేవలందిస్తున్న ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, ప్రముఖ సంఘ సేవకురాలు డా.ఎస్.ఇందిరకు డాక్టర్ దాసరి నారాయణరావు స్మారక ప్రతిభా కళా సేవా సినిమా అవార్డు-25ను శనివారం హిమాయత్‌నగర్‌లోని ఆలియాడ్ ఆర్టిస్ట్స్ ఆడిటోరియంలో అందజేశారు. ముఖ్య అతిథిగా మా మెంబర్ డా.చింతకుంట మాణిక్యరావు, గౌరవ అతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహాదారులు దరువు అంజన్న, సీనియర్ కవి, వ్యాఖ్యాత డా.రామకృష్ణ చంద్రమౌళి, ప్రవాస భారతీయులు వెంకప్ప భాగవతుల పాల్గొన్నారు.



బలమైన తరాల కోసం ఆయుర్వేదం

వెంగళరావునగర్: వాతావరణంలోని కాలుష్యాన్ని తగ్గిస్తూ బలమైన భవిష్యత్ కలిగిన తరాల కోసమే ఆయుర్వేదం నిరంతరం ప్రయత్నిస్తోందని ఆయుష్ కమిషనర్ శ్రీకాంత్‌బాబు తెలియజేశారు. ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదంపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పర్యావరణాన్ని రక్షించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. దీర్ఘకాలిక వ్యాధులను పూర్తిగా నయం చేస్తూ ప్రజల్లో నమ్మకాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు.

తెలంగాణ విమోచన దినోత్సవ ప్రాముఖ్యతపై అవగాహన



తెలంగాణ విమోచన ప్రాముఖ్యతను తెలియజేస్తూ జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ర్యాలీ

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో తెలంగాణ విమోచన దినోత్సవ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించే ముఖ్య ఉద్దేశ్యంతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దేశభక్తి భావం, ఎందరో త్యాగధనుల పట్ల గౌరవాన్ని, భారత యూనియన్‌లో హైదరాబాద్ ఏకీకరణ ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యంగా సాగింది. ఈ సందర్భంగా 'ప్రభాత్ సిరి' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్ విముక్తి చారిత్రాక, సాంస్కృతిక ప్రభావంపై వ్యాసరచన, పోస్టర్ తయారీ, నినాదాలు రాయడం వంటి అంశాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ ఐక్యత, న్యాయం, సామరస్య విలువలను కాపాడుకోవడం మన కర్తవ్యం అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ విమోచన ప్రాముఖ్యతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు.

ఆడ వేషంలో వచ్చి ఇంట్లో చోరీ



నిందితుడు హర్షిత్



ఆడవేషంలో దొంగతనానికి వెళ్తూ..

బంజారాహిల్స్: పోలీసుల కళ్లు గప్పేందుకు ఆడ వేషం కట్టాడు. స్నేహితుడి ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. అనుమానంతో చోరీ చేసిన ఇంటి సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించేందుకు వెళ్లాడు. చివరికి పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-11లోని ఉదయ్‌నగర్‌లో నివసించే శివరాజ్ ఈ నెల 16న తన కుటుంబ సభ్యులతో కలిసి నిజామాబాద్‌కు వెళ్లాడు. ఈ విషయాన్ని శివరాజ్ కుమారుడు తన స్నేహితుడైన లింగంపల్లిలో నివసించే సీసీ కెమెరా టెక్నీషియన్ చిత్తూరు జిల్లాకు చెందిన హర్షిత్(26)కు చెప్పాడు. మరుసటి రోజు శివరాజ్ ఇంటి తాళం పగులగొట్టి ఉంది. అల్మరాలోని 6.75 తులాల బంగారు ఆభరణాలు, నగదు చోరీ అయినట్లు బంజారాహిల్స్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. బంజారాహిల్స్ డీఐ కవియుద్దీన్, డీఎస్ఐ యాసిన్ అలీ తమ బృందంతో కలిసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించగా ఒక మహిళ శివరాజ్ ఇంటికి వెళ్లడం, తిరిగి వెళ్లిపోవడాన్ని గుర్తించారు. చుట్టుపక్కల ఉన్న సీసీ టీవీ కెమెరాలను చూస్తున్న క్రమంలో ముందు రోజు ఒక వ్యక్తి వచ్చి సీసీ టీవీ కెమెరాలను పరిశీలించాడంటూ ఇంటి యజమాని పోలీసుల దృష్టికి తీసుకువచ్చాడు. పోలీసులు లింగంపల్లిలోని హర్షిత్ ఇంటికి వెళ్లి తనిఖీ చేశారు. ఆడ వేషంలో వచ్చింది తానేనని అంగీకరించాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కాగా నిందితుడు లోన్‌యాప్ ద్వారా విపరీతమైన అప్పులు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది.

కంటి సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



కళ్ల అద్దాలను మహిళలకు అందజేస్తున్న మంత్రి వివేక్

శ్రీనగర్‌కాలనీ: కంటి సమస్యలపై అశ్రద్ధ చేయవద్దని, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని మంత్రి వివేక్ సూచించారు. ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్‌నగర్ గ్రౌండ్స్‌లో అంజన్‌కుమార్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల పలుచోట్ల నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాల్లో అర్హులైన వారికి ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి వివేక్ హాజరై మాట్లాడుతూ మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్ తనవంతు బాధ్యతగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉచిత కంటి వైద్యశిబిరాలు నిర్వహించి ఉచితంగా కళ్ల అద్దాలను అందించడం శుభపరిణామం అన్నారు. ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్, నేతలు భవానీశంకర్, నిజాముద్దీన్, మురళీగౌడ్, సంజయ్‌గౌడ్, మోసిన్ ఖురే షి, రవిగౌడ్, అశోక్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

పెట్రోల్‌కు బదులు కార్లలో నీళ్లు నింపిన సిబ్బంది

పంజగుట్ట: రాజ్‌భవన్ రోడ్డులోని ఆస్కీ ప్రాంగణంలో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లోని ఓ ట్యాంక్‌లో నీరు నిండిపోయింది. ఇది గమనించని నిర్వాహకులు కార్లలో పెట్రోల్ బదులు నీటిని పోశారు. దీంతో కార్లు మొరాయించాయి. వివరాలు.. రాజ్‌భవన్ రోడ్డులో హెచ్‌పీ కంపెనీకి చెందిన పెట్రోల్ బంక్ ఉంది. ఇందులో దాదాపు ఆరు పెట్రోల్ స్టోర్ ట్యాంకులు ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మొదటి ట్యాంకులో నీరు చేరింది. ఇది గమనించని సిబ్బంది శనివారం ఉదయం కార్లలో పెట్రోల్ బదులు నీటిని పోశారు. దీంతో నాలుగు కార్లు మొరాయించడంతో అసలు విషయం తెలిసింది. వెంటనే కార్లలో పోసిన నీటిని తీసేశారు. ఒకటో స్టోర్ ట్యాంక్‌లోని నీటిని పూర్తిగా తోడేశారు. కార్లలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే మరమ్మతులు చేయించి ఇస్తామని బంక్ సిబ్బంది తెలిపారు.

స్వదేశీ ఉత్పత్తులతోనే దేశం స్వయం సమృద్ధి

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సదస్సులో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, వివిధ వ్యాపార వర్గాల ప్రతినిధులు, స్వదేశీ జాగరణ మంచ్ ప్రతినిధులు

బంజారాహిల్స్: విదేశాల నుంచి దిగుమతులు తగ్గించుకొని స్వదేశీ వస్తువుల వినియోగం పెంచితేనే దేశం స్వయం సమృద్ధిని సాధిస్తుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. భారత్ గ్లోబల్ ఇండస్ట్రీస్ ఫోరం రీజినల్ వైస్ ప్రెసిడెంట్ బొల్లంపల్లి ఇంద్రసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్‌లో సదస్సు ఏర్పాటు చేశారు. స్వదేశీ వస్తువుల వినియోగం పెంపు, జీఎస్టీ సరళీకరణ, ప్రభుత్వంపై పడుతున్న భారం తదితర అంశాలపై వివిధ పారిశ్రామిక, వ్యాపార వర్గాల ప్రతినిధులు చర్చించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని జీఎస్టీ కౌన్సిల్ ప్రవేశపెట్టిన కొత్త జీఎస్టీ విధానంతో తాత్కాలికంగా కేంద్ర ప్రభుత్వానికి రావాల్సిన రాబడి సుమారు రూ.7 లక్షల కోట్లు తగ్గనుందన్నారు. అయితే పారిశ్రామిక వర్గాలు దేశ ప్రజల మీద ప్రభుత్వానికి ఉన్న విశ్వాసం వల్ల రానున్న కాలంలో జీఎస్టీ వల్ల ఎక్కువ మొత్తంలో పన్నులు వచ్చే అవకాశం ఉందన్నారు. విదేశాల నుంచి అనేక కీలకమైన రంగాల్లో దిగుమతులు ఎక్కువగా చేసుకుంటుండటంతో విదేశీ మారకద్రవ్యం ఖర్చు చేయాల్సి వస్తోందని, ఈ సమస్యను అధిగమించేందుకు వ్యూహాత్మకంగా కేంద్ర ప్రభుత్వం చొరవతో ఇతర దేశాల సంస్థలతో వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకోవాలని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయన్నారు. ఇటీవల అమెరికా విధిస్తున్న సుంకాల ప్రభావాన్ని తగ్గించుకునేందుకు స్వదేశీ ఉత్పత్తులను ఎక్కువగా వినియోగించాల్సిన అవసరం మరింత పెరిగిందన్నారు. ఈ అంశాలపై పరిశ్రమ పెద్దలు, వ్యాపారస్తులు స్వదేశీ జాగరణ మంచ్ ప్రతినిధులు కలిసి నివేదిక రూపంలో కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలకు అందజేయనున్నారని పేర్కొన్నారు. సదస్సు నిర్వాహకులు బొల్లంపల్లి ఇంద్రసేన్‌రెడ్డి, భారత్ గ్లోబల్ ఇండస్ట్రీస్ ఫోరం ఆలిండియా ఆర్గనైజింగ్ సెక్రటరి సిద్ధార్థ శర్మ, స్వదేశి జాగరణ మంచ్ నేషనల్ కన్వీనర్ సుందరం, ఆలిండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ కశ్మీర్ లాల్, ఆలిండియా కో-ఆర్గనైజింగ్ సెక్రటరీ సతీష్ కుమార్, నేషనల్ కో-కన్వీనర్ ప్రొఫెసర్ అశ్విని మహాజన్, నేషనల్ కో-కన్వీనర్ భగవంతు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మంత్రి సీతక్క

గన్‌ఫౌండ్రీ: బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. శనివారం నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీలతోపాటు కళాశాల బోధనా సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

బహుజన బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరణ



గన్‌పార్కు వద్ద బతుకమ్మలతో విమలక్క

నాంపల్లి: రాష్ట్రవ్యాప్తంగా బహుజన బతుకమ్మ పండుగను వాడవాడలా నిర్వహిస్తున్నట్లు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క అన్నారు. శనివారం నాంపల్లిలోని గన్‌పార్కు తెలంగాణ అమరవీరుల స్థూపం ఎదుట బహుజన బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరణ, బస్సుయాత్ర ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో అడవుల విధ్వంసం, ఆదివాసీల హక్కులను కాలరాయడం తగదని అన్నారు. అడవుల విధ్వంసానికి వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతూనే ఈ నెల 20వ తేదీ నుంచి అక్టోబరు 4వ తేదీ వరకు బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా బస్సు యాత్రను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ బస్సు యాత్ర గన్‌పార్కు వద్ద ప్రారంభమై రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తుందని, తిరిగి అక్టోబర్ 4న హైదరాబాదుకు చేరుకుంటుందని ఆమె వివరించారు.

సీఎం రమేష్.. నీకు రాజకీయాలు ఎందుకు?:కిశోర్



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్

బంజారాహిల్స్: ఏపీ ఎంపీ సీఎం రమేష్‌కు రాజకీయాలు ఎందుకని, ఆయన దందా ఆయన చేసుకుంటే మంచిదని మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై సీఎం రమేష్ వ్యక్తిగత దూషణలు చేయడం వల్లనే తాను స్పందించానన్నారు. సీఎం రమేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. విచారణ ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై కుట్రపూరితంగా కేసు నమోదు చేశారని, తన మాటలను చిత్రీకరించారని అన్నారు. సీఎం రమేష్ టీడీపీ ఎంపీనా, బీజేపీ ఎంపీనా అనేది అర్థం కావడం లేదంటూ ఆ పార్టీ ఎంపీ ఒకరు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. చట్టాలను గౌరవించి తాను విచారణకు హాజరయ్యానని, పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పానన్నారు.

నగరంలో నేడు

- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఉద్యానవన శాఖ గ్రాండ్‌నర్సరీ మేళా పేరుతో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హార్టికల్చర్ షో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు పెన్సిల్ డ్రాయింగ్స్, ష్కల్ప్చర్స్, స్టేకిడ్ స్టోరీస్, దీప్ ఇంటీరియల్స్ చిత్ర ప్రదర్శనలు అందుబాటులో ఉంటాయి.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

బ్రాండింగ్.. పటిష్టంగా బాండింగ్

ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల మన్నన పొందేందుకు చర్యలు

- ప్రయోగాత్మకంగా 'గాంధీ'లో అమలు చేయాలని నిర్ణయం
- నాలుగు రాష్ట్రాల్లో పరిశీలించిన ప్రభుత్వ బృందం
- పేద రోగులకు మెరుగుపడనున్న వైద్యసేవలు
- నిరక్షరాస్యులకు సులువుగా అర్థమయ్యే విధానాలు





సాక్షి, సిటీ బ్యూరో/గాంధీ ఆసుపత్రి: ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రులకు సమాజంలో సరైన గుర్తింపు రావడం లేదు. ఏ చిన్న సందర్భం వచ్చినా ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు గొప్పగా ప్రచారం చేసుకుంటున్నాయి. దీంతో ప్రభుత్వ ఆసుపత్రుల పాలిట చిన్నచూపు, కార్పొరేట్ పట్ల గౌరవం పెరుగుతోంది. ఈ పరిస్థితులను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ప్రజారోగ్యానికి రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నా ప్రజల ప్రశంసలు పొందడంలో ఎక్కడ వెనుకబడుతున్నామనే అంశంపై అంతర్మథనం చేశారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను బ్రాండింగ్ చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించి అక్కడి విధానాలపై అధ్యయనం చేశారు. ప్రజలకు సులువుగా మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రయోగాత్మకంగా గాంధీ ఆసుపత్రిని ఎంపిక చేశారు. ఇక్కడ పైలెట్ ప్రాజెక్టు కింద బ్రాండింగ్ విధానాన్ని అమలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇది అందుబాటులోకి వస్తే లక్షలాది మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు కార్పొరేట్ స్థాయి సేవలు అందనున్నాయి.

ఏంటీ బ్రాండింగ్..?

ఒకే రకమైన చికిత్సకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఒక్కో రకమైన ధరలు ఉంటున్నాయి. ఇదేమంటే బ్రాండ్ అంటున్నారు. ప్రజల్లో నమ్మకాన్ని సొమ్ము చేసుకునే ప్రయత్నమే ప్రైవేటు బ్రాండింగ్. అయితే ప్రభుత్వ ఆసుపత్రుల బ్రాండింగ్ వరకు వచ్చేసరికి ప్రజల్లో ఉన్న నెగిటివ్ భావనను తొలగించి, ప్రభుత్వ ఆసుపత్రులంటే ప్రజల్లో నమ్మకాన్ని కలిగించాలని, అందుకు వైద్యసేవల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. ఓపీ చీటీ కోసం గంటల తరబడి నిలబడే విధానానికి స్వస్తి పలకడం, విశాలమైన భవనంలో ఏ రకమైన టెస్టులు ఎక్కడ చేస్తారు? అనంతరం రిపోర్టులు ఎక్కడ ఇస్తారు.? ఫార్మసీ, ఇతర వివిధ సేవలకు సంబంధించిన వివరాలు నిరక్షరాస్యులకు సైతం అర్థమయ్యేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. సైన్ బోర్డులతోపాటు విద్యుత్తు లైట్లకు ప్రత్యేకించి రంగులను కేటాయించనున్నారు. ఒక రకంగు లైట్‌ను అనుసరిస్తూ పోతే ఒక రకమైన సర్వీస్ అందుబాటులో ఉండేలా కలర్ కోడింగ్ చేస్తున్నారు. ఫుడ్‌కోర్టు, మందులు, పరీక్షలు, పార్కింగ్, సిబ్బంది వివరాలను తెలిపే సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అవసరాలకు సరిపడా వీల్‌చైర్, స్ట్రెచ్చర్స్ అందుబాటులో ఉంచనున్నారు. అదే సమయంలో ఆసుపత్రికి వచ్చేవారికి సమాచార సహాయం కోసం హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయనున్నారు. గాంధీలో విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల ఆసుపత్రుల్లో అమలు చేయనున్నారు.

నిరీక్షణకు స్వస్తి పలకాలి...

వ్యాధుల సీజన్ మొదలైందంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులు, వారి సహాయకులతో ఓపీ విభాగం వద్ద కిక్కిరిసిపోయే దృశ్యాలు కోకొల్లలుగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విశాలమైన ప్రదేశంలో పెద్ద సంఖ్యలో ఓపీ, ఫార్మసీ కౌంటర్లను రోగుల అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేయనున్నారు. విద్యాధికులు స్వతహాగా ఓపీ తీసుకునేందుకు గతంలో ఉండే క్యూఆర్ కోడ్, ఓపీ కియోస్క్‌లను అందుబాటులోకి తేవాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. రోగి వైద్యులను సులువుగా కలిసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షలకు సంబంధించిన రిపోర్టుల కోసం కింది అంతస్తుకు, పై అంతస్తులకు తిరిగే అవసరం లేకుండా ఒకే చోట లభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గర్భిణుల పట్ల ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచిస్తున్నారు.

మంత్రి చొరవతో..

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గాంధీ ఆసుపత్రిలోనే జన్మించారని, ఆసుపత్రి రుణం తీసుకునేందుకు దానిని అభివృద్ధి చేయడమే కాకుండా, రాష్ట్రంలో రోల్ మోడల్‌గా తయారు చేయాలని నిర్ణయించుకున్నారని ఆసుపత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల తరచూ గాంధీని మంత్రి సందర్శిస్తూ అవసరాల మేరకు నిధులు సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నామని ఆసుపత్రి వర్గాలకు భరోసా కల్పిస్తున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం



గాంధీ ఆసుపత్రిలో ప్రయోగాత్మకంగా ప్రభుత్వ ఆసుపత్రుల బ్రాండింగ్ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. వైద్యుల బృందాలు వివిధ రాష్ట్రాల్లోని ఆసుపత్రుల పనితీరును పరిశీలించి, నివేదికలు ప్రభుత్వానికి అందించాయి. కొన్ని నమూనాలను (మోడల్స్) ఉన్నతాధికారుల ముందు ఉంచాం. ఆమోదించిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. సమీప భవిష్యత్తులో గాంధీ ఆసుపత్రిలో విప్లవాత్మకమైన మార్పులు రానున్నాయి.

- డా.వాణి, గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్

వైద్యాన్ని సేవగానే భావించాలి

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



జ్ఞాపికను అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

బంజారాహిల్స్: వైద్యాన్ని ఎప్పుడూ వ్యాపారంగా చూడకూడదని, దానిని ఎల్లప్పుడూ సేవగానే భావించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. 'హై-టెక్ హెల్త్‌కేర్ యుగంలో నాయకత్వం'అనే అంశంపై బంజారాహిల్స్ తాజ్ డెక్కన్ హోటల్‌లో రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ భారత ఆరోగ్య వ్యవస్థ బలపడాలంటే దార్శనిక నాయకత్వం కీలకమన్నారు. మన ఆరోగ్య వ్యవస్థ బలమైనదని, సాంకేతికత లేదా కొత్త ఆవిష్కరణల ద్వారా మాత్రమే కాదని, అందులో కరుణ, సానుభూతి, నిజాయితీ ద్వారా కూడా ఉంటుందన్నారు. ప్రపంచంలో అతిపెద్ద యువతరం ఉన్న భారత్ భవిష్యత్తులో ప్రతివ్యక్తి గౌరవం, నమ్మకంతో ఆరోగ్య సేవలు పొందేవిధంగా ఉండేలా ఉండాలన్నారు. ఈ వేదికపై విజనరీ హెల్త్‌కేర్ సీఈఓ అవార్డును అందుకున్న క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నా మాట్లాడుతూ ఈ గుర్తింపు కేవలం తన వ్యక్తిగత సాధన కాదని, రోగుల జీవితాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్న ప్రతి వైద్యుడు, నర్సు, ఆరోగ్య నిపుణుల సమిష్టి ప్రయత్నానికి ప్రతీక అన్నారు. ప్రతి రోగికి గౌరవం, నమ్మకాన్ని అందించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏహెచ్‌పీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అలెగ్జాండర్ థామస్, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎంఐ సహదుల్లా, హెల్త్ పాలసీ కమిటీ చైర్మన్ విశాల్ బాలి, డైరెక్టర్ జనరల్ డాక్టర్ గిరిధర్ జే గ్యాని తదితరులు పాల్గొన్నారు.

22న జీవీఎస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్ బంజారా

పంజగుట్ట: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కుట్రలు, కుతంత్రాలు చేస్తున్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాపూరావులను వెంటనే కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని గిరిజన విద్యార్థి సంఘం (జీవీఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకట్ బంజారా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జీవీఎస్, లంబాడీ హక్కుల పోరాట సమితిల ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవీఎస్ జాతీయ ప్రధానకార్యదర్శి లోకేష్ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ నాయక్‌తో కలిసి మాట్లాడుతూ సోయం బాపూరావు, తెల్లం వెంకట్రావు ఇద్దరూ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారని రాష్ట్రంలో 40 లక్షల జనాభా ఉన్న లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని వారు కుట్రలు చేస్తుంటే కాంగ్రెస్ పట్టించుకోకపోవడం లేదంటే, వారితో కాంగ్రెస్ పార్టీనే ఈ మాటలు మాట్లాడిస్తుందని భావించాల్సి వస్తుందని అన్నారు. 1976లో రాజ్యాంగబద్ధంగా తమను ఎస్టీల్లో చేర్చారని, కేవలం వారి రాజకీయ లబ్ధి కోసం గిరిజనులు, ఆదివాసీల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకోకపోతే హైదరాబాద్‌కు వచ్చే జాతీయ రహదారులన్నీ దిగ్బంధం చేస్తామని, 22న ఎన్ని అడ్డంకులు సృష్టించినా రేవంత్‌రెడ్డి ఇల్లు ముట్టడించి తీరుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీవీఎస్ నాయకులు రవీందర్ నాయక్, రోహిత్ నాయక్, భరత్, సుధీర్, ప్రవీణ్ నాయక్, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువతలో నైపుణ్యాల పెంపునకు శిక్షణ



లక్డీకాపూల్: జీహెచ్ఎంసీ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా యువత సాధికారతకు నడుం బిగించాయి. యువతలో నైపుణ్యాలను పెంపొందిస్తూ వారిని ఉపాధి మార్గాల వైపు ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో క్వియర్ బంధు అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన లాభాపేక్షలేని సంస్థ వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్ (1ఎం1బీ) సహకారాన్ని అందిపుచ్చుకుంది. ముఖ్యంగా అణగారిన వర్గాల సాధికారత, యువత నాయకత్వాభివృద్ధి లక్ష్యంగా చేపట్టిన శిక్షణ కార్యక్రమాలకు జీహెచ్ఎంసీ మద్దతుగా నిలుస్తోంది. ఇందులో భాగంగా 20 మంది ఉద్యోగార్థులకు డిజిటల్ లిటరసీ, ప్రొఫెషనల్ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. వారిలో ఆరుగురికి ఇండస్ట్రీ గుర్తింపు పొందిన సర్టిఫికెట్లు అందించారు. తదుపరి దశలో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ సందర్భంగా "1.5 మ్యాటర్స్"అనే అంశంపై ప్రచారం గురించి చర్చించారు. వాతావరణ పరిరక్షణ, సస్టైనబిలిటీపై యువతలో అవగాహన పెంచే లక్ష్యంతో ఈ ప్రచారం సాగుతోంది. సమానత్వంతో కూడిన తెలంగాణ అనే సీఎం నినాదానికి అనుగుణంగా ఈ కార్యక్రమాలను రూపొందించారు. ఈ నేపథ్యంలో శనివారం జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (హెల్త్-ఎన్‌యూఎచ్‌ఎం) ఎస్.పంకజా, సూపరింటెండింగ్ ఇంజనీర్ రమాదేవి లంక ఉద్యోగార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

చదువే మహిళా సాధికారతకు మూలం

జస్టిస్ రాధారాణి



బాలోత్సవం బాలికా సాధికారత బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జస్టిస్ రాధారాణి, డీసీపీ లావణ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అమ్మాయిల చదువే వారి సాధికారతకు మూలమని తెలంగాణ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. అమ్మాయిలు తమ కాళ్ల తాము నిలబడి స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవాలంటే దానికి ప్రధాన ఆయుధం చదువేనని ఆమె సూచించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో బాలికా సాధికారత బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ చట్టాలను, హక్కులను ఉపయోగించుకొని తమ సమస్యలను అధిగమించాలన్నారు. ఇప్పటికే అనేక మంది అనేక రంగాల్లో మహిళలు అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతలు గడించి ఆదర్శంగా నిలిచారన్నారు. సావిత్రిబాయి పూలే, కల్పనాచావ్లా, సునీతావిలియమ్స్ వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బాలోత్సవం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. బాలోత్సవం ఉపాధ్యక్షురాలు మమత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, ఉమెన్స్ సేఫ్టీ డీసీపీ డాక్టర్ లావణ్య, విజ్ఞాన దర్శిని కన్వీనర్ టి.రమేష్, బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఎస్.సోమయ్య, కోశాధికారి బుచ్చిరెడ్డి, సైకాలజిస్ట్ శైలజాసుజావతి, అంకమ్మ, వంగపల్లి పద్మ, ఆఫీసు కార్యదర్శి పి.ఎస్.కె.బ్రాహ్మణి, మహేష్ దుర్గ, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక ఆరోగ్య వ్యవస్థలను స్వీకరించాలి

సాక్షి, సిటీబ్యూరో: దేశం ఆధునిక ఆరోగ్య వ్యవస్థలను స్వీకరించాలని కాంటినెంటల్ ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ గురు ఎన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏహెచ్‌పీఐ లీడర్‌షిప్ సమ్మిట్-2025లో పాల్గొని గ్లోబల్ ట్రెండ్స్ ఇన్ హెల్త్‌కేర్ లీడర్‌షిప్ అనే అంశంపై ఆయన మాట్లాడారు. ఆధునిక ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇన్నోవేషన్, హోలిస్టిక్ స్టాఫ్ ఎంగేజ్‌మెంట్‌లో కాంటినెంటల్ ఆసుపత్రికి రెండు అవార్డులు వచ్చాయని వివరించారు. భవిష్యత్తు రూపకల్పనలపై ఆలోచనలను పంచుకున్నారు. రెండు రోజులపాటు జరిగిన లీడర్‌షిప్ సమ్మిట్‌లో సుమారు 500 మంది వైద్యులు పాల్గొన్నారు.

పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి

- ఎండీ సర్ఫరాజ్ అహ్మద్

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ మెట్రోతోపాటు రెండో దశ మెట్రో ప్రాజెక్టు పనులను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ సమీక్షించారు. మెట్రో పనుల్లో వేగంపెంచాలని అధికారులను ఆదేశించారు. మెట్రో రైల్ భవన్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో అధికారులతో ఆయన ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ప్రస్తుతం నడుస్తున్న పాత నగరం మెట్రో కారిడార్ విస్తరణ పనులు జరుగుతున్న తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. సవాళ్లను అధిగమించడానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఫేజ్ - 2ఏ, ఫేజ్ -2బి తాజా పరిస్థితిని సమీక్షించారు. రెండో దశకు సంబంధించి హెచ్ఏఎంఎల్ తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు.

మెడికల్ కౌన్సెలింగ్‌లో జీవో 550ని అమలు చేయాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు కౌన్సెలింగ్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలులో తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఏటా 200 నుంచి 300 వరకు వైద్యసీట్లను విద్యార్థులు కోల్పోతున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. వైద్య సీట్ల రిజర్వేషన్ల అమలులో అక్రమాలు జరుగుతున్నాయని, జీవో నెంబర్ 550ని సక్రమంగా అమలు చేయడం లేదని ఆయన అన్నారు. ఈ మేరకు శనివారం బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. హెల్త్ యూనివర్సిటీ అధికారులు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 550 జీవోను అమలు చేస్తున్నట్లు నటిస్తూ తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. ఇంతలో జీవో 144ను తీసుకువచ్చి వక్రభాష్యం చెబుతూ తీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు. యూనివర్సిటీ అధికారులు ఉద్దేశపూర్వకంగానే ఓపెన్ కేటగిరీలో వచ్చిన విద్యార్థులను రిజర్వేషన్లలో చూపించడం వల్ల గత సంవత్సరం 262 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఎంబీబీఎస్ సీట్లు రాకుండా పోయాయని పేర్కొన్నారు. ఈ సంవత్సరం కూడా అదే మాదిరిగా అన్యాయం చేయడానికి యూనివర్సిటీ అధికారులు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బోయిన్‌పల్లి మార్కెట్‌ను సందర్శించిన విదేశీ విద్యార్థులు



కంటోన్మెంట్: ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్‌గా పేరొందిన బోయిన్ పల్లి కూరగాయల మార్కెట్ యార్డును వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు సందర్శించారు. శ్రీలంక, దక్షిణ ఆఫ్రికా, నైజీరియా, జాంబియా, ఇరాన్, జింబాబ్వే, కెన్యా ఇథియోపియా దేశస్తులు బోయిన్ పల్లి మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు, సెక్రటరీ వెంకన్నతో కలిసి మార్కెట్‌లో పర్యటించారు. రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ పొందుతున్న వీరు, ఫీల్డ్ విజిట్‌లో భాగంగా బోయిన్‌పల్లి మార్కెట్ యార్డుకు వచ్చారు. మార్కెట్‌లో జరుగుతున్న క్రయవిక్రయాలు, విధివిధానాలపై చర్చించారు. చిన్న రైతుల జీవనోపాధి మెరుగుపర్చడం, కొత్త పద్ధతులు, టెక్నాలజీలు, మార్కెటింగ్ వ్యూహాలతో వారిని శక్తివంతం చేసే అంశాలపై చర్చించారు. బోయిన్‌పల్లి మార్కెట్‌లోని బయో ప్లాంట్ ను సందర్శించారు.

పీపుల్స్‌ప్లాజా వద్ద శుభ్రతా కార్యక్రమం



సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ శుభ్రతా దినాన్ని పురస్కరించుకొని శనివారం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్‌ప్లానర్స్ ఆఫ్ ఇండియా(ఐటీపీఐ), డెకథ్లాన్(హైదరాబాద్), ప్రాస్పెరిటీ ప్లానెట్ ఫౌండేషన్ సంయుక్తంగా నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద శుభ్రతా కార్యక్రమాన్నినిర్వహించాయి. మూడు సంస్థల వాలంటీర్లు, కమ్యూనిటీ సభ్యులు కలిసి 60 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించారు. ప్రపంచ వ్యాప్తంగా వ్యర్థాలు, కాలుష్య సమస్యలను తగ్గించేందుకు వ్యక్తులు, సంస్థలు కలిసి పనిచేయాలని చెప్పడమే శుభ్రతాదినం లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐటీపీఐ రాష్ట్ర శాఖ చైర్మన్ ఎస్.దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ సుస్థిర నగర జీవనం పౌరుల భాగస్వామ్యంతోనే ప్రారంభమవుతుందన్నారు. అందులో తాము భాగస్వాములు కావడం గర్వకారణంగా ఉందన్నారు. డెకథ్లాన్ సోషల్ ఎంగేజ్‌మెంట్ అండ్ కమ్యూనిటీ లీడర్ మనీష్ మాట్లాడుతూ శుభ్రమైన నగరం కోసం పౌరులు కలసి రావడం ఇతరులకు స్ఫూర్తినిస్తుందన్నారు. సమాజం కలిసికట్టుగా చేసే ప్రయత్నాలు ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు శాశ్వత ప్రభావాన్ని చూపుతాయని ప్రాస్పెరిటీ ప్లానెట్ ఫౌండేషన్ డైరెక్టర్ నవ్య పేర్కొన్నారు.

హైకోర్టు ఆదేశాలు అమలు చేయండి

కిషన్ చంద్ ఫౌండేషన్ ట్రస్ట్ విజ్ఞప్తి

హిమాయత్‌నగర్: రెవెన్యూ అధికారులు హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని కిషన్‌చంద్ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ త్రిలోక్ చంద్ కోరారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదర్‌గూడలో ఉన్న ఎంఏ గార్డెన్ ఫంక్షన్ హాల్‌కు కిషన్ చంద్ ఫౌండేషన్ ట్రస్ట్ సంపూర్ణ యజమానులు, లీజుదారులుగా ఉన్నామని అన్నారు. అయితే సెప్టెంబర్ 11న మండల రెవెన్యూ అధికారి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వచ్చి చట్టపరమైన విధివిధానాలు పాటించకుండా బలవంతంగా తమ ఆస్తిలోకి ప్రవేశించి తాళం వేశారని వివరించారు. అది ప్రభుత్వానికి చెందిందని బోర్డులు పెట్టారని విచారం వ్యక్తం చేశారు. అయితే సెప్టెంబర్ 12న తెలంగాణ హైకోర్టు తక్షణ చర్యలు తీసుకోవద్దని, తాళాలు తొలగించాలని ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. హైకోర్టు ఆదేశాలను పాటించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. ఇమ్రాన్ బిన్ హజీ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ప్రోద్బలంతో మండల రెవెన్యూ అధికారి అన్యాయంగా తాళం వేశారని అన్నారు. హైకోర్టు చెప్పినా అధికారులు తాళం తొలగించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ట్రస్టీ కైలాష్ శ్రీకాంత్, ప్రతినిధులు సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మను జాతీయ పండుగగా గుర్తించాలి

బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

హిమాయత్‌నగర్: తెలంగాణ సంస్కృతిలో భాగమైన, ప్రపంచం వ్యాప్తంగా గుర్తింపు పొందిన బతుకమ్మ పండుగను జాతీయ పండుగగా గుర్తించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. సగర ఉప్పరి సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 24న ట్యాంక్‌బండ్ బతుకమ్మ ఘాట్ వద్ద నిర్వహించ తలపెట్టిన బతుకమ్మ వేడుకలను కుల, మతాలకు, పార్టీలకతీతంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బతుకమ్మ సంబరాల వాల్‌పోస్టర్‌ను సంఘం రాష్ట్ర మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గనుల స్రవంతి, సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్, గౌరవ అధ్యక్షులు ముత్యాల హరికిషన్, గ్రేటర్ అధ్యక్షులు వెంకట్ స్వామి, బీసీ సంఘం నాయకులు కుందారం గణేష్‌చారి, మణిమంజరిలతో కలసి ఆవిష్కరించి మాట్లాడారు. మానవ సంబంధాలు, నైతిక విలువలకు ప్రతీక బతుకమ్మ పండుగ అన్నారు. మైనార్టీ మహిళలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాన్ని బీసీ మహిళలకు కూడా వర్తింపజేసి రూ.లక్ష అందజేయాలని డిమాండ్‌చేశారు. మహిళా అధ్యక్షురాలు స్రవంతి మాట్లాడుతూ ఈసారి కూడా ట్యాంక్‌బండ్‌పై సుమారు 2500 నుంచి 3000 మందితో భారీ ఎత్తున బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండ సురేఖ, సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్, బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి తదితరులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు సత్యం, రవి, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో సాంకేతికతను వినియోగించాలి

కేఎన్ఆర్ హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ నందకుమార్



గాంధీఆస్పత్రి: వైద్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉందని కాళోజీ నారాయణరావు హెల్త్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పీవీ నందకుమార్ అన్నారు. ఈఎన్‌టీ వైద్యుల రాష్ట్రస్థాయి సదస్సు(ఏఐఓ-టీజీ-కాన్ 2025) సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో శనివారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చెవి, ముక్కు, గొంతు వ్యాధులపై ఆధునిక చికిత్స విధానాలు, శస్త్రచికిత్సల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తే ఈ తరం వైద్యులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి డా. జేబీఎస్ రాథోడ్ మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా యువ వైద్యులకు కొత్త జ్ఞానం, శిక్షణ లభిస్తుందని, సీనియర్ నిపుణుల అనుభవాలను పంచుకోవడం ద్వారా యువ వైద్యులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గాంధీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి, తెలంగాణ ఈఎన్‌టీ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ శోభన్ బాబుతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 700 మంది ఈఎన్‌టీ వైద్యులు పాల్గొన్నారు.

వరల్డ్ రోబో చాంపియన్‌షిప్ పోటీలకు ' మెస్కో గ్రేడ్' విద్యార్థులు



సాక్షి,సిటీబ్యూరో: విద్యార్థులు లక్ష్యాలను సాధించే వరకు పోరాడాలని, సమస్యలు, ఇబ్బందులను అధిగమించి గమ్యాన్ని చేరుకోవాలని.. కృషి ఎప్పటికీ వృథా కాదని విశ్రాంత డీజీపీ ఎస్ఏ హుదా అన్నారు. శనివారం మలక్‌పేటలో ఆల్ ఇండియా రోబోటిక్స్ చాంపియన్‌షిప్ గెలుచుకున్న మెస్కో బృందానికి అభినందనసభ నిర్వహించారు. మెస్కో విద్యార్థులు ఇండియా చాంపియన్‌షిప్‌ను గెలుచుకోవడమే కాకుండా సింగపూర్‌లో జరగనున్న వరల్డ్ రోబోటిక్స్ చాంపియన్‌షిప్‌కు కూడా అర్హత సాధించడంపై హుదా సంతోషం వ్యక్తం చేశారు. మెస్కో బృందం సింగపూర్ నుంచి కూడా విజయం సాధించి తిరిగి వస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్ట్ మీర్ అయూబ్ అలీఖాన్ మాట్లాడుతూ పాతబస్తీకి చెందిన మెస్కో గ్రేడ్ విద్యార్థులు అనేక ప్రసిద్ధ కార్పొరేట్ పాఠశాలలతో పోటీపడి సత్తా చాటి, నగరానికి పేరు తెచ్చారన్నారు. రోబోటిక్స్ చాంపియన్‌షిప్ గెలుచుకున్న బృందంలో జైన్ ఉద్ దిన్, ఫిర్దోస్ ఫాతిమా, నాదియా ఫాతిమా, జైనబ్ ఫాతిమా, జైనబ్ ఉన్నారు.







22 నుంచి సెలబ్రిటీ దాండియా నైట్స్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మోడల్స్ ఆధ్వర్యంలో 'సెలబ్రిటీ దాండియా నైట్స్' 9వ సీజన్ మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకూ 11 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని మీడియా సమావేశంలో సంస్థ ఫ్యాషన్ డైరెక్టర్ వంశీ పల్లే శనివారం తెలిపారు. ఈసారి వేడుకలు మరింత సందడిగా ఉంటాయని, లైవ్ బ్యాండ్, డీజే, సంప్రదాయ ఢోల్ తడ్కా, థీమ్ డెకరేషన్లు, సంప్రదాయ ఆహార వంటల స్టాల్స్‌తో పాటు సెలబ్రిటీల సందర్శనలు ఉంటాయని వివరించారు. ఈ సందర్భంగా 'సెలబ్రిటీ దాండియా నైట్స్' పోస్టర్ ఆవిష్కరణలో మిస్ ఇండియా ఛత్తీస్‌గఢ్ స్పందనా పల్లి, వర్ధమాన నటి క్యాథలిన్ గౌడ, రాఘవి మీడియా యండీ మధుబాబు పాల్గొన్నారు.



ఏ ఫిల్టర్ కాఫీ రేవ్

గచ్చిబౌలి : ఆంధ్రా క్యాంటీన్ హైదరాబాద్‌లో మొట్టమొదటి 'ఏ ఫిల్టర్ కాఫీ రేవ్' శనివారం విజయవంతంగా నిర్వహించారు. 'రాత్రి వేళల్లో కెఫిన్ కిక్, షాట్లు, కాక్టెయిల్స్ మర్చిపోండి, అదే ఫిల్టర్ కాఫీ మ్యూజిక్, స్వచ్ఛమైన ప్రకంపనలు సరదగా గడపడానికి మీకు మద్యం అవసరం లేదని నిరూపించడానికి కేవలం మంచి బీట్స్, మంచి స్నేహితులు, చేతిలో వేడి వడపోత కాఫీ అందించేలా చేసేందుకే ఫిల్టర్ కాఫీ రేవ్' అని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 400 మందికి పైగా ఫిల్టర్ కాఫీ ప్రేమికులు, సంగీత ఔత్సాహికులు ఈ కొత్త సంస్కృతికి నాందిపలియారు. రుచులు, బీట్స్ నాస్టాల్జియాతో ఆహ్లాదకరమైన సాయంత్రం ఈ కార్యక్రమం జరుపుకున్నారు. ఆంధ్రా క్యాంటీన్ అధికార ప్రతినిధి హైమా కేశినేని మాట్లాడుతూ సమాజం, సంస్కృతి, సృజనాత్మకతను ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకే ఈ తరహా ఆలోచన అని పేర్కొన్నారు. 'ఫిల్టర్ కాఫీ రేవ్ అనేది నగరంలో జరిగిన మొదటి కార్యక్రమం, ఇది కేవలం కార్యక్రమం మాత్రమే కాదు, ఇది సంప్రదాయాన్ని సమకాలీన అనుభవాలతో మిళితం చేసే ఉద్యమం' అని అభివర్ణించారు. కార్యక్రమంలో పలువురు ఔత్సాహికులు పాల్గొన్నారు.

వెడ్డింగ్ అంబాసిడర్‌గా తమన్నా రూజ్..

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ దుస్తుల బ్రాండ్ మాన్యవర్ మోహే తమ వెడ్డింగ్ అంబాసిడర్‌గా నగరానికి చెందిన సెలబ్రిటీ మేకప్ ఆర్టిస్ట్ తమన్నా రూజ్‌ను ఎంపిక చేసింది. ఈ విషయాన్ని బంజారాహిల్స్‌లో నిర్వహించిన ఓ మీడియా సమావేశంలో మాన్యవర్ ప్రతినిధులు ప్రకటించారు. దేశవ్యాప్తంగా 15 మంది వెడ్డింగ్ అంబాసిడర్ల నియామకం జరపడం ఇదే మొదటి సారని పేర్కొన్నారు. ముంబైలోని తాజ్ మహల్ హోటల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో వెడ్డింగ్ సూత్ర ఇన్‌ఫ్లుయెన్సర్ అవార్డ్ అందుకున్న నేపథ్యంలో వివాహ రాయబారిగా ఎంపిక కావడం సంతోషంగా ఉందని తమన్నా రూజ్ అన్నారు. ఈ హోదాతో దేశవ్యాప్తంగా వెడ్డింగ్ ఇండస్ట్రీలో నగర ప్రతిష్ట ఇనుమడించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.



ఏమేమి పువ్వొప్పనే గౌరమ్మ.. ఏమేమి కాయొప్పనే గౌరమ్మ.. గుమ్మాడి పువ్వొప్పనే గౌరమ్మ.. గుమ్మాడి కాయొప్పనే గౌరమ్మ.. ఆట చిలుకలార గౌరమ్మ.. పాట చిలుకలార గౌరమ్మ.. అంటూ సాంస్కృతిక నగరమైన హైదరాబాద్‌లో బతుకమ్మ ఉత్సవాల సందడి మొదలైంది.. నేటి (ఆదివారం) నుంచి.. తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు నిర్వహించేందుకు నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యింది. వాడవాడలా పూల గోపురాల హడావుడి మొదలైంది. పలు ప్రాంతాల్లోని ప్రాంగణాల్లో పండుగ సంబరాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.. విద్యుత్ దీపాల వెలుగులతో ప్రత్యేక అలంకరణ చేసింది..ప్రధాన కూడళ్లు మొదలు.. చెరువులు, కుంటలు ఉత్సవాలకు వేదికలు కానున్నాయి..

- సాక్షి,సిటీబ్యూరో

ఏమేమి పువ్వొప్పనే.. గౌరమ్మ..

సాంస్కృతిక నగరిలో బతుకమ్మ సందడి

- తొమ్మిది రోజుల ఉత్సవాలకు ముస్తాబు
- వాడవాడలా పూలగోపురాల హడావుడి
- పలు ప్రాంగణాల్లో పండుగకు ఏర్పాట్లు
- విద్యుత్ వెలుగులతో ప్రత్యేక అలంకరణ
- వేదికలుగా చెరువులు, కుంటలు, ప్రధాన కూడళ్లు

పూలపండుగకు మహానగరం సన్నద్ధమైంది. బతుకమ్మ ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహించేందుకు ఎల్‌బీ స్టేడియంలో పెద్ద ఎత్తున సద్దుల బతుకమ్మ వేడుకలకు ప్రభుత్వం ఏర్పాట్లు చేపట్టింది. ట్యాంక్ బండ్, నెక్లెస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లోనూ విద్యుత్ వెలుగులతో ప్రత్యేక అలంకరణలు చేశారు. ప్రైవేట్ సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ మహిళలు బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వెసులుబాటు కల్పించారు. సాధారణ మహిళల నుంచి సాఫ్ట్‌వేర్ నిపుణుల వరకూ అన్ని వర్గాల వారూ వేడుకల్లో భాగస్వాములయ్యే విధంగా ఏర్పాట్లు చేపట్టింది. గ్లోబల్‌సిటీగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన హైదరాబాద్ సాంస్కృతిక నగరంగా కూగా ప్రత్యేక అస్తిత్వాన్ని కలిగి ఉంది. నిజాం కాలం నుంచే నగరంలో బతుకమ్మ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం..





శతాబ్దాల చరిత్ర..

వైవిధ్యభరితమైన సంస్కృతుల పాదులాంటి భాగ్యనగరంలో శతాబ్దాల క్రితమే అందమైన బంతిపూల బతుకమ్మలు, నూటొక్కతీరు పూల బతుకమ్మలు కొలువుదీరాయి. అప్పట్లో ప్రతి సంవత్సరం స్వచ్ఛంగా, నిండుగా ప్రవహించే మూసీనది ఒడ్డున ఎంగిలిపూల బతుకమ్మలు మొదలుకొని సద్దుల బతుకమ్మల వరకూ తొమ్మిది రోజుల పాటు మహిళలు వేడుకలను నిర్వహించేవారు. దీంతో మూసీనది పరీవాహక ప్రాంతమంతా నిలువెత్తు ఇంద్రధనస్సు నేలపై పరుచుకున్నట్లు అందంగా తళుకులీనుతూ కనువిందు చేసేది. వందలాది చెరువులు, కుంటలతో, అందమైన ఉద్యానవనాలతో కూడిన భాగ్యనగరానికి బతుకమ్మ పండుగ మొదటి నుంచి బంగారు కాంతులద్దింది. కుతుబ్‌షాహీల కాలం నుంచే హైదరాబాద్‌లో ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో బతుకమ్మ పండుగ చేసుకున్నారు. అప్పటి రాజు ఇబ్రహీం కులీకుతుబ్‌షాను పొగుడుతూ మహిళలు పాడుకున్న బతుకమ్మ పాటలే ఇందుకు నిదర్శనమని ఇంటాక్ సంస్థ ప్రతినిధి అనురాధారెడ్డి తెలిపారు. ఆ తరువాత నిజాం కాలం నాటికి బతుకమ్మ పండుగ మరింత వైభవోపేతంగా జరిగింది.

మూసీనది ఒడ్డున..

'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ మహిళలు పాడుకునే పాటలతో తొమ్మిది రోజుల పాటు నగరంలో సందడి కనిపించేది. ఈ వేడుకలకు నిజాం నవాబులు తగినవిధంగా ఏర్పాట్లు చేసేవారు. పండుగ సందర్భంగా చెరువులు, కుంటల వద్ద, మూసీనది ఒడ్డున మహిళలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకొనేవారు. మహబూబ్ అలీఖాన్ కాలంలో హిందువుల పండుగలకు అనూహ్యమైన ఆదరణ, ప్రాచుర్యం లభించాయి. మూసీనది వరదలు పోటెత్తి నగరాన్ని అతలాకుతలం చేసినప్పుడు, ఎంతోమంది ఆ వరదల్లో విగతజీవులయ్యారు. ఆ విషాదాన్ని గుర్తు చేసుకుంటూ మహిళలు బతుకమ్మ పాటలు పాడారు. 'తళతళ మెరుపులు మెరవంగా ఉయ్యాలో, పెళపెళ పిడుగులు రాలంగా ఉయ్యాలో, కురిసింది వాన ఉయ్యాలో.. పట్నంబులోన ఉయ్యాలో.. పొంగిందీ మూసీ ఉయ్యాలో.. మునిగిందీ ఊరు ఉయ్యాలో..' అంటూ ఆ నాటి విషాదాన్ని పాటల రూపంలో పాడుకున్నారు.

సద్దుల సమర్పణ..

సజ్జ, మొక్కజొన్న, జొన్న వంటి తృణధాన్యాలు, బెల్లంతో మలీద ముద్దలు చేసి సద్దుల బతుకమ్మ రోజున బతుకమ్మకు సద్దులు సమర్పిస్తారు. బతుకమ్మ పండుగ రోజున పసుపుతో చేసిన గౌరమ్మను పూలమధ్యలో అలంకరించి పూజిస్తారు. ఆ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉపవాస దీక్షలో మహిళలు బతుకమ్మ పండుగ అనంతరం తాము తెచ్చిన సద్దులు ఆరగించి దీక్ష విరమిస్తారు. నిలువెత్తు పూలగోపురాల్లా, ఎత్తయిన పూల శిఖరాల్లా రంగురంగుల పూలతో ఎంతో అద్భుతంగా కనిపించే బతుకమ్మ ఇక్కడి ప్రజలకు ఆరాధ్యం. 'బతుకమ్మ' అంటే బతుకును ఇచ్చే తల్లి అని అర్థం. ఆ మాటకొస్తే కాకతీయుల కాలంలో పోరుభూమిలో ఉన్న రాణి రుద్రమ దేవిపై శతృవు కత్తి దూసినప్పుడు ఓ మహిళ అడ్డంగా వెళ్లి ఆమె ప్రాణాలు కాపాడి బతుకునిచ్చిందనే అభిప్రాయం బలంగా ఉంది. ఇలా అనేక శతాబ్దాలుగా తెలంగాణలో బతుకమ్మ ఉత్సవాలకు హైదరాబాద్ నగరం ఆది నుంచి వేదికగా నిలిచింది.

ప్రకృతి ఉత్సవం..

పెత్తరమవాస్య నాడు ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై తొమ్మిది రోజుల పాటు సాగే బతుకమ్మ ఆఖరు రోజు నవమి నాడు సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. తంగేడు, గునుగు, బంతి, చేమంతి, ముత్యాలపూలు, కట్ల పువ్వులు, తీగెమల్లె పువ్వులు, డిసెంబరాలు వంటి పూలతో అమ్మాయిలు బతుకమ్మలను పేర్చుతారు. ఇంట్లో అమ్మాయిల వయసుకు తగిన విధంగా ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం బతుకమ్మ ఎత్తు పెంచుకోవడం, తమ స్థాయికి తగిన విధంగా పెద్ద పెద్ద బతుకమ్మలను అలంకరించుకొనే సంప్రదాయం నగరంలో బలంగానే ఉంది. కూకట్‌పల్లి, మియాపూర్, తదితర చోట్ల ఏటా బాహుబలి బతుకమ్మలను ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ సారి ఎల్‌బీస్టేడియంలోనూ అతిపెద్ద బతుకమ్మను అలంకరించేందుకు పర్యాటక శాఖ ఏర్పాట్లు చేపట్టింది.

సాయంకాలాన..

సాగర తీరాన అన్నట్లు.. ప్రకృతి ప్రేమికులను అలరిస్తోంది.. నగరంలో నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన హార్టికల్చర్ ఎక్స్‌పో.. ప్రదర్శనలో వివిధ ప్రాంతాలకు చెందిన నర్సరీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో పలు రకాల ఇండోర్, అవుట్‌డోర్ ప్లాంట్స్ సందర్శకులను అలరిస్తున్నాయి. ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచుతున్నాయి. దీంతో పాటు ఈ ఎక్స్‌పోలో మనసుదోచే అక్వేరియం మోడల్స్, అందులో పెంచుకునే వివిధ రకాల చేపలు, అదే విధంగా గాజు, పింగాణి పాత్రలు, అందమైన ఇంటీరియర్స్, బాల్కనీని అలంకరించే పలు డెకరేటివ్స్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. - ఖైరతాబాద్



ప్రకృతి సోయగం..

ఆకట్టుకుంటున్న హార్టికల్చర్ ఎక్స్‌పో

- పీపుల్స్ ప్లాజా వేదికగా ప్రకృతి ప్రేమికుల సందడి
- అలరిస్తున్న వివిధ రకాల ఇండోర్, అవుట్‌డోర్ ప్లాంట్స్
- ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచుతున్న ప్రదర్శన

ఇంటి పెరట్లోనే మెడిసిన్..

మొక్కలో ఎన్నో ఔషధ మొక్కలు ఉన్నాయి. వాము చెట్టు ఈ మొక్క ఆకులు తరచూ తీసుకుంటే దగ్గు, ఆయసం వంటి వాటిని అరికట్టేందుకు అవకాశముంటుంది.

ఇండోర్ ప్లాంట్స్‌లో ప్రధానంగా చెప్పుకునేది లక్కీ బాంబు ప్లాంట్. ఇది ఒక గాజు పాత్రలో నీరు, రంగు రంగు రాళ్ల మధ్య పెరిగే ఈ మొక్క ఇంట్లో ఉంటే అదృష్టంగా భావిస్తారు. మనం ఎవరికైనా పుట్టిన రోజు, స్వాగతం పలుకుతూ ఇచ్చేందుకు పిల్లోనియా అనే గిఫ్టింగ్ ప్లాంట్ ఎంతో ఆకర్షణీంగా కనిపిస్తుంది. దీనిని ఆఫీస్ టేబుల్‌పై, ఇంట్లోనూ పెట్టుకోవచ్చు.











- కాక్టస్ ఫ్యామిలీకి చెందిన ఇండోర్ ప్లాంట్స్ నారింజ, ఎరుపు వర్ణంలో ఎంతో అందంగా ఉంటాయి. తక్కువ నీటిని తీసుకొని పెరిగే ఈ మొక్కలు ఇంట్లో ఎంతో అలంకరణగా ఉంటాయి.
- స్నేక్ ప్లాంట్‌గా పిలుచే ఈ మొక్క ఎయిర్ ప్యూరిఫయ్యర్‌గా పనిచేస్తుంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా మన ఇంట్లోని గాలని శుద్ధి చేస్తుంది. చూడటానికి ఎంతో అందంగా ఉంటుంది.
- ఇంట్లో వాస్తు దోషం, ధన అభివృద్ధి కలుగుతుందనే నమ్మకంతో ఇండోర్‌లో జెడ్ ప్లాంట్ మొక్కను ఎక్కువగా పెంచుకుంటారు. ఈ మొక్కను పెట్టుకోవడం వల్ల మంచి జరుగుతుందని నమ్మకం.
- వాటర్ సేవింగ్ ప్లాంట్స్‌గా పిలువబడే సకులెట్స్ మొక్కలు ఇంట్లో పెట్టుకోవడానికి ఎంతో మంది ఇష్టపడతారు. వీటిని ఇంటి గుమ్మం వద్ద స్వాగతం పలికే మొక్కలుగా, నెగిటివిటీని పాజిటివిటీగా మార్చే మొక్కలుగా పిలుస్తుంటారు. నవంబర్ నెలలో వీటికి పూచే పూలు వివిధ రంగుల్లో ఆకర్షిస్తాయి.
- రణపాల ఈ మొక్క ఆకులు తరచూ తీసుకుంటే కిడ్నీలో స్టోన్స్ ఉన్నా, రాకుండా అరికట్టేందుకు అవకాశముంటుంది.
- మింట్ తులసి ఈ మొక్క ఆకును రోజు ఒకటి తీసుకుంటే మౌత్ ఫ్రెషనర్‌గా పనిచేస్తుంది. నోట్లో, గొంతులో ఇన్‌ఫెక్షన్స్ వంటి వాటిని కొంత వరకూ అరికట్టవచ్చు.
- లావెండర్ మాసుపత్రి ఈ మొక్క ఇంట్లో ఉంటే దోమల నివారణకు ఉపయోగపడుతుంది. అందే ఈ మొక్కను మస్కిటో ఫ్రెషనర్‌గా పిలుస్తారు.




వీటితో పాటు 40కి పైగా రాకాల బోన్సాయి మొక్కలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. వీటిని ఇంట్లో అలంకరణగా అమర్చుకోవచ్చు. ఆక్వేరియంలో చిన్న పాటి దట్టమైన అడవిని తలపించే విధంగా గాజు, పింగాణి పాత్రల్లో అమర్చిన ఫారెస్ట్ ఫ్రేమ్‌లు ఎంతో ముచ్చటగా ఉన్నాయి. వీటికి నెలలో ఒక్కసారి వాటర్ స్ప్రే చేస్తే చాలు నెల మొత్తం ఇంట్లో ఎంతో అందాన్ని, ఆహ్లాదాన్ని పంచుతాయి.



సీగ్రమ్స్ టీమ్‌లో నాగ చైతన్య..

సాక్షి, సిటీబ్యూరో: బూమ్ బాక్స్ సంగీతోత్సవం వంటి విభిన్న ఈవెంట్లతో యువతను ఉర్రూతలూగిస్తున్న సీగ్రమ్స్ రాయల్ స్టాగ్.. తమ అంబాసిడర్ టీమ్‌లో టాలీవుడ్ స్టార్ నాగ చైతన్యను కూడా ఎంపిక చేసింది. తమ బ్రాండ్ అంబాసిడర్లలో నటుడు సిద్ధార్థ్ మల్హోత్రా, ర్యాపర్ బాద్షా, గేమర్ పాయల్ ధరేలతో పాటు నాగ చైతన్యను కూడా ఎంపిక చేసినట్లు కంపెనీ ప్రకటించింది. క్రికెటర్లు రోహిత్ శర్మ, జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్‌లతో వీరు కలుస్తారని, తద్వారా మన దేశపు ప్రధాన ఆకర్షణలైన క్రికెట్, సినిమా, సంగీతం, గేమింగ్ అభిరుచులకు అద్దం పడతారని తెలిపింది.

టూర్‌కు ముందే.. ఓ టూర్ వేయండి!



న్యూయార్క్ సిటీ, ప్యారిస్, కశ్మీర్, ఆగ్రా.. ప్లేస్ ఏదైనా ట్రిప్‌కు వెళ్లే ముందు ఆ ప్రదేశంలోని వింతలు, విశేషాల గురించి తెలుసుకుంటాం. వీడియోలు చూస్తాం. అక్కడి భద్రత, సంస్కృతి, రవాణా సౌకర్యాలు ఎలా ఉన్నాయో కూడా కచ్చితంగా అవగాహన తెచ్చుకోవాలి. ఇందుకోసం వెబ్‌సైట్లలో వీడియోలు చూడటం.. కావాల్సిన వారితో ఫోన్లో మాట్లాడటం ద్వారా 'టూర్‌కి ముందే ఓ టూర్' వేయాల్సిందే. తద్వారా టూర్‌ని పక్కాగా ప్లాన్ చేసుకోవడానికి వీలవుతుంది. ఫలితంగా జీవితాంతం గుర్తుండిపోయే ఒక టూర్.. మీ జ్ఞాపకాల బీరువాలో చేరుతుంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

ఆ ప్రదేశం గురించి లోతుగా తెలుసుకోండి
- ఆచార వ్యవహారాలపై అవగాహన తప్పనిసరి
- తీర్థయాత్రలు, అడ్వెంచర్ టూరిజంలో కీలకం
- ప్రయాణం తీపి జ్ఞాపకాలు అందించేలా జాగ్రత్తలు

సెలవులు వస్తున్నాయంటే చాలు.. టూర్లు ప్లాన్ చేస్తుంటాం. మనం ఏ ప్రదేశానికి టూర్‌కి వెళ్లాలి అనుకుంటున్నామో అక్కడి ప్రసిద్ధ ఆకర్షణలు, చారిత్రక ప్రదేశాలు, సహజ అద్భుతాల గురించి నెట్‌లోనూ, అక్కడికి అప్పటికే వెళ్లి వచ్చిన వారి దగ్గరా ఆరాలు తీస్తాం. అయితే మనం వెళ్లాల్సిన చోట భద్రతా పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు వంటి వాటిని మాత్రం తెలుసుకోం. సముద్రం, నదులు, జలపాతాలు, లోయలు, కొండ ప్రాంతాలకు వెళ్లడానికి యువత ఆసక్తి చూపుతారు. కానీ, అక్కడ పొంచి ఉండే ప్రమాదాల గురించి మాత్రం ఆరా తీయరు.

ఆచారాలు తెలిస్తే..

పర్యాటక ప్రాంత స్థానిక సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలు, కళలు, ఆహారపుటలవాట్ల గురించి తప్పకుండా తెలుసుకోవాలి. తద్వారా వాటికి విభిన్నంగా లేదా వ్యతిరేకంగా మనం నడుచుకోకుండా.. అక్కడి ప్రజలను గౌరవించి, వారి మన్ననలు పొందవచ్చు. సామాజిక మర్యాదలు, దుస్తుల నియమావళి, మతపరమైన లేదా సాంస్కృతిక ప్రదేశాలలో ఎలా ప్రవర్తించాలో ముందే అవగాహన పెంచుకోవాలి. ఉదాహరణకు కొన్ని ఆలయాల్లోకి ప్రవేశించే ముందు.. కొన్ని రకాల దుస్తులు ధరించాలి. అలాగే, అక్కడ గుడిలో సమర్పించే ప్రసాదాలు కూడా ప్రత్యేకంగా ఉంటాయి.

తీర్థయాత్రలు

తీర్థయాత్రలకు 'టూర్‌కి ముందే టూర్' అత్యంత కీలకం. ఉదాహరణకు శ్రీశైలం వెళ్లేవారు ముందుగా, తప్పనిసరిగా సాక్షి గణపతి దర్శనం చేసుకోవాలి. ఇది మనందరికీ తెలిసిందే. కానీ, ఇతర రాష్ట్రాల్లోనూ, నేపాల్ వంటి దేశాల్లోనూ ఇలాంటి నిబంధనలు చాలా ఉంటాయి. వాటిని ముందుగా తెలుసుకుంటే.. 'అయ్యో, ముందు తెలుసుకోలేకపోయామే' అని బాధపడాల్సిన అవసరం ఉండదు. అలాగే చార్‌ధామ్ యాత్ర వంటి ఎత్తైన ప్రదేశాలకు వెళ్లేటప్పుడు ఆక్సిజన్ స్థాయులు తక్కువగా ఉంటాయి. దానికి తగ్గట్టుగా మనం సంసిద్ధం ఎలా కావాలో ముందే చూసి, తెలుసుకోవాలి.

అడ్వెంచర్ టూరిజం

ట్రెక్కింగ్, స్కీయింగ్, వైట్ వాటర్ రాఫ్టింగ్ వంటివి చేసేముందు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ముందే తెలుసుకోవాలి. అవి ఎలా చేస్తారో, అందులో వాడే వస్తువుల గురించీ కూడా ముందే చూసి తెలుసుకోవాలి. పర్యటనకు ముందు నుంచే మానసికంగా, శారీరంగా దృఢంగా ఉండటం అవసరం. దుస్తుల నుంచి అవసరమైన మందుల వరకు ప్రతి విషయంలోనూ పూర్తి సంసిద్ధంగా ఉండాలి.



వైల్డ్ లైఫ్, ఎకో టూరిజం

ప్రకృతి సంపదకు నిలయమైన ప్రాంతాలకు; అడవులు, జాతీయ పార్కులకు వెళ్లేటప్పుడు అక్కడి వాతావరణాన్ని మనం పాడుచేయకుండా ఉండటం చాలా ప్రధానం. మనవల్ల పర్యావరణ కాలుష్యం, అక్కడి సంస్కృతి సాంప్రదాయాలు దెబ్బతినకుండా నడుచుకోవాలంటే.. 'టూర్‌కి ముందే టూర్' చాలా అవసరం.

అదనపు జాగ్రత్తలు

వ్యాపారులు, స్థానికుల నుంచి తలెత్తే మోసాలు, గమ్యస్థానానికి సంబంధించిన ఏవైనా నిర్దిష్ట భద్రతా సమస్యల గురించి అవగాహన తెచ్చుకోవాలి. ఉదాహరణకు అధిక నేరాల రేటు ఉన్న ప్రదేశానికి ప్రయాణిస్తుంటే.. రాత్రిపూట సంబంధిత ప్రాంతాలకు వెళ్లకపోవడం, విలువైన వస్తువుల గురించి మరింత అప్రమత్తంగా ఉండటం వంటి అదనపు జాగ్రత్తలు తీసుకోవచ్చు. ఇందుకోసం ట్రావెల్ బ్లాగ్స్, టూరిజం, ప్రభుత్వ వెబ్‌సైట్లను పరిశీలించాలి. స్నేహితులు, బంధువుల నుంచీ సమాచారాన్ని సేకరించాలి.

వీటిలో ముఖ్యం

తీర్థయాత్రలు	అడ్వెంచర్ టూరిజం	ఎకో టూరిజం	క్రూయిజ్ టూరిజం	వైల్డ్‌లైఫ్ టూరిజం	రూరల్ టూరిజం

క్లుప్తంగా...

నేటినుంచి మావోయిస్టు పార్టీ వార్షికోత్సవాలు

- ఈనెల 27 వరకు నిర్వహించాలని కేంద్ర కమిటీ పిలుపు
- ఏజెన్సీ ప్రాంతాల్లో కరపత్రాలపై పోలీసుల నిఘా

సాక్షి, హైదరాబాద్: ఒకవైపు ఆపరేషన్ కగార్‌తో తరుముతున్న సాయుధ పోలీసు బలగాలు.. మరోవైపు కాల్పుల విరమణపై తర్జనభర్జనలతో మావోయిస్టుల లేఖల లీకులు కొనసాగుతున్న సమయంలో.. తాజాగా మావోయిస్టు కేంద్ర కమిటీ విడుదల చేసిన కరపత్రాలు ఆసక్తికరంగా మారాయి. మావోయిస్టు పార్టీ 21వ వ్యవస్థాపక వార్షికోత్సవాలు ఆదివారం నుంచి నిర్వహించేందుకు మావోయిస్టులు సిద్ధమయ్యారు. ఈనెల 21వ తేదీ నుంచి 27 వరకు దేశవ్యాప్తంగా విప్లవ స్ఫూర్తితో ఈ ఉత్సవాలు నిర్వహించాలని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ములుగు జిల్లా నూగురు వెంకటాపురం మండలం పాత్రపురం గ్రామ శివారులో మావోయిస్టు కరపత్రాలు వెలిశాయి. ఇలా ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టుల కరపత్రాలు వెలువడటంపై పోలీసులు నిఘా పెంచారు. కరపత్రాలు ఎక్కడి నుంచి వచ్చాయి.. ఎవరు పంపిణీ చేశారన్న దానిపై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా సరిహద్దు జిల్లాల పోలీసులు అప్రమత్తమయ్యారు.

రణమా... శరణమా?

సాయుధ పోరాటంపై మావోయిస్టు పార్టీలో భిన్నాభిప్రాయాలు
- మావోయిస్టులకు డెడ్‌లైన్ విధించిన హోంమంత్రి అమిత్ షా
- 2026 మార్చి 31 తర్వాత సాయుధ పోరాటం ఉండేనా ?
- సీపీఐ (మావోయిస్టు) ఏర్పాటై నేటితో 21 వసంతాలు పూర్తి


(ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీపీఐ (మావోయిస్టు) పార్టీ ఏర్పడి ఆదివారం నాటికి 21 ఏళ్లు పూర్తవుతోంది. ఈ తరుణంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పినట్టుగా 2026 మార్చి 31 నాటికి మావోయిస్టుల నిర్మూలన జరుగుతుందా లేక విప్లవ పోరాటం ఇంకా కొనసాగుతుందా? అసలు రాబోయే ఆరు నెలల్లో ఏం జరుగుతోందనే ఉత్కంఠ నెలకొంది.

ఏకంగా సైన్యం ఏర్పాటు
ఉమ్మడి ఏపీ ప్రభుత్వంతో చర్చలు విఫలమైన వెంటనే దేశంలో సాయుధ విప్లవ పోరాటం సాగిస్తున్న పార్టీలన్నీ (ముఖ్యంగా పీపుల్స్‌వార్, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్)లు ఏకమై 2004 సెప్టెంబర్ 21న భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)గా ఏర్పడ్డాయి. తెలంగాణకు చెందిన గణపతి తొలి చీఫ్‌గా ఎన్నికయ్యారు. ఈ మార్పుతో విప్లవ పోరాటాలు కొత్త బలం పుంజుకున్నాయి. 2009 నాటికి దేశంలో తొమ్మిది రాష్ట్రాల్లోని 200 జిల్లాల్లో ప్రభావం చూపించే స్థాయికి చేరుకున్నారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ పేరుతో సొంత సైన్యం ఏర్పాటు చేసుకున్నారు. క్రమంగా ఈ ఆర్మీలోనే 12 వేల మంది సభ్యులు వచ్చి చేరారు. వీరికి అవసరమైన ఆయుధాల కోసం పోలీస్ క్యాంపులపై దాడి పెరిగింది. ఛత్తీస్‌గఢ్ - మహారాష్ట్ర - తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న అడవుల్లో జనతన సర్కార్ పేరుతో సమాంతర ప్రభుత్వాలను సైతం ఏర్పాటు చేశారు.

సీపీఐ (మావోయిస్టు) ఒక దశనే..

పెరిగిన నిర్బంధంతో ఆ పార్టీకి మిగిలిన ముగ్గురు పొలిట్‌బ్యూరో సభ్యుల్లో ఒకరైన మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను ఏకంగా ఆయుధాలు వదిలేసి లీగల్ పోరాటానికి సిద్ధమంటూ లేఖ జారీ చేశారు. కానీ, సోను లేఖ ఆయన వ్యక్తిగత అభిప్రాయమని, సాయుధ పోరాటం కొనసాగుతుందని పార్టీ స్పష్టంచేసింది. వెరసి విప్లవ పోరాటం దశదిశ ఏంటనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

అయితే, సాయుధ రైతాంగ పోరాటం, నక్సల్బరీ ఉద్యమం, పీపుల్స్‌వార్ పార్టీలు ఎదుర్కొన్న దశనే ప్రస్తుతం మావోయిస్టు పార్టీ ఎదుర్కొంటోందనే వాదనలు వినిపిస్తున్నాయి. చర్చలు జరిపినా, ఆయుధాలెక్కుపెట్టినా విప్లవ పంథా మారదని మేధావులు అంటున్నారు. సమాజంలో పీడకులు, పీడితులు ఉన్నంత వరకు వర్గపోరాటం కొనసాగుతుందని అంటున్నారు. ఇందులో మావోయిస్టుల పోరాటం కేవలం ఒక దశనే అని వారు చెబుతున్నారు.

ప్రధానినే కలవరపరిచారు..
పశుపతి టు తిరుపతి పేరుతో రెడ్ కారిడార్ ఏర్పాటు కోసం మావోయిస్టులు ఉద్యమించారు. దీంతో మావోయిస్టులు పురోగమిస్తున్న తీరు చూసి 'దేశానికి అంతర్గతంగా మావోయిస్టుల నుంచే అతిపెద్ద ప్రమాదం ఉంది'అని అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ 2009 అక్టోబర్ 11న వ్యాఖ్యానించారు. ఆ తర్వాత యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌గా గ్రీన్‌హంట్ మొదలైంది. 2015 తర్వాత కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆపరేషన్ సమాధాన్, ప్రహార్, 2024 జనవరిలో కగార్ (ఫైనల్ మిషన్) మొదలైంది. 2026 మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను సమూలంగా నిర్మూలిస్తామని హోంమంత్రి అమిత్‌షా ఇప్పటికే ప్రకటించారు. అన్నట్లుగానే ప్రత్యేక శిక్షణ పొందిన దళాలను రంగంలోకి దించడంతో మావోయిస్టు పార్టీ తీవ్రంగా నష్టపోయింది. దీంతో శాంతి చర్చల ప్రతిపాదనను ఈ ఏడాది ఏప్రిల్‌లో మావోయిస్టులు తెరపైకి తెచ్చారు. ఇందుకు ప్రభుత్వం సుముఖంగా లేకపోవడంతో నిర్బంధం కొనసాగుతోంది. ఇటీవల వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ఏడుగురు కేంద్ర కమిటీ సభ్యులు చనిపోయారు. ఇందులో ఆ పార్టీ చీఫ్ నంబాల కేశవరావు కూడా ఉన్నారు.


పోచంపల్లి టూరిజం పార్కులో మగ్గాలను పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శామ్‌కోషీ

పోచంపల్లిలో జస్టిస్ శామ్‌కోషీ

భూదాన్‌పోచంపల్లి: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శామ్‌కోషీ శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిని సందర్శించారు. టూరిజం పార్కులో మగ్గాలు, చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియ, ఫొటో గ్యాలరీని తిలకించారు. పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల ప్రాధాన్యం, భూదానోద్యమ చరిత్రను స్థానిక అధికారుల ద్వారా అడిగి తెలుసుకొన్నారు. అనంతరం చేనేత సహకార సంఘం, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కాంప్లెక్స్‌లో పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు, డిజైన్లను పరిశీలించారు. చేనేత కళాకారుల నైపుణ్యాలను కొనియాడారు. చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా హ్యాండ్లూమ్ ఏడీ శ్రీనివాస్‌రావులు జస్టిస్ శామ్‌కోషీని సన్మానించారు.

జిల్లా న్యాయ శాఖ పనితీరు భేష్

- హైకోర్టు జడ్జి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి



రామగిరి(నల్లగొండ): కేసుల పరిష్కారంలో జిల్లా న్యాయ శాఖ పనితీరు ప్రశంసనీయమని హైకోర్టు జడ్జి, నల్లగొండ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి అభినందించారు. నల్లగొండ జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయనకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదులు, సిబ్బంది సహకారంతోనే నల్లగొండ జిల్లా కేసుల పరిష్కారంలో రాష్ట్రంలోనే ముందుందన్నారు. అనంతరం జ్యుడీషియల్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో నల్లగొండ జిల్లా ప్రధాన జడ్జి ఎం.నాగరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కట్టా అనంతరెడ్డి, మంద నగేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.


ఆలయం వద్ద జస్టిస్ శ్రవణ్‌కుమార్

జోగుళాంబ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

అలంపూర్: ఐదో శక్తి పీఠం అలంపూర్ జోగుళాంబ అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ దర్శించుకున్నారు. ఆలయ ఈవో దీప్తి, అర్చకులు జడ్జికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవా రి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను ఆలయ అధికారులు శేషవస్త్రాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. హైకోర్టు జడ్జి వెంట జిల్లా న్యాయమూర్తి ప్రేమలత, స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మిథున్ తేజ, తదితరులున్నారు. అనంతరం ఆయన జోగుళాంబ గద్వా ల జిల్లా కోర్టును సందర్శించారు. తిరుగు ప్రయాణంలో బీచుపల్లి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

'ఇందిరమ్మ' బిల్లు పంట రుణం కింద జమ!

- మహబూబాబాద్ జిల్లాలో బ్యాంకు అధికారుల నిర్వాకం

మహబూబాబాద్ రూరల్: ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుకు విడుదలైన రూ. లక్ష బిల్లును బ్యాంకు అధికారులు పంట రుణం కింద జమ చేసుకున్న ఘటన మహబూబాబాద్ జిల్లాలో వెలుగుచూసింది. జిల్లాలోని మహబూబాబాద్ మండలం పర్వతగిరి గ్రామానికి చెందిన ఎలక యాకమ్మకు ఇందిరమ్మ ఇల్లు మంజూరవడంతో ఇంటి నిర్మాణ పనులు చేపట్టింది. ఈ నెల 8న రూ. లక్ష బిల్లును ఆమె ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. దీంతో డబ్బు కోసం ఆమనగల్ గ్రామంలోని కెనరా (సిండికేట్) బ్యాంకు వెళ్లి అధికారులను అడగ్గా పంట రుణాల కింద జమ చేసుకున్నట్లు పేర్కొన్నారని యాకమ్మ చెప్పింది. ఇందిరమ్మ ఇంటి డబ్బును ఇతర లావాదేవీలకు మళ్లించొద్దని ప్రభుత్వం చెబుతున్నా బ్యాంకు అధికారులు పట్టించుకోవటం లేదు. ఇప్పుడు ఇంటి నిర్మాణ పనులు ఎలా చేపట్టాలని యాకమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంపై ఎంపీడీఓ రఘుపతిరెడ్డిని వివరణ కోరగా బ్యాంకు అధికారులతో మాట్లాడామని.. మరికొద్ది రోజుల్లో యాకమ్మ ఖాతాలో తిరిగి రూ. లక్ష జమ అయ్యేలా చూస్తామన్నారు.

వేములవాడలో రియల్టర్ దారుణ హత్య

కారులోనే గొంతు కోసి చంపిన వైనం ● డ్రైవర్‌పైనే అనుమానం


సిరిగిరి రమేశ్ (ఫైల్)

వేములవాడ అర్బన్: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ శివారులోని నందికమాన్ వద్ద సిరిసిల్లకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, మాజీ కౌన్సిలర్ సిరిగిరి రమేశ్ (55) హత్యకు గురయ్యారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణ శివారుల్లో రమేశ్ పాతికేళ్లుగా రియల్ ఎస్టేట్ వెంచర్లు నిర్వహిస్తున్నాడు. సిరిసిల్లలోని ఇంటి నుంచి శుక్రవారం ఉదయం 9 గంటలకు తన భార్య అడ్వొకేట్ అయిన అనీలను కారులో ఎక్కించుకొని స్థానిక కోర్టు ఆవరణలో దింపి.. డ్రైవర్ వెంకటేశ్‌తో కలిసి వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో భార్యకు రమేశ్ నుంచి మిస్‌కాల్ వచ్చింది. ఆమె వెంటనే ఫోన్ చేయగా అరుపులు, కేకలు వినిపించాయి. ఆ తరువాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తలేదు. శుక్రవారం రాత్రి రమేశ్ ఇంటికి రాలేదు. శనివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో కారులో మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కారు ముందు సీట్లో గొంతు కోసి, పొట్టలో కత్తితో పొడవడంతో తీవ్రరక్తస్రావమై మృతిచెందినట్లు పోలీసులు గుర్తించారు. వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రామ్మోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పాతికేళ్ల క్రితం రమేశ్ కొందరు భాగస్వాములతో కలిసి రియల్ ఎస్టేట్ వెంచర్ వేసి ప్లాట్లు విక్రయించిన నందికమాన్ స్థలంలోనే హత్యకు గురవడం చర్చనీయాంశమైంది. రమేశ్‌కు తాత్కాలిక కారు డ్రైవర్‌గా పని చేస్తున్న వేములవాడకు చెందిన వెంకటేశ్ ఈ హత్యకు పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు. ఇప్పటికే అతను పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. భూకబ్జా, డబుల్ భూ రిజిస్ట్రేషన్లు, మోసం చేసిన కేసుల్లో ఇటీవల రమేశ్‌పై కేసులు నమోదు కావడంతో జైలుకు వెళ్లి వచ్చాడు. రియల్ ఎస్టేట్ భూవివాదాలే హత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు.

23న భాగ్యలక్ష్మి ఆలయం వద్ద బతుకమ్మ వేడుకలు

- బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి

సాక్షి, హైదరాబాద్ : ఈ నెల 23న చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయం వద్ద బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నట్టు బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా.మేకల శిల్పారెడ్డి వెల్లడించారు. ఈ ఉత్సవాల్లో బీజేపీ నేత, సినీనటి ఖుష్బూ, పార్టీ సీనియర్ నేతలు, మహిళా మోర్చా నాయకులు పాల్గొంటారని తెలిపారు. శనివారం శిల్పారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 22న బీజేపీ కార్యాలయంలో బతుకమ్మ వేడుకల నిర్వహణకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేస్తామన్నారు. తెలంగాణలో బతుకమ్మ పండుగ అంటే కవితమ్మ అనే పేటెంట్ ఏమీ లేదని పేర్కొన్నారు.

పోలీస్ కొత్త బాస్ ఎవరు?

▶ మొదటి పేజీ తరువాయి


శిఖాగోయల్

1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. డీజీపీగా శివధర్‌రెడ్డిని నియమిస్తే.. సీవీ ఆనంద్‌ను విజిలెన్స్ డీజీగా పంపడంతోపాటు, ఏసీబీ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనూ సీవీ ఆనంద్ ఏసీబీ, విజిలెన్స్ డీజీగా పనిచేశారు. ఇలా చేయడం వల్ల సీనియారిటీ పరమైన పొరపచ్చాలు తలెత్తకుండా డీజీపీగా శివధర్‌రెడ్డి, పోలీస్ శాఖతో నేరుగా సంబంధం లేకుండా ప్రభుత్వ పరిధిలో పనిచేసే ఏసీబీ, విజిలెన్స్‌కు డీజీగా ఆనంద్ కొనసాగే వెసులుబాటు ఉంటుందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నట్లు తెలిసింది. వీరితోపాటు ప్రస్తుతం డైరెక్టర్ జనరల్ (డీజీ) ర్యాంకులో 1990 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ రవి గుప్తా, డా.సౌమ్యామిశ్రా (1994 బ్యాచ్ ఐపీఎస్), శిఖాగోయల్ (1994 బ్యాచ్ ఐపీఎస్), ఆప్టే వినాయక్ ప్రభాకర్ (1994 బ్యాచ్ ఐపీఎస్) కొనసాగుతున్నారు. వీరిలో రవిగుప్తా ఈ ఏడాది డిసెంబర్ 19న పదవీ విరమణ పొందనున్నారు. ఆప్టే వినాయక్ ప్రభాకర్ కేంద్ర సర్వీస్‌లో ఉన్నారు. మిగిలిన వారిలో శిఖాగోయల్ శిఖాగోయల్ సైతం డీజీపీ రేసులో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

హైదరాబాద్ సీపీకి తీవ్ర పోటీ

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ పోస్టుకు తీవ్ర పోటీ నెలకొనే అవకాశం ఉంది. ప్రస్తుతం సీపీ సీవీ ఆనంద్ బదిలీ అయితే, ఆ స్థానంలోకి ఎవరు వస్తారన్నది ఆసక్తిరంగా మారింది. ఈ పోస్టుకు ప్రధానంగా 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి, ప్రస్తుతం ఆర్టీసీ ఎండీగా పనిచేస్తున్న వీసీ సజ్జనార్, 1995 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి, ప్రస్తుతం శాంతిభద్రతల అడిషనల్ డీజీగా ఉన్న మహేశ్ భగవత్ ప్రధానంగా పోటీ పడుతున్నట్లు సమాచారం. 1996 బ్యాచ్ ఐపీఎస్, సీఐడీ చీఫ్ చారుసిన్హా, 1997 బ్యాచ్ ఐపీఎస్ అధికారులు డీఎస్ చౌహాన్, వై నాగిరెడ్డి అడిషనల్ డీజీ హోదాలో ఉన్నారు. వీరితోపాటు వీవీ శ్రీనివాస్, స్వాతిలక్రా, సంజయ్ కుమార్ జైన్, స్టీఫెన్‌రవీంద్ర సైతం హైదరాబాద్ సీపీ పోస్టుకు అర్హులుగా ఉన్నారు. అయితే, వీరిలో సజ్జనార్ పేరు హైదరాబాద్ సీపీతోపాటు ఇంటెలిజెన్స్ డీజీ పోస్టుకు పరిశీలనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇంటెలిజెన్స్ డీజీగా 1996 బ్యాచ్ ఐపీఎస్ అనిల్‌కుమార్ పేరు సైతం పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. అదేవిధంగా పలు కీలక విభాగాలతోపాటు జిల్లా ఎస్పీల వరకు దసరా పండుగలోపే బదిలీలు జరిగే అవకాశం ఉంది.


రామాలయంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేష్

రామయ్య సేవలో హైకోర్టు న్యాయమూర్తి

భద్రాచలం టౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని హైకోర్టు జడ్జి జస్టిస్ భీమపాక నగేష్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఐవీ సుబ్బారావు కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీలోని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీకేకే రావు కూడా స్వామివారిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో దామోదర్‌రావు, భద్రాచలం కోర్టు న్యాయమూర్తి వి.శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కంప్రెషన్ బ్యాండ్‌తో.. కత్తిలాంటి ఫేస్‌కట్!?

▶ మొదటి పేజీ తరువాయి

డ్రైనేజ్ వ్యవస్థ క్రియాశీలం అవుతుంది. దాంతో ముఖ చర్మం బిగుతుగా మారి ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఫేస్ మసాజ్‌లో జరిగేది కూడా ఇదే.

వరంలా మారుతోంది!
సోషల్ మీడియాలో ఎప్పుడు ఏది ట్రెండింగ్‌లోకి వస్తుందో తెలీదు. ఈ ఫేస్ బ్యాండ్ కూడా ఇప్పుడు అలాగే ట్రెండ్ అవుతోంది. దవడల్ని పదునెక్కించి, ముఖ చర్మంలోని వదులును తగ్గించుకునేందుకు మహిళలు ఈ కంప్రెషన్ బ్యాండ్‌ల పట్ల ఆసక్తి చూపుతున్నారు. కాస్మెటిక్స్ వాడటం ఇష్టం లేనివారికి ఇదొక వరంలా కనిపిస్తోంది. పైగా వీటిని ఇంట్లోనే అమర్చుకోవచ్చు. ఎవరికీ కనిపించకూడదు అనుకుంటే.. రాత్రుళ్లు పెట్టుకుని పడుకోవచ్చు. తీసిన కొన్ని గంటల వరకు ముఖ్యం పలుచగా, తేటగా కనిపిస్తుంది.

మైనస్‌లూ ఉన్నాయి
నిపుణులు చెబుతున్న దాన్ని బట్టి కంప్రెషన్ బ్యాండ్‌లు పైకి హాని చేయనివిగా కనిపించవచ్చు కానీ, వాటిని సరిగ్గా ఉపయోగించకపోతే మాత్రం సురక్షితం కావు. 'బ్యాండ్ పట్టి ఉంచే ఒత్తిడికి ముఖంలో అసౌకర్యంగా ఉంటుంది. తలనొప్పి రావచ్చు. రక్త ప్రసరణ పరిమితం కావచ్చు. బ్యాండ్ లోపలి వైపు చర్మానికి చెమట పట్టి దద్దుర్లు తేలొచ్చు. పైగా ఎక్కువసేపు ధరించటం వల్ల ముఖంపై నొక్కులు పడతాయి. తిమ్మిరి కూడా ఉండొచ్చు' అంటున్నారు చర్మవైద్య నిపుణులు.

జీవనశైలి.. చక్కటి పరిష్కారం

ముఖ సౌందర్యానికి డైటీషియన్లు చెబుతున్న కొన్ని ప్రధాన సూచనలు
- రోజూ సరిపడా నీళ్లు తాగటం
- కంటి నిండా నిద్రపోవడం
- ముఖాన్ని రోజుకు కనీసం రెండుసార్లు శుభ్రంగా కడుక్కోవడం
- ఒత్తిడి, ఆందోళన దరిచేరకుండా ఆనందంగా ఉండటం.. అన్ని రకాల పోషకాలూ ఉండే ఆహారం తీసుకోవడం
- ఉదయపు ఎండలో తగినంత వ్యాయామం చేయడం
- ఆహారంలో ఉప్పు తగ్గించటం
- బరువు పెరగకుండా జాగ్రత్త పడటం

నాణ్యమైనవి కాకుంటే?
'కంప్రెషన్ బ్యాండ్‌లు నాణ్యమైనవి కాకపోతే అది మరో సమస్య. అందువల్ల ముఖానికి వదులుగా గానీ, బిగుతుగా గానీ అనిపించవచ్చు. సమానంగా కాకుండా ఎగుడు దిగుడుగా సాగొచ్చు. దవడ, చెవులపై అధిక ఒత్తిడిని కలిగించవచ్చు. ఇందువల్ల కొన్నిసార్లు తల తిరిగినట్లు కూడా అవుతుంది' అని చెప్తున్నారు కాస్మెటాలజిస్టులు.

సర్జరీల తరువాత!: ఫేస్ లిఫ్టింగ్ స్ట్రాప్స్ లేదా చిన్ స్ట్రాప్ అని కూడా వాడుకలో ఉన్న ఫేషియల్ కంప్రెషన్ బ్యాండ్‌లు సాధారణంగా శస్త్ర చికిత్స తర్వాత కోలుకోవటానికి కొంతవరకు ఉపయోగపడతాయి. అవి మెడపై స్థిరమైన ఒత్తిడి ఉండేలా చూస్తాయి. ముఖానికి, నోటికి శస్త్ర చికిత్స జరిగినప్పుడు ఆ వాపును, గాయాలను తగ్గించటానికి రక్త ప్రసరణ మెరుగయ్యేలా ఈ బ్యాండ్‌లు సహాయపడతాయి. కొంత మంది డబుల్ చిన్ (దవడ కింద చర్మం జారిపోవడం) వంటివి తగ్గించుకోవడానికి వాడుతుంటారు.

ముఖ వ్యాయామాలు ఉత్తమం
ఫేషియల్ బ్యాండ్‌ల కంటే ముఖ వ్యాయామాలు ఉత్తమమని ఫిట్‌నెస్ నిపుణులు సూచిస్తున్నారు. 'చెంప, దవడల వ్యాయామాల వంటివి ముఖ కండరాలను బలోపేతం చేస్తాయి. రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. చర్మాన్ని బిగుతుగా ఉంచడంలో సాయపడతాయి. వైద్యులు సూచించే కొన్ని ఔషధాలతోనూ ముఖ చర్మాన్ని సంరక్షించుకోవచ్చు' అని వారు సలహా ఇస్తున్నారు.

థెరపీలూ, చికిత్సలూ!
రేడియోఫ్రీక్వెన్సీ, అల్ట్రాసౌండ్ థెరపీ, లేజర్ లైటింగ్ వంటి చికిత్సలతో ముఖ చర్మాన్ని దీర్ఘకాలం చక్కటి ఆకృతిలో ఉంచుకోవటం సాధ్యమేనని చర్మవ్యాధి నిపుణులు చెబుతున్నారు. చర్మంపై ముడతలను పోగొట్టే డెర్మల్ ఫిల్లర్‌లు, బొటాక్స్ ఇంజెక్షన్‌లు కూడా ప్రభావవంతంగా పనిచేస్తాయని సూచిస్తున్నారు.


జస్టిస్ శరత్‌కు వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

సత్వరం తీవ్ర నేరాల కేసుల విచారణ

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్

భువనగిరి టౌన్/యాదగిరిగుట్ట: లోక్‌అదాలత్‌లతో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారమవుతున్న క్రమంలో.. తీవ్ర నేరాల కేసుల విచారణను వేగవంతం చేయాలని హైకోర్టు న్యాయమూర్తి, భువనగిరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి జస్టిస్ కె.శరత్ ఆదేశించారు. భువనగిరిలో శనివారం జరిగిన జిల్లా న్యాయమూర్తుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, కేసు వాయిదాల గడువును తగ్గించాలని జస్టిస్ కె.శరత్ సూచించారు. కోర్టుల వారీగా పెండింగ్ కేసులను సమీక్షించి పరిష్కారానికి పలు సూచనలు చేశారు. పట్టణ శివారు మాసుకుంటలో జిల్లా కోర్టు భవనాల నిర్మాణానికి కేటాయించిన పది ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. త్వరలో నిర్మాణ పనులకు శంకుస్థాపన జరపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భువనగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు, న్యాయమూర్తులు ముక్తిదా, వి.మాధవీలత, సబిత, ఎస్.శ్యాంసుందర్, ఆర్.అజయ్‌కుమార్, మహతి వైష్ణవి, జి.స్వాతి, ఎస్.శిరీష, చండీశ్వరిదేవి పాల్గొన్నారు. అంతకుముందు జస్టిస్ శరత్‌కు భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ అక్షాంశ్‌యాదవ్ స్వాగతం పలికారు. జస్టిస్ శరత్ యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని శనివారం దర్శించుకున్నారు. ఆయనకు అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి లడ్డూ ప్రసాదంతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

చంద్రబాబు కుట్రల ముందు
నక్క జిత్తులు ఎందుకూ పనికిరావు...!

ఈనాడు పత్రిక కట్టుకథలకైతే
శకుని కుతంత్రాలు కూడా తీసికట్టే...!

అలాంటి ఇద్దరూ కుమ్మక్కై
బరితెగిస్తే ఎలా ఉంటుందో తెలుసా...?

అబద్ధానికి ప్రతిరూపంలా...
దుర్మార్గానికి నిలువుటద్దంలా నిలుస్తుంది...!

అడ్డగోలుతనానికి అక్షర రూపంలా...
ఓ నిలువెత్తు సాక్ష్యంలా కనిపిస్తుంది..!

మద్యం అక్రమ కేసులో చంద్రబాబు- ఈనాడు
ఇలానే పన్నాగాలు పన్నుతున్నారు..!

సిట్‌ను అడ్డం పెట్టుకుని...
సిగ్గులేకుండా అవాస్తవాలు అచ్చోస్తున్నారు...!

పాత్రికేయ కుతంత్రం

పచ్చ మైకంలో.. ఈనాడు అచ్చోసిన అబద్ధాలు

మాజీ సీఎం వైఎస్ జగన్ సతీమణి భారతిపై దుష్ప్రచారం

సిట్ తనిఖీలు చేసిన కంపెనీల్లో ఆమె డైరెక్టర్ అంటూ అసత్య ప్రచారం


వైఎస్ అనిల్‌రెడ్డి కంపెనీల్లో సిట్ సోదాలు
- ఆయన జగన్ పెదనాన్న కుమారుడు
- ఆ కంపెనీల్లో గతంలో డైరెక్టర్‌గా ఉన్న జగన్ సతీమణి భారతి
- చెన్నై, హైదరాబాద్‌ల్లో మొత్తం 10 చోట్ల సిట్ తనిఖీలు

2020లో డైరెక్టర్‌గా వైదొలగిన భారతి

నేడు.. వైఎస్ జగన్ సతీమణి భారతికి సంబంధం లేకపోయినా వైఎస్ అనిల్‌రెడ్డి కంపెనీల్లో డైరెక్టర్ అంటూ ఈనాడు కుతంత్రం

సాక్షి, అమరావతి: నక్కజిత్తులను తలదన్నే చంద్రబాబు, శకుని కుతంత్రాలను మించిన ఈనాడు పత్రిక తోడుదొంగల మాదిరి మద్యం అక్రమ కేసులో కట్టుకథలు వండివారుస్తున్నారు. చంద్రబాబు విషపు రాజకీయాలను కొమ్ముకాసే రామోజీ కుటుంబ విష పుత్రిక ఈనాడు అంతకంతకూ బరితెగిస్తోంది. రాజకీయ స్వార్థం కోసం ఎంతకైనా దిగజారే తమ 'బాబు'కు గొడుగు పడుతూ అసలు నైజం చాటుకుంటోంది. నిత్యం ఉషోదయాన అసత్యాలను ప్రవచించడమే ఏకైక విధానంగా చేసుకున్న ఈనాడు... ఈ కోవలోనే 'వైఎస్ అనిల్ రెడ్డి కంపెనీల్లో సిట్ సోదాలు' శీర్షికన శనివారం ఓ అబద్ధపు కథనాన్ని అచ్చేసింది. పాత్రికేయ విలువలకు పాతరేస్తూ... అవాస్తవాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేసింది.

- మద్యం అక్రమ కేసులో సిట్ సోదాలు నిర్వహించిన రెండు కంపెనీల్లో మాజీ సీఎం వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతి గతంలో డైరెక్టర్‌గా ఉన్నారంటూ అసత్యాన్ని ఈనాడు నిస్సిగ్గుగా ప్రచురించింది. ఆ రెండు కంపెనీల్లో వైఎస్ భారతి ఏనాడూ డైరెక్టర్‌గా లేరని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్వోసీ) రికార్డులు స్పష్టం చేస్తున్నా... పచ్చ పత్రిక మాత్రం ఉద్దేశపూర్వకంగా అబద్ధపు కథనాన్ని వదిలింది. చంద్రబాబు ప్రభుత్వం కుట్రలో ప్రధాన పాత్రధారిగా అసత్య కథనాలతో తన అసలు స్వరూపాన్ని ప్రదర్శించింది.

బాబు, ఈనాడు క్షుద్ర రాజకీయానికి పరాకాష్ట

వైఎస్ జగన్ సతీమణి భారతిపై దుష్ప్రచారం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యంగా చంద్రబాబు, ఈనాడు సాగిస్తున్న కుట్ర పరాకాష్ఠకు చేరింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లేని మద్యం స్కాంను ఉన్నట్టుగా చూపించేందుకు సాగిస్తున్న వారి కుతంత్రాలు మరింత పదునెక్కాయి. ఈసారి ఏకంగా వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతిని లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారానికి దిగి కుట్రను పతాకస్థాయికి తీసుకెళ్లారు. మద్యం అక్రమ కేసు దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు వైఎస్ జగన్ సమీప బంధువు వైఎస్ అనిల్‌రెడ్డికి చెందిన షిలో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఫోరెస్ ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతోలపాటు మరో ఆరు కంపెనీల్లో శుక్రవారం సోదాలు నిర్వహించారు. అయితే, ఇదే అవకాశంగా చేసుకుని చంద్రబాబు ప్రభుత్వ డైరెక్షన్‌లో... వైఎస్ భారతిపై దుష్ప్రచారం చేసేందుకు ఈనాడు బరితెగించింది.

- షిలో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఫోరెస్ ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో వైఎస్ భారతి 2020 వరకు డైరెక్టర్‌గా ఉన్నారని ఈనాడు నిస్సిగ్గుగా అవాస్తవ కథనం ప్రచురించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అక్రమ నిధులు మళ్లించేందుకు 2019లో ఆ కంపెనీలను ఏర్పాటు చేశారని కూడా చెప్పుకొచ్చింది. అబద్ధాల విష పుత్రిక అయిన ఈనాడు... పాత్రికేయ విలువలు కాలరాస్తూ అసత్య కథనాన్ని శనివారం ప్రధాన ఎడిషన్ మొదటి పేజీ, రెండో పేజీ ప్రచురించింది. వైఎస్ జగన్ సతీమణి భారతి గతంలో డైరెక్టర్‌గా ఉన్న కంపెనీల్లో సిట్ సోదాలు అని ప్రచురించి ప్రజలను తప్పుదారి పట్టించేందుకు యత్నించింది.

ఆ కంపెనీల్లో వైఎస్ భారతి డైరెక్టర్‌గా ఏనాడూ లేరు

స్పష్టం చేస్తున్న ఆర్వోసీ రికార్డులు

అసలు వాస్తవం ఏమిటంటే... వైఎస్ అనిల్‌రెడ్డికి చెందిన షిలో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఫోరెస్ ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో వైఎస్ జగన్ సతీమణి భారతి ఏనాడూ డైరెక్టర్‌గా లేనే లేరు. ఇదేమీ బ్రహ్మ రహస్యం కాదు. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్వోసీ) డిన్ (డైరెక్టర్ ఐడెంటిఫికేషన్ నంబర్)ను పరిశీలిస్తే ఇట్టే తెలిసిపోతుంది. ఓ వ్యక్తి గతంలో ఏయే కంపెనీల్లో డైరెక్టర్‌గా ఉన్నారు...? ప్రస్తుతం ఏ కంపెనీల్లో ఉన్నారనే విషయాలు తెలుసుకోవచ్చు. ఆర్వోసీ రికార్డులు ఓపెన్ డాక్యుమెంట్లే. వెబ్‌సైట్‌లో అందరికీ అందుబాటులో ఉంటాయి. అయినా సరే, ఈనాడు కుట్రపూరితంగా అబద్ధపు కథనాన్ని ప్రచురించింది. ఆ రెండు కంపెనీల్లో వైఎస్ జగన్ సతీమణి భారతి 2020 వరకు డైరెక్టర్‌గా ఉన్నారని పచ్చి అవాస్తవ కథనాన్ని ప్రచురించి ప్రజలను తప్పుదారి పట్టించేందుకు యత్నించింది.

పక్కా కుట్రతోనే దుష్ప్రచారం

చంద్రబాబు డైరెక్షన్‌లో ఈనాడు పక్కా పన్నాగంతోనే మాజీ సీఎం వైఎస్ జగన్ సతీమణి భారతిపై అవాస్తవ కథనం ప్రచురించింది. ఆర్వోసీ కేటాయించే డిన్‌తో రికార్డులు పరిశీలిస్తే ఒక వ్యక్తి గతంలో, ప్రస్తుతం ఏఏ కంపెనీల్లో డైరెక్టర్‌గా ఉన్నారన్నది వెల్లడవుతుంది. ఒకే ఇంటి పేరు, ఒకే పేరుతో ఉన్న వ్యక్తుల పట్ల కూడా సందేహం రాకుండా ఉండేందుకు అందరి పేర్లతో పాటు వారి తండ్రి, భర్త పేర్లు, వయసు వంటి వివరాలు అందులో పొందుపరుస్తారు. కానీ, షిలో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఫోరెస్ ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో వైఎస్ భారతి డైరెక్టర్‌గా ఉండేవారు అని దురుద్దేశపూర్వకంగానే ఈనాడు కథనం రాసింది. ఆర్వోసీ రికార్డులను పరిశీలిస్తే ఆ రెండు కంపెనీల్లో గతంలో డైరెక్టర్‌గా వ్యవహరించినది వైఎస్ అనిల్‌రెడ్డి తల్లి భారతి అని ఇట్టే తెలుస్తుంది. ఆమె వయసు, ఆమె భర్త పేరు కూడా ఆ రికార్డుల్లో ఉన్నాయి. డైరెక్టర్‌గా వ్యవహరించింది వైఎస్ జగన్ సతీమణి భారతి కాదు వైఎస్ అనిల్‌రెడ్డి తల్లి వైఎస్ భారతి అని సులువుగా తెలుసుకోగలం. కానీ, ఈనాడు చంద్రబాబు ప్రభుత్వ ఆదేశాల మేరకు కుట్రపూరితంగా వ్యవహరించింది. ఆ రెండు కంపెనీల్లో వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతి 2020 వరకు డైరెక్టర్‌గా వ్యవహరించారని అవాస్తవ కథనం ప్రచురించింది. వైఎస్ జగన్ కుటుంబ సభ్యుల ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు ఉద్దేశపూర్వకంగానే ఇలా చేసింది. మరి... అలాగైతే నారా ఇంటి పేరుతో ఆ కుటుంబంలో వేర్వేరు తరాలకు చెందిన వందలమంది ఉన్నారు. వారందరి ఆస్తులు చంద్రబాబుకే చెందుతాయని చెబితే ఆయన సమ్మతిస్తారా... లేదు కదా...? మరి అదే సూత్రం వైఎస్ కుటుంబానికి కూడా వర్తిస్తుంది కదా...! ఈ సంగతి తెలిసినా చంద్రబాబు ప్రభుత్వం, ఈనాడు కుట్రపూరితంగా వ్యవహరించాయి.


ఎమ్మార్ కుంభకోణంలో సునీల్‌రెడ్డే కీలకం
- ఎమ్మార్ ప్రాపర్టీస్ కుంభకోణం కేసులో జగన్ ఏ-1 కాగా సునీల్‌రెడ్డి ఏ-7. ఎమ్మార్ స్థలాల విక్రయాల్లో జరిగిన లూటీ ద్వారా సమకూరిన సొమ్ములో దాదాపు రూ.96 కోట్లు సునీల్‌రెడ్డికి అందినట్లు దర్యాప్తులో తేల్చిన సీబీఐ.. అప్పట్లో ఆయన్ను అరెస్టు చేసింది.
- జగన్ తరఫున అక్రమ వసూళ్లు, నిధులను విదేశాలకు తరలించడంలో సునీల్‌రెడ్డి కీలక పాత్ర పోషించినట్లు సీబీఐ అభియోగాలు మోపింది. వైఎస్ ప్రభుత్వం నుంచి లబ్ధి పొందినవారిచ్చే ముడుపులకు సునీల్‌రెడ్డి సంధానకర్తగా వ్యవహరించారన్న ఆరోపణలూ ఉన్నాయి.
- ఎమ్మార్ కుంభకోణంలో విల్లాల విక్రయంపై అదనంగా వసూలుచేసిన సొమ్ము సునీల్‌రెడ్డి, ఆయన తండ్రి సంగిరెడ్డి వ్యవస్థాపక డైరెక్టర్లుగా ఉన్న కంపెనీల్లోకి బదిలీ అయినట్లు సీబీఐ గుర్తించింది.

నిన్న.. ఎమ్మార్ కేసులో వైఎస్ జగన్ ఏ1 అంటూ ఈనాడు అచ్చోసిన అబద్ధం

దుష్ప్రచారం... దుమ్మెత్తిపోయడం...

- నిన్న ఎమ్మార్ కేసులో వైఎస్ జగన్ ఏ-1 అంటూ తప్పుడు రాతలు
- నేడు సిట్ తనిఖీలు చేసిన కంపెనీల్లో వైఎస్ భారతి డైరెక్టర్ అంటూ విషప్రచారం
- వారం వ్యవధిలోనే పచ్చ ముఠా బరితెంగిపునకు పరాకాష్ఠ
- అబద్ధం అని తెలిసి కూడా విషం కక్కుతూ క్షుద్ర పాత్రికేయం

ప్రత్యర్థిని దొంగదెబ్బ తీసేందుకు దుష్ప్రచారం... విషం కక్కుతూ దుమ్మెత్తిపోయడం చంద్రబాబు, ఈనాడు సారథ్యంలోని పచ్చముఠాకు వెన్నతో పెట్టిన విద్య. వారం రోజుల వ్యవధిలోనే వారు చేసిన దుష్ప్రచారం చూస్తే ఈ విషయం మరింత స్పష్టం అవుతుంది. ఉమ్మడి ఏపీలో నమోదైన ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసులో వైఎస్ జగన్‌ను ప్రధాన నిందితుడిగా(ఏ1) పేర్కొంటూ ఈ నెల 13న ఈనాడు అవాస్తవ కథనాన్ని ప్రచురించి ప్రజలను తప్పుదారి పట్టించాలని చూసింది. చంద్రబాబు కుట్రలో భాగంగా 2010-11 నాటి ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసును తెరపైకి తెచ్చింది. ఆ కేసులో వైఎస్ జగన్ నిందితుల జాబితాలోనే లేరు. కానీ, ప్రధాన నిందితుడు (ఏ1) అంటూ ప్రముఖంగా ప్రచురించింది. ఇదే కేసులో ఏ-7 హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది, చిన్నాచితక వ్యాపారాలు చేసుకునే నర్రెడ్డి సునీల్‌రెడ్డి ఆయనకు అత్యంత సన్నిహితుడని కూడా చెప్పుకొచ్చింది. వైఎస్ జగన్ తరఫున సునీల్ రెడ్డి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని, విదేశాలకు నిధులు తరలించారని అవాస్తవాలు, అభూత కల్పనలను ప్రచురించింది. ఇలాంటి కథనాన్ని ప్రచురించే ముందు ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసు పూర్వాపరాలు తెలుసుకోవాలని అయినా ప్రయత్నించలేదు. కనీసం ఆ కేసులో సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిశీలించినా నిజాలు వెల్లడవుతాయి. అయితే, కేవలం చంద్రబాబు చెప్పినట్టు వైఎస్ జగన్‌పై బురదజల్లడమే లక్ష్యం అయిన ఈనాడు అవేమీ పట్టించుకోలేదు. ఇక ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసులో 14 మందిని నిందితులుగా పేర్కొంటూ సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ జాబితాలో వైఎస్ జగన్ పేరు లేనే లేదు. తాజాగా మద్యం అక్రమ కేసులో సిట్ తనిఖీలు చేసిన కంపెనీల్లో వైఎస్ భారతి ప్రస్తావన కూడా ఇదే తరహాలోనిదే. గతంలో డైరెక్టర్‌గా ఉన్నారనే అసత్యాన్ని ఈనాడు అచ్చోసింది.

- ఇదంతా చూస్తుంటే ఈనాడు క్షుద్ర పాత్రికేయం స్పష్టం అవుతోంది. అబద్ధం అని తెలిసి కూడా దానిని ప్రజల్లోకి వదలడం దాని విష ప్రచారానికి అద్దం పడుతోంది.

ఈనాడుపై న్యాయపరమైన చర్యలు

నోటీసులు పంపించిన వైఎస్ భారతిరెడ్డి

అవాస్తవ కథనాన్ని ప్రచురించారని ఆగ్రహం

సాక్షి, అమరావతి: తన ప్రతిష్ఠకు భంగకరంగా అవాస్తవ కథనాన్ని ప్రచురించిన ఈనాడుపై మాజీ సీఎం వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి తీవ్రంగా స్పందించారు. సిట్ సోదాలు నిర్వహించిన షిలో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఫోరెస్ ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో తాను 2020 వరకు డైరెక్టర్‌గా ఉన్నట్లు ఈనాడు ఇచ్చిన కథనం పూర్తిగా అవాస్తవం అని వైఎస్ భారతి స్పష్టం చేశారు. ఈ మేరకు ఈనాడు ప్రచురణ సంస్థ ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఆ పత్రిక ఏపీ ఎడిషన్ ఎడిటర్ ఎం.నాగేశ్వరరావుకు తన న్యాయవాదుల ద్వారా శనివారం నోటీసులు పంపించారు.

- భారతిరెడ్డి ఎడుగూరి సందింటి అనే పేరు గల మరో మహిళ ఆ కంపెనీల్లో డైరెక్టర్‌గా వ్యవహరించారని, తాను కాదని ఆమె వెల్లడించారు. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్వోసీ) ప్రకారం ఆమె గుర్తింపు నంబరు (డిన్-డైరెక్టర్ ఐడెంటిఫికేషన్ నంబర్) 02584220 కాగా, తన డిన్ 01580536 అని తెలిపారు. సిట్ సోదాలు నిర్వహించిన కంపెనీలతో తనకు ఏమాత్రం సంబంధం లేదని వైఎస్ భారతి తేల్చి చెప్పారు. కానీ, ఆ రెండు సంస్థల్లో తాను డైరెక్టర్‌గా ఉన్నట్లు, అక్రమ నిధులను మళ్లించినట్లు ఈనాడు దురుద్దేశపూర్వకంగా అవాస్తవ కథనాన్ని ప్రచురించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనాడు కథనం తన ప్రతిష్ఠకు భంగం కలిగించేదిగా ఉంది అని వైఎస్ భారతి తీవ్ర అభ్యంతరం తెలిపారు. దీనిపై ఈనాడు పత్రిక తక్షణం వివరణను ప్రచురించాలని డిమాండ్ చేశారు. అవాస్తవ కథనాన్ని ప్రచురించినంత ప్రాముఖ్యతతో అదే (మొదటి) పేజీల్లో తన వివరణను రెండు రోజుల్లో ప్రచురించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. లేదంటే ఈనాడు ఉద్దేశపూర్వకంగానే తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరించిందని భావించాల్సి వస్తుందన్నారు. అవాస్తవ కథనాన్ని ప్రచురించినందుకు న్యాయపరంగా అన్ని చర్యలు తీసుకునే హక్కు తనకు ఉందని స్పష్టం చేశారు.

చంద్రబాబు అవినీతి కేసులను కప్పిపుచ్చేందుకే...

టీడీపీ కూటమి ప్రభుత్వం ఇంతగా బరితెగించి వైఎస్ జగన్, ఆయన కుటుంబ సభ్యులపై ఎందుకు దుష్ప్రచారం చేస్తోందంటే... చంద్రబాబు అవినీతి దందాను కప్పిపుచ్చేందుకే అనే సమాధానం ఠక్కున వస్తుంది. ఎందుకంటే మద్యం, ఇసుక, ఇతర ఖనిజాల దందాలో చంద్రబాబు యథేచ్ఛగా అవినీతికి పాల్పడ్డారు. 2014-19 టీడీపీ హయాంలో మద్యం విధానం ముసుగులో టీడీపీ సిండికేట్ బరితెగించి దోపిడీ చేసింది. రెండు చీకటి జీవోలతో బార్లు, మద్యం దుకాణాలపై ప్రివిలేజ్ ఫీజు తొలగించింది. తద్వారా రూ.5,200 కోట్ల మేర ప్రభుత్వ ఖజానాకు గండికొట్టింది. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం అమ్మకాలు సాగించి రూ.20 వేల కోట్లు కొల్లగొట్టింది. వెరసి రూ.25 వేల కోట్లు దోపిడీ చేసింది. ఈ వాస్తవాన్ని సీఐడీ గతంలోనే ఆధారాలతో సహా నిగ్గు తేల్చి... చంద్రబాబు, అప్పటి ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర తదితరులపై కేసు నమోదు చేసింది. ఈ కేసులో చంద్రబాబు ఇప్పటికీ బెయిల్‌పైన ఉన్నారు. ఇక 2024లో టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మద్యం, ఇసుక, ఖనిజాల దందాకు చంద్రబాబు తెరతీశారు. టీడీపీ సిండికేట్‌కు ఏకపక్షంగా 4,700 మద్యం దుకాణాలు కేటాయించడంతో పాటు అంతే సంఖ్యలో పర్మిట్ రూమ్‌లకు అనుమతినిచ్చింది. అనధికారికంగా ఏకంగా 75 వేల బెల్ట్ దుకాణాలను ఏర్పాటు చేశారు. 924 బార్లు ఏకపక్షంగా టీడీపీ సిండికేట్‌కు కట్టబెడుతున్నారు. ఎంఆర్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తూ భారీగా దోపిడీ చేస్తున్నారు. గంజాయి, ఇతర డ్రగ్స్ రాకెట్ రాష్ట్రంలో చెలరేగిపోతోంది. ఉచిత ఇసుక విధానం ముసుగులో టీడీపీ నేతల దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. ప్రభుత్వ ఖజానాకు గండిపడి... టీడీపీ ప్రజాప్రతినిధులు మాత్రం జేబులు నింపుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక విక్రయాల ద్వారా రూ.700 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం రాగా, టీడీపీ కూటమి ప్రభుత్వంలో రూపాయి కూడా రాలేదు. కానీ టీడీపీ ప్రజాప్రతినిధులు రోజూ వేల లారీల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తూ భారీ దోపిడీకి పాల్పడుతున్నారు. ఇలా చంద్రబాబు ప్రభుత్వం యథేచ్ఛగా సాగిస్తున్న అవినీతి దందా నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే మద్యం విధానంపై అక్రమ కేసుతో వేధింపులకు పాల్పడుతోందన్నది సుస్పష్టం.

చంద్రబాబు, సిట్, ఎల్లో మీడియా తొలినుంచీ అదే కుట్ర

- మద్యం అక్రమ కేసులో ఒక్కో పాత్రను తెస్తూ కుతంత్రాలు
- ఎవరో ఒకరిపై బురదజల్లడం, సోదాలు, అరెస్టులు
- వారితో సంబంధాలు ఉన్నాయని 10 మందిని అరెస్టు చేయడం..
- దొంగ డాక్యుమెంట్లు... నగదును చూపెడుతూ దుష్ప్రచారం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా నిర్వహించిన మద్యం విధానంపై అక్రమ కేసు నమోదు చేసి దర్యాప్తు పేరిట చంద్రబాబు సర్కారు తొలినుంచీ కుట్రపూరితంగానే వ్యవహరిస్తోంది. అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలతో న్యాయస్థానాలను సైతం తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తోంది.

- మద్యం విధానంతో గాని అసలు ఏపీ ప్రభుత్వ వ్యవహారాలతో ఏమాత్రం సంబంధం లేని వ్యక్తుల పేర్లను ఈ అక్రమ కేసులో ఇరికిస్తూ దుష్ప్రచారానికి పాల్పడుతోంది. అక్రమ కేసు కాబట్టి ఎలానూ నిరూపించలేరు... ఈలోగా ఈనాడు, ఇతర ఎల్లో మీడియాలో దుష్ప్రచారం చేసి వారి పరువు, ప్రతిష్ఠలను దెబ్బతీయొచ్చన్నదే చంద్రబాబు ప్రభుత్వ కుతంత్రం.
- రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్‌రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, అంతర్జాతీయ సిమెంట్ దిగ్గజ సంస్థ వికాట్ కంపెనీ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప పేర్లను మద్యం అక్రమ కేసుతో ముడిపెట్టింది. వారిని అక్రమంగా అరెస్టు చేసి జైలు పాల్జేసింది. తర్వాత వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపింది. అంతటితో చంద్రబాబు కుట్రలకు తెరపడలేదు. మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కారుమూరు నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు రాంప్రసాద్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి పేర్లను తెరపైకి తెచ్చింది.
- సిట్ కుట్రలు ఇంకా కొనసాగాయి... హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది నర్రెడ్డి సునీల్‌రెడ్డి, భార్గవ్ పేర్లను కూడా సిట్ కుట్రపూరితంగానే ఈ కేసుతో ముడిపెట్టింది. ఇక వైఎస్ జగన్ సమీప బంధువు వైఎస్ అనిల్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వేధింపులను తీవ్రం చేసింది. ఆయన తరఫున వ్యవహారాలు నిర్వహించేవారు, అత్యంత కీలక వ్యక్తులు అంటూ ఎల్లో మీడియా ద్వారా అవాస్తవ కథనాలు ప్రచారంలోకి తీసుకొచ్చింది.
- మద్యం అక్రమ కేసులో ఒక్కో పాత్రను తెస్తూ కుతంత్రాలు పన్నుతోంది కూటమి ప్రభుత్వం. ముందుగా ఎవరో ఒకరిపై బురదజల్లడం, సోదాలు, అరెస్టులు చేయడం.. వారితో సంబంధాలు ఉన్నాయని 10 మందిని అరెస్టు చేయడం పనిగా పెట్టుకుంది. దొంగ డాక్యుమెంట్లు, నగదును చూపెడుతూ దుష్ప్రచారం సాగిస్తోంది. ఎవరిని అరెస్టు చేయాలనుకున్నా, ఎవరి కంపెనీలు, నివాసాల్లో తనిఖీలు చేయాలన్నా సరే... వారు వైఎస్ జగన్‌కు అత్యంత సన్నిహితులు అంటూ ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచారం చేయడం, అనంతరం సిట్ అధికారులు రంగంలోకి దిగడం... ఇలా పక్కా పన్నాగంతో చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఈ లెక్కన ఈనాడు రామోజీరావు కుటుంబం, టీడీపీ ఎంపీ భరత్ కుటుంబం యావత్ చంద్రబాబుకు అత్యంత సన్నిహితులు. మరి ఈనాడు-ఈటీవీ సంస్థలు, రామోజీ ఫిలింసిటీ, గీతం విద్యా సంస్థలు చంద్రబాబువే అవుతాయా...!? ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, టీవీ 5 బీఆర్ నాయుడు కూడా చంద్రబాబు పచ్చ తానులో ముక్కలే. మరి వారి ఆస్తులన్నీ కూడా చంద్రబాబువేనా!? టీడీపీ కూటమి ప్రభుత్వం, ఈనాడుతో పాటు ఎల్లో మీడియా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విషయంలో అదే రీతిలో వాదిస్తున్నాయి మరి. ఇక రెడ్‌బుక్ కుతంత్రాలకు పరాకాష్ఠగా వైఎస్‌జగన్ సతీమణి వైఎస్ భారతి పేరును కూడా ఈ అక్రమ కేసు ఉచ్చులోకి లాగేందుకు చంద్రబాబు ప్రభుత్వం బరితెగించింది. అందుకే వైఎస్ భారతికి ఏమాత్రం సంబంధం లేకపోయినా షిలో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఫోరెస్ ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో ఆమె గతంలో డైరెక్టర్‌గా వ్యవహరించారనే తప్పుడు కథనాన్ని కుట్రపూరితంగానే ఈనాడు ప్రముఖంగా ప్రచురించింది.

'సాక్షి'పై మరో రెండు కేసులు

కొనసాగుతున్న అక్రమ కేసుల పరంపర

- 'సాక్షి' న్యూస్ పేపర్, న్యూస్ ఛానల్, పబ్లిషర్, కర్నూలు బ్యూరోపై నమోదు
- మంత్రి టీజీ భరత్‌కు వ్యతిరేకంగా వార్త రాశారని టీడీపీ నేతల ఫిర్యాదు
- ఆ మేరకు 2వ, 3వ పట్టణ పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేసిన పోలీసులు
- కర్నూలులోని బీ, సీ క్యాంపు స్థలాలను కారు చౌకగా కొట్టేసే కుట్రపై సాక్షి కథనం
- వాస్తవానికి ఆ కథనంలో ఎక్కడా మంత్రి టీజీ భరత్ పేరే లేదు
- అయినా గుమ్మడికాయల దొంగ.. అంటే భుజాలు తడుముకున్నారనే చందంగా స్పందన
- అనుచరులను ఉసిగొలిపి తప్పుడు కేసు పెట్టించిన వైనం

సాక్షి ప్రతినిధి కర్నూలు: 'సాక్షి'పై ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వానికి, అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు వ్యతిరేకంగా వార్తలు రాస్తే అక్రమ కేసులు నమోదు చేస్తామని మీడియాను బెదిరిస్తూ ప్రభుత్వం, పోలీసులు ఆ దిశగా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 13న 'క్యాంపు భరతం పట్టేస్తా!' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ఓ కథనం ప్రచురితమైంది. కర్నూలులోని బీ, సీ క్యాంపు స్థలాల్లో మినీ క్రికెట్ స్టేడియం నిర్మించే ముసుగులో ఇద్దరు ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు అత్యంత విలువైన ఆ స్థలాలను లీజు పేరుతో కారు చౌకగా కొట్టేయడానికి కుట్ర పన్నుతున్నారనేది ఆ కథనం సారాంశం. ఈ కథనంపై బి.నవీన్‌కుమార్ అనే వ్యక్తి త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో 'సాక్షి'పై ఫిర్యాదు చేశారు. ఈ కథనం చదివి కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు బీ, సీ క్యాంపులో సమావేశమై.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా చర్చించుకుంటున్నారని, వీరంతా నక్సలైట్లుగా మారే అవకాశం ఉందని, మంత్రి టీజీ భరత్‌కు నష్టం చేకూర్చేలా ఆ కథనం రాశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసుస్టేషన్‌లో సాక్షి పత్రిక, సాక్షి టీవీ, పబ్లిషర్, కర్నూలు బ్యూరోపై క్రైం నెంబర్ 419/2025 కింద సెక్షన్ యూ/ఎస్ 192, 352, 353(1),(బి), 356, 61(1)(ఏ) రెడ్‌విత్ 3(5) బీఎన్ఎస్ ప్రకారం కేసు నమోదు చేశారు. అలాగే రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో కూడా దాదాపు ఇదే సెక్షన్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. కేసు వివరాలు చెప్పాలని 'సాక్షి' విలేకరి పోలీసులకు ఫోన్ చేసి అడిగినా వారు స్పందించ లేదు. పోలీసుల ప్రెస్‌మీట్లు, ఇతర సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు కర్నూలు జిల్లాలో అత్యధిక సర్క్యులేషన్ ఉన్న 'సాక్షి'ని ఉపయోగించుకునే పోలీసులు, ప్రభుత్వం.. సాక్షిపై కేసు నమోదుకు సంబంధించిన కనీస సమాచారం ఇవ్వక పోవడం గమనార్హం.

జాతీయ స్థాయిలో తప్పుబట్టినా మారని వైఖరి

'సాక్షి' పత్రికపై, జర్నలిస్టులపై ఆంధ్రప్రదేశ్‌లో అక్రమంగా కేసులు నమోదు చేస్తూ వేధిస్తున్నారని రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నేతలు, జర్నలిస్టు యూనియన్లతో పాటు జాతీయస్థాయిలో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఎడిటర్స్ గిల్డ్ కూడా తీవ్రంగా తప్పుబట్టింది. ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదని, రాజ్యాంగం పత్రికలకు భావ ప్రకటన స్వేచ్ఛను హక్కుగా కల్పించిందని, దాన్ని ఇతర వ్యవస్థలు కాపాడాలని విన్నవిస్తున్నా ప్రభుత్వానికి, పోలీసులకు ఏమాత్రం చెవికెక్కడం లేదు. కూటమి పార్టీల నేతలు ఏం చెబితే అలా పోలీసులు అక్రమ కేసులు నమోదు చేస్తున్నారు. కర్నూలులో నమోదు చేసిన కేసు కూడా మంత్రి టీజీ భరత్ ప్రోద్బలంతోనే నమోదైనట్లు తెలుస్తోంది. ఆ కథనంలో టీజీ భరత్ దోచుకోవాలనే ప్రయత్నం చేస్తున్నట్లు ఎక్కడాలేదు. ఇద్దరు ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలు అని మాత్రమే ప్రచురితమైంది. నిజంగా టీజీ భరత్‌కు భంగం వాటిల్లి ఉంటే ఆయనే ఫిర్యాదు చేయాలి. లేదా పరువునష్టం దావా దాఖలు చేయొచ్చు. అయితే గుమ్మడికాయల దొంగ.. అంటే భుజాలు తడుముకున్నారనే చందంగా ఆయన స్పందించినట్లు స్పష్టమవుతోంది. అధికారం చేతిలో ఉంది కదా అని.. ఎవరినో ఉసిగొలిపి, పోలీసులను అడ్డు పెట్టుకుని అక్రమ కేసులు నమోదు చేయించడం మంత్రి దిగజారుడుతనాన్ని సూచిస్తోందని జర్నలిస్టులు తీవ్రంగా తప్పు పడుతున్నారు.



* ఫాల్కే గ్రహీత - మోహన్‌లాల్

అతడిని 'కంప్లీట్ యాక్టర్' అని పిలుస్తారు.
'లాలెట్టన్' అని ప్రేమగా పిలుచుకుంటారు.
'కేరళ అహం' అని వ్యాఖ్యానిస్తారు.
'దర్శకుల నటుడు' అని శ్లాఘిస్తారు.
మోహన్‌లాల్ మాధవన్ నాయర్!
అతడిప్పటికి 400 వందల సినిమాలు.
నలుదిశలకు చేరిన విజయాలు.
అతడు పాత్రను గెలిపించే నటుడు. తాను ఓడని కళాకారుడు.
ఇప్పుడు దాదాసాహెబ్ ఫాల్కే... ఎప్పటికీ నటులలో ధ్రువతార.

కంప్లీట్ యాక్టర్



మీకు 'గాంధీ నగర్ రెండవ వీధి' సినిమా గుర్తుందా?

అందులో రాజేంద్ర ప్రసాద్ చెప్పే డైలాగ్- 'మై అసలీ గూర్ఖా హూ... హై... హూ' ...

అది మోహన్‌లాల్ మలయాళంలో చేసిన పాత్ర.

ఆ సినిమా 'గాంధీ నగర్ సెకండ్ స్ట్రీట్'.

• • •

'అల్లుడు గారు' పెద్ద హిట్ అయ్యింది తెలుగులో.

పెరోల్ మీద బయటకు వచ్చిన ఖైదీ అద్దె మొగుడుగా మారి సందడి సృష్టిస్తాడు.

కాని ఆ సందడి వెనుక భయానకమైన విషాదం ఉంటుంది.

అతడు త్వరలో ఉరిశిక్ష అనుభవించ బోతున్నాడు.

మోహన్‌బాబుకు లైఫ్ ఇచ్చిన ఆ వేషం మోహన్‌లాల్‌ది.

సినిమా పేరు 'చిత్రం'.

• • •

ఇటీవల చిరంజీవి 'గాడ్‌ఫాదర్' చేశారు.

స్టయిలిష్ లుక్‌తో అభిమానులను అలరించారు.

అది మలయాళంలో సూపర్‌హిట్ అయిన మోహన్‌లాల్ సినిమా- లూసిఫర్.





• • •

విదేశాలలో ఉన్న యాక్టింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో విద్యార్థులకు మోహన్‌లాల్ సినిమాల క్లిపింగ్స్‌తో ఒక వీడియో చూపిస్తారు. ముఖంలో ఎన్ని ఎక్స్‌ప్రెషన్స్ చూపించవచ్చు... ఆ భావాన్ని కచ్చితంగా పలికించవచ్చు అనేది ఆ వీడియోలో ఉంటుంది. పెన్ను, పేపర్ తీసుకొని మొదట భావాలు రాసుకుంటే- అయోమయం, పరాభవం, తమకం, ఉత్సాహం, విసుగు, ఆరాటం, సహానుభూతి, విషాదం, ఆరాధన, సంతోషం, మౌనం, ఆందోళన, ఆశ్చర్యం, కుతూహలం... ఇలా ప్రతిపదానికి మోహన్‌లాల్ ముఖాన ఎక్స్‌ప్రెషన్ ఉంటుంది.

మొత్తం ఎన్ని భావాలో తెలుసా?

27.

ఇన్ని ఎక్స్‌ప్రెషన్స్‌ను పలికించగల నటులు వేళ్ల మీద లెక్కించగలిగినంత మందే ఉంటారు. వారిలో మోహన్‌లాల్ ముందు వరుసలో ఉంటాడు.

• • •

మోహన్‌లాల్‌ను దర్శకుల నటుడు అంటాడు మణిరత్నం. ఆయన దర్శకత్వంలో మోహన్‌లాల్ 'ఇద్దరు'లో నటించాడు. అందులో ఆయన ఎం.జి.ఆర్ వేషం పోషించాడు. 'మోహన్‌లాల్ సెట్ మీద ఉంటే దర్శకుడికి నటుడికి ఏం చెప్పాలనే టెన్షన్ ఉండదు. సీన్ ఎలా రాబట్టుకోవాలో చూసుకుంటే చాలు' అంటాడు మణివణ్ణన్. 'మోహన్‌లాల్ సెట్‌లో ఉంటే మీరు కెమెరా ఎటుపెట్టుకున్నా దిగుల్లేదు' అంటాడు దర్శకుడు మురగదాస్. 'మోహన్‌లాల్ ముందు నుంచి కూడా ఒకే హెయిల్ స్టయిల్... కేవలం మీసాన్నే కొద్దిగా మారుస్తాడు పాత్రను బట్టి. రూపం ఏదైనా తన బాడీ లాంగ్వేజ్‌తో పాత్రను నమ్మించగలడు... అదే ఆయనలోని మేజిక్' అంటారు తోటి నటులు.

• • •

ప్రియదర్శన్ దర్శకత్వం వహించిన 'గాండీవం'లో అక్కినేని, బాలకృష్ణ, రోజాల మీద పాట ఉంటుంది. 'గోరువంక వాలగానే గోపురానికి స్వరాల గణగణగంటలే మోగనేల'... ఆ పాటలో హటాత్తుగా ప్రత్యక్షమవుతాడు మోహన్‌లాల్. ప్రియదర్శన్ తన క్లోజ్‌ఫ్రెండ్ కావడం వల్ల అలా అతిథిగా మెరిశాడు. అక్కినేనితో కలిసి మోహన్‌లాల్ వేసే స్టెప్స్ చూసే ప్రేక్షకులు నేటికీ ఎంజాయ్ చేస్తారు.

• • •

కొంతమంది హీరోలు చనిపోయేవరకూ హీరోలగానే ఉండాలనుకుంటారు. తప్పు లేదు.

కాని కొంతమంది హీరోలు నటులుగా ఉండాలనుకుంటారు. మోహన్‌లాల్ రెండో రకం. అందుకే 'జనతా గ్యారేజ్'లో వయసు మళ్లిన క్యారెక్టర్‌లో కనిపించడానికి అంగీకరించాడు. తెలుగులో ఆయన నేరుగా చేసిన సినిమా 'మనమంతా'. ఇందుకోసం తెలుగు నేర్చుకుని సొంతగా డబ్బింగ్ చెప్పాడు. ఇలా చేసే నటులు ఎందరు? సూపర్‌స్టార్ రజనీకాంత్ 'జైలర్'లో ఐదు, పదినిమిషాల్లో మెరిసే పాత్ర మోహన్‌లాల్ చేయడం ఆ సినిమాలో కేరింతలు పుట్టించింది. అదీ మోహన్‌లాల్.

• • •

విలన్లుగా చేసి హీరోలైన వారు మన దేశంలో చాలామంది ఉన్నారు. బాలీవుడ్‌లో శతృఘ్నసిన్హా ఉన్నాడు. తమిళంలో రజనీకాంత్ ఉన్నాడు. తెలుగులో చిరంజీవి, మోహన్‌బాబు ఉన్నారు. మలయాళంలో మోహన్‌లాల్!

బొద్దుగా ఉంటే మోహన్‌లాల్ కాలేజీ చదివే సమయానికి దట్టమైన కనుబొమలతో, లావు మీసాలతో అప్పటి కాలానికి వెండితెరకు పనికి వచ్చే విధంగా కనిపించేవాడు కాదు. కాని కాలేజీ రోజుల్లోనే విపరీతంగా నాటకాలు ఆడేవాడు. తర్వాతి కాలంలో పెద్ద దర్శకుడైన ప్రియదర్శన్ మోహన్‌లాల్‌కు కాలేజీమేట్. అందరికీ సినిమా పిచ్చి పట్టింది. కానీ ఎవరు అవకాశం ఇస్తారు? అయితే అప్పటికి మోహన్‌లాల్ తండ్రి కేరళలో 'లా సెక్రెటరీ'గా పని చేసేవాడు. కాబట్టి తగినంత డబ్బు ఉండేది. దాంతో అందరం తలా కొంత వేసుకుని సినిమా తీద్దాం అని మోహన్‌లాల్ ప్రతిపాదించాడు. అలా మొదలైన సినిమాయే 'తిరనోట్టం' (1978). అయితే ఆ సినిమా ముగియడానికే చాలా కష్టాలు పడాల్సి వచ్చింది. అయినా రిలీజ్ కాలేదు. 25 సంవత్సరాల తర్వాత రిలీజైంది. అయితే దర్శకుడు ఫాజిల్ కళ్లలో పడటంతో మోహన్‌లాల్ దశ తిరిగింది. 'మంజిల్ విరింజ పూక్కళ్' (1980) సినిమాలో ఫాజిల్ ఆయనకు విలన్ వేషం ఇచ్చాడు. ఆ సినిమా సూపర్‌హిట్‌గా నిలిచి మోహన్‌లాల్ విలన్‌గా అవతరించాడు. సంవత్సరానికి 27 సినిమాల్లో విలన్‌గా నటించిన రికార్డు మోహన్‌లాల్‌కి ఉంది. 1984లో వచ్చిన 'ఈవిడె తుడన్‌గున్ను' సినిమాతో మోహన్‌లాల్ హీరోగా గుర్తింపు పొందాడు. 1986లో వచ్చిన 'టి.పి.బాలగోపాలన్ ఎం.ఏ' సినిమాతో మోహన్‌లాల్ కేరళ ఉత్తమ నటుడు అవార్డు తీసుకోవడంతో అతని జైత్రయాత్ర మొదలైంది.

• • •

మోహన్‌లాల్ తన కెరీర్‌లో భిన్నమైన పాత్రలు చేయడానికి వెనుకాడలేదు. 'వానప్రస్థం' (1999)లో ఆయన కథకళి ఆర్టిస్ట్‌గా పోషించిన పాత్ర చిరస్మరణీయం. విమర్శకులు అత్యంత మేలిమి నటనగా గుర్తించారు. 'తన్మాత్ర' సినిమాలో అల్జైమర్స్ పేషంట్‌గా, 'వడక్కుమ్‌నదన్'లో బైపోలార్ డిజార్డర్ ఉన్న వ్యక్తిగా నటించాడు. 'అహమ్' (1992)లో ఓసీడీ పేషంట్‌గా, 'కమలదళం'(1992)లో క్లాసికల్ డాన్సర్‌గా ప్రేక్షకుల మన్ననలు పొందాడు. ఇక మాస్‌ప్రేక్షకుల కోసం 'మన్యం పులి'లాంటి సినిమాలు చేస్తూనే ఉన్నాడు. మన్యం పులి వందకోట్ల రికార్డు స్థాపించి కేరళ ట్రేడ్‌లో సంచలనం రేపింది. ఇక మోహన్‌లాల్ నటించిన 'దృశ్యం' ఎన్ని భాషల్లో రీమేక్ అయ్యిందో అందరికీ తెలుసు. ఇటీవల మోహన్‌లాల్ నటించిన 'తుడరం' సంచలన కలెక్షన్స్ సాధించింది. మోహన్‌లాల్ తాజా సినిమా 'హృదయపూర్వం' 30 కోట్లతో తీస్తే 80 కోట్లు రాబట్టింది.

• • •

మోహన్‌లాల్ యాక్షన్ ఎంతబాగా చేయగలడో కామెడీ అంత బాగా చేయగలడు. నృత్యాలు చేస్తాడు. అవసరమైతే 'కాలాపానీ' వంటి సినిమాలో బ్రిటిష్ పోలీసుల బూట్లు నాకే (నిజంగానే నాకాడు) భారత ఖైదీ పాత్ర కూడా చేయగలడు. అందుకే మోహన్‌లాల్ ఇంతకాలం ప్రేక్షకులకు ఆరాధ్యుడిగా ఉన్నాడు. ఇంత బిజీలో కూడా నాటకాలు వేయడం, కౌన్ బనేగా కరోడ్‌పతి మలయాళం వెర్షన్ చేయడం, గాయకుడు కాబట్టి పాటలు పాడటం, ఇంట్లో మొక్కలు పెంచడం... అన్నీ చేస్తుంటాడు. తన సమఉజ్జీ మమ్ముట్టితో అతను స్నేహంగా కొనసాగుతున్నాడు.

మోహన్‌లాల్‌కు 'పద్మభూషణ్'తోపాటు ఐదు సార్లు జాతీయ ఉత్తమ నటుడు అవార్డు దక్కింది. ఇంకా ఇతర అవార్డులు, గౌరవాలకు లెక్కే లేదు.

ఇప్పుడు దాదాసాహెబ్ వచ్చింది.

మోహన్‌లాల్ వంటి నటుణ్ణి వరించడం వల్ల అది ఇప్పుడు కొత్త కాంతులీనుతున్న వధువులా మారింది.

మోహన్‌లాల్‌కు శుభాకాంక్షలు. •

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 21-9-2025





పువ్వులా పరిమళిద్దాం

సుద్దాల అశోక్ తేజ

"ప్రతి మనిషి ఒక పువ్వులాంటివాడే. పువ్వు ఉన్నంతసేపు పరిమళాన్నిస్తుంది. మనిషి కూడా ఉన్నన్ని రోజులు ప్రపంచానికి, భూమికి, తన కుటుంబానికి, ఇరుగు పొరుగు వారికి ప్రేమగా, బాధ్యతగా ఉండాలన్నది మానవ జీవితం అయినప్పుడు.. పువ్వు కూడా అంతే. పూస్తుంది... పరిమళాలు పంచుతుంది.. వాడిపోయి రాలిపోతుంది. పూల జీవన తాత్పర్యం, జీవన తాత్వికత అదే. మనిషి కూడా మంచి చేయకపోయినా పర్వా లేదు కానీ, చెడు చేయకూడదు. ఇలా ఓ మంచి సందేశం ఇచ్చే పండుగ బతుకమ్మ" అని ప్రముఖ రచయిత సుద్దాల అశోక్ తేజ చెప్పారు. నేడు 'బతుకమ్మ' పండుగ ఆరంభం సందర్భంగా 'సాక్షి'తో ప్రత్యేకంగా పంచుకున్న విశేషాలు.

"నాకు ఊహ తెలిసీ తెలియని వయసులోనే మా అమ్మ, అక్కతో పాటు మా నాన్న కూడా బతుకమ్మ కోసం పూలను తీసుకొచ్చేవారు. అలా ఈ పూల పండుగ అయిన బతుకమ్మకి ఇచ్చే ప్రాధాన్యం చిన్న వయసులో నాకు అర్థం అయింది. బతుకమ్మ అనే పేరు పెట్టడంలోనే ప్రజలు చాలా గొప్ప ప్రతిభ పాటించారనిపిస్తోంది. పూలతో అలంకరించి చేస్తారు కాబట్టి పూలమ్మ పండుగ అని కూడా అనొచ్చు కదా? కానీ, అనలేదు. గౌరమ్మ పండుగ, పార్వతీదేవి పండుగ, లక్ష్మీదేవమ్మ పండుగ అనలేదు. ఇవన్నీ పాటలు పాడుతుంటారు. కానీ, బతుకుకు సంబంధించిన ప్రకృతిని పూజించి, ప్రార్థించి, గౌరవించి, ఆరాధించేటటువంటి ఒక పండుగేమో అని అర్థం వచ్చేటట్లు బతుకమ్మ అని పేరు పెట్టారేమో అనిపిస్తుంది. మనిషి బతకాలంటే పంచభూతాలు బాగుండాలి. అది మన శరీరం కావొచ్చు, ఈ ప్రపంచం కావొచ్చు. అసలు మన పండుగలన్నీ వ్యవసాయమే ప్రధాన వృత్తిగా బతుకుతున్న ప్రజలు చేసుకునే పండుగలే. అది దసరా అయినా, సంక్రాంతి అయినా, ఉగాది అయినా. అందులో భాగంగా దసరాకి ముందు వచ్చేదే ఈ బతుకమ్మ పండుగ.

సామాన్యుల పండుగ

బతుకమ్మ పండుగలో ఒక గమ్మత్తయిన ఆచారం ఉంది. ఖరీదైన పూలు బతుకమ్మలో వాడరు. పేదవాళ్లు తమ పొలాల్లో, పొలం గట్లల్లో, చెలకల్లో, ఆరు బయట ఊరు చివర ఉన్న ఎక్కడపడితే అక్కడ దొరికే గడ్డిపోగులను, పూలను మాత్రమే వాడతారు. ఈ పూలన్నింటినీ పేర్చినప్పటికీ.. గణపతిని నీళ్లల్లో నిమజ్జనం చేసినట్లు చేయరు. ఒక కార్తీక దీపంలాగా అలల మీద పెట్టి తోస్తారు. ఈ గట్టు నుంచి ఆ గట్టుకు చేరుకోమని. వాళ్ల బతుకులు కూడా ఒక గట్టు మీద నుంచి మరో గట్టుకి చేరడంలోనే జీవితానికి సార్థకత ఉందని భావించడానికే చెరువులో వేసి 'పోయిరా బతుకమ్మా..' అంటుంటారు. ఇలా తమ బతుకులకు తామే ధైర్యం చెప్పుకుంటున్నట్లుగా ఉంటుంది. ఎందుకంటే ఈ గట్టు అనేది పుట్టుక అయితే ఆ గట్టు అనేది చివర. మధ్యలో అనేకమైన అల్లకల్లోలాలు, గాలులు, అలలు, తుఫానులు, అభ్యంతరాలు, ఆటంకాలు, ఆశాభంగాలు ఉంటాయి జీవితంలో. ఈ పండుగలో కూడా బతుకమ్మని పేర్చి, ఈ చివరి నుంచి అటు తోస్తే అది మెలమెల్లగా వెళుతూ మధ్యలో మునిగిపోతుందా? ఆ గట్టుకు చేరుకుంటుందా? అనేది మనకు తెలియదు కానీ, తమ జీవితాలను తామే ఒక సాంకేతికమైన మార్గంగా సృష్టించుకుని చేసుకుంటారేమో అనిపిస్తుంది నాలాంటివాళ్లకి.

మా ఇంట్లో మనవరాళ్ల దాకా...

బతుకమ్మ అనేది ఆడపడుచుల పండుగ. అత్తగారింటికి వెళ్లిన ఆడబిడ్డలందరూ అమ్మగారింటికి వచ్చి బతుకమ్మ, దసరా పండుగ చూసుకుని వెళ్లిపోతుంటారు. ఈ పండుగ గురించి మాకు గుర్తొచ్చేది ఏంటంటే.. పూలను తీసుకురావాలి, పేర్చాలి.. అమ్మ ప్రసాదం చేస్తే తినాలి.. ఇరుగు పొరుగువారికి ఇచ్చిపుచ్చుకోవడం అన్నమాట. ఈ సంప్రదాయం నాకు ఊహ తెలిసినప్పటి నుంచి ఇప్పటివరకూ సాగుతూనే ఉంది. మా అమ్మ, అక్కలు, చెల్లెళ్లు, కూతుళ్లు, కోడళ్లు... ఇప్పుడు నా మనవరాళ్ల దాకా వచ్చింది.

చప్పట్ల పండగ

బతుకమ్మ అంటే చప్పట్ల పండుగ. ఈ పండుగనాడు సన్నాయిలు, వాయిద్యాలు, మృదంగాలు, డప్పులు కొడుతుంటే మహిళలు బతుకమ్మని చెరువుదాకా తీసుకెళ్లేవారు. కాలప్రవాహంలో మనం చూస్తున్న ఈ దాండియా, డీజేలు మన సంప్రదాయం కాదు. బతుకమ్మ పండుగలో కాలక్రమేణా వస్తున్న మార్పులు సంప్రదాయబద్ధంగా ఉంటే పర్వాలేదు. కానీ, అందులోకి ఈ ఐటమ్ సాంగ్‌లను వాయించే వాయిద్యాలు చొరబడొద్దు.. అది కరెక్ట్‌కాదు..

ఆ అనుభూతితో పాటలు రాశా!

బతుకమ్మ పండుగపైన నేను కూడా చాలా పాటలు రాశాను. చిన్నప్పుడు మా అమ్మ బతుకమ్మ ఆడుతుంటే చూసినవాణ్ణి. అలాగే మా అక్కలు, చెల్లెళ్లు, కూతుళ్లు, మనవరాళ్లు ఆడుతుంటే చూసినప్పుడు ఒక అనుభూతి ఉంటుంది. ఆ అనుభూతి, సంప్రదాయం, వారు పాడే పాటల్లోని జానపదం కలిపి ఆ పాట రాస్తున్నప్పుడు ఒక గొప్ప అనుభూతి కలిగింది. ఆ అనుభూతితోనే పాటలు రాశాను.

తాత్త్విక సందేశం ఇచ్చే పండుగ

బతుకమ్మ పండుగ నుంచి నేర్చుకోవాల్సింది ఏంటంటే... మన సంప్రదాయం, మన పూర్వీకులు ఆచరిస్తున్న పద్ధతులు, ప్రేమ, మానవ సంబంధాలు, రక్తసంబంధాలు, ఆడపడుచులు పుట్టింటికి రావడం, ఆ ప్రేమలు ఉన్నాయి. అదే విధంగా మనం పూలను గౌరవించాలి.. పూజించాలి.. పువ్వులకు నమస్కారం చేయాలి. పువ్వులు ఉండాలంటే చెరువులుండాలి.. చెరువులు ఉండాలంటే వానలు ఉండాలి.. వానలు ఉండాలంటే చెట్లు ఉండాలి. చెట్లు పిలిస్తే వాన- వాన కురిస్తే చెట్టు అయినప్పుడు ఈ రెండూ లేకుండా బతుకమ్మ పండుగ లేదు. ప్రకృతి, పర్యావరణం బాగుంటేనే బతుకమ్మ బాగుంటుంది.. బతుకమ్మ బాగుంది అంటే బతుకులు బాగున్నట్టు లెక్క. ఇలా ఓ మంచి సందేశం ఇచ్చే పండుగ బతుకమ్మ. జీవితంలో కష్టాలు, కన్నీళ్లు, గండాలు, సుడిగుండాలు ఉంటాయి.. వాటన్నింటినీ తప్పించుకుంటూ, అధిగమించుకుంటూ మనుషుల్లో అందరం బాగుండడం.. అందులో మనం కూడా ఉండటం అనే తాత్త్విక సందేశం ఇచ్చేదే బతుకమ్మ.

ఆ సంబరం... ఆ సందడి

బతుకమ్మ పండుగప్పుడు గతంలో మా అక్కలు, చెల్లెళ్లు ఇంటికొచ్చేవారు. ఇప్పుడైతే నా కూతురు వస్తుంది.. మనవరాళ్లు వస్తారు. మా కోడళ్లు కుదిరితే తల్లిగారి ఇంటికి వెళతారు.. లేదంటే మా ఇంట్లోనే ఉంటారు. నా భార్య కూడా బతుకమ్మ పేర్చడం, ఇరుగు పొరుగువారితో బతుకమ్మ ఆడటం, మా కాలనీలో తాత్కాలిక నీటి కొలను ఏర్పాటు చేసుకుని అందులో బతుకమ్మని వేయడం జరుగుతుంటుంది. లేదా అవకాశం ఉంటే ఎవరితోనైనా పంపించి, నదిలోనో, చెరువుల్లోనో వేయిస్తాం. మా ఊరు సుద్దాలకి వెళ్లి బతుకమ్మ చేసుకుంటే మాత్రం పక్కాగా బతుకమ్మ కుంటలో వేస్తాం. పిత్రమాస నాడు కుంటలో వేస్తాం, సద్దుల బతుకమ్మనాడు చెరువు వద్దకు అందరూ వెళతారు. ఆట పాటల్లో మహిళలు మాత్రమే పాల్గొంటారు. కానీ, పురుషులు మాత్రం వారి వెంట వెళతారు. బతుకమ్మలను అవసరమైతే చెరువు మధ్యలోకి వెళ్లి వదలాల్సి వచ్చినప్పుడు పురుషులు వెళ్లి వదిలే సంప్రదాయం మాత్రం ఉంది.. వాటన్నింటిలో మేము పాల్గొన్నాం. ఇప్పుడైతే మా అబ్బాయిలు, అల్లుళ్లు, మనవళ్లు ఉన్నారు.. వాళ్లు చూసుకుంటారు కానీ, నేను పాల్గొనటం లేదు. నాకు ఐదుగురు మనవరాళ్లు, ఒక మనవడు ఉన్నారు. వీరందరూ బతుకమ్మ పండగకి తప్పకుండా వస్తారు. అది పిత్రమాస రోజు అయినా లేదంటే సద్దుల బతుకమ్మనాడు అయినా వస్తుంటారు. ఆ సంబురం, ఆ సందడి వేరుగా ఉంటుంది. అది బతుకమ్మలో ఇంకా బ్రహ్మాండంగా ఉంటుంది. అందుకే నా దృష్టిలో అమ్మాయిలు లేని బతుకమ్మ పండుగ చంద్రుడు లేనటువంటి పౌర్ణమిలాంటిది" అని చెప్పారు సుద్దాల అశోక్ తేజ.



సుద్దాల అశోక్ తేజ కోడలు శ్వేత, భార్య నిర్మల, మనుమరాలు ధీర



బతుకమ్మలతో సుద్దాల అశోక్ తేజ మనుమరాళ్లు వర్షిత, లాలిత్య

– దేరంగుల జగన్ మోహన్

హెల్త్

• నిర్లక్ష్యం వద్దు

కీలెంచి మేలెంచండి!

కీళ్ల దగ్గర నొప్పి సమస్యను మొదట్లోనే తుంచేయాలి. తగిన పరీక్షలు చేయించుకొని, వాటిల్లో వచ్చిన రిపోర్టులను బట్టి త్వరగా చికిత్స తీసుకుంటే చాలు. 'ఆ... ఎప్పుడో ఓసారి నొప్పి రావడంగానీ లేదా కీళ్ల దగ్గర ఇబ్బందిగా (డిస్‌కంఫర్ట్‌గా) ఉండటం మామూలే కదా' అంటూ నిర్లక్ష్యం చేస్తే... కేవలం టాబ్లెట్ల వంటి మందులతో పోయేదానికి శస్త్రచికిత్స వరకూ వెళ్లే అవకాశముందని హెచ్చరిస్తున్నారు ఆర్థోపెడిక్ నిపుణులు. ఇలా మోకాలూ లేదా ఇతరత్రా కీళ్లలో (జాయింట్స్‌లో) నొప్పిగానీ ఇబ్బందిగానీ వచ్చేందుకు కారణాలూ, అలా సమస్య కనిపించినప్పుడు ఏం చేయాలన్న అంశంపై అవగాహన కలిగించేందుకు డాక్టర్లు చెబుతున్న అంశాలేమిటో చూద్దాం.

మీరు ఎప్పుడైనా జాయింట్ నొప్పిని "అదే తగ్గిపోతుందని" అని నిర్లక్ష్యం చేశారా? చాలా మందికి ఇది సాధారణంగా అనిపించవచ్చు. కానీ జాయింట్ నొప్పిని నిర్లక్ష్యం చేయడం శరీరానికి మెల్లగా నష్టం కలిగిస్తూ, భవిష్యత్తులో తప్పనిసరిగా శస్త్రచికిత్స వరకు తీసుకెళ్లే ప్రమాదం ఉంది.

మన దేశవాసుల్లో కీళ్లనొప్పులు వస్తుండటం చాలా సాధారణం. ఇలాంటి నొప్పులు దాదాపుగా విస్తృతంగా మధ్య వయసు దాటిన అందరిలోనూ కనిపిస్తుంటాయి. ఒక అంచనా ప్రకారం మన దేశజనాభాలో సుమారు 15% మందిలో అంటే... 21 కోట్ల మందిలో ఆర్థరైటిస్ తాలూకు బాధలు కనిపిస్తుంటాయి. మధుమేహం (డయాబెటిస్), ఎయిడ్స్, క్యాన్సర్‌ల కంటే కూడా ఆర్థరైటిస్ నొప్పులతో బాధపడేవారి సంఖ్యే ఎక్కువ. మరీ ముఖ్యంగా మహిళల్లో కీళ్లనొప్పులూ, ఆర్థరైటిస్ కారణంగా కనిపించే బాధలు ఇంకా ఎక్కువ. దాదాపు 45 ఏళ్లకు పైబడిన వయసు మహిళల్లో ఇలా ఈ తరహా బాధలు కనిపించడం చాలా సాధారణం. వీటికి వీలైనంత త్వరగా... అంటే తగిన సమయంలో చికిత్స అందించకపోతే అవి ఎలా పరిణమిస్తాయో తెలుసుకుందాం.

కీళ్ల (జాయింట్) నొప్పులను నిర్లక్ష్యం చేస్తే...

కీళ్ల నొప్పులు కనిపించినప్పుడు వెంటనే డాక్టర్‌కు చూపించుకోకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ కింద పేర్కొన్న నష్టాలు జరిగే అవకాశముంది. అవి...

- **చిగురు ఎముకకు (కార్టిలేజ్) నష్టం:** కీళ్లు కలిసే చోట ప్రతి ఎముకకూ చివరన ఉండే మెత్తటి చిగురు ఎముక (కార్టిలేజ్) స్వాభావికంగా కుషన్‌లా పనిచేసే గుణం తగ్గుతుంది. దాంతో అది స్టిఫ్‌గా మారి (గట్టిపడిపోయి) అది ఆస్టియోఆర్థరైటిస్ అనే కండిషన్‌కు దారి తీస్తుంది.
- **కీలు ఉండాల్సిన తీరులో లేకపోతే (డిఫార్మిటీ):** నేచురల్‌గా ఉండాల్సిన విధంగా ఉండకుండా కీళ్లలో ఉండాల్సిన స్థిరత్వం తగ్గడంతో కీళ్ల కదలికలూ మందగిస్తాయి.
- **కండరాల బలహీనత (మజిల్ వీక్‌నెస్):** కీళ్ల దగ్గర నొప్పి కారణంగా మనం కీళ్లను కదిలించకపోవడంతో కీళ్లలో కదలికలు తగ్గుతాయి. ఫలితంగా కండరాలూ బలహీనమవుతాయి.
- **దీర్ఘకాలిక (క్రానిక్) ఇన్‌ఫ్లమేషన్:** కీళ్ల దగ్గర వచ్చే సమస్యతో అక్కడ ఎర్రబారడం, తీవ్రమైన వాపు, మంట, నొప్పి వంటి లక్షణాలు సుదీర్ఘ కాలం పాటు కనిపించడాన్ని క్రానిక్ ఇన్‌ఫ్లమేషన్ అంటారు. ఇలా సుదీర్ఘంగా ఇన్‌ఫ్లమేషన్ రావడం వల్ల ఆ ప్రాంతంలోనూ, అలాగే ఆ చుట్టుపక్కల ఉండే కణజాలానికి (టిష్యూలకు) నష్టం జరుగుతుంది.



- **జీవన నాణ్యత (క్వాలిటీ ఆఫ్ లైఫ్) తగ్గిపోవడం:** ప్రతిరోజూ కీళ్లనొప్పి కారణంగా మనం చేయాల్సిన పనులు చేయలేకపోవడం, నార్మల్‌గా ఉండలేపోవడంతో మన జీవన నాణ్యత (క్వాలిటీ ఆఫ్ లైఫ్) తగ్గుతుంది.

డాక్టర్‌ను ఎప్పుడు సంప్రదించాలంటే...

ఈ కింద పేర్కొన్న లక్షణాలు కనిపించినప్పుడు డాక్టర్‌ను తప్పనిసరిగా కలవాలి.
- కీళ్లు లేదా ఆ ప్రాంతాల్లో కనిపించే నొప్పి దానంతట అదే తగ్గకుండా చాలాకాలం పాటు కొనసాగడం. (కొన్నిసందర్భాల్లో నెలల తరబడి లేదా ఏళ్ల తరబడి).
- నడక, మెట్లు ఎక్కడం, చేతులు పైకి ఎత్తడానికి కష్టంగా ఉంటే.
- కూర్చున్నవారు లేవడానికి ఇబ్బంది పడుతూ ఉంటే.
- కర్ర లేదా వాకర్ సాయంతోనే నడవగలగడం.
- నొప్పి తగ్గడానికి తరచూ నొప్పి నివారణ మందులపైనే ఆధారపడుతుంటే.
- కీళ్ల ఆకృతి మారడం లేదా కీలు కలిసేచోట ఎముకలు కుదురుగా లేకపోతే (అలైన్‌మెంట్ మారితే).

చికిత్స ఆలస్యం అయిన కొద్దీ...

- నొప్పి, కీళ్ల దగ్గర గట్టితనం (స్టిఫ్‌నెస్) పెరగడం; కదలికలు మందగించడం.
- కీళ్ల దగ్గర ఎముకల చివరన ఎముకలు అరగడంతో (ఆర్థరైటిస్ సమస్యతో) నొప్పులు లేదా జాయింట్ దగ్గర వ్యాధులు తీవ్రతరం కావడం.
- పడిపోయి గాయపడే ముప్పు పెరగడం.
- కోతపెట్టి చేయాల్సిన శస్త్రచికిత్స (ఇన్వేసివ్ సర్జరీ) చేయాల్సి రావడం.
- కోలుకోవడానికి పట్టే సమయం పెరగడం.

మీ కీళ్ల ఆరోగ్యాన్ని చిరకాలం కాపాడుకోవాలంటే...

- **తక్షణ వైద్య సలహా:** వీలైనంత త్వరగా డాక్టర్‌ను కలిసి, తగిన నిర్ధారణ పరీక్షలు చేయించుకుని, దానికి తగినట్లుగా చికిత్స తీసుకోవడం.
- **బరువును అదుపులో పెట్టుకోవడం:** బరువు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం.
- **వ్యాయామం:** శరీర బరువు పెరుగుతున్న కొద్దీ జాయింట్స్‌పై పడే ఒత్తిడి పెరుగుతుంది కాబట్టి దాన్ని అదుపులో పెట్టుకోడానికి స్విమ్మింగ్, సైక్లింగ్ వంటి వ్యాయామాలను క్రమం తప్పకుండా చేయడం.
- **చురుగ్గా ఉండటం:** కీళ్లకు తగినన్ని పోషకాలు అందడంతో పాటు కండరాల ఆరోగ్యం బాగా ఉండటానికి ఎప్పుడూ ఒకేచోట కూర్చుని ఉండకుండా నిత్యం చురుగ్గా కదులుతూ ఉండటం.
- **ఫిజియోథెరపీ వంటి చికిత్సలు:** ఎడతెరిపి లేకుండా వచ్చే నొప్పి నివారణ కోసం అవసరాన్ని బట్టి ఫిజియో వంటి చికిత్సలు తీసుకోవడం.
- **సమస్య తగ్గడానికి అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాలను తెలుసుకోవడం:** ఈ సమస్య తగ్గడానికి అందుబాటులో ఉన్న చికిత్స ప్రక్రియలు... ఉదాహరణకు మందులూ, ఇంజెక్షన్లతో; జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వంటి చర్యలతో శస్త్రచికిత్స నివారించుకోవడానికీ... ఇక తప్పదు అనుకున్నప్పుడు చేయాల్సిన శస్త్రచికిత్సను వీలైనంత ఆలస్యంగా జరిగేలా చూసుకోవడం.

చివరగా... ఈ సమస్యపై తగినంత అవగాహన పెంచుకోవడం వల్ల... ఇవ్వాళ్ల జీవనశైలిలో మార్పులు (లైఫ్‌స్టైల్ మాడిఫికేషన్స్)తోనే తగ్గేవీ; లేదా కొద్దిపాటి మందులతోనే తగ్గేలా తేలికపాటి చికిత్సలతోనే తగ్గే సమస్య... భవిష్యత్తులో శస్త్రచికిత్స వరకూ వెళ్ల వచ్చు. అందుకే ఈ తరహా కీళ్లనొప్పుల విషయం వీలైనంతలో త్వరగా డాక్టర్‌ను కలవడం అవసరం. •



డా. నీలం వి. రమణారెడ్డి,
సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్

క్లుప్తంగా...

ధ్యానంతో ఒత్తిడిని జయించవచ్చు

డీజీపీ జితేందర్



సాక్షి, హైదరాబాద్: పోలీసింగ్ అత్యంత సవాళ్లు, ఒత్తిడితో కూడిన ఉద్యోగమని, దాన్ని యోగా, ధ్యానంతో ఎదుర్కొనవచ్చని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీజీపీ కార్యాలయ సిబ్బంది కోసం నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. కార్యక్రమంలో డీజీపీ జితేందర్, అడిషనల్ డీజీ (పర్సనల్) డాక్టర్ అనిల్ కుమార్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ మాట్లాడుతూ, ఆధునిక జీవన శైలిలో ఒత్తిడి పెరిగిందన్నారు. యోగా, ధ్యానం ద్వారా దాన్ని నియంత్రించుకోవడం ఎంతో అవసరమన్నారు. శిక్షణ తరగతులు సిబ్బంది పనితీరును మెరుగుపరిచేందుకు సహకరిస్తాయని తెలిపారు. వారం రోజుల పాటు జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ స్టేట్ కౌన్సిల్ డైరెక్టర్ విశాల్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల్లో అధిక ఫీజులను అరికట్టాలి

ఫీజుల రెగ్యులేటరీ కమిటీ చైర్మన్‌కు పేరెంట్స్ కమిటీ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు మెడికల్, డెంటల్ కాలేజీలలో అధిక ఫీజు వసూళ్లను అరికట్టాలని తెలంగాణ వైద్య విద్యార్థుల పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ చైర్మన్ జస్టిస్ కె. గోపాల్ రెడ్డిని పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాదె వెంకట్, ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రశేఖర్ తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని అనేక ప్రైవేట్ మెడికల్, డెంటల్ కాలేజీల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. వాస్తవానికి మెడికల్, డెంటల్ కాలేజీల్లో నాలుగున్నర సంవత్సరాలకు మాత్రమే ఎంబీబీఎస్ ఫీజు వసూలు చేయవలసి ఉండగా, అనేక కాలేజీలు ఐదు సంవత్సరాలకు ఫీజు వసూలు చేస్తున్నాయని చైర్మన్‌కు సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నారు. వైద్య కళాశాలల్లో అధిక ఫీజుల కారణంగా పేద, మధ్యతరగతి వర్గాలు వైద్యవిద్యకు దూరమవుతున్నాయని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ వైద్య కళాశాలలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

టోల్‌ప్లాజా వద్ద దసరా రద్దీ

పండుగకు జనం స్వగ్రామాల బాట

చౌటుప్పల్ రూరల్: ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించడంతో పాటు ఆదివారం బతుకమ్మ పండుగ ఉండడంతో హైదరాబాద్‌లో నివాసముంటున్నవారు.. శనివారం సాయంత్రం నుంచి స్వగ్రామాలకు పయనమయ్యారు. దీంతో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. వాహనాలు భారీగా రావడంతో హైవేపై వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగాయి. పంతంగి టోల్‌ప్లాజాలో శనివారం సాయంత్రం వాహనాలు కిక్కిరిశాయి. విజయవాడ వైపు వెళ్లే మార్గంలో ఎనిమిది విండోల ద్వారా వాహనాలను టోల్ సిబ్బంది పంపించారు.



నోటీసులివ్వకుండా ఆస్తుల జప్తా?

సాక్షి, హైదరాబాద్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) నిధుల్లో అవినీతి జరిగిందంటూ.. నోటీసులైనా జారీ చేయకుండా మాజీ సీఈవో కుటుంబ సభ్యుల ఆస్తులను జప్తు చేయడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఈ మేరకు జగిత్యాల జిల్లా సహకార సంఘ రిజిస్ట్రార్ జారీ చేసిన జప్తు ఉత్తర్వులను రద్దు చేసింది. మెట్‌పల్లి యామాపూర్ పీఏసీఎస్ సర్‌చార్జి వసూళ్లకు సంబంధించి తన ఆస్తులను జప్తు చేయడాన్ని సవాల్ చేస్తూ తిరునగరి సరిత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన భర్త మధుకర్ నుంచి రూ.76,28,519 వసూలు చేయడంలో భాగంగా జిల్లా సహకార సంఘ రిజిస్ట్రార్ జారీ చేసిన జప్తు ఉత్తర్వులు చట్టవిరుద్ధమని, కొట్టివేయాలని కోరారు. మరో ఇద్దరు ఉద్యోగుల కుటుంబ సభ్యులు కూడా పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లపై టి.మాధవీదేవి విచారణ చేపట్టారు. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.


యువతను విస్మరిస్తే ఉద్యమాలు

- యువత ఆకాంక్షలను పాలకులు పట్టించుకోవాలి
- పాక్‌తో కాదు.. పశ్చిమ దేశాలతో పోటీపడాలి
- మందిరం, మసీదు కాదు.. మౌలిక వసతులే ముఖ్యం
- తెలంగాణలో రీకాల్, రీగ్రెట్, రివోల్ట్ నడుస్తోంది
- ఎన్డీటీవీ యువ -2025లో బీఆర్ఎస్ నేత కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: యువత ఆకాంక్షలను విస్మరిస్తే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వచ్చే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హెచ్చరించారు. దేశ యువత ఆకాంక్షలు ఆకాశాన్ని అంటుతుండగా పాలకుల ఆలోచనలు మాత్రం పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల చుట్టూనే తిరుగుతున్నాయని విమర్శించారు. ప్రజల మౌలిక భావోద్వేగాలను రెచ్చగొడుతూ మందిర్– మస్జిద్ పేరిట ప్రజల దృష్టిని మళ్లించడంలో ప్రధాని నరేంద్ర మోదీ విజయం సాధించారని మండిపడ్డారు. ముంబైలో శనివారం సాయంత్రం జరిగిన 'ఎన్డీటీవీ యువ 2025'సదస్సులో కేటీఆర్ ప్రసంగించారు. 'దేశ భవిష్యత్తుకు కీలకమైన అభివృద్ధి, ఆవిష్కరణలను ప్రధాని మోదీ గాలికొదిలేశారు. చైనా, జపాన్‌తోపాటు అమెరికా వంటి పశ్చిమ దేశాలను అధిగమించే ప్రయత్నం చేయకుండా మనకంటే వెనుకబడిన దేశాలతో పోల్చుకుని సంతృప్తి చెందడం సరికాదు'అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

జెన్ జీ శక్తిని తక్కువగా అంచనా వేయొద్దు

'ప్రస్తుత తరం యువత (జెన్–జీ) కేవలం డిజిటల్ మీడియాకే పరిమితం కాకుండా సమాజం పట్ల అపారమైన బాధ్యతతో పనిచేయాలి. జెన్ జీ శక్తిని పాలకులు తక్కువగా అంచనా వేయొద్దు. తెలంగాణలో 400 ఎకరాల అటవీ భూమిని అమ్మే ప్రభుత్వ ప్రయత్నాలు సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల పోరాటంతో నిలిచిపోయింది. సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే యువత రాజకీయాల్లోకి వచ్చి భవిష్యత్తు నిర్ణేతలు కావాలి. దేశంలోని యువశక్తిని దేశ నిర్మాణానికి వాడుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారు. అణుబాంబు దాడితో సర్వనాశనమైన జపాన్ కేవలం 23 ఏళ్లలోనే విధ్వంసం నుంచి వికాసం వైపు పయనించింది'అని కేటీఆర్ గుర్తు చేశారు.



ఎన్డీటీవీ యువ -2025లో మాట్లాడుతున్న కేటీఆర్

పదేళ్లలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ

'గడిచిన పదేళ్లలో అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరంతో పాటు అమెజాన్ అతి పెద్ద క్యాంపస్, అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ టీ హబ్ వంటివి తెలంగాణలో సాధ్యమయ్యాయి. ఇదే రీతిలో మిగతా భారతదేశం ఎందుకు చేయలేకపోయింది. మనదేశంలోని 38 కోట్ల జెన్–జీ యువత సరికొత్త ఆలోచనలతో ప్రపంచ గతిని మార్చేందుకు ప్రభుత్వాలతో కలిసి పనిచేయాలి. ప్రస్తుతం తెలంగాణలో రీకాల్, రిగ్రెట్, రివోల్ట్ నడుస్తోంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరుతో ప్రజలు పోల్చి (రీకాల్) చూసుకుంటున్నారు. బీఆర్ఎస్‌ను గెలిపించుకోనందుకు (రిగ్రెట్) బాధపడుతున్నారు. త్వరలోనే అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగబడే (రివోల్ట్)కు అవకాశం ఉంది'అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

రహదారి భద్రతా సెస్ పేరుతో ప్రజలపై భారం వేస్తారా?: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రహదారి భద్రతా సెస్ పేరుతో ఒక్కో కొత్త వాహనం కొనుగోలుపై ఏకంగా రూ.2వేల నుంచి రూ.10 వేల వరకు అదనపు భారం వేయాలని చూడటం పేద, మధ్యతరగతి ప్రజానీకాన్ని దగా చేయడమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. పెరిగిపోతున్న ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలిస్తే.. వాటిని అమలు చేయాల్సింది పోయి వాహన కొనుగోలుదారులపై భారం మోపడం ఏమిటని ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. పైసా పైసా కూడబెట్టుకుని, లేదా అప్పు చేసి వాహనాలు కొనుగోలు చేసే పేద, మధ్యతరగతివారి జేబులు కొట్టే ఇలాంటి పన్నాగాలకు కాంగ్రెస్ సర్కారు ఇకనైనా స్వస్తి పలకాలని, రాష్ట్ర బడ్జెట్ నుంచి రోడ్ సేఫ్టీకి నిధులు కేటాయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

బీడీఎస్ వెబ్ ఆప్షన్లు షురూ

రేపటి వరకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్టేట్ కోటా కింద బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ మొదలైంది. కన్వీనర్ (కాంపిటెంట్ అథారిటీ) కోటా కింద ప్రభుత్వ, ప్రైవేట్ డెంటల్ కళాశాలలు, ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్‌లో సీట్ల భర్తీకి కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం (కేఎన్ఆర్‌యూహెచ్ఎస్) శనివారం వెబ్ ఆప్షన్ల నోటిఫికేషన్ విడుదల చేసింది. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 22న మధ్యాహ్నం 1 గంట వరకు అభ్యర్థులు https:/ tsbdsadm. tsche. in/ లో ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. ఈనెల 15న విడుదల చేసిన స్టేట్ కోటా ఫైనల్ మెరిట్ లిస్ట్‌లో పేర్లు ఉన్న అభ్యర్థులకే ఈ అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో ప్రభుత్వపరంగా ఉస్మానియా డెంటల్ కాలేజీతో పాటు ఆర్మీ డెంటల్ కాలేజీ ఉండగా, మరో 10 ప్రైవేటు డెంటల్ కాలేజీలు ఉన్నాయి. ఈ కాలేజీల్లోని సీట్ల కోసం ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది.

ఫీజులు ఇలా...

కౌన్సెలింగ్‌లో సీటు పొందిన విద్యార్థులు యూనివర్సిటీ ఫీజు రూ. 12,000 (ఆన్‌లైన్ ద్వారా) చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ట్యూషన్ ఫీజుల కింద ప్రభుత్వ డెంటల్ కళాశాలలకు ఏటా రూ. 10,000, ప్రైవేట్ డెంటల్ కళాశాలలకు ఏటా రూ. 45,000 చెల్లించాల్సి ఉంటుంది.

రెండో రౌండ్‌లో నో చాన్స్..

బీడీఎస్ కౌన్సెలింగ్‌కు సంబంధించి మొదటి దశలో ఆప్షన్లు వినియోగించని అభ్యర్థులకు తరువాతి రౌండ్లలో అవకాశం ఉండదు. కౌన్సెలింగ్‌లో సీటు కేటాయించబడిన తర్వాత చేరకపోతే, తదుపరి కౌన్సెలింగ్‌కు అర్హత ఉండదు. ఎన్ని కావాలంటే అన్ని కళాశాలలపై ఆప్షన్లు ఇవ్వొచ్చు. సీటు కేటాయింపుని వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. కేటాయింపు ఎస్ఎంఎస్ ద్వారా కూడా లభిస్తుంది. సీటు వచ్చిన వారు యూనివర్సిటీ ఫీజు చెల్లించి అలాట్‌మెంట్ ఆర్డర్ డౌన్‌లోడ్ చేసి, సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ వద్ద ఒరిజినల్ సర్టిఫికెట్లు, బాండ్లు సమర్పించి ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పీడబ్ల్యూడీ, ఆంగ్లో ఇండియన్, పీఎంసీ, క్యాప్ కేటగిరీల అభ్యర్థులకూ ఇదే విధానం వర్తిస్తుంది.

హెల్ప్‌లైన్ నంబర్లు

టెక్నికల్ హెల్ప్: 9392685856, 7842136688, 9059672216, అడ్మిషన్ నిబంధనలపై క్లారిటీ కోసం: 7901098840, 9490585796, పేమెంట్ సమస్యలు: 9618240276



ఓపీఎస్ అమలు చేస్తున్న ఝార్ఖండ్ ప్రభుత్వం ఆదర్శనీయం

ఎన్ఎంఓపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ

సాక్షి, హైదరాబాద్: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించిన ఝార్ఖండ్ ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు ఆదర్శమని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఎన్ఎంఓపీఎస్) సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ అన్నారు. శనివారం రాంచిలో జరిగిన ఉద్యోగ, ఉపాధ్యాయుల కర్మచారి సంపర్క్ మహా సమ్మేళన్ భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఓపీఎస్ అమలు చేశారని ప్రశంసించారు. పాత పెన్షన్ అమలు చేస్తామని మాటఇచ్చి, అమలు చేయడంతో పాటు ప్రత్యేక సభ ద్వారా పదవీ విరమణ పొందిన సీపీఎస్ ఉద్యోగులకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్లు ఇవ్వడం చారిత్రాత్మకమని స్థితప్రజ్ఞ తెలిపారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

దేవీ శరన్నవరాత్రులకు వేళాయె..

భద్రగిరిలో ఈ నెల 23 నుంచి అక్టోబర్ 2 వరకు ఉత్సవాలు

- రోజుకో అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు
- అక్టోబర్ 2న శమీ, ఆయుధ పూజ, శ్రీ లీలా మహోత్సవం


శమీ పూజ నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు (ఫైల్)

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు వేళయింది. ఈనెల 23 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు వేడుకలు జరగనున్నాయి. చెడుపై మంచి సాధించిన విజయానికి సూచికగా, రాక్షసుడైన మహిషాసురుడిని అంతమొందించి.. భక్తులను కాపాడిన అమ్మవారి ధైర్యానికి ప్రతీకగా నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. శ్రీరామచంద్రుడు కొలువైన భద్రగిరి క్షేత్రంలో మహాలక్ష్మి స్వరూపమైన లక్ష్మీతాయారు అమ్మవారి ఉపాలయంలో నిరంతరం ప్రత్యేక పూజలు చేస్తారు. అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. ఈనెల 23 నుంచి అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులను కనువిందు చేయనుండగా.. చిత్రకూట మండపంలో తొమ్మిది రోజుల పాటు వాల్మీకి రామాయణ పారాయణం సాగనుంది.


ధనలక్ష్మి అలంకారం


ఐశ్వర్యలక్ష్మి అలంకారం


గజలక్ష్మి అలంకారం

అమ్మవారి అలంకారాలు ఇవీ..

తేదీ	అలంకారం	పారాయణం
23-09-2025	ఆదిలక్ష్మి	బాలకాండ
24-09-2025	సంతానలక్ష్మి	అయోధ్యకాండ
25-09-2025	గజలక్ష్మి	అయోధ్యకాండ
26-09-2025	ధనలక్ష్మి	అరణ్యకాండ
27-09-2025	ధాన్యలక్ష్మి	కిష్కింధకాండ
28-09-2025	విజయలక్ష్మి	సుందరాకాండ
29-09-2025	ఐశ్వర్యలక్ష్మి	యుద్ధకాండ
30-09-2025	వీరలక్ష్మి	యుద్ధకాండ
01-10-2025	మహాలక్ష్మి (నిజరూపం)	యుద్ధకాండ


సంతానలక్ష్మి అలంకారం


వీరలక్ష్మి అలంకారం


ధాన్యలక్ష్మి అలంకారం


మహాలక్ష్మి అలంకారం


విజయలక్ష్మి అలంకారం

అక్టోబర్ 2న శమీ, ఆయుధ పూజ, శ్రీ లీలా మహోత్సవం

శరన్నవరాత్రి ఉత్సవాలలో రోజుకో అలంకరణలు ముగిశాక.. విజయదశమి వేడుకలను వైభవోపేతంగా జరుపుతారు. దశమి రోజు భక్తరామదాసు నిర్మించిన దసరా మండపంలో.. ఈ వేడుకలు నిర్వహించడం ప్రత్యేకత. శమీ, ఆయుధ పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. అనంతరం లీలా మహోత్సవంగా భావించే రావణ వధను బాణసంచాలతో జరుపుతారు. ఈ సందర్భంగా 23 తేదీ నుంచి ఉత్సవాలు ముగిసే వరకు శ్రీలక్ష్మీ అమ్మవారి సన్నిధిలో అభిషేకం, చిత్రకూట మండపంలో సామూహిక శ్రీ రామాయణ పారాయణం, మధ్యాహ్నం శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమార్చన, సాయంత్రం 7గంటలకు చిత్రకూట మండపంలో శ్రీరామాయణ ప్రవచనం, రాత్రికి శ్రీ స్వామి వారికి తిరువీధి సేవలు జరగనున్నాయి.


ఆదిలక్ష్మి అలంకారం

అమ్మవారి అవతారాలు.. ప్రత్యేకతలు

1) ఆదిలక్ష్మి అలంకారం: భగవంతుని గుర్తించడానికే ఆలంబనైన లక్ష్మీ తత్వాన్నే ఆదిలక్ష్మి అంటారని, ఆ అమ్మవారి వల్లే వేదవేద్యుని గుర్తించగలిగారని శ్రీ పరాశర భట్టార్ చెబుతారు. చతుర్భుజాలలో పై రెండు చేతుల్లో పద్మాలను ధరించి వరద–అభయ హస్తాలతో విరాజిల్లుతున్న ఆదిలక్ష్మి అమ్మవారు తొలి అలంకరణగా రామాలయంలో దర్శనమిస్తారు.

2) సంతానలక్ష్మి అలంకారం: 'అఖిల జగన్మాతరం, అస్మన్మాతరం'అంటూ ప్రార్థించారు భగవత్ రామానుజాచార్యులు. సకల చరాచర జగత్తు ఆ అమ్మ సంతానమని, అందుకే ఆమె సంతానలక్ష్మి అని, ఈ రూపంలో ఉన్న అమ్మను ఆరాధిస్తే సంతాన అవరోధాలన్నీ తొలగి సత్సంతానం, సుఖశాంతులు కలుగుతాయని ప్రతీతి.

3) గజలక్ష్మి అలంకారం: 'లక్ష్మీః దివ్యైః గజేంద్రై మణిగణఖచితైః స్నాపితా హేమకుంభైః'అని కీర్తిస్తారు పూర్వాచార్యులు. ఈ అమ్మను ఆరాధిస్తే అధికారం, మహా సంపద కలుగుతాయని శాస్త్రం చెబుతోంది. ఈ గజలక్ష్మిని ఆరాధించే దేవేంద్రుడు త్రైలోకాధిపత్యాన్ని సాధించాడని పురాణంలో ఉందని, ఆ అమ్మను పూజిస్తే చెదరని అధికారం, తరగని సంపద కలుగుతాయని పండితులు పేర్కొంటున్నారు.

4) ధనలక్ష్మి అలంకారం: 'హిరణ్యవర్ణాం హరిణీంసువర్ణ రజతస్రజాం..'అంటూ శ్రీ సూక్తం అమ్మవారిని ధనలక్ష్మిగా కీర్తిస్తుంది. ధనం అంటే కేవలం డబ్బు మాత్రమే కాదు. విద్య, బలం, కీర్తి మొదలైనదంతా ధనమేనని, విద్యాధనం, హిరణ్య ధనం, శక్తి ధనాలను ప్రసాదిస్తుంది కాబట్టే ఈ అమ్మకు ధనలక్ష్మిగా పేరు అని, ముగ్గురమ్మల శక్తిని భక్తులకు పంచుతుందని ప్రతీతి.

5) ధాన్యలక్ష్మి అలంకారం: 'ధన ధాన్య కరీం...సిద్ధీం' అంటూ కీర్తిస్తుంది పురాణం. అన్ని రకాల ధాన్యాన్ని ప్రసాదించేది ఈ అమ్మేనని, ఈ అమ్మను ఆరాధిస్తే ఈతి బాధలన్నీ తొలగి, సమయానికి తగు వర్షాలు కురిసి దేశం సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉంటుందని పండితులు అంటున్నారు. వ్యవసాయ ప్రధానమైన భారత దేశ సౌభాగ్యం కోసం... ధాన్యలక్ష్మిని పూజిస్తారని చెబుతున్నారు.

6) విజయలక్ష్మి అలంకారం: 'జ్ఞానేశ్వరి..విజయ ప్రదా'అని కీర్తిస్తారు పరాశరభట్టర్. విజయం అంటే కేవలం యుద్ధ విజయం మాత్రమే కాదని, అన్ని రంగాలలో విజయమని, ఈ రూపంలో ఉన్న అమ్మను సేవిస్తే అన్ని రంగాల్లో సునిశితమైన జ్ఞానాన్ని ప్రసాదించి, తద్వారా విజయులను చేస్తుందని, అందుకే విజయలక్ష్మి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇస్తారని ప్రతీతి.

7) ఐశ్వర్యలక్ష్మి అలంకారం: 'అస్యేశనా జగతో విష్ణుపత్నీ'అని కీర్తిస్తుంది యజుర్వేదం. ఐశ్వర్యం అంటే శాఖాపరమైన శక్తి సామర్థ్యాలని, అఖిలాండ కోటి బ్రహ్మాండాలకు శాసకురాలు, కరుణారూపిణి అయిన ఈ అమ్మ క్రీగంటి చూపుల కదలికలనే శాసనాలుగా భావించి శ్రీ మహావిష్ణువు సకల జగద్రక్షణ చేస్తుంటాడని శ్రీ పరాశరభట్టర్ కీర్తించారు. ఈ రూపంలో ఉన్న అమ్మను ఆరాధిస్తే వాక్కుకు ప్రభావం, అనంత ఐశ్వర్యం కలుగుతాయని శాస్త్రం చెబుతోంది.

8) వీరలక్ష్మి అలంకారం: 'దారిద్ర్య ధ్వంసినీందేవీం సర్వోపద్రవవారిణీం..'అని అమ్మవారిని వీరలక్ష్మిగా కీర్తిస్తుంది పురాణం. దారిద్ర్యాన్ని, అన్ని రకాల ఉపద్రవాలను పారద్రోలే వీరత్వం ఈ అమ్మ సొంతమని, త్రిమూర్తులకు సైతం సాధ్యం కాని మహిషాసురుడిని ముగ్గురమ్మల శక్తి స్వరూపంగా ఆవిర్భవించి సంహరించిందని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ అమ్మను ఆరాధిస్తే అన్ని రకాల దుష్ట శక్తులు, భయాలు, ఉపద్రవాలు తొలగిపోతున్నాయని పండితులు చెబుతున్నారు.

9)మహాలక్ష్మి (నిజరూప) అలంకారం: ధనం, ధాన్యం, సంతానం, విద్య, అధికారం, విజయం, ఐశ్వర్యం.. ఇలా మనిషికి అవసరమైన అష్టైశ్వర్యాలను ప్రసాదించేందుకు అష్టలక్ష్మీ రూపాలను ధరించిన మహాలక్ష్మి.. కరుణాస్వరూపమైన తన నిజరూపంలో భక్తులందరినీ అనుగ్రహిస్తుందని శాస్త్రం చెబుతోంది.


దేవరుప్పలలో జనగామ-సూర్యాపేట రహదారిపై బాలయేసు హైస్కూల్ భారీ బతుకమ్మల శకటం

జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని బాలయేసు పాఠశాలలో బతుకమ్మలతో చిన్నారుల సందడి


శనివారం నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో మంత్రి సీతక్క తదితరులు

చెంచు రైతులకు పట్టాలివ్వండి

రంగారెడ్డి కలెక్టర్‌కు సీతక్క ఆదేశం

సాక్షి, హైదరాబాద్: గతంలో ప్రభుత్వాలు భూ పంపిణీలో భాగంగా పేద చెంచు రైతులకు పంపిణీ చేసిన భూములకు పట్టాలు మంజూరు చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డిని పీఆర్ మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రజాభవన్ భవన్‌లో శనివారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌కు చెందిన చెంచు రైతులు మంత్రి సీతక్కను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. 1988లో అప్పటి ప్రభుత్వం 27 మంది రైతులకు కడ్తాల్ మండలం అనుమాన్ పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 54 ఎకరాలు కేటాయించింది. గత ప్రభుత్వ హయాంలో ధరణి వల్ల ఆ భూములపై పట్టాలు కోల్పోయామని చెంచు రైతులు ఆవేదన వెలిబుచ్చారు. 30 ఏళ్లుగా తాము సేద్యం చేస్తున్న భూములకు పట్టాలు ఇప్పించాలని మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు. మంత్రి వెంటనే రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి వారికి తగిన న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.



నింగీ నేలా పరవశించెలే..

అల్లూరి జిల్లా మన్యంలో పచ్చని పొలాలపై నీలాకాశం పరుచుకున్న వేళ.. పచ్చదనం పరవశించింది.. ప్రకృతి పులకించింది. పచ్చని పొలాలు ఆకాశంతో ప్రేమగా పెనవేసుకున్న ఈ అపురూప దృశ్యం ఓ కవి రాసిన కవితలా, ఓ చిత్రకారుడి కుంచె నుంచి జాలువారిన కళాత్మకమైన చిత్రంలా మనసుకు హత్తుకుంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



అలిగిన వేళనె చూడాలి

ప్రేమకు, అలకలకు ఉన్న సంబంధాన్ని చెబుతున్నట్టుగా కనిపించిన మూడు జంట పక్షులు అరకు ఘాట్ మార్గంలో చూపరులను ఆకట్టుకున్నాయి. వీటిలో మూడు బుంగమూతితో అలిగినట్టుగా.. తమ మనసు మార్చుకుని ప్రేమ కురిపించే సమయం కోసం మగ పక్షులు ఎదురు చూస్తున్నట్టుగా ఈ దృశ్యం కనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



కొత్తపల్లి.. జలసవ్వడి

మన్యంలో శనివారం కురిసిన భారీ వర్షానికి కొత్తపల్లి జలపాతం ఉరకలేస్తోంది. ప్రమాదభరితంగా ఉన్నా చూపరులను ఆకట్టుకుంటోంది. వీకెండ్ కావడంతో జలపాతాన్ని వీక్షించేందుకు వచ్చిన పర్యాటకులకు నిరాశే మిగిలింది. ఒక్కసారిగా ఉప్పొంగడంతో జలపాతం దగ్గరకు వెళ్లేందుకు వారు సాహసించలేకపోయారు. – జి.మాడుగుల

నౌకా నిర్మాణంలో నవ శకం

భారీ నౌకల నిర్మాణంపై దృష్టి సారించిన భారత్

రెండు మెగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్ల ఏర్పాటుకు సన్నాహాలు

అందులో ఒకటి శ్రీకాకుళం జిల్లా మూలపేటలో..

విశాఖలో ఇండియన్ షిప్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం

నౌకా నిర్మాణ మార్కెట్‌లో వాటా పెంచుకోవడంపై భారత్ గురి

రక్షణ ఉత్పత్తులు, త్రివిధ దళాల పాటవాల్లో అగ్రరాజ్యాలతో పోటీ పడుతున్న భారత్.. నౌకా నిర్మాణం విషయంలో మాత్రం ఇప్పటివరకు వెనుకబడే ఉంది. చైనా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు ఏటా ఈ రంగంలో దూసుకుపోతుంటే.. ఇన్నాళ్లూ నెమ్మదిగా నెట్టుకొచ్చిన భారత్ ఇప్పుడు తన వ్యూహాన్ని మార్చింది. మెగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్లు, ఇండియన్ షిప్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటుతో భారత నౌకా నిర్మాణ రంగ దశ, దిశ మారబోతోంది. భారీ కార్గో నౌకల తయారీ కోసం అగ్రదేశాల వైపు చూసే పరిస్థితి నుంచి.. ఇకపై 3 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్న నౌకలను తయారుచేసే శక్తిగా భారత్ అవతరించబోతోంది. దేశ తూర్పు, పశ్చిమ తీరాలకు మణిహారాల్లా ఈ మెగా షిప్ బిల్డింగ్ కేంద్రాలు రూపుదిద్దుకోనున్నాయి.

సాక్షి, విశాఖపట్నం: ప్రపంచ నౌకా నిర్మాణ మార్కెట్‌లో ప్రస్తుతం భారత్ వాటా కేవలం 0.06 శాతం మాత్రమే. చైనా, దక్షిణ కొరియా, జపాన్ వంటి దేశాలు 85 శాతం వాటాతో షిప్ బిల్డింగ్ పరిశ్రమపై ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. మన దేశ తీరానికి వచ్చే భారీ నౌకలకు ఏవైనా మరమ్మతులు అవసరమైతే, వాటిని బాగుచేసే అత్యాధునిక షిప్‌యార్డులు లేకపోవడం ఒక ప్రధాన లోటుగా కేంద్రం భావించింది. ఈ ఏడాది జూలైలో అరేబియా సముద్రంలో 'ఎంవీ మెర్క్స్ ఫ్రాంక్‌ఫర్ట్' అనే భారీ కార్గో షిప్ అగ్నిప్రమాదానికి గురైనప్పుడు.. దానికి అవసరమైన మరమ్మతు సౌకర్యాలు భారత్‌లో లేకపోవడంతో మెగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్ల ఆవశ్యకతను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో దేశంలోని రెండు ప్రాంతాల్లో రూ.75 వేల కోట్ల పెట్టుబడులతో మెగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. తూర్పు, పశ్చిమ తీరాల్లో చెరొకటి చొప్పున ఈ క్లస్టర్లను 2030 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ప్రధాని మోదీ సమక్షంలో భావనగర్‌లో జరిగిన కార్యక్రమంలో విశాఖపట్నం పోర్టు, ఏపీ ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఏపీలో ఈ మెగా క్లస్టర్‌ను శ్రీకాకుళం జిల్లా మూలపేటలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో మూలపేట



పోర్టుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ మెగా క్లస్టర్లను పీపీపీ పద్ధతిలో పూర్తి చేయనుండగా.. కేంద్ర ప్రభుత్వమే రోడ్లు, భూమి అభివృద్ధి, విద్యుత్, నీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలను కల్పించనుంది.

నౌకల నిర్మాణం భారత్‌లో మొదలైనా..

సింధులోయ నాగరికత కాలంలోనే అంతర్జాతీయ వాణిజ్యం కోసం ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా నౌకల నిర్మాణాన్ని భారత్ ప్రారంభించింది. గుజరాత్, మహారాష్ట్ర, బెంగాల్ రాష్ట్రాల్లో భారీ చెక్క నౌకలను నిర్మించేవారు. మధ్యయుగంలో భారతీయ నౌకా నిర్మాణదారులు తయారు చేసిన నౌకలకు మంచి గిరాకీ ఉండేది. అయినప్పటికీ ఆధునిక షిప్‌బిల్డింగ్‌లో మనం వెనుకబడ్డాం.



షిప్‌యార్డులో నౌకల నిర్మాణాలు

విస్తరణకు భారీ అవకాశాలు

భారత నౌకానిర్మాణ పరిశ్రమ ఉద్యోగావకాశాల కల్పన, ఆర్థిక విస్తరణ, జాతీయ భద్రతకు అపారమైన సామర్థ్యాన్ని అందిస్తుంది. దేశంలో 200 కంటే ఎక్కువ చిన్న ఓడరేవులు, 12 ప్రధాన పోర్టులు, 7,500 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఉండటం స్వదేశీ నౌకానిర్మాణాన్ని ప్రోత్సహించడానికి బలమైన పునాదిగా ఉంది. ఇన్ని అవకాశాలు ఉన్నప్పటికీ, ప్రపంచ మార్కెట్‌లో మన దేశ వాటా 1శాతం కంటే తక్కువగా ఉంది. ఈ వాటా దక్షిణ కొరియా (25శాతం), జపాన్ (18శాతం), చైనా (47శాతం) కంటే చాలా తక్కువ. ఆ దేశాలు బలమైన ఆర్థిక ప్రోత్సాహకాలు, అత్యాధునిక సాంకేతికతతో పర్యావరణ వ్యవస్థలను స్థాపించగా, భారత్ ఇప్పుడు ఆ దిశగా పయనిస్తోంది. 2024లో ప్రపంచ నౌకా నిర్మాణ మార్కెట్ విలువ 150.42 బిలియన్ డాలర్లుగా అంచనా వేయగా, ఇది 2033 నాటికి 203.76 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. అంతర్జాతీయ సముద్ర రవాణాకు అనుగుణంగా నౌకలకు డిమాండ్ పెరగనుండటంతో, ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి భారత్ సిద్ధమైంది.

భారీ నౌకల తయారీ సులభతరం

దేశంలో ప్రస్తుతం ఉన్న కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్, గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్, గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్, హిందూస్తాన్ షిప్‌యార్డ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు, ఎల్ అండ్‌టీ, రిలయన్స్ నావల్ అండ్ ఇంజనీరింగ్ లిమిటెడ్ వంటి ప్రైవేట్ షిప్‌యార్డులకు ఈ కొత్త మెగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్ల ద్వారా విస్తృతమైన అవకాశాలు లభించనున్నాయి. ప్రస్తుతం గరిష్ఠంగా 1.25 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్న నౌకలను మాత్రమే నిర్మిస్తున్న భారత్.. ఈ క్లస్టర్లు పూర్తయితే ఏకంగా 3 మిలియన్ టన్నుల వరకు కార్గో సామర్థ్యంతో అతిపెద్ద నౌకలను నిర్మించగలుగుతుంది. అదేవిధంగా భారీ యుద్ధనౌకలు, ప్రత్యేక నౌకల నిర్మాణం కూడా ఈ మెగా క్లస్టర్లలో జరగనుంది. దేశంలో విస్తరిస్తున్న చమురు, గ్యాస్ నిక్షేపాల వెలికితీతకు అవసరమైన డ్రెడ్జర్లు, ఆఫ్‌షోర్ సపోర్ట్ షిప్‌లకు పెరుగుతున్న గిరాకీని కూడా ఈ కేంద్రాలు తీర్చనున్నాయి.

ప్రస్తుతం 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమాల కింద ఉపాధి, ఎగుమతులు, దేశ రక్షణ, ఆర్థిక అభివృద్ధికి దోహదపడేలా నౌకా నిర్మాణ రంగాన్ని ప్రభుత్వం బలోపేతం చేస్తోంది. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, మన నావికా దళాన్ని ఆధునీకరించడంలో భాగంగా విమాన వాహక నౌకలు, జలాంతర్గాములు, యుద్ధ నౌకలను నిర్మించడంలో ఈ షిప్ బిల్డింగ్ క్లస్టర్లు కొత్త ఒరవడిని సృష్టించనున్నాయి.

విశాఖలో ఇండియన్ షిప్ టెక్నాలజీ సెంటర్

విశాఖలోని ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ ఆవరణలో సాగరమాల పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన ఇండియన్ షిప్ టెక్నాలజీ సెంటర్‌ను(ఐఎస్‌టీసీ) ప్రధాని మోదీ శనివారం వర్చువల్‌గా ప్రారంభించారు. మారిటైమ్ విజన్–2030లో భాగంగా నెలకొల్పిన ఈ కేంద్రం.. మారిటైమ్ టెక్నాలజీకి జాతీయ హబ్‌గా మారనుంది. ఇక్కడ నౌకా నిర్మాణ అభివృద్ధిపై పరిశోధనలు, స్వదేశీ నౌకల రూపకల్పన, డిజిటల్ ఆవిష్కరణలు జరగనున్నాయి. ఇది దేశంలోని ప్రభుత్వ రంగ షిప్‌యార్డులకు అనుసంధానంగా పనిచేస్తూ, భారత నౌకా నిర్మాణ సామర్థ్యాన్ని పెంచనుంది. ఇక్కడే నేషనల్ షిప్ డిజైన్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను కూడా పునరుద్ధరించేందుకు కేంద్రం అడుగులు వేస్తోంది.

శీతాకాలంలో ఇంధన కరువు

ఏటా 9 రోజులు వాతావరణ పరిస్థితుల్లో మార్పులు

- 42 సంవత్సరాల్లో పరిస్థితులపై అధ్యయనం
- 1979-2022 మధ్య రెండుసార్లు ఇంధన కరువు
- భవిష్యత్‌లో తరచూ వచ్చే అవకాశం



సాక్షి, అమరావతి: 'పునరుత్పాదక ఇంధన కరువు' వినడానికి కొత్తగా ఉన్న ఈ పదం ఇప్పుడు వాతావరణ, ఇంధన రంగ నిపుణులను కలవరపరుస్తోంది. నీటి కరువు, ఆహారం కరువు, ఎరువుల కరువు.. అంటూ అనేక కరువుల గురించి వింటుంటాంగానీ.. ఈ ఇంధన కరువు ఏమిటనే సందేహం సహజంగానే కలుగుతుంది. ఇంధన కరువు కూడా వస్తుంది. ఇది వస్తే విద్యుత్ కొరత ఏర్పడుతుంది. బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విద్యుత్‌ను కొనాల్సి వస్తుంది. వేగంగా జరుగుతున్న వాతావరణ మార్పులే ఇంధన కరువుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. పైగా పునరుత్పాదక ఇంధన పెట్టుబడులను వాతావరణ మార్పు ఫలితాలు భవిష్యత్తులో ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తలు, ఇంధన, పర్యావరణరంగ నిపుణుల సలహాలు, సూచనల మేరకు గతంలో చోటుచేసుకున్న వాతావరణ మార్పులు, చరిత్రలో ఎదురైన ఇంధన కరువు వంటి సంఘటనలపై పరిశోధకులు ఒక అధ్యయనం చేశారు.

సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి తగ్గుతుంది

పునరుత్పాదక ఇంధన కరువు వంటి ఘటనలను అంచనా వేయడానికి పరిశోధకులు మన దేశ చారిత్రక వాతావరణ నమూనాలను విశ్లేషించారు. 1979 నుంచి 2022 వరకు 42 సంవత్సరాలను అధ్యయనం చేశారు. సౌర, పవన విద్యుత్ ఏ సమయంలో తక్కువగా ఉందనే సమాచారాన్ని సేకరించారు. ఇంగ్లండ్‌కు చెందిన కొందరు పరిశోధకులు జరిపిన అధ్యయనం మన దేశంలో 30 వేర్వేరు వాతావరణ నమూనాలను విశ్లేషించింది. పునరుత్పాదక ఇంధన కరువు సంభవించిన రోజుల్లో, వాటికి సంబంధించిన మూడు విభిన్నమైన అసాధారణ వాతావరణ పరిస్థితులు ఉన్నాయని అంచనా వేసింది. ఈ వాతావరణ పరిస్థితులు పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని వివిధ మార్గాల్లో ప్రభావితం చేశాయి. ఈశాన్య రుతుపవనాలు పవన శక్తి ఉత్పత్తిని ప్రభావితం చేశాయి. శీతాకాలంలో సౌర ఉత్పత్తిని మరింత దిగజార్చాయి. నైరుతి రుతుపవనాల ఉపసంహరణ వాయవ్య భారతదేశంలో తక్కువ గాలి ఉత్పత్తికి దారితీసింది. పశ్చిమ భారతదేశంలో మేఘాలు సౌర విద్యుత్ ఉత్పత్తిని తగ్గిస్తున్నాయని అధ్యయనంలో తేలింది. ఇలా కొన్ని వాతావరణ పరిస్థితుల్లో సౌర, పవన శక్తి లభ్యత క్షీణిస్తుంది. సహజంగా శీతాకాలంలో తొమ్మిది రోజులు సౌర, పవన శక్తి లభ్యత తగ్గుతుంది. దీన్నే పునరుత్పాదక ఇంధన కరువు అంటారు.

విద్యుత్ ప్లాంట్లలో ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు


చారిత్రక వాతావరణ డేటాను ఉపయోగించి తక్కువ సౌర, పవన శక్తి ఉత్పత్తికి కారణమయ్యే వాతావరణ పరిస్థితులను పరిశోధకులు అంచనా వేశారు. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు పునరుత్పాదక ఇంధన కరువులు ఎక్కువగా సంభవిస్తాయని తేల్చారు. 1979–2022 మధ్య రెండుసార్లు ఇంధన కరువు ఏర్పడింది. కానీ భవిష్యత్తులో తరచు ఇంధన కరువు పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంది. దీనిని అడ్డుకోవడానికి, ముందుగానే ఇంధన కరువును అంచనా వేయడానికి చారిత్రక వాతావరణ డేటా ఉపయోగపడనుంది. మన దేశంలో ప్రస్తుతం ఉన్న 220 గిగావాట్ల పునరుత్పాదక శక్తిలో మొత్తం 106 గిగావాట్ల సౌరశక్తి, 50 గిగావాట్ల పవనశక్తి ఉత్పత్తి సామర్థ్యం ఉంది. 2030 నాటికి 500 గిగావాట్ల వ్యవస్థాపిత పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలనేది మన దేశం లక్ష్యం. ఈ క్రమంలోనే పునరుత్పాదక ఇంధన గ్రిడ్‌ల కోసం వాతావరణ అంచనాను మెరుగుపరిచే ప్రయత్నంలో భాగంగా దేశవ్యాప్తంగా పవన, సౌర విద్యుత్ ప్లాంట్లలో ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి కేంద్ర విద్యుత్ అథారిటీ మార్గదర్శకాలను జారీచేసింది.

యువత రాజకీయాల్లోకి రావాలి

వెస్టిన్ కాలేజీ కాఫీ–కాన్వర్సేషన్ షోలో మంత్రి నాదెండ్ల మనోహర్

సాక్షి, అమరావతి: ఆడ, మగ అనే తేడాలేకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని, యువత రాజకీయాల్లోకి రావాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. ఓర్పు, సహనంతో ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చన్నారు. వెస్టిన్ కళాశాల ఆధ్వర్యంలో 15వ కాఫీ–కాన్వర్సేషన్ షో శనివారం విజయవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజ్‌మెంట్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన మంత్రి.. సామాజిక బాధ్యత, వృత్తి నైతికత, నాయకత్వం, మానవీయ విలువలపై పలు సూచనలు చేశారు. అనంతరం.. దుబాయ్, న్యూజిలాండ్‌లోని ప్రముఖ హోటళ్లలో ఉద్యోగాలకు ఎంపికైన 50 మంది వెస్టిన్ విద్యార్థులకు అంతర్జాతీయ ప్లేస్‌మెంట్ వీసాలను మంత్రి అందజేశారు. ఇప్పటివరకు 13 వేల అంతర్జాతీయ ఉద్యోగావకాశాలను విద్యార్థులకు అందించిన కాలేజి నిర్వాహకులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో 'వెస్టిన్' డైరెక్టర్ దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపకులు 600 మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులు, వృత్తి నిపుణులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు



తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 71,249 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 22,901 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.04 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టోకెట్లు లేని వారికి 18 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన వారు 3 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

తిరుమల పవిత్రతను కాపాడుదాం

తిరుమల: తిరుమల పవిత్రత, ప్రశాంతత కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ముఖ్యంగా భక్తులకు సరైన సమాచారం అందించే విషయంలో మీడియా పాత్ర మరింత కీలకమైనదని టీటీడీ అదనపు ఈఓ సి.హెచ్. వెంకయ్య చౌదరి అన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శనివారం టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి మీడియా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మీడియా ప్రతినిధుల నుంచి ప్రయోజనకరమైన సూచనలను ఎల్లప్పుడూ స్వాగతిస్తామని పేర్కొన్నారు. తిరుమల కొండ పవిత్రతను కాపాడటం, టీటీడీ కార్యక్రమాలను ప్రోత్సహించే విషయంలో మీడియాపై ఎంతో బాధ్యత ఉందని అభిప్రాయపడ్డారు. టీటీడీపై అసత్య కథనాలతో దుష్ప్రచారం చేసే వారిని నియంత్రించేందుకు మీడియా ప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


పట్టు తప్పిన ప్రోత్సాహకం

బైవోల్టిన్ పట్టు రైతులకు అందని రాయితీ సొమ్ము

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేరుకుపోయిన రూ.27 కోట్ల బకాయిలు

రీలర్లకూ అందని ప్రోత్సాహక ధనం





హిందూపురం పట్టు గూళ్ల మార్కెట్‌లో జరుగుతున్న క్రయవిక్రయాలు

మడకశిర: ఏడాది కాలంగా పట్టుగూళ్లు ఉత్పత్తి చేస్తున్న రైతులకు కూటమి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు లేవు. పట్టు పురుగులు పెంచే షెడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకంలో అందించే రాయితీ సొమ్మూ రైతులకు చెల్లించడం లేదు. ఫలితంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో బైవోల్టిన్ పట్టు రైతులు సంక్షోభంలో కూరుకుపోయారు. దీంతో బైవోల్టిన్ పట్టు సాగుపై రైతుల్లో ఆసక్తి సన్నగిల్లుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో బైవోల్టిన్ పట్టుగూళ్ళ ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. కిలో బైవోల్టిన్ పట్టుగూళ్ల ధర రూ.700కు పైగా పలుకుతోంది. ప్రోత్సాహక ధనం అందకపోవడంతో బైవోల్టిన్ పట్టుగూళ్ల ఉత్పత్తిని తగ్గిస్తున్నారు. హిందూపురం మార్కెట్‌కు రోజూ బైవోల్టిన్ పట్టుగూళ్లు దాదాపు 40 నుంచి 50 లాట్లు వచ్చేవి. ప్రస్తుతం రోజూ 30 లాట్‌ల లోపే ఉంటున్నాయి.

పేరుకుపోయిన రూ.66 కోట్ల బకాయి

ఉమ్మడి జిల్లాలో పట్టు రైతులు రెండు రకాల పట్టు గూళ్లను ఉత్పత్తి చేస్తున్నారు. పట్టు సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆకర్షణీయమైన ప్రోత్సహకాలు ఇస్తోంది. బైవోల్టిన్ పట్టు గూళ్లను ఉత్పత్తి చేసి ప్రభుత్వ మార్కెట్‌లో విక్రయించిన రైతుకు కిలోకు రూ.50, అలాగే సీబీ రకం పట్టు గూళ్లకు కిలోకు రూ.10 చొప్పున ప్రోత్సాహక ధనాన్ని ప్రభుత్వం అందజేస్తూ వచ్చింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పట్టు రైతులు నయా పైసా ప్రోత్సాహక ధనం అందలేదు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా పట్టు రైతులకు రూ.66 కోట్ల బకాయిలు పేరుకుపోగా ఒక్క ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే రూ.27 కోట్ల బకాయిలు ఉండడం గమనార్హం. అలాగే పట్టుగూళ్ల నుంచి దారం వెలికి తీసే రీలర్లకూ ప్రతి కిలో దారానికి రూ.130 చొప్పున ప్రోత్సాహక ధనం చెల్లించాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 17 నెలల కాలంలో నయా పైసా ప్రోత్సాహక ధనం అందలేదని రీలర్లు వాపోతున్నారు.

పట్టు రైతులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహక ధనం ఇలా...	బైవోల్టిన్ పట్టు రైతులకు: కిలోకు	సీబీ పట్టు రైతులకు: కిలోకు	రీలర్లకు అందించేది: కిలో దారానికి
	రూ. 50	రూ. 10	రూ. 130

బకాయిలువెంటనే విడుదల చేయాలి



పట్టు రైతులను ఆదుకోవాలంటూ పట్టు రైతు సంఘం ఆధ్వర్యంలో పలుమార్లు విజయవాడకు వెళ్లి ప్రభుత్వ పెద్దలతో చర్చించాం. అయినా కూటమి సర్కారులో మార్పు రాలేదు. పట్టు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలి. పేరుకుపోయిన ప్రోత్సాహక ధనం బకాయిలు తక్షణమే విడుదల చేయాలి.
– వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర పట్టు రైతు సంఘం అధ్యక్షుడు

తప్పని ఆర్థిక ఇబ్బందులు



ప్రభుత్వం ప్రోత్సాహక ధనం బకాయిలను మంజూరు చేయకుండా జాప్యం చేస్తోంది. దీంతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాం. పరిస్థితి ఇలాగే ఉంటే పట్టుగూళ్ల ఉత్పత్తికి రైతులు స్వస్తి పలుకుతారు.
– సోమ్‌కుమార్, పట్టు రైతు సంఘం అధ్యక్షుడు, మడకశిర

ఓ వైపు కళారంగంలో తళుక్కుమంటూనే మరోవైపు వ్యాపార రంగంలోనూ రాణిస్తున్నారు నేటి సినీ తారలు. నటనలో అవకాశాలను సద్వినియోగం చేయడంలోనే కాదు తమలో ఉన్న సాధికారిత శక్తిని కూడా నిరూపిస్తున్నారు. నేషనల్ క్రష్‌గా పేరొందిన రష్మికా మందన్నా నుంచి నయనతార, సమంత, తమన్నా... ఇలా ప్రతీ నటీమణి తమ జీవితాన్ని సరికొత్త కోణంలో ఆవిష్కరిస్తున్నారు. సినిమా స్టార్స్‌గా కోట్లలో పారితోషికం తీసుకుంటున్న ఈ తారలు ఆ డబ్బుని రెట్టింపు చేసే పని మీద ఉన్నారు. వ్యాపారంలోనూ కోట్లు సంపాదించే ప్రయత్నంలో ఉన్నారు. ఇక 'షో (సినిమా) బిజినెస్'లో రాణిస్తూ వేరే ఏయే 'బిజినెస్'లోకి ఈ స్టార్స్ ఎంటరయ్యారో తెలుసుకుందాం.

షో బిజినెస్



● శ్రుతీహాసన్ ● తమన్నా ● సమంత ● రష్మిక ● శ్రద్ధా దాస్ ● నయనతార

తండ్రి బాటలో...

మిల్కీ బ్యూటీగా నార్త్, సౌత్‌లో బోలెడంత క్రేజ్ సంపాదించుకున్నారు తమన్నా. హీరోయిన్ అయి, దాదాపు 20 ఏళ్లు కావొస్తున్నా అదే స్పీడుతో దూసుకెళుతున్నారు. ఇక ఇటీవల ఐటెమ్ సాంగ్స్‌తోనూ అలరిస్తున్నారు. మరోవైపు ఆన్‌లైన్ నగల వ్యాపారాన్ని ఆరంభించారు. ఈ ఆభరణాలను తనే డిజైన్ చేస్తున్నారు కూడా. ఇంతకీ తమన్నాకి జ్యూయెలరీ బిజినెస్ ఎందుకు చేయాలనిపించిదంటే... ఆమె తండ్రి వల్లే. తమన్నా తండ్రికి నగల వ్యాపారం ఉంది. దాంతో కుమార్తెకి కూడా ఆ వ్యాపారంపై ఆసక్తి కలిగింది. ఒకవైపు నటన... మరోవైపు జ్యూయెలరీ బిజినెస్‌తో మిల్కీ బ్యూటీ ఫుల్ బిజీ.

మ్యూజిక్‌పై మమకారంతో..

బహుముఖ ప్రజ్ఞాశాలి కమల్‌హాసన్ తనయగా శ్రుతీహాసన్ కూడా మల్టీ టాలెంటెడ్. తనలో మంచి నటి, గాయని, సంగీతదర్శకురాలు... ఇలా ఎన్నో ప్రతిభలు ఉన్నాయి. అయితే హీరోయిన్‌గా బిజీగా ఉంటున్న శ్రుతీహాసన్ తనకెంతో నచ్చిన మ్యూజిక్‌పై కూడా దృష్టి సారించాలనుకున్నారు. అందుకే 'ఇసిడ్రో' అనే నిర్మాణ సంస్థను ఆరంభించారామె. ఈ సంస్థ లఘు చిత్రాలు, యానిమేషన్ చిత్రాలు, వీడియో రికార్డింగ్‌లను ఈ రూపొందిస్తుంటుంది.

క్లాతింగ్ బ్రాండ్... ప్రొడక్షన్

నటనలో భేష్ అనిపించుకున్న సమంత తన స్టైలిష్ లుక్స్‌కు కూడా చాలా పాపులర్. సినిమాల్లోనే కాదు... విడిగా కూడా సమంత రకరకాల డ్రెస్ డిజైన్స్ ట్రై చేస్తుంటారు. ఇప్పటికే 'సాకీ' పేరుతో సమంతకు క్లాతింగ్ బ్రాండ్ ఉంది. 2020లో ఈ బ్రాండ్‌ని ఆరంభించారామె. అలాగే ఏ సినిమా ఫీల్డ్ అయితే తనకు నటిగా మంచి జీవితాన్ని ఇచ్చిందో అదే సినిమా రంగంలో పెట్టుబడి పెట్టాలనుకుని, 'ట్రా లా లా' బేనర్‌ని ఆరంభించారు. ఈ బేనర్‌లో తొలి ప్రయత్నంగా 'శుభం' చిత్రాన్ని నిర్మించారు సమంత. అలాగే ఇదే బేనర్‌లో తాను కథానాయికగా 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని ప్రకటించారు.

నయన... నాలుగైదు వ్యాపారాలు

నటనలో లేడీ సూపర్‌స్టార్ అని పేరు తెచ్చుకున్న నయనతార ఇప్పటికే 'ది లిప్ బామ్ కంపెనీ'ని స్థాపించారు. భర్త విఘ్నేష్ శివన్‌తో కలిసి 'రౌడీ పిక్చర్స్' అనే నిర్మాణ సంస్థలో పాలు పంచుకున్నారు. చెన్నైలో 'ఛాయ్‌వాలే' అనే స్థానిక పానీయాల బ్రాండ్‌లో పెట్టుబడి పెట్టి, రెస్టారెంట్ వ్యాపారంలో కూడా రాణిస్తున్నారు. ఇటీవల '9 స్కిన్' అనే చర్మ సంరక్షణ బ్రాండ్‌నూ ప్రారంభించారామె. మొత్తానికి ఈ లేడీ సూపర్ స్టార్ ఒక్క వ్యాపారంలో కాదు... నాలుగైదు వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టి, దూసుకెళుతున్నారు.

ఫ్యాషన్ రంగలోకి నేషనల్ క్రష్

'నేషనల్ క్రష్'గా పాన్ ఇండియా స్థాయిలో అభిమానులను సొంతం చేసుకున్న రష్మికా మందన్నా తన కొత్త వ్యాపారాన్ని ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటించారు. ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో తన తల్లితో జరిపిన సంభాషణ వీడియోను పంచుకున్నారామె. తన తల్లితో మాట్లాడుతూ– 'అమ్మా... ఈ రోజు చాలా చాలా ముఖ్యమైన షూటింగ్ చేయబోతున్నాను. మీరు చెప్పినట్టుగా ఈ వ్యాపారాన్ని ప్రారంభించబోతున్నాను' అని ఆమె తన తల్లితో పేర్కొన్నారు. రష్మిక తల్లి 'దేవుడు నిన్ను ఆశీర్వదిస్తాడు' అని కుమార్తెను హృదయపూర్వకంగా ఆశీర్వదించారు. ఇంతకీ రష్మిక ఏ బిజినెస్ చేయనున్నారంటే.... తన సొంత బ్రాండ్‌తో ఫ్యాషన్ రంగంలోకి అడుగుపెట్టనున్నారు.

శ్రద్ధగా వ్యాపారంలోకి...

కెరీర్ ఫుల్ ఫామ్‌లో ఉన్నప్పుడు ఆ బిజీని ఎంజాయ్ చేసి, కాస్త అవకాశాలు తగ్గగానే డీలా పడిపోతుంటారు కొందరు తారలు. కానీ శ్రద్ధా దాస్ అలా కాదు. ఒకప్పుడు మంచి కెరీర్‌ని చూసిన ఈ బ్యూటీ... ఇప్పుడు నటిగా అంత బిజీగా లేకపోయినా నగల వ్యాపారంతో జోష్‌గా ఉన్నారు. 'పల్మోనాస్' అనే డెమీ ఫైన్ జ్యూయెలరీ బ్రాండ్‌ని ఆరంభించారు. పల్మోనాస్‌కి ఆమె ఒక ఫౌండర్. ఈ నగల వ్యాపారాన్ని కూడా చాలా శ్రద్ధగా చేస్తున్నారు శ్రద్ధా దాస్.

ఇలా మరికొందరు తారలు ఇతర వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టి, 'బిజినెస్ ఉమన్'గానూ రాణిస్తున్నారు. ప్రతిభ, వ్యాపార చతురతతో అటు కెరీర్ ఇటు వ్యాపార రంగంలోనూ విజయవంతంగా విస్తరిస్తున్నారు ఈ కథానాయికలు. ఈ స్టార్స్ నవతరానికి సవాల్‌తో కూడిన ఆలోచననూ అందిస్తున్నారు.



● రిషబ్ శెట్టి

ట్రైలర్ రెడీ

రిషబ్ శెట్టి హీరోగా నటించి, స్వీయ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కాంతార: చాప్టర్1'. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించగా, గుల్షన్ దేవయ్య, జయరాం ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. హోంబలే ఫిలింస్ నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ను రేపు (సెప్టెంబరు 22) రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ వెల్లడించి, ఓ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. కాగా ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను ప్రభాస్, హిందీ ట్రైలర్‌ను హృతిక్ రోషన్, తమిళ ట్రైలర్‌ను శివకార్తికేయన్, మలయాలం ట్రైలర్‌ను పృథ్వీరాజ్ సుకుమారన్‌లు డిజిటల్‌గా విడుదల చేయనున్నారు. ''ఈ సినిమా కోసం 3వేలమంది ప్రజలు, 500 మంది యోధులు పాల్గొన్న ఓ భారీ యుద్ధ సన్నివేశాన్ని తెరకెక్కించాం. ఇందుకోసం 25 ఎకరాల స్థలంలో ఓ పట్టణాన్ని నిర్మించి, దాదాపు 50 రోజుల పాటు షూటింగ్ చేశాం. భారతీయ సినిమా చరిత్రలోనే అతి పెద్ద సన్నివేశాల్లో ఈ యుద్ధ సన్నివేశం ఒకటిగా నిలుస్తుంది. 'కాంతార' ('కాంతార' సినిమాకు ప్రీక్వెల్‌గా 'కాంతార: ఛాప్టర్ 1' చిత్రం తెరకెక్కింది) విజయాన్ని కొనసాగించడంలో హోంబలే ఫిలింస్ రాజీ పడటం లేదు. ఆడియన్స్‌కు థియేటర్స్‌లో గొప్ప అనుభూతిని ఇచ్చేలా ఈ సినిమా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. కన్నడతో పాటు హిందీ, తెలుగు, మలయాళ, తమిళ, బెంగాలీ, ఇంగ్లిష్ భాషల్లో 'కాంతార: ఛాప్టర్ 1' చిత్రం అక్టోబరు 2న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది.

షారుక్ చెప్పిన పాఠాన్ని ఫాలో అవుతున్నా!



● షారుక్‌ఖాన్

''పద్దెనిమిది సంవత్సరాల క్రితం 'ఓం శాంతి ఓం' సినిమా చేస్తున్నప్పుడు షారుక్ ఖాన్ నాకు కొన్ని పాఠాలు నేర్పారు. ఓ సినిమా మేకింగ్, ఆ సినిమా నుంచి మనం ఏం నేర్చుకున్నాం, ఆ సినిమాలో ఎవరితో కలిసి నటించాం అనే అంశాలు ఆ సినిమా విజయాని కన్నా ముఖ్యమైనవి అని ఆయన చెప్పారు. షారుక్ నాకు నేర్పిన తొలి పాఠం ఇదే. అప్పట్నుంచి నేను తీసుకునే నిర్ణయాలకు ఈ పాఠాన్నే అమలు చేస్తున్నాను. షారుక్‌తో ఆరోసారి సినిమా చేస్తుండటానికి ఈ పాఠమే కారణమై ఉండొచ్చు'' అని తన తాజా ఇన్‌స్టా పోస్ట్‌లో దీపికా పదుకోన్ పేర్కొన్నారు. షారుక్ ఖాన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కింగ్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలోని ఈ చిత్రంలో దీపికా పదుకోన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, షారుక్ తనయ సుహానా ఖాన్, అభిషేక్ బచ్చన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. కాగా 'కింగ్' సినిమా షూటింగ్‌లోకి తాను అడుగుపెట్టినట్లుగా స్పష్టం చేస్తూ దీపికా పదుకోన్ ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్‌ను షేర్ చేశారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ పోల్యాండ్‌లో జరుగుతోందని, ఈ షెడ్యూల్ దాదాపు నెల రోజులకు పైనే ఉంటుందని బాలీవుడ్ టాక్. ఇక 'ఓం శాంతి ఓం, చెన్నై ఎక్స్‌ప్రెస్, హ్యాపీ న్యూ ఇయర్, పఠాన్, జవాన్' చిత్రాల్లో షారుక్–దీపిక హీరో హీరోయిన్లుగా నటించిన సంగతి గుర్తుండే ఉంటుంది. తాజాగా 'కింగ్' సినిమా కోసం ఈ ఇద్దరు ఆరోసారి కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. మరోవైపు 'కల్కి 2' చిత్రంలో దీపిక నటించడం లేదని ఆ చిత్రం మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.



● దీపికా పదుకోన్

రామ్‌చరణ్‌తో జోడీ?

హీరో రామ్‌చరణ్‌కి జోడీగా బాలీవుడ్ హీరోయిన్ కృతీ సనన్ నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. ప్రస్తుతం బుచ్చిబాబు దర్శకత్వంలో 'పెద్ది' అనే పాన్‌ఇండియా సినిమాలో నటిస్తున్నారు రామ్‌చరణ్. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. 2026 మార్చి 27న ఈ చిత్రం విడుదల కానున్న సంగతి తెలిసిందే. 'పెద్ది' తర్వాత సుకుమార్ దర్శకత్వంలో నటించనున్నారు రామ్‌చరణ్. 'ఆర్‌సీ 17' అన్నది వర్కింగ్ టైటిల్. 'రంగస్థలం'(2018) వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత రామ్‌చరణ్–సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమా ఇది. ప్రస్తుతం ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు సుకుమార్. 'పెద్ది' షూటింగ్ పూర్తయిన వెంటనే ఏమాత్రం విరామం లేకుండా 'ఆర్‌సీ 17'ని సెట్స్‌కి తీసుకెళ్లనున్నారట రామ్‌చరణ్– సుకుమార్. అయితే ఈ సినిమాలో హీరోయిన్ ఎవరు? అనే విషయంపై ఇప్పటి వరకూ ఎలాంటి ప్రకటన రాలేదు. అయితే రామ్‌చరణ్‌కి జోడీగా కృతీసనన్‌ని తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారట సుకుమార్. మహేశ్ బాబు హీరోగా నటించిన 'వన్: నేనొక్కడినే' సినిమా ద్వారా కృతీసనన్‌ని తెలుగుకి పరిచయం చేశారు సుకుమార్. ఆ తర్వాత 'దోచెయ్, ఆదిపురుష్' వంటి తెలుగు సినిమాల్లో నటించారు కృతీసనన్. ప్రస్తుతం బాలీవుడ్‌లో బిజీగా ఉన్న ఈ బ్యూటీని 'ఆర్‌సీ 17' ద్వారా మరోసారి టాలీవుడ్‌కి తీసుకురానున్నారట సుకుమార్. మరి రామ్‌చరణ్‌కి జోడీగా కృతీసనన్ నటిస్తారా? లేదా? అనే విషయం తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాలి.



● కృతీ సనన్



● ప్రదీప్ రంగనాథన్

దీపావళికి డ్యూడ్

'ప్రేమలు' వంటి అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు జంటగా నటించిన చిత్రం 'డ్యూడ్'. కీర్తిశ్వరన్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్న ఈ సినిమాలో శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా దీపావళి సందర్భంగా అక్టోబరు 17న తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. సాయి అభ్యంకర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'సెకండ్ గేర్ బాగుండు పో..' పాటని శనివారం రిలీజ్ చేశారు మేకర్స్. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటని సంజిత్, సాయి అభ్యంకర్ పాడారు. ''రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'డ్యూడ్'. 'సెకండ్ గేర్ బాగుండు పో..' పాట మనసుని హత్తుకునే మెలోడీగా ఉంటుంది. వినగానే కనెక్ట్ అయ్యే ఈ సాంగ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ దీపావళికి అద్భుతమైన మ్యూజిక్‌తో కూడిన కలర్‌ఫుల్ సినిమాని అందించడానికి మా 'డ్యూడ్' సిద్ధంగా ఉంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. రోహిణి మొల్లేటి, హృదు హరూన్, ద్రవిడ్ సెల్వం ఇతర పాత్రలు పోషించిన ఈ సినిమాకి సీఈఓ: చెర్రీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అనిల్ యెర్నేని, కెమెరా: నికేత్ బొమ్మి.

బిజినెస్ రీల్

జీఎస్టీ తగ్గింపును కస్టమర్లకు బదలాయించండి

పరిశ్రమకు కేంద్ర మంత్రి గోయల్ సూచన



న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపు ప్రయోజనాలను కస్టమర్లకు బదలాయించడంపై దృష్టి పెట్టాలని దేశీ పరిశ్రమకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ సూచించారు. దీని వల్ల పరిశ్రమకు కూడా లబ్ధి చేకూరుతుందన్నారు. మరోవైపు, పరిశ్రమకు లావాదేవీల వ్యయాలను తగ్గించే దిశగా సమగ్ర రాష్ట్ర, నగర లాజిస్టిక్స్ ప్రణాళికలను ఆయన ఆవిష్కరించారు. ఎనిమిది రాష్ట్రాలవ్యాప్తంగా ఇవి అమలవుతాయి. ప్రస్తుత లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలు, అంతరాలను గుర్తించడం, సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడం, వ్యయాలను తగ్గించుకోవడానికి సంబంధించి మార్గదర్శ ప్రణాళికను రూపొందించేందుకు ఈ ప్రణాళిక తోడ్పడుతుంది. అటు వాణిజ్య చర్చల కోసం సెప్టెంబర్ 22న భారత అధికారిక బృందాన్ని తీసుకుని గోయల్ అమెరికా వెళ్లనున్నట్లు కేంద్రం ఒక ప్రకటనలో వెల్లడించింది.

23 నుంచి ట్రూ కలర్స్ ఐపీఓ

ధర శ్రేణి రూ. 181–191

ముంబై: డిజిటల్ టెక్స్‌టైల్ ప్రింటర్ల దిగుమతి, పంపిణీదారు ట్రూ కలర్స్ కంపెనీ ఐపీఓకి సిద్ధమైంది. మార్కెట్ నుంచి రూ.128 కోట్లు సమీకరించనుంది. ఇందుకు ధరల శ్రేణి రూ.181–191గా నిర్ణయించింది. సబ్‌స్క్రిప్షన్ మంగళవారం (సెప్టెంబర్ 23న) ప్రారంభమై... గురువారం ముగిస్తుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు సెప్టెంబర్ 22నే బిడ్డింగ్ విండో తెరుచుకోనుంది. సమీకరించిన నిధుల్లో మూలధన అవసరాలకు రూ.48.90 కోట్లు, రుణ చెల్లింపులకు రూ.40.40 కోట్లు మిగిలిన ధనాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించనుంది. జీవైఆర్ క్యాపిటల్ అడ్వైజర్స్ బుకింగ్ రన్నింగ్ మేనేజర్‌గా, బిగ్‌షేర్ సర్వీసెస్ రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్నాయి. 2021 అక్టోబర్‌లో ఏర్పాటైన ట్రూ కలర్స్ సంస్థ కోనికా మినోల్టా, హోప్‌టెక్, ఐటెన్, పెంగ్యా, స్కైజెట్ వంటి బ్రాండ్ల నుండి డిజిటల్ టెక్స్‌టైల్ ప్రింటర్లను దిగుమతి చేసుకొని పంపిణీ చేస్తోంది.

మల్టీ క్యాప్ ఫండ్ ఏయూఎం @ రూ. 2,900 కోట్లు

బరోడా బీఎన్‌పీ పారిబా

ముంబై: బరోడా బీఎన్‌పీ పారిబా ఏఎంసీ తమ మల్టీ క్యాప్ ఫండ్ నిర్వహణలోని ఆస్తుల (ఏయూఎం) పరిమాణం రూ. 2,900 కోట్ల మైలురాయిని దాటినట్లు తెలిపింది. అలాగే ఈ ఫండ్ ప్రారంభించి 22 ఏళ్లయినట్లు పేర్కొంది. ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఇది వార్షికంగా 15.24 శాతం మేర రాబడిని అందించిందని సంస్థ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ సంజయ్ చావ్లా తెలిపారు. తొలినాళ్లలో ఇన్వెస్ట్ చేసిన రూ. 1,00,000 విలువ ఈ ఏడాది ఆగస్టు నాటికి రూ. 22.6 లక్షలకు చేరిందని వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-9-2025

విశాఖ	555–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535–00
విజయవాడ	550–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535–00
వరంగల్	537–00
రిటైల్ ధర	5.95

భారత టెక్ కంపెనీలపై ఎఫెక్ట్!

- ఆన్‌షోర్ వ్యాపార కార్యకలాపాలకు విఘాతం
- ఒక్క రోజు డెడ్‌లైన్‌తో కంపెనీలు, ప్రొఫెషనల్స్‌కి అనిశ్చితి
- హెచ్1బీ వీసా ఫీజుల పెంపుపై నాస్కామ్ ఆందోళన



న్యూఢిల్లీ: హెచ్1బీ వీసాలకు సంబంధించి అమెరికా అదనంగా 1,00,000 డాలర్ల ఫీజు విధించడంపై దేశీ ఐటీ సంస్థల సమాఖ్య నాస్కామ్ ఆందోళన వ్యక్తం చేసింది. దీనితో ఆన్‌షోర్ ప్రాజెక్టులకు సంబంధించి వ్యాపార కార్యకలాపాలకు విఘాతం కలుగుతుందని పేర్కొంది. ఫలితంగా భారతీయ టెక్నాలజీ సర్వీస్ కంపెనీలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపింది. అంతేగాకుండా దీని అమలుకు ఒకే ఒక్క రోజు గడువు ఇవ్వడం వల్ల ప్రపంచవ్యాప్తంగా వ్యాపార సంస్థలు, ప్రొఫెషనల్స్, విద్యార్థుల విషయంలో అనిశ్చితి తలెత్తే ప్రమాదం ఉందని ఒక ప్రకటనలో పేర్కొంది. అంతర్జాతీయ, భారతీయ కంపెనీల కోసం హెచ్1బీ వీసాలపై పని చేస్తున్న భారతీయులపైనా అమెరికా నిర్ణయం ప్రభావం పడుతుందని నాస్కామ్ వివరించింది. వీసా ఫీజులపై ఆదేశాలను అధ్యయనం చేస్తున్నామని, ఇలాంటి మార్పుల వల్ల అమెరికా నవకల్పనల వ్యవస్థపై, అలాగే ఉద్యోగాలపై కూడా ప్రభావాలు పడతాయని పేర్కొంది. వీటికి తగ్గట్లుగా సర్దుబాట్లు చేసుకునేందుకు క్లయింట్లతో కలిసి కంపెనీలు పని చేస్తాయని వివరించింది. ఈ స్థాయి మార్పులు చేసేటప్పుడు వ్యాపారవర్గాలు, వ్యక్తులు ప్రణాళిక వేసుకునేందుకు తగినంత సమయం ఇవ్వాల్సి ఉంటుందని అభిప్రాయపడింది. 'మేము ఎప్పటికప్పుడు పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాం. దీని వల్ల తలెత్తే ప్రభావాల గురించి పరిశ్రమవర్గాలతో సమాలోచనలు జరుపుతున్నాం' అని నాస్కామ్ తెలిపింది. మరోవైపు, ప్రస్తుతం హెచ్1బీ వీసాలు కలిగి ఇతర దేశాల్లో ఉన్న ఉద్యోగులను అత్యవసరంగా అమెరికాకు తిప్పి పంపేందుకు సత్వరం చర్యలు తీసుకోవాలని కంపెనీలకు నాస్కామ్ వైస్ ప్రెసిడెంట్ శివేంద్ర సింగ్ సూచించారు. కృత్రిమ మేధ, ఇతరత్రా టెక్నాలజీలను అభివృద్ధి చేయడం వేగవంతమవుతున్న తరుణంలో ఇలాంటి చర్యల వల్ల వ్యవస్థకు విఘాతం కలుగుతుందని తెలిపారు.

అమెరికాలో నియామకాలు పెంచుకుంటున్నాం ..

భారత్ కేంద్రంగా పని చేసే కంపెనీలు అమెరికాలో స్థానికుల నియామకాలను పెంచుకోవడం ద్వారా కొన్నాళ్లుగా వీసాలపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించుకుంటున్న సంగతిని నాస్కామ్ గుర్తు చేసింది. ఈ కంపెనీలు హెచ్1బీ ప్రాసెస్‌లకు సంబంధించి అన్ని నిబంధనలను పాటిస్తున్నాయని, నిర్దేశిత జీతభత్యాలు చెల్లిస్తున్నాయని, స్థానిక ఎకానమీ వృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తున్నాయని, కొత్త ఆవిష్కరణల కోసం విద్యాసంస్థలు, స్టార్టప్‌లతో కలిసి పని చేస్తున్నాయని పేర్కొంది. ఈ కంపెనీల్లో హెచ్1బీ వీసాలపై పని చేస్తున్న వర్కర్లతో అమెరికా దేశ భద్రతకు ఎలాంటి ముప్పు ఉండదని స్పష్టం చేసింది.

నవకల్పనలకు నిపుణులు కీలకం..

కొత్త ఆవిష్కరణలను కనుగొనేందుకు, అమెరికా దీటుగా పోటీపడేందుకు, ఆ దేశ ఎకానమీ అభివృద్ధి చెందేందుకు ప్రతిభావంతులు అవసరమని నాస్కామ్ తెలిపింది. ఏఐతో పాటు ఇతరత్రా సాంకేతికతల్లో అనేక మార్పులు జరుగుతున్న తరుణంలో వారి సేవలు కీలకంగా మారాయని వివరించింది. ప్రస్తుతం హెచ్1బీ వీసా ఫీజులు కంపెనీ స్థాయిని బట్టి సుమారు 2,000–5,000 డాలర్ల వరకు ఉన్నాయి. కొత్తగా విధించిన 1,00,000 డాలర్లు దీనికి అదనం. అమెరికన్ల ఉద్యోగాలను కాపాడే పేరుతో తలపెట్టిన చేపట్టిన ఈ చర్య, కీలకమైన ప్రతిభావంతుల లభ్యతను దెబ్బతీస్తుందని కార్పొరేట్ న్యాయవాది సీఆర్ సుకుమార్ వ్యాఖ్యానించారు. అమెరికా నిర్ణయాన్ని వీసా కన్సల్టెంట్, ఐటీ వ్యాపారవేత్త దిలీప్ కుమార్ నూనె 'షాకింగ్'గా అభివర్ణించారు. అమెరికాలో సర్వీసులు అందిస్తున్న చాలా మటుకు ఐటీ కంపెనీలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందన్నారు. దీనితో ప్రతిభావంతులను అమెరికాకు రప్పించడం కష్టతరం అవుతుంది కాబట్టి అమెరికన్ కంపెనీలపైనా ప్రభావం పడుతుందన్నారు.

ఐటీ కంపెనీల వ్యయాలు పెరుగుతాయ్



హెచ్1బీ వీసాల ఫీజు పెంపుతో భారతీయ ఐటీ కంపెనీలకు వ్యయాలపరంగా సవాళ్లు గణనీయంగా పెరుగుతాయి. సమీప భవిష్యత్తులో దీని పరిణామాలు కొంత తీవ్రంగా ఉండొచ్చు. దేశీ ఐటీ కంపెనీలు అమెరికాలో నియామకాలను మరింతగా పెంచుకునేందుకు, గ్లోబల్ డెలివరీ వ్యవస్థను పటిష్టం చేసుకునేందుకు ఇది దారి తీయొచ్చు. తద్వారా సవాలును అవకాశంగా మల్చుకోవడానికి ఆస్కారం ఉంది. – బీవీఆర్ మోహన్ రెడ్డి, సైయెంట్ వ్యవస్థాపక చైర్మన్

ఆఫ్‌షోరింగ్ వేగవంతం



హెచ్1బీ వీసా ఫీజుల పెంపుతో కొత్త దరఖాస్తులపై ప్రభావం పడుతుంది. దీని ఎఫెక్ట్‌తో ఓవైపు ప్రతిభావంతులు దొరక్క, మరోవైపు వ్యయాలు పెరిగిపోవడం వల్ల రాబోయే రోజుల్లో కార్యకలాపాల ఆఫ్‌షోరింగ్ మరింత వేగవంతం అవుతుంది. హెచ్1బీ వీసాలపై భారత ఐటీ కంపెనీలు ఆధారపడటం కొన్నాళ్లుగా గణనీయంగా తగ్గిపోయింది. డేటా ప్రకారం అమెరికన్ టెక్ దిగ్గజాలే వీటిని ఎక్కువగా తీసుకుంటున్నాయి. కొత్త దరఖాస్తులకు మాత్రమే కొత్త నిబంధన వర్తిస్తుంది కాబట్టి ప్రస్తుతానికైతే దీని ప్రభావం పరిమితమే. అమెరికాలో చౌకగా పని చేసి పెట్టేలా ఉద్యోగులను పంపించేందుకు కంపెనీలు ఈ వీసాలను ఉపయోగించుకుంటున్నాయన్న అభిప్రాయాలన్నీ అపోహలే. హెచ్1బీ వీసాలను వినియోగించుకునే టాప్ 20 కంపెనీలు సగటున 1,00,000 డాలర్ల పైగానే జీతభత్యాలు ఇస్తున్నాయి.

– మోహన్‌దాస్ పాయ్, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో

అమెరికాకు నష్టం, భారత్‌కు లాభం



హెచ్1బీ వీసా ఫీజులను భారీగా పెంచడం వల్ల అమెరికాలో కొత్త ఆవిష్కరణలపై దెబ్బ పడుతుంది. అయితే, దీని వల్ల భారత్‌లో నవకల్పనలకు ఊతం లభిస్తుంది. హైదరాబాద్, బెంగళూరు, పుణె, గుర్గావ్ లాంటి నగరాలకు కొత్త ప్రయోగశాలలు, పేటెంట్లు, అంకురాలు వెల్లువెత్తుతాయి. తద్వారా హెచ్1బీ ఫీజులను పెంచడమనేది అమెరికాకు నష్టదాయకం, భారత్‌కు లాభదాయకంగా మారుతుంది. దీని వల్ల దేశంలోనే అత్యుత్తమ డాక్టర్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలకు భారతదేశ వృద్ధి గాధలో, వికసిత భారత్ లక్ష్య సాధనలో పాలుపంచుకునే అవకాశం లభించినట్లవుతుంది.

– అమితాబ్ కాంత్, నీతి ఆయోగ్ మాజీ సీఈవో

ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్‌లో భారత్ టాప్

- అంతర్జాతీయ మెచ్యూరిటీ సూచీలో స్థానం
- కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: భారత కో–వర్కింగ్ స్పేస్ మార్కెట్ అంతర్జాతీయ మెచ్యూరిటీ సూచీలో మొదటి స్థానంలో నిలిచినట్టు కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడించింది. యూకే, ఫ్రాన్స్, యూఎస్, జపాన్, సింగపూర్ మార్కెట్లను భారత్ వెనక్కి నెట్టేయడం గమనార్హం. 'ఫ్లెక్సిబుల్ ఆఫీస్‌లో ప్రపంచ ధోరణులు, 2025' పేరుతో ఈ సంస్థ ఒక నివేదికను విడుదల చేసింది. ''ప్రపంచ వ్యాప్తంగా వివిధ మార్కెట్లలోని మొత్తం ఆఫీస్ స్పేస్‌లో ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్ భిన్నంగా ఉంది. కొన్ని అభివృద్ధి చెందిన మార్కెట్లలో ఫ్లెక్సిబుల్ ఆఫీస్ పెద్ద స్థాయిలో లేదు. అదే కొన్ని వర్ధమాన మార్కెట్లలో ఫ్లెక్సిబుల్ ఆఫీస్ ప్రొవైడర్లు బలమైన ప్రాతినిధ్యం కలిగి ఉన్నారు'' అని తెలిపింది. కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ మెచ్యూరిటీ ఇండెక్స్‌లో భారత్ 100 స్కోరు సాధించింది. ప్రపంచంలో పేరొందిన ఆఫీస్ మార్కెట్లు అయిన యూకే 98, ఫ్రాన్స్ 97, యూఎస్ 81, జపాన్, సింగపూర్ 77% స్కోరుతో భారత్ కంటే వెనుకనే ఉన్నాయి.

మొత్తం ఆఫీస్ స్పేస్ పరిమాణంలో ఫ్లెక్సిబుల్ స్పేస్ (అన్ని వసతులతో, కోరుకున్నన్ని రోజులకు అద్దెకు లభించేది) ఎంతుంది? ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్ ప్రొవైడర్ల సంఖ్య ఆధారంగా కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఈ నివేదికను రూపొందించింది.

79.7 మిలియన్ ఎస్ఎఫ్‌టీ

భారత్‌లోని టాప్–8 నగరాల్లో ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్ 79.7 మిలియన్ చదరపు అడుగులు (ఎస్ఎఫ్‌టీ) ఉన్నట్టు ఈ నివేదిక వెల్లడించింది. ''భారత ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్ రంగం ప్రపంచంలో పేస్‌సెట్టర్ (విస్తరణ వేగం పరంగా కొత్త ధోరణి)గా నిలిచింది. పరిపక్వత, కార్యాకలాపాల్లో వైవిధ్యం, డిమాండ్‌కు అనుగుణంగా సామర్థ్యం పెంచుకోవడం భారత మార్కెట్‌ను ప్రత్యేకంగా నిలిపింది''అని పేర్కొంది.

హెల్త్ ప్రోడక్టుల మార్కెట్ @ రూ. 63,093 కోట్లు

- ఏటా 11.7 శాతం వృద్ధి
- వరల్డ్‌ప్యానెల్ ఇండియా అధ్యయనం

న్యూఢిల్లీ: దేశీయంగా ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో 12 కేటగిరీల ఆహార, పానీయాలకు సంబంధించి ఆరోగ్యకరమైన ఫుడ్, బెవరేజెస్‌కి డిమాండ్ పెరుగుతోంది. గత నాలుగేళ్లలో వీటి మార్కెట్ 11.7 శాతం పెరిగి రూ. 63,093 కోట్లకు చేరింది. నూడుల్స్, టీ, బాటిల్డ్ సాఫ్ట్ డ్రింక్స్, ఆటా, బిస్కట్లు/కుకీస్, నూనె/నెయ్యి/వనస్పతి, ఉప్పు, రెడీ టు కుక్ మిక్స్‌లు, ఐస్‌క్రీమ్‌లు మొదలైనవి వీటిలో ఉన్నాయి. వరల్డ్‌ప్యానెల్ ఇండియా నిర్వహించిన మెయిన్‌స్ట్రీమింగ్ హెల్త్ 2025 అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం 87.9 శాతం భారతీయ కుటుంబాలు గత ఏడాది వ్యవధిలో ఏదో ఒక హెల్త్ ప్రోడక్టును కొనుగోలు చేశాయి. పట్టణ ప్రాంతాల్లో ఇలాంటి కుటుంబాలు 96 శాతంగా ఉండగా,



గ్రామీణ ప్రాంతాల్లోను ఈ ధోరణి వేగం పుంజుకుంటోంది.

నివేదికలో మరిన్ని విశేషాలు..

→ ఆటా (పిండి), ఉప్పు, వంటనూనె/నెయ్యి, టీ లాంటి ఉత్పత్తులకు సంబంధించి 80 శాతం కుటుంబాలు ఆరోగ్యకరమైన వేరియంట్ల వైపు మొగ్గు చూపుతున్నాయి.
→ కేటగిరీల వారీగా వార్షికంగా అధిక వృద్ధి సాధిస్తున్న ఉత్పత్తుల్లో రెడీ టు కుక్ మిక్స్‌లు (46 శాతం), సాల్టీ స్నాక్స్ (34 శాతం), బాటిల్డ్ సాఫ్ట్ డ్రింక్స్ (29 శాతం), బిస్కట్లు (19 శాతం) ఉన్నాయి. వినియోగదారులు ఒకసారి ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తులకు అలవాటుపడితే వాటి వినియోగాన్ని క్రమం తప్పకుండా కొనసాగిస్తున్నారు.
→ ఆరోగ్యమనేది ఒక ట్రెండ్‌గా కన్నా వినియోగదారుల రోజువారీ అలవాట్లలో భాగంగా మారుతోంది.
→ ఆరోగ్యకరమైన ఉత్పత్తుల కోసం 22 శాతం అధికంగా చెల్లించేందుకు కూడా కొనుగోలుదారులు సిద్ధంగా ఉంటున్నారు. సామాజికంగా–ఆర్థికంగా వెనుకబడిన వారు కూడా 17 శాతం అధికంగా చెల్లించేందుకు సిద్ధంగా ఉంటున్నారు.
→ టీ, బాటిల్డ్ సాఫ్ట్ డ్రింకులకు అత్యధికంగా ప్రీమియం రేట్లు ఉంటున్నాయి.
→ మధుమేహం, కార్డియాక్ ..హైపర్‌టెన్షన్ సమస్యలు ఉన్న కుటుంబాలు మరింత ఎక్కువగా హెల్త్ ప్రోడక్టులను ఉపయోగిస్తున్నాయి. అయితే, వ్యాధులపరమైన సవాళ్లు లేని కుటుంబాల్లో కూడా క్రమంగా వీటి వినియోగం పెరుగుతోంది.

టైర్ల పరిశ్రమకు ప్రీమియం దన్ను



- 12 రెట్లు పెరగనున్న ఆదాయం
- 2047 నాటికి రూ. 13 లక్షల కోట్లకు చేరిక
- ఏటీఎంఏ, పీడబ్ల్యూసీ ఇండియా సంయుక్త నివేదిక

న్యూఢిల్లీ: ప్రీమియం ఉత్పత్తులకు డిమాండ్, ఎగుమతులు పెరుగుతుండటం వంటి సానుకూల అంశాల తోడ్పాటుతో దేశీ టైర్ల పరిశ్రమ రాబోయే రోజుల్లో గణనీయంగా వృద్ధి చెందనుంది. 2047 నాటికి పరిశ్రమ ఆదాయం 12 రెట్లు పెరిగి రూ. 13 లక్షల కోట్లకు చేరనుంది. ఆటోమోటివ్ టైర్ల తయారీ సంస్థల సమాఖ్య ఏటీఎంఏ, కన్సల్టెన్సీ సంస్థ పీడబ్ల్యూసీ ఇండియా సంయుక్తంగా రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దేశీయంగా వాహనాల తయారీ సంస్థలు (ఓఈఎం), రీప్లేస్‌మెంట్‌కి సంబంధించి టైర్లకు డిమాండ్ నెలకొనడం, వాహన ఎగుమతులు వేగవంతం కావడంలాంటి అంశాలు టైర్ల పరిశ్రమ వృద్ధికి దోహదపడతాయని నివేదిక వివరించింది. 2047 నాటికి దేశీయంగా టైర్ల తయారీ పరిశ్రమ ఉత్పత్తి పరిమాణం సుమారు నాలుగు రెట్లు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఈ వ్యవధిలో ఆదాయం 12 రెట్లు వృద్ధి చెంది రూ. 1,300 కోట్ల మేర పెరగవచ్చని రిపోర్ట్ తెలిపింది.

నివేదిక ప్రకారం 'వికసిత భారత్ 2047' లక్ష్యం దిశగా భారత్ ప్రస్థానం సాగిస్తుండటం, టైర్ల పరిశ్రమకు గణనీయంగా అవకాశాలు కల్పిస్తుంది. దేశీ కస్టమర్ల ఆకాంక్షలను నెరవేర్చడమే కాకుండా అమెరికా, యూరోపియన్ యూనియన్‌లాంటి కీలక మార్కెట్లకు వాణిజ్య, ప్యాసింజర్ వాహనాలకు ఉపయోగపడే టైర్లను మరింతగా ఎగుమతి చేసేందుకు కూడా ఇది తోడ్పడుతుందని పీడబ్ల్యూసీ ఇండియా పార్ట్‌నర్ కవన్ ముఖ్తియార్ తెలిపారు. వినియోగదారులు, మొబిలిటీ ధోరణులు మారుతుండటం, అంతర్జాతీయంగా వ్యాపార పరిస్థితులు ఎప్పటికప్పుడు కొత్త మార్పులకు లోనవుతుండటం, పర్యావరణహితమైన ఆవిష్కరణలపై ఆసక్తి పెరుగుతుండటమనే విషయాలు, భారతీయ టైర్ల పరిశ్రమ తనను తాను కొత్తగా మల్చుకునేందుకు ఒక చక్కని అవకాశం కల్పిస్తాయని పేర్కొన్నారు. రిపోర్ట్ ప్రకారం మౌలిక సదుపాయాలపై వ్యయాలు, దేశీయంగా వినియోగం పటిష్టంగా ఉండటంతో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడం వల్ల ఓఈఎం, రీప్లేస్‌మెంట్ టైర్లపరమైన ఆదాయాలు 2047 ఆర్థిక సంవత్సరం నాటికి వార్షికంగా 10 శాతం మేర వృద్ధి చెందనున్నాయి. ఇక ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నందున భారతీయ టైర్లకు విదేశీ మార్కెట్లలోను అవకాశాలు పెరగనున్నాయి.

ఏసీలు, డిష్‌వాషర్ల ధరలు తగ్గుతున్నాయ్..

- హోమ్ అప్లయెన్స్ కంపెనీల నిర్ణయం
- కొత్త ధరలు సోమవారం నుంచి అమల్లోకి..



న్యూఢిల్లీ: గృహోపకరణాల దిగ్గజ సంస్థలు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను కస్టమర్లకు బదిలీ చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఎయిర్ కండీషనర్ల (ఏసీలు) రేట్లను రూ.4,500 వరకు, డిష్‌వాషర్ల ధరలను రూ.8,000 వరకు తగ్గించాయి. కొత్త ధరలు సెప్టెంబర్ 22(సోమవారం) నుంచి అమల్లోకి రానున్నాయి. ఏసీల తయారీ కంపెనీలు రూమ్ ఎయిర్ కండీషనర్లతో పాటు వాణిజ్య సముదాయాల్లో వినియోగించే వీఆర్ఎఫ్ ఏసీలు, స్ప్లిట్ ఏసీలు, టవర్ ఏసీలపై కూడా ధరలు తగ్గించాయి. వోల్టాస్, డైకిన్, గోద్రెజ్ అప్లయెన్సెస్, పానసోనిక్, హైయర్ తదితర ప్రముఖ బ్రాండ్లు తగ్గింపు ధరలతోనే ముందస్తు బుకింగ్‌లు ప్రారంభించాయి. ప్రతిపాదిత జీఎస్టీ రేట్ల కోతతో పండుగ సీజన్ అమ్మకాల్లో రెండంకెల వృద్ధి నమోదవుతుందని కంపెనీలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. జీఎస్టీ సంస్కరణల్లో కేంద్రం ఏసీలు, డిష్‌వాషర్లపై జీఎస్టీ 28% నుంచి 18 శాతానికి తగ్గించిన సంగతి తెలిసిందే.

- గోద్రెజ్ అప్లయెన్సెస్ లైట్ కమర్షియల్, టవర్ ఏసీల ధరలను రూ.8,550 నుంచి రూ.12,450 వరకు తగ్గిస్తోంది. స్ప్లిట్ ఏసీ ఇన్వర్టర్ మోడళ్ల ధరలు రూ.3,200 - 5,900 మేర తగ్గుతాయి.
- హైయర్ కంపెనీ తన గ్రావిటీ (1.6 టన్నుల ఇన్వర్టర్)ఏసీలపై రూ.3,905, అలాగే కినొచీ ఏసీ మోడల్ (1.5 టన్నులు, 4 స్టార్ రేటింగ్)పై రూ.3,202 తగ్గిస్తోంది.
- వోల్టాస్ కంపెనీ ఫిక్స్‌డ్ స్పీడ్ విండో ఏసీ ధరలు రూ.42,990 నుంచి రూ.39,590కి, ఇన్వర్టర్ ఇండో ఏసీ ధరలు రూ.46,990 నుంచి రూ.43,290కి తగ్గించింది.
- జపాన్ చెందిన డైకిన్ సంస్థ 5 స్టార్ ఇన్వర్టర్ స్ప్లిట్ ఏసీ ధర (1 టన్ను) రూ.20,500 నుంచి రూ.18,890కు, అలాగే 1.5 టన్నుల సామర్థ్యం కలిగిన ఇన్వర్టర్ స్ప్లిట్ ఏసీ ధర రూ.73,800 నుంచి రూ.68,020కు, 1.8 సామర్థ్యం కలిగిన ఇన్వర్టర్ స్ప్లిట్ ఏసీ ధర రూ.92,200 నుంచి రూ.84,980కు దిగి వచ్చాయి. ఇదే కంపెనీ 3 స్టార్ రేటింగ్ కలిగిన ఇన్వర్టర్ స్ప్లిట్ ఏసీ(1 టన్ను సామర్థ్యం) ధరలను రూ.50,700 నుంచి రూ. 46,730కు, 1.5 సామర్థ్యం కలిగిన హాట్‌అండ్‌కోల్డ్ ఇన్వర్టర్ స్ప్లిట్ ఏసీ ధర రూ.61,300 నుంచి రూ.56,500 కు తగ్గించింది.
- ఎల్‌జీ ఎలక్ట్రానిక్ ఎంట్రీ లెవల్ 3 స్టార్ ఇన్వర్టర్ స్ప్లిట్ ఏసీ(టన్ను సామర్థ్యం) ధరలపై రూ.2,800 తగ్గించింది. 1.5 టన్ను సామర్థ్యం కలిగిన ఇన్వర్టర్ స్ప్లిట్ ఏసీ ధరలపై రూ.3,600, రెండు టన్నుల సామర్థ్యం కలిగిన స్ప్లిట్ ఏసీలపై రూ.4,400 ధరను తగ్గించింది.
- పానసోనిక్ ఇండియా 1.5 టన్ను విండో ఏసీ ధరల శ్రేణి 45,650 - 49,990 నుంచి రూ.42,000 - 46,000కి దిగిరానుంది. అలాగే ఫిక్స్‌డ్ స్పీడ్ స్ప్లిట్ ఏసీ(టన్ను సామర్థ్యం)లపై రూ.3700, రెండు టన్నుల సామర్థ్యం కలిగిన ఏసీలపై రూ.5,500 వరకు తగ్గించింది.

డిష్ వాషర్ల ధరలు ఇలా

బీఎస్‌హెచ్ హోమ్ అప్లయెన్సెస్ రూ.8,000 వరకు తగ్గించింది. సెప్టెంబర్ 22 నుంచి ఎంట్రీ లెవల్ డిష్‌వాషర్ రూ.49,000 నుంచి రూ.45,000కు, టాప్–ఎండ్ మోడల్ రూ.104,500 నుంచి రూ.96,500కు దిగిరానుంది. అలాగే వోల్టాస్ బెకో ఎంట్రీలెవల్ డిష్‌వాషర్ల ధరలు రూ.25,990 నుంచి రూ.23,390కు తగ్గనున్నాయి.

91 లక్షలకు చేరనున్న ఫ్లెక్సీ ఉద్యోగులు

- 2027 నాటికి అంచనా
- ఇండియన్ స్టాఫింగ్ ఫెడరేషన్ నివేదిక



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్‌లో సంఘటిత ఫ్లెక్సీ వర్క్‌ఫోర్స్ 2027 నాటికి గణనీయంగా పెరగనుంది. ఈ ఏడాది ఈ సంఖ్య 72.3 లక్షలుగా ఉండగా, 2027 నాటికి 91.6 లక్షలకు చేరనుంది. సాంప్రదాయ నియామకాల విధానాలకు భిన్నంగా, అవసరాన్ని బట్టి కంపెనీలు తాత్కాలిక నియామకాలు చేపట్టే ధోరణి పెరుగుతుండటాన్ని ఇది సూచిస్తోంది. ఇండియన్ స్టాఫింగ్ ఫెడరేషన్ (ఐఎస్ఎఫ్) రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం దేశీయంగా సంఘటిత ఫ్లెక్సీ స్టాఫింగ్ మార్కెట్ 2026 ఆర్థిక సంవత్సరంలో రూ. 2.20 లక్షల కోట్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నట్లు ఐఎస్ఎఫ్ ప్రెసిడెంట్ లోహిత్ భాటియా విలేకరుల సమావేశంలో తెలిపారు. భారమైన నిబంధనల బాదరబందీ లేకుండా అవసరం, డిమాండ్, తమ వెసులుబాటుని బట్టి వ్యాపార సంస్థలు నియమించుకునే తాత్కాలిక సిబ్బందిని ఫ్లెక్సీ వర్క్‌ఫోర్స్‌గా వ్యవహరిస్తారు. త్రైపాక్షిక మోడల్ కింద దేశీయంగా ఫ్లెక్సీ వర్క్‌ఫోర్స్ 2023 ఆర్థిక సంవత్సరంలో 57 లక్షలుగా ఉండగా, 12.6 శాతం వార్షిక వృద్ధితో ఈ ఏడాది 72.3 లక్షలకు చేరిందని భాటియా చెప్పారు. కోవిడ్ అనంతరం ఆర్థిక వ్యవస్థ రికవరీ, డిజిటల్ పరివర్తన, పాలసీ సంస్కరణలు ఇందుకు దన్నుగా నిల్చాయని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా చైనా, అమెరికా తర్వాత ఫ్లెక్సీ సిబ్బంది విషయంలో భారత్ మూడో స్థానంలో ఉందని భాటియా వివరించారు. సంఘటిత కాంట్రాక్ట్ సిబ్బంది ఐదు రాష్ట్రాల్లో (తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్, తమిళనాడు) అత్యధికంగా ఉన్నట్లు చెప్పారు.

లాజిస్టిక్స్, బీఎఫ్ఎస్ఐలో అత్యధికం..

రంగాలవారీగా చూస్తే లాజిస్టిక్స్, బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్), తయారీ రంగాల్లోని మొత్తం సంఘటిత కాంట్రాక్ట్ సిబ్బందిలో ఫ్లెక్సీ సిబ్బంది అత్యధికంగా సుమారు 38 శాతం ఉంటారని నివేదిక పేర్కొంది. రాబోయే ఐదేళ్లలో పండుగ సీజన్లలో పరిశ్రమ మరింతగా ఫ్లెక్సీ సిబ్బంది వైపు మొగ్గు చూపే అవకాశం ఉంటుందని వివరించింది.

సిబ్బందిని తాత్కాలికంగా పెంచుకోవాల్సిన అవసరం ఉండే ఈ–కామర్స్, ఆతిథ్య, రిటైల్ తదితర రంగాల్లో ఈ ధోరణి ఎక్కువగా కనిపించవచ్చని నివేదిక తెలిపింది. అదే సమయంలో పారిశ్రామికీకరణ వేగవంతం కావడం, ఐటీ, రిటైల్, ఈ–కామర్స్, తయారీ లాంటి రంగాలు వృద్ధి చెందడం వల్ల ఉద్యోగులకు డిమాండ్ స్థిరంగా ఉంటోందని పేర్కొంది. స్వల్పకాలిక ప్రాజెక్టుల కోసం, సీజనల్ పనిభారాన్ని తగ్గించుకోవడం కోసం కంపెనీలు తాత్కాలిక సిబ్బంది నియామకాలు పెంచుకుంటున్నాయని రిపోర్ట్ తెలిపింది.



హర్యానా స్టీలర్స్ ఆరో విజయం

జైపూర్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో హర్యానా స్టీలర్స్ ఆరో విజయం తమ ఖాతాలో వేసుకుంది. శనివారం జరిగిన పోరులో హర్యానా స్టీలర్స్ 38–36 పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్‌పై విజయం సాధించింది. స్టీలర్స్‌కు ఇది వరుసగా నాలుగో గెలుపు కావడం విశేషం. హర్యానా స్టీలర్స్ తరఫున శివమ్ 9 పాయింట్లు, వినయ్ 7 పాయింట్లతో సత్తాచాటగా... తమిళ్ తలైవాస్ తరఫున అర్జున్ దేశ్వాల్ 13 పాయింట్లతో పోరాడాడు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో హర్యానా 20 రెయిడ్ పాయింట్లు సాధించగా... తలైవాస్ 22 పాయింట్లు సాధించింది. ట్యాక్లింగ్‌లో ఇరు జట్లు తొమ్మిదేసి పాయింట్లు సాధించాయి. అయితే ఎక్స్‌ట్రా పాయింట్లలో ముందున్న హర్యానా గెలుపొందింది. తాజా సీజన్‌లో 8 మ్యాచ్‌లాడిన స్టీలర్స్ 6 విజయాలు, 2 పరాజయాలతో 12 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక మూడో స్థానానికి చేరింది. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 33–30 పాయింట్ల తేడాతో దబంగ్ ఢిల్లీపై విజయం సాధించింది. సీజన్ ఆరంభం నుంచి ఓటమి ఎరగకుండా దూసుకెళ్తున్న దబంగ్ ఢిల్లీకి ఆరు విజయాల తర్వాత ఇదే తొలి పరాజయం. పట్నా తరఫున సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ అంకిత్ రాణా 12 పాయింట్లతో విజృంభించాడు. అంకిత్ జగ్లాన్ 6, అయాన్ 5 పాయింట్లతో అతడికి అండగా నిలిచారు. దబంగ్ ఢిల్లీ తరఫున నీరజ్ నర్వాల్ 8, అషు మాలిక్ 6 పాయింట్లు సాధించారు. తాజా సీజన్‌లో పట్నా పైరేట్స్ 7 మ్యాచ్‌లాడి 2 విజయాలు, 5 పరాజయాలతో 4 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక తొమ్మిదో స్థానంలో నిలిచింది. మరోవైపు ఢిల్లీ 7 మ్యాచ్‌లాడి 6 విజయాలు, ఒక పరాజయంతో 12 పాయింట్లతో పట్టిక రెండో స్థానంలో కొనసాగుతోంది. లీగ్‌లో ఆదివారం విశ్రాంతి దినం కాగా... సోమవారం గుజరాత్ జెయింట్స్‌తో బెంగళూరు బుల్స్, తమిళ్ తలైవాస్‌తో యూపీ యోధాస్ తలపడతాయి.

భారత రెజ్లర్లకు నిరాశ

జాగ్రెబ్ (క్రొయేషియా): ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్ల వైఫల్యం కొనసాగింది. శనివారం బరిలోకి దిగిన ముగ్గురు భారత రెజ్లర్లు ఆరంభంలోనే పరాజయం పాలయ్యారు. పురుషుల 63 కేజీల విభాగంలో బరిలోకి దిగిన సన్నీ కుమార్ 1–3తో ఆరిఫ్ హుసేన్ ఖాన్ చేతిలో ఓడాడు. 67 కేజీల విభాగంలో అనిల్ 0–7తో గాగిక్ (ఖతర్) చేతిలో పరాజయం పాలయ్యాడు. 87 కేజీల విభాగం క్వాలిఫయింగ్ రౌండ్‌లో అమెరికా రెజ్లర్ జాకబ్‌సన్ చేతిలో కరణ్ కంబోజ్ టెక్నికల్ సూపీరియారిటీతో ఓడాడు. 60 కేజీల విభాగంలో క్వార్టర్ ఫైనల్ చేరి ఆశలు రేపిన సూరజ్ కూడా ఆ తర్వాత ప్రభావం చూపలకపోవడంతో ఈ టోర్నమెంట్‌లో భారత రెజ్లర్ల పోరాటం ముగిసినట్టైంది. ఈ పోటీల్లో భారత్ కేవలం ఒక్క పతకం మాత్రమే సాధించింది. మహిళల 53 కేజీల విభాగంలో 21 ఏళ్ల అంతిమ్ పంఘాల్ కాంస్య పతకం గెలుచుకుంది.

బంగ్లాదేశ్ సంచలన విజయం

- 4 వికెట్లతో శ్రీలంక చిత్తు
- రాణించిన సైఫ్, తౌహీద్, ముస్తఫిజుర్
- ఆసియా కప్ సూపర్–4 మ్యాచ్



దుబాయ్: ఆసియా కప్ టి20 టోర్నీ సూపర్–4 దశలో బంగ్లాదేశ్ శుభారంభం చేసింది. లీగ్ దశలో తమను చిత్తు చేసిన శ్రీలంకను చిత్తు చేసి ప్రతీకారం తీర్చుకుంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో బంగ్లా 4 వికెట్ల తేడాతో లంకపై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. దసున్ షనక (37 బంతుల్లో 64 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో టాప్ స్కోరర్‌గా నిలవగా, కుశాల్ మెండిస్ (25 బంతుల్లో 34; 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించాడు. ముస్తఫిజుర్ రహమాన్ 3 వికెట్లతో లంకను దెబ్బ తీయగా, మెహదీ హసన్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం బంగ్లాదేశ్ 19.5 ఓవర్లలో 6 వికెట్లకు 169 పరుగులు చేసింది. సైఫ్ హసన్ (), తౌహీద్ హృదయ్ () అర్ధ సెంచరీలతో జట్టును గెలిపించారు.

బ్యాటింగ్ తడబాటు...

శ్రీలంకకు ఓపెనర్లు నిసాంక (15 బంతుల్లో 22; 3 ఫోర్లు, 1 సిక్స్), కుశాల్ మెండిస్ చక్కటి ఆరంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు వీరిద్దరు 30 బంతుల్లో 44 పరుగులు జోడించారు. పవర్ ప్లేలో జట్టు 53 పరుగులు చేసింది. అయితే ఆ తర్వాత 7 పరుగుల వ్యవధిలో మెండిస్, కామిల్ వెనుదిరిగారు. ఈ దశలో క్రీజ్‌లోకి వచ్చిన షనక జట్టును ఆదుకున్నాడు. ఫోర్‌తో ఇన్నింగ్స్ మొదలు పెట్టిన అతను ఆ తర్వాతా జోరు కొనసాగించాడు. కుశాల్ పెరీరా (16) వెనుదిరిగిన తర్వాత షనక, కెప్టెన్ అసలంక (21) కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. నసుమ్ ఓవర్లో షనక ఒక ఫోర్, 2 భారీ సిక్స్‌లతో చెలరేగగా, తస్కీన్ వేసిన తర్వాతి ఓవర్ తొలి బంతులను అసలంక సిక్స్, ఫోర్‌గా మలిచాడు. షరీఫుల్ ఓవర్లో వరుసగా రెండు సిక్స్‌లు బాదిన షనక 30 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఐదో వికెట్ భాగస్వామ్యం 57 పరుగులకు (27 బంతుల్లో) చేరిన తర్వాత దురదృష్టవశాత్తూ అసలంక రనౌట్‌గా వెనుదిరిగాడు. అదే ఓవర్లో కమిందు (1), హసరంగ (2)లను ముస్తఫిజుర్ అవుట్ చేశాడు. తస్కీన్ వేసిన ఆఖరి ఓవర్లో షనక ఫోర్, సిక్స్‌తో స్కోరును 160 దాటించాడు.

కీలక భాగస్వామ్యాలు...

తొలి ఓవర్లోనే తన్జీద్ హసన్ (0) అవుట్ కావడంతో బంగ్లాదేశ్ ఛేదన పేలవంగా మొదలైంది. అయితే సైఫ్, కెప్టెన్ లిటన్ దాస్ (16 బంతుల్లో 23; 3 ఫోర్లు) కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించారు. పవర్ ప్లేలో స్కోరు 59 పరుగులకు చేరింది. సైఫ్ వరుసగా మూడు ఓవర్లలో ఒక్కో సిక్సర్‌తో ధాటిని ప్రదర్శించగా, చమీరా ఓవర్లో దాస్ 2 ఫోర్లు కొట్టాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు 34 బంతుల్లో 59 పరుగులు జోడించారు. అనంతరం తౌహీద్‌తో సైఫ్ భాగస్వామ్యం కొనసాగింది. 36 బంతుల్లోనే సైఫ్ హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. అనంతరం మరో భారీ షాట్‌కు ప్రయత్నించి హసరంగ బౌలింగ్‌లో సైఫ్ వెనుదిరిగాడు. మూడో వికెట్‌కు సైఫ్, తౌహీద్ 45 బంతుల్లో 54 పరుగులు జత చేశారు. కమిందు ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ బాది తౌహీద్ బంగ్లాను వేగంగా లక్ష్యం దిశగా నడిపించాడు. 31 బంతుల్లోనే అతని అర్ధ సెంచరీ పూర్తయింది. విజయానికి 10 పరుగుల దూరంలో తౌహీద్ అవుట్ కావడంతో కొంత ఉత్కంఠ ఎదురైనా, చివరకు బంగ్లా గట్టెక్కింది.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) సైఫ్ (బి) తస్కీన్ 22; కుశాల్ మెండిస్ (సి) సైఫ్ (బి) మెహదీ 34; కామిల్ (బి) మెహదీ 5; కుశాల్ పెరీరా (సి) దాస్ (బి) ముస్తఫిజుర్ 16; షనక (నాటౌట్) 64; అసలంక (రనౌట్) 21; కమిందు మెండిస్ (సి) దాస్ (బి) ముస్తఫిజుర్ 1; హసరంగ (సి) తన్జీద్ (బి) ముస్తఫిజుర్ 2; వెలలాగె (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 168. వికెట్ల పతనం:** 1–44, 2–58, 3–65, 4–97, 5–154, 6–156, 7–158. **బౌలింగ్:** షరీఫుల్ 4–0–49–0, నసుమ్ 4–0–36–0, తస్కీన్ 4–0–37–1, మెహదీ హసన్ 4–0–25–2, ముస్తఫిజుర్ 4–0–20–3.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: సైఫ్ హసన్ (సి) వెలలాగె (బి) హసరంగ 61; తన్జీద్ (బి) తుషార 0; లిటన్ దాస్ (సి) నిసాంక (బి) హసరంగ 23; తౌహీద్ (ఎల్బీ) (బి) చమీరా 58; షమీమ్ (నాటౌట్) 14; జాకీర్ (బి) షనక 9; మెహదీ హసన్ (సి) కుశాల్ మెండిస్ (బి) షనక 0; నసుమ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (19.5 ఓవర్లలో 6 వికెట్లకు) 169. వికెట్ల పతనం:** 1–1, 2–60, 3–114, 4–159, 5–168, 6–168. **బౌలింగ్:** నువాన్ తుషార 4–0–42–1, చమీరా 4–0–32–1, వెలలాగె 4–0–36–0, హసరంగ 4–0–22–2, షనక 2.5–0–21–2, కమిందు 1–0–16–0.

44 ఏళ్ల వయసులో
సత్తా చాటి...

ఒమన్ క్రికెటర్ కలీమ్ జోరు ●భారత్‌పై రాణించి వార్తల్లోకి

అబుదాబీ వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఒమన్ బ్యాటర్ ఆమిర్ కలీమ్ భారత్‌పై అర్ధ సెంచరీ చేశాడు. ఈ ఫిఫ్టీ పూర్తవడంతోనే అదేదో సెంచరీ లేదంటే డబుల్ సెంచరీ చేసినంతగా సంబరాలు చేసుకున్నాడు. డగౌట్‌లో ఉన్న సహచరులు కూడా అతనికి చప్పట్లతో జేజేలు పలికారు. ఇది మనకు 'ఓవరాక్షన్'లా కనిపించింది. చేసిన అర్ధ శతకానికే ఏంటీ సంబరాలు అనిపించింది. కానీ అసలు సంగతి మరొకటి ఉంది. ఎందుకంటే అతనేమీ టి20లు ఆడే రెగ్యులర్ యువ క్రికెటర్ కాదు. 44 ఏళ్ల వెటరన్! అంతేకాదు. ఓ రిటైర్డ్ క్రికెటర్ కూడా! ఆట వదిలేసి కోచింగ్ బాట పట్టిన కలీమ్ తిరిగొచ్చి యువకుడిలా చెలరేగడమే గొప్ప విశేషం. ఈ విశేషం తాలుకూ సంబరాలే ఆ చిందులు!

కోచింగ్‌లో టైటిల్

కొన్ని నెలల క్రితం థాయ్‌లాండ్‌లో జరిగిన అండర్–19 ప్రపంచకప్ డివిజన్–2 ఆసియా క్వాలిఫయర్స్‌లో ఒమన్ యువజట్టు టైటిల్ గెలిచింది. ఈ జట్టును తీర్చిదిద్దింది మరెవరో కాదు... ఆమిర్ కలీమ్. అలా కోచ్‌గా సక్సెస్ అయ్యాడు. కానీ అతని జాతీయ క్రికెట్‌లో సంక్షోభం తలెత్తింది. ఏకంగా 11 మంది ఒమన్ ఆటగాళ్లు మస్కట్‌లో ఎమర్జింగ్ ఆసియా కప్‌కు ముందు వైదొలిగారు. అమెరికా, కరీబియన్‌లలో జరిగిన టి20 ప్రపంచకప్‌లో పాల్గొన్న తమకు బోర్డు ప్రైజ్‌మనీ ఇవ్వకపోవడంతో కెప్టెన్ అఖిబ్ ఇలియాస్, మాజీ కెప్టెన్ జీషాన్ మక్సూద్ సహా 11 మంది ఒమన్‌కు ఆడేందుకు ససేమిరా అన్నారు. దీంతో ఒమన్ క్రికెట్ బోర్డు తమ మాజీ క్రికెటర్, ప్రస్తుత అండర్–19 జట్టుకు కోచ్ అయిన ఆమిర్ కలీమ్‌ను ఆడేందుకు పిలిచింది. దీంతో అతను రిటైర్మెంట్‌ను పక్కనబెట్టి ఆడేందుకు సై అన్నాడు.

భారత్‌పై మెరుపు ఫిఫ్టీ

అలా ఒమన్ క్రికెట్ జట్టును సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు వచ్చిన కలీమ్ వయసు సహకరించకపోయినా... క్రికెట్‌పై అంకితభావంతో ఆటగాడిగా మళ్లీ మైదానంలో చెమటోడ్చాడు. అబుదాబీలోని జాయెద్ క్రికెట్ స్టేడియంలో పటిష్టమైన భారత బౌలింగ్‌ను ఎదుర్కొన్న తీరు ఆకట్టుకుంది. ఈ వెటరన్ క్రికెటర్ తమ కెప్టెన్ జతిందర్ సింగ్‌తో ఇన్నింగ్స్‌ను ఓపెన్ చేశాడు. భారత బౌలర్లపై దూకుడుగా ఆడి బౌండరీలు బాదాడు. ఈ క్రమంలో 38 బంతుల్లో అర్ధసెంచరీ చేశాడు. ఇటీవల కోచ్‌గా మార్గదర్శనం చేసిన చేతులతోనే తాజాగా సెంచరీ చేసిన ఆనందం కట్టలు తెగడంతో అంతగా సంబరాల్లో మునిగితేలాడు. ఓపెనర్‌గా వచ్చిన కలీమ్ 18వ ఓవర్‌గా నిలబడటం గొప్ప విశేషం. అంతేకాదు భారత శిబిరాన్ని కూడా తన మెరుపు బ్యాటింగ్‌తో కాసేపు వణికించాడు.

ఉద్యోగం కోసం కరాచీ నుంచి...

పాకిస్తాన్‌కు చెందిన కలీమ్‌కు క్రికెట్ అంటే ఇష్టం. కానీ ఉపాధి కోసం పొట్టచేతపట్టుకొని కరాచీ నుంచి 2004లో ఒమన్ బాటపట్టాడు. అక్కడ డెలివరీ సెక్షన్‌లో లోడింగ్, అన్‌లోడింగ్ చేసే హమాలీగా పనిచేశాడు. వేడి వాతావరణ పరిస్థితుల మధ్య చెమట చిందించిన కలీమ్ తర్వాత రెస్టారెంట్‌లో పనికి కుదిరాడు. భారత సంతతికి చెందిన రెస్టారెంట్ యజమాని కెకె మోహన్‌దాస్‌కు క్రికెట్ అంటే పిచ్చి అభిమానం. స్థానికంగా ఓ క్రికెట్ క్లబ్‌ను ఆయన నడిపిస్తున్నాడు. ఇది తెలుసుకున్న కలీమ్ తన క్రికెట్ జిజ్ఞాసను యజమానికి వివరించాడు. ఓ అవకాశం ఇవ్వాలని అభ్యర్థించాడు. అతని ఉత్సాహాన్ని గమనించిన మోహన్‌దాస్ కొత్త కిట్ కొనిచ్చి ప్రోత్సహించాడు. అలా భారత సంతతి యజమాని ప్రోత్సాహంతో ఆమిర్ కలీమ్ 2012లో ఒమన్ తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. ప్రస్తుత కెప్టెన్ జతిందర్ సింగ్‌తో కలిసి 13 ఏళ్ల పాటు ఒమన్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఇద్దరు కూడా ఓ పూట జాబ్ చేసుకుంటూనే క్రికెట్‌ను కొనసాగించారు. ఇన్నేళ్లుగా రాని గుర్తింపు ఈ ఒక్క మ్యాచ్ (భారత్)తో కలీమ్‌కు వచ్చింది.



కలీమ్

- సాక్షి క్రీడా విభాగం



వెర్‌స్టాపెన్‌కు పోల్ పొజిషన్

బాకు (అజర్‌బైజాన్): రెడ్‌బుల్ డ్రైవర్, ఫార్ములా వన్ మాజీ చాంపియన్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ అజర్‌బైజాన్ సర్క్యూట్‌పై దూసుకెళ్లాడు. శనివారం జరిగిన రేసులో పోల్ పొజిషన్ సాధించాడు. క్వాలిఫయింగ్‌లో వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా 1 నిమిషం 41.117 సెకన్లలో ల్యాపును పూర్తిచేశాడు. ఈ సీజన్‌లో అతనికిది ఆరో పోల్ పొజిషన్ కాగా... ఏడుసార్లు చాంపియన్ అయిన బ్రిటన్ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ (ఫెరారీ)కు ఈ గ్రాండ్‌ప్రి కలిసిరాలేదు. అతను ఏకంగా 12వ స్థానంలో నిలిచి నిరాశపరిచాడు. శనివారం జరిగిన బాకు సిటీ సర్క్యూట్ అత్యంత క్లిష్టంగా సాగింది. ఏకంగా ఆరు మంది రేసర్ల కార్లు ప్రమాదానికి గురయ్యాయి. చాంపియన్‌షిప్‌లో లీడర్‌బోర్డులో ఉన్న మెక్‌లారెన్ రేసర్ ఆస్కార్ పియాస్ట్రి కారు కూడా ప్రమాదానికి గురైంది. దీంతో ప్రధాన రేసుకు అతను దూరమయ్యాడు. ఆదివారం జరిగే ప్రధాన రేసును వెర్‌స్టాపెన్ మొదటి స్థానం నుంచి ప్రారంభిస్తారు. బాకు సర్క్యూట్ రేసర్లను బాగా ఇబ్బంది పెట్టింది. ప్రతికూల వాతావరణం కూడా డ్రైవర్ల కష్టాలను పెంచింది. అదే పనిగా వర్షం, రికార్డు స్థాయిలో ఏకంగా ఆరుగురు రేసర్ల కార్లు ప్రమాదానికి గురవడం ఆందోళనకు గురిచేసింది. పియాస్ట్రీ సహా, ఫెరారీ డ్రైవర్ లెక్‌లెర్క్, ఒలీవర్ బియర్మన్ (హాస్), అలెక్స్ అల్బాన్ (విలియమ్స్), హుల్కెన్‌బర్గ్ (సాబెర్), పియెర్ గాస్లీ (ఆల్పైన్స్) ప్రమాదాలతో ప్రధాన రేసుకు అర్హత సాధించలేకపోయారు.

హుబైదా–ప్రేమ్ జంటకు కాంస్యం

బీజింగ్: పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ టోర్నీలో భారత ప్లేయర్లు అబు హుబైదా–ప్రేమ్ కుమార్ కాంస్య పతకం సాధించారు. డబ్ల్యూహెచ్1–డబ్ల్యూహెచ్2 కేటగిరీలో టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన భారత జోడీ... సెమీఫైనల్లో చైనా ద్వయం చేతిలో ఓడింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీస్‌లో అబు హుబైదా–ప్రేమ్‌కుమార్ ఆలె జంట 4–21, 10–21తో మాయి జియాన్‌పెంగ్–క్యూ జిమో జోడీ చేతిలో పరాజయం పాలైంది. గ్రూప్ 'ఎ'లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, ఒక పరాజయంతో భారత షట్లర్లు సెమీఫైనల్‌కు అర్హత సాధించారు. 'ప్రతి మ్యాచ్‌లో కొత్త సవాలే. వాటిని దాటితేనే ఫలితాలు మనకు అనుకూలంగా వస్తాయి. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడం ఎంత కష్టమో మాకు తెలుసు. ఈ కాంస్యం భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించగలమనే నమ్మకాన్ని పెంచింది' అని అబు హుబైదా పేర్కొన్నాడు. ఇటీవల థాయ్‌లాండ్ వేదికగా జరిగిన ఆసియా పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లోనూ ఈ జంట పతకం నెగ్గింది. చిన్నప్పుడు పోలియో మహమ్మారి బారినపడి కాళ్లు కోల్పోయిన 31 ఏళ్ల హుబైదా... వైకల్యాన్ని అధిగమిస్తూ నాలుగుసార్లు జాతీయ చాంపియన్‌గా నిలిచాడు. అంతర్జాతీయ స్థాయిలో సైతం అతడు నిలకడగా పతకాలు సాధించాడు. ఉగాండా పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్, ఈజిప్ట్ పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్‌లోనూ అతడు కాంస్య పతకాలు సాధించాడు. ఇక భారత సైన్యంలో సేవలందిస్తూ 2009లో స్పైనల్‌కార్డ్ గాయానికి గురైన ప్రేమ్ కుమార్ ఆలె 2014 నుంచి అంతర్జాతీయ స్థాయిలో బ్యాడ్మింటన్ ఆడుతున్నాడు.



జ్యోతి సింగ్ సారథ్యంలో...

- భారత జూనియర్ మహిళల హాకీ జట్టు ఎంపిక
- సెప్టెంబర్ 26 నుంచి ఆస్ట్రేలియా పర్యటన



న్యూఢిల్లీ: భారత జూనియర్ మహిళల హాకీ జట్టుకు జ్యోతి సింగ్ సారథిగా ఎంపికైంది. ఈ నెలాఖరులో ఐదు మ్యాచ్‌ల సిరీస్ ఆడేందుకు భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. కాన్‌బెర్రా జాతీయ హాకీ సెంటర్ వేదికగా జరిగే ఈ సిరీస్ కోసం హాకీ ఇండియా శనివారం 23 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబర్‌లో చిలీ వేదికగా ఎఫ్‌ఐహెచ్ జూనియర్ మహిళల ప్రపంచకప్ జరగనుండగా... దానికి ముందు ఈ సిరీస్ సన్నాహకంగా ఉపయోగించుకోవాలని భారత జట్టు భావిస్తోంది. ఎఫ్‌ఐహెచ్ హాకీ ప్రో లీగ్ సందర్భంగా భారత సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన డిఫెండర్ జ్యోతి సింగ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనుంది. నిధి, హర్ష రాణి గోల్ కీపింగ్ బాధ్యతలు మోయనుండగా... జ్యోతి, మనీషా, మమిత ఓరమ్, సాక్షి శుక్ల, పూజ సాహు, నందినితో డిఫెన్స్ బలంగా ఉంది. మిడ్‌ఫీల్డ్‌లో ప్రియాంక యాదవ్, సాక్షి రాణా, శైలిమా చాను, రజని, ఇషిక, సునేలితా టొప్పో, అనిషా సాహు కీలకం కానున్నారు. లాల్‌రిన్‌పుయి, నిషా మింజ్, పూర్ణిమ యాదవ్, సోనమ్, కనిక సివాచ్, సుఖ్‌వీర్ కౌర్ ఫార్వర్డ్‌లుగా వ్యవహరించనున్నారు. 'ఇది మంచి బృందం. జట్టులో ప్రతి ఒక్కరూ శిక్షణ శిబిరంలో కఠోర సాధన చేశారు. అన్నీ విభాగాల్లో జట్టు సమతూకంగా ఉంది. పరిస్థితులను అర్థం చేసుకొని బాధ్యతలు నిర్వర్తించే ప్లేయర్లు చాలా మంది ఉన్నారు. ఆస్ట్రేలియా పర్యటన ద్వారా తగిన అనుభవం వస్తుంది. అది ఎఫ్‌ఐహెచ్ జూనియర్ మహిళల ప్రపంచకప్‌లో ఉపయోగపడుతుంది. వరల్డ్‌కప్‌నకు ముందు ప్రపంచ అత్యుత్తమ జట్టుతో తలపడే అవకాశం దక్కింది. ఈ సిరీస్ మన ప్లేయర్లకు చాలా ఉపయోగ పడుతుంది. ఈ మ్యాచ్‌ల ద్వారా మెరుగవ్వాల్సిన అంశాలను గుర్తిస్తాం. వాటి ఆధారంగా జూనియర్ ప్రపంచకప్ వరకు జట్టును మరింత బలంగా తీర్చిదిద్దుతాం' అని భారత కోచ్ తుషార్ ఖండేకర్ అన్నాడు.

'ఇరాన్‌లో ఉపాధి' పేరుతో మోసపోవద్దు

యువతకు కేంద్రం హెచ్చరిక

సాక్షి, న్యూఢిల్లీ: విదేశాల్లో మంచి ఉద్యోగం, అధిక జీతం అంటూ కొందరు ఏజెంట్లు చెప్పే మాటలను నమ్మవద్దని విదేశాంగ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా ఇరాన్‌లో ఉద్యోగాల పేరిట జరుగుతున్న భారీ మోసం, కిడ్నాప్‌ల పర్వం ఇటీవల బయటపడిన విషయాన్ని గుర్తు చేసింది. మాయ మాటలతో ఇరాన్‌కు రప్పించుకుని, ఆ తర్వాత కిడ్నాప్ చేసి వారి కుటుంబ సభ్యుల నుంచి భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్న నేరగాళ్ల ముఠాల బారిన పడవద్దని కోరింది. ఇరాన్ ప్రభుత్వం భారతీయులకు వీసా రహిత ప్రవేశాన్ని కేవలం పర్యాటక ప్రయోజనాల కోసం మాత్రమే కల్పించిందని స్పష్టం చేసింది. అయితే, నేరగాళ్లతో సంబంధాలున్న కొందరు ఏజెంట్లు ఇదే అదనుగా ఉద్యోగాల కోసం కూడా వీసా లేకుండా వెళ్లవచ్చని నమ్మిస్తున్నారని తెలిపింది. ఇలాంటి ఆఫర్ల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని కోరింది. తప్పుడు వాగ్దానాలు చేసే ఏజెంట్లు కిడ్నాపర్లతో కుమ్మక్కై ఉండే ప్రమాదం ఉందని హెచ్చరించింది.



గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో మారిటైమ్‌పై ఏర్పాటైన ప్రదర్శనలో శనివారం ఓ నౌక నమూనాను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రధాని మోదీకి విశేషాలు వివరిస్తున్న అధికారులు



తైవాన్ రాజధాని తైపీలో ఏర్పాటైన ఏరోస్పేస్ డిఫెన్స్ టెక్నాలజీ ఎగ్జిబిషన్‌లో ఉంచిన ఈ క్రూయిజ్ క్షిపణి పేరు బరాకుడా 500. దీనిని అమెరికా, తైవాన్ కంపెనీలు ఉమ్మడిగా ఉత్పత్తి చేశాయి.

గిరిజనులు బంజరు భూముల్ని లీజుకివ్వొచ్చు

త్వరలో చట్టం తేనున్న మహారాష్ట్ర ప్రభుత్వం

ముంబై: మహారాష్ట్రలోని గిరిజనులు తమ బంజరు భూములను ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇచ్చేందుకు వీలు కల్పిస్తూ త్వరలో చట్టం చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ మంత్రి చంద్రశేఖర్ బవాంకులే తెలిపారు. దీనివల్ల గిరిజనులు తమ భూములపై యాజమాన్య హక్కులను కొనసాగించుకోవడంతోపాటు పడావు భూముల నుంచి సైతం వారికి స్థిర ఆదాయం అందుతుందన్నారు. గిరిజన రైతు ఎవరైనా తన భూమిని ప్రైవేటు భాగస్వామ్యంతో ఒక పారిశ్రామికవేత్తతో కలిసి అభివృద్ధి పర్చాలని భావిస్తే జిల్లా కలెక్టర్‌ను సంప్రదించి అందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవచ్చని వివరించారు. ఇప్పటి వరకు గిరిజన రైతులు దీనికోసం ముంబైలోని సెక్రటేరియట్‌కు రావాల్సిన అవసరముండేదని తెలిపారు. గిరిజన రైతులు నేరుగా ప్రైవేటు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉండేది కాదన్నారు. ప్రతిపాదిత చట్టం సాగుకు యోగ్యం కాని బంజరు భూములకే తప్ప, పంటలు పండే గిరిజనుల భూములకు వర్తించదని స్పష్టం చేశారు. పాల్ఘార్, నందుర్బార్ జిల్లాలకు చెందిన పలువురు గిరిజన రైతులు అందించిన విజ్ఞప్తుల మేరకే చట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ప్రైవేట్ కంపెనీలు ప్రభుత్వ పథకం కింద సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయాలనుకుంటే, సంబంధిత గిరిజన భూ యజమానితో ఒప్పందం కుదుర్చుకోవచ్చు. ఆవిధంగా రైతుకు స్థిరమైన వార్షిక ఆదాయం ఉంటుంది. నిరుపయోగంగా ఉన్న బంజరు భూమి నుంచి మామూలు పరిస్థితుల్లో ఇలా ఆదాయం పొందడం సాధ్యం కాదని మంత్రి బవాంకులే చెప్పారు. గిరిజన రైతులు, ప్రైవేటు పారిశ్రామికవేత్తల మధ్య జరిగే ఒప్పందంలో పారదర్శకత, నిష్పాక్షికత కోసం సంబంధిత జిల్లా కలెక్టర్ ప్రమేయం తప్పనిసరి చేస్తున్నామన్నారు. ఎకరం భూమి కనీస లీజు ఏడాదికి కనీసంగా రూ.50 వేలు, అదే హెక్టారుకైతే రూ.1.25 లక్షలుగా ఉంటుందని, గరిష్టంగా లీజు పొందే విషయంలో గిరిజన రైతులు ఒప్పందానికి ముందుకువచ్చే ప్రైవేటు సంస్థలతో సంప్రదింపులు జరుపుకోవచ్చన్నారు. ఒకవేళ ఈ భూమి నుంచి ఏవైనా ఖనిజాలను వెలికి తీయాల్సి ఉంటే రెండు పార్టీలు అవగాహనా ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకోవచ్చని వివరించారు. కాగా, ప్రభుత్వ నిర్ణయం పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కల్గించేలా ఉందని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. గిరిజనులను దోపిడీ చేసే కొందరు పారిశ్రామికవేత్తలు, పలుకుబడి కలిగిన వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా ప్రతిపాదిత చట్టం ఉందని ఆరోపించింది.

శబరిమల అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు

గ్లోబల్ అయ్యప్ప సంగంలో కేరళ సీఎం విజయన్ వెల్లడి

పత్తనంతిట్ట: శబరిమల అభివృద్ధి కోసం వెయ్యి కోట్ల విలువైన ప్రాజెక్టులను చేపడతామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించారు. ఏటికేడు పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా యాత్ర సజావుగా, సురక్షితంగా సాగేందుకు చర్యలు చేపడతామన్నారు. ట్రావన్‌కోర్ దేవస్వోమ్ బోర్డు ఏర్పాటై 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటైన గ్లోబల్ అయ్యప్ప సంగం కార్యక్రమంలో విజయన్ మాట్లాడారు. ప్రపంచ దేశాల నుంచి భక్తులను ఆకర్షించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మదురై, తిరుపతి మాదిరిగా శబరిమలకు ప్రముఖ తీర్థయాత్రాస్థలంగా తీర్చిదిద్దుతామన్నారు. శబరిమల, పంప, నీలక్కల్‌లతోపాటు అయ్యప్పస్వామి ఆలయానికి చేరుకునే మార్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయనున్నట్లు సీఎం వివరించారు. ఈ కార్యక్రమాన్ని వ్యతిరేకించిన కాంగ్రెస్, బీజేపీలను సీఎం విజయన్ విమర్శిస్తూ..దేనినీ ద్వేషించనివాడు, అందరితో స్నేహపూర్వకంగా, దయతో ఉండేవాడు, సుఖదుఃఖాల పట్ల ఉదాసీనంగా ఉండేవాడు. సహనం కలిగి ఉండేవాడే నిజమైన భక్తుడని భగవద్గీతను ఉటంకించారు. భగవద్గీత నిర్వచించిన ప్రకారం ఈ కార్యక్రమానికి హాజరైన వారంతా భక్తులేనని ఆయన పేర్కొన్నారు. మిగతా వారు విశ్వాసులుగా నటిస్తూ ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఇటువంటి ప్రయత్నాలను అడ్డుకున్నందుకు సుప్రీంకోర్టుకు సీఎం విజయన్ ధన్యవాదాలు తెలిపారు. అన్ని మతాల వారు దర్శించుకునే శబరిమల కుల, మతాలకు అతీతమన్నారు. హరివరాసనమ్ గేయాన్ని లాలిపాటగా దేవరాజన్ మాస్టర్ స్వరపర్చగా క్రైస్తవుడైన ఏసుదాస్ పాడారన్నారు. అయ్యప్ప ఆలయాన్ని దర్శించుకునే భక్తులు ఆయన సహచరుడిగా భావించే వావర్‌కు అంకితం చేసిన మసీదు వావర్ నాడ మీదుగా వెళతారని సీఎం విజయన్ తెలిపారు. ఈ క్షేత్రం ప్రాశస్త్యం ప్రపంచమంతా తెలియాలంటే భక్తులను ఆకర్షించే విధంగా సౌకర్యాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. శబరిమల ఆలయ సముదాయమున్న సన్నిధానంను మూడు దశల్లో రూ.778కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు.

గార్బా కార్యక్రమాల్లోకి హిందువుల్నే అనుమతించాలి

స్పష్టం చేసిన వీహెచ్‌పీ • సమర్థించిన మహారాష్ట్ర మంత్రి

ముంబై: నవరాత్రి సందర్భంగా నిర్వహించే గార్బా కార్యక్రమాల్లోకి హిందువులను మాత్రమే అనుమతించాలని విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ)స్పష్టం చేసింది. కార్యక్రమాల నిర్వాహకులు పాల్గొనే వారి ఆధార్ కార్డును పరిశీలించిన తర్వాతే అనుమతించాలని సూచించింది. సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు మహారాష్ట్రలో నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. 'గర్బా కేవలం నృత్యం మాత్రమే కాదు, దేవతలను ప్రసన్నం చేసుకోవడానికి చేసే ఒక ఆరాధన. వారు (ముఖ్యంగా ముస్లింలు) విగ్రహారాధనను నమ్మరు. ఆచారాలపై విశ్వాసం ఉన్నవారిని మాత్రమే గార్బా కార్యక్రమాల్లోకి అనుమతించాలి' అని వీహెచ్‌పీ జాతీయ ప్రతినిధి శ్రీరాజ్ నాయర్ తెలిపారు. ఈ మేరకు కార్యక్రమాల నిర్వాహకులకు అడ్వైజరీ జారీ చేశామన్నారు. కార్యక్రమాల ఎంట్రీ పాయింట్ల వద్ద ఆధార్ కార్డులను పరిశీలించాలని, పూజ చేసినట్లు నిర్ధారించుకుని తిలకందిద్ది వారిని లోపలికి పంపించాలని తెలిపామన్నారు. వీహెచ్‌పీతోపాటు బజ్‌రంగ్ దళ్ కార్యకర్తలు ఈ విషయంలో నిర్వాహకులకు సహకరిస్తారని పేర్కొన్నారు. దేవతపై విశ్వాసం లేని వారు ఈ కార్యక్రమాల్లో పాల్గొనరాదని స్పష్టం చేశారు. వీహెచ్‌పీ నిర్ణయంపై మంత్రి చంద్రశేఖర్ బవాంకులే సానుకూలంగా స్పందించారు. గార్బా కార్యక్రమ నిర్వాహకులకు నిబంధనలు అమలు చేసే స్వేచ్ఛ ఉంటుందని పేర్కొన్నారు. మహారాష్ట్ర కాంగ్రెస్ మాత్రం మంత్రి వ్యాఖ్యలను తప్పుబట్టింది. వీహెచ్‌పీ సమాజాన్ని మతం ప్రాతిపదికన విభజించి, మంటలు రాజేయాలనుకుంటోందని విమర్శించింది.

తుపాకీతో కాల్చి రోడ్డు ప్రమాదమన్నారు

జమ్మూలో ముగ్గురు పోలీసుల సస్పెన్షన్

జమ్మూ: గత నెలలో ఓ మహిళ మరణానికి కారణం రోడ్డు ప్రమాదం కాదు, తుపాకీ గాయాలేనని వెల్లడవడంతో జమ్మూ అధికారులు ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేశారు. ముంబైకి చెందిన మెహ్‌జబీన్(30), ఆమె సోదరి ఫాతిమా(21), లూధియానా వాసి జస్‌ప్రీత్ కౌర్(28)లను ఆగస్టు 21వ తేదీన జమ్మూ శివారులోని జేకే మెడిసిటీ అనే ప్రైవేట్ ఆస్పత్రి ఇద్దరు వ్యక్తులు తీసుకువచ్చారు. వీరు రింగ్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో గాయపడినట్లు ఆస్పత్రి సిబ్బందికి తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది చన్ని హిమ్మత్ పోలీస్ స్టేషన్‌కు ఈ మేరకు సమాచారమిచ్చారు. మరునాటి రోజు ఉదయమే ఆ ఇద్దరు వ్యక్తులు ముగ్గురు క్షతగాత్రులను జమ్మూలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మెహ్‌జబీన్ ఆగస్టు 29వ తేదీన కన్నుమూసింది. మెహ్‌జబీన్ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మెహ్‌జబీన్ మృతికి బుల్లెట్ గాయాలే కారణమని పోస్టుమార్టం నివేదిక తెలిపింది. అనంతరం పోలీసులు దర్యాప్తు జరిపి ముగ్గురు మహిళలూ గుర్తు తెలియని వ్యక్తుల కాల్పుల్లో గాయపడినట్లు తేల్చారు. వీరి గాయాలకు రోడ్డు ప్రమాదం కారణం కాదని కూడా తేలింది. సీసీ ఫుటేజీ, కాల్‌డేటాల ఆధారంగా కాల్పులకు కారకులుగా భావిస్తూ చన్ని హిమ్మత్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో దీపక్ పఠానియా, ఎస్ఐ రోహిత్ శర్మ, సైనిక్ కాలనీ పోలీస్ పోస్ట్ ఇన్‌ఛార్జి, ఎస్సై వాసిమ్ భట్టిలను సస్పెండ్ చేస్తూ జమ్మూ సీనియర్ ఎస్పీ జోగిందర్ సింగ్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ ముగ్గురినీ అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని పోలీసులు తెలిపారు.

మరో 43 మంది పాలస్తీనియన్లు మృతి

కైరో: గాజా నగరంపై గట్టి పట్టున్న హమాస్‌తో అమీతుమీ తేల్చుకుంటామంటూ భారీగా సైనికులను రంగంలోకి దించిన ఇజ్రాయెల్ ఆర్మీ.. దాడుల తీవ్రతను కొనసాగిస్తోంది. శుక్రవారం రాత్రి నుంచి ఇజ్రాయెల్ ఆర్మీ గాజా వ్యాప్తంగా చేపట్టిన దాడుల్లో కనీసం 43 మంది ప్రాణాలు కోల్పోయారని అల్‌జజీరా తెలిపింది. వీరిలో గాజా నగరంలోని షావా స్క్వేర్ సమీపంలో జరిగిన దాడిలో ఐదుగురు, మరో దాడిలో ఒకే కుటుంబంలోని ఆరుగురు చనిపోయారని ఆరోగ్య విభాగం తెలిపింది. వీరు షిఫా ఆస్పత్రి డైరెక్టర్ మహ్మద్ అబూ సెల్మియా బంధువులని ఆస్పత్రి ఎండీ రమీ ఎమ్‌హన్నా చెప్పారు. ఇలాఉండగా, గత 23 నెలలుగా ఇజ్రాయెల్ ఆర్మీ యథేచ్ఛగా సాగిస్తున్న దాడుల్లో చనిపోయిన వారి సంఖ్య 65, 100 దాటిపోయింది. భవనాలను నేలమట్టం చేస్తుండటంతో గాజా ప్రాంతంలో ఉన్న కనీసం 90 శాతం మంది పాలస్తీ నియన్లకు నిలువ నీడ కూడా లేకుండాపోయింది. దాదాపు సగం మంది, అంటే సుమారు 4.50 లక్షల మంది గాజా నగరాన్ని వీడి వెళ్లిపోయినట్లు పాలస్తీనా సివిల్ డిఫెన్స్ విభాగం తెలిపింది. ఇలాఉండగా, గాజా ప్రాంతంలో పోషకాహార లోపంతో బాధపడుతున్న వేలాది మంది చిన్నారుల కోసం తీసుకువచ్చిన అత్యవసర ఆహార పదార్థాలున్న నాలుగు ట్రక్కులను సాయుధులు వచ్చి తరలించుకుపోయారని యునిసెఫ్ శుక్రవారం తెలిపింది.



ఆస్ట్రియాలోని లియోగాంగ్‌లో శనివారం యూరోపియన్ బియర్డ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వంపులు తిరిగిన గడ్డం, మీసాలను ప్రదర్శిస్తున్న పోటీదారులు

ప్రభుత్వ వ్యతిరేక ఉత్తర్వుల జారీపై వెనుకంజ

ట్రిబ్యునళ్లలోని నాన్ జ్యుడీషియల్ సభ్యులపై సీజేఐ వ్యాఖ్య

న్యూఢిల్లీ: వివిధ ట్రిబ్యునళ్లలోని నాన్ జ్యుడీషియల్ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉత్తర్వులు జారీ చేయడానికి ఇష్టపడటం లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించేందుకు కృషి చేయాలని వారిని కోరారు. సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)-2025 ఆలిండియా కాన్ఫరెన్స్‌లో శనివారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ట్రిబ్యునళ్లలోని పలు సమస్యలు, దేశంలోని న్యాయవ్యవస్థ తీరు గురించి పలు వ్యాఖ్యలు చేశారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మెఘ్వాల్, పీఎంవోలోని సహాయ మంత్రి జితేంద్ర సింగ్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. పరిపాలనా ట్రిబ్యునళ్లు న్యాయస్థానాలకు భిన్నంగా ఉంటాయని, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ మధ్య వీటికి ఒక ప్రత్యేకత ఉందన్నారు. ట్రిబ్యునళ్లలోని సభ్యులు కొందరు పరిపాలనా విభాగానికి చెందిన వారైతే మరికొందరు న్యాయవ్యవస్థ నుంచి వచ్చిన వారని తెలిపారు. 'ఒక న్యాయమూర్తిగా, నేను వ్యక్తిగతంగా గమనించిందేమంటే.. పరిపాలనా విభాగాల నుంచి వచ్చిన ట్రిబ్యునళ్ల సభ్యులు కొందరు తమ పూర్వ అనుభవాలను మర్చిపోవడం లేదు. వీరు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండే ఏదైనా ఉత్తర్వును జారీ చేయడానికి ఇష్టపడటం లేదు. వీరి ఈ విషయాన్ని ఆలోచించాలని కోరుతున్నా'అని సీజేఐ అన్నారు. వీరి కోసం న్యాయ విద్యావేత్తలతో వర్క్‌షాపులు, సదస్సులు, శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తే పరిస్థితి మెరుగవుతుందని భావిస్తున్నానన్నారు. ట్రిబ్యునళ్లలో సభ్యుల నియామకం, సర్వీసు నిబంధనల విషయంలో ఏకీకృత ప్రక్రియను తీసుకువస్తే బాగుంటుందన్నారు.

ఢిల్లీలోని వంద స్కూళ్లకు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని 100కు పైగా స్కూళ్లకు శనివారం బాంబు బెదిరింపు అందింది. ఆయా స్కూళ్లు, పరిసరాల్లో క్షుణ్నంగా తనిఖీలు జరిపిన పోలీసులు అవన్నీ ఒట్టి బెదిరింపులేనని తేల్చారు. టెర్రరైజర్స్111 అనే ఒకే ఒక గ్రూపు నుంచి శనివారం ఉదయం 6.10 గంటల సమయంలో పాఠశాలలకు ఈమెయిళ్లు అందాయని పోలీసులు తెలిపారు. ఇదే గ్రూపు గతంలోనూ ఇలాంటి బెదిరింపు మెయిళ్లను పంపిందని చెప్పారు. 'మీ స్కూలు భవనంలో బాంబులు అమర్చాం. స్పందిస్తారా లేక విధ్వంసాన్ని చూస్తారా?'అని అందులో ఉంది. ద్వారకాలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్, కృష్ణా మోడల్ పబ్లిక్ స్కూల్, సర్వోదయ విద్యాలయ, సీఆర్‌పీఎఫ్ పబ్లిక్ స్కూల్, మాతా విద్యా దేవి పబ్లిక్ స్కూల్ తదితర 10 స్కూళ్లకు బెదిరింపు వచ్చినట్లు తమకు సమాచారం అందిందని ఢిల్లీ ఫైర్ విభాగం పేర్కొంది. ఈ మేరకు వెంటనే ఆయా స్కూళ్లలో పోలీసులు, బాంబు డిస్పోజల్ స్క్వాడ్లతో కలిసి పూర్తి స్థాయిలో తనిఖీలు జరిపామని తెలిపింది. ఎటువంటి పేలుడు పదార్థాలు, ఇతర అనుమానాస్పద వస్తువులు కనిపించకపోవడంతో వట్టి బెదిరింపేనని తేల్చామన్నారు. బెదిరింపులపై విచారణ చేపట్టామని ఢిల్లీ పోలీసు విభాగం వెల్లడించింది.

యూరప్ ఎయిర్‌పోర్ట్‌లపై సైబర్ దాడి

ప్రధాన విమానాశ్రయాల్లో స్తంభించిన కార్యకలాపాలు

- నిలిచిపోయిన చెక్-ఇన్, బోర్డింగ్ వ్యవస్థలు
- వందల విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- పలు విమానసర్వీసులు రద్దు
- పునరుద్ధరణకు కృషిచేస్తున్న బ్రిటన్, బెల్జియం, జర్మనీ తదితర దేశాలు

లండన్/న్యూఢిల్లీ: ఆసియా దేశాల్లో రహదారులను ఎంత విపరీతంగా వినియోగిస్తారో యూరప్ దేశాల్లో విమానాలను పౌరులు అంతే స్థాయిలో ఉపయోగిస్తారు. నిత్యం అత్యంత రద్దీగా ఉండే యూరప్‌లోని పలు దేశాల్లోని ప్రధాన విమానాశ్రయాలపై శనివారం అనూహ్యంగా హఠాత్తుగా ఒకేసారి సైబర్ దాడి జరిగింది. ఈ దెబ్బకు ఆయా విమానాశ్రయాల్లో లక్షలాది మంది ప్రయాణికుల చెక్-ఇన్, బోర్డింగ్ సర్వీసులు స్తంభించిపోయాయి. సేవలు నిలిచిపోవడంతో లక్షలాది మంది ప్రయాణికులు అవస్థలు పడ్డారు. సర్వీస్ ప్రొవైడర్లను సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకోవడంతో ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. అయితే వెంటనే అప్రమత్తమైన నిపుణులు పరిస్థితిని సాధారణ స్థాయికి తీసుకొచ్చేందుకు రంగంలోకి దిగారు. ప్రస్తుతానికి పరిస్థితి దాదాపు అదుపులోకి వచ్చిందని, స్వల్పస్థాయిలో ప్రయాణికులే ఇంకా ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది. అయితే ఎయిర్‌పోర్ట్‌లో విమానసర్వీసుల వ్యవస్థలో పటిష్ట భద్రతా లోపించిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లండన్‌లోని ప్రఖ్యాత హీత్రూ ఎయిర్‌పోర్ట్ మొదలు బెల్జియంలోని బ్రస్సెల్‌లో ఎయిర్‌పోర్ట్, జర్మనీలోని బెర్లిన్ విమానాశ్రయం దాకా పలు ఎయిర్‌పోర్ట్‌లు సైబర్‌దాడుల ప్రభావాన్ని చవిచూశాయి. ఎయిర్‌లైన్స్, ఎయిర్‌పోర్ట్ వ్యవస్థల్లో సైబర్‌దాడి జరగలేదని కేవలం సర్వీస్ ప్రొవైడర్లలోనే ఈ ఘటన జరిగిందని బ్రస్సెల్స్ ఎయిర్‌పోర్ట్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ''కొన్ని ఎయిర్‌పోర్ట్‌లలో మల్టీ-యూజర్ సిస్టమ్ ఎన్విరాన్‌మెంట్ (మ్యూస్) సాఫ్ట్‌వేర్‌పై సైబర్‌దాడి జరిగింది. దీంతో ప్రయాణికులు సొంతంగా చెక్-ఇన్ చేసుకోవడం, బోర్డింగ్ పాస్ ముద్రణ, బ్యాగులకు ట్యాగ్‌లు తదితర సేవలు అందుబాటులోకి లేకుండా పోయాయి''అని ఈ సాఫ్ట్‌వేర్ సేవలు అందించే కోలిన్స్ ఏరోస్పేస్ సంస్థ తెలిపింది.

ఇది కచ్చితంగా లక్షిత దాడే

''యథాలాపంగా జరిగిన దాడి కాదు. హ్యాకర్లు, నేరముఠాలు లేదా యూరప్ అంటే గిట్టని దేశాలు తమ సైబర్ నిపుణులతో చేయించిన దాడి ఇది. ఒకేసారి వేర్వేరు దేశాల్లోని వేర్వేరు సర్వీస్ ప్రొవైడర్ల సమక్షంలో పనిచేసే ఎయిర్‌పోర్ట్‌లపై జరిగిన దాడి ఇది. ఇది నిజంగా ఆశ్చర్యానికి, షాక్‌కు గురిచేసే దాడి. ప్రపంచంలోనే మంచి పేరున్న ఏవియేషన్, రక్షణరంగ కంపెనీల సాఫ్ట్‌వేర్‌పైనే దాడి జరిగింది. భద్రతావైఫల్యాలను ఈ ఘటన ఎత్తిచూపిస్తోంది'' అని ప్రయాణ నిపుణుడు పాల్ ఛార్లెస్ విశ్లేషించారు. సైబర్‌దాడికి గురైన వ్యవస్థలతో అనుసంధానతను ఆపరేటర్లు వెంటనే తొలగించి ప్రభావతీవ్రతను తగ్గించారని బెర్లిన్ ఎయిర్‌పోర్ట్ తెలిపింది. యూరప్‌లోనే అత్యంత రద్దీగా ఉంటే హీత్రూ ఎయిర్‌పోర్ట్‌లోనూ కొందరు ప్రయాణికులు అవస్థలు పడ్డారు. 'కియోస్క్‌లు పనిచేయట్లేవు. కౌంటర్‌ల వద్ద సిబ్బంది ఎటో వెళ్లిపోయారు. బ్యాగేజ్ చెక్-ఇన్ కోసం టెర్మినల్-4 వద్ద మూడు గంటలువేచి ఉన్నాను' అని మేరియా కాసే అసహనం వ్యక్తంచేశారు. ''ఆన్‌లైన్ పనిచేయట్లేదు. దీంతో మ్యాన్యువల్‌గా చెక్-ఇన్ పూర్తిచేస్తున్నాం. బ్యాగ్‌లపై చేతితో నంబర్లు వేస్తున్నాం''అని ఏవియేషన్, డిఫెన్స్ టెక్నాలజీ సంస్థ కోలిన్స్‌కు అనుబంధ 'ఆర్‌టీఎక్స్' తెలిపింది. భారత్‌లో మాత్రం ఇలాంటి సమస్య తలెత్తలేదని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు శనివారం ప్రకటించారు.



బెల్జియంలోని బ్రస్సెల్స్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జనం పడిగాపులు



లండన్‌లోని హీత్రూ ఎయిర్‌పోర్టులో విమానాల రద్దుతో నిలిచిపోయిన ప్రయాణికులు

పూర్వీకులకు పిండ ప్రదానం చేసిన రాష్ట్రపతి

గయా: బిహార్‌లోని గయాజీలో ఉన్న ప్రఖ్యాత విష్ణుపాద ఆలయం వద్ద రాష్ట్రపతి ముర్ము శనివారం తమ పూర్వీకులకు పిండ ప్రదానం చేశారు. ఫల్గు నదీ తీరాన రాష్ట్రపతి ముర్ము తమ పూర్వీకుల ఆత్మ శాంతి కోసం ప్రదానం క్రతువును నిర్వహించి, జల తర్పణం చేశారని ఆలయ ట్రస్ట్ వర్కింగ్ ప్రెసిడెంట్ శంభు లాల్ విఠల్ తెలిపారు. ఏటా పితృ పక్షం రోజున వేలాదిగా హిందువులు విష్ణుపాద ఆలయాన్ని దర్శించుకుని పిండప్రదానం చేస్తుంటారు. అంతకు ముందు, గయాజీ విమానాశ్రయానికి వచ్చిన రాష్ట్రపతి ముర్ముకు గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ ఘన స్వాగతం పలికారు. ఆమె రాకను పురస్కరించుకుని అధికారులు గయాజీలో విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.

రూ.14కే లీటరు 'రైల్ నీరు'

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని అన్ని రైల్వే స్టేషన్లలో 'రైల్ నీర్' బాటిల్ ధర రూ.14కే అందుబాటులో ఉంటుందని రైల్వే శాఖ పేర్కొంది. తగ్గిన జీఎస్టీ కారణంగా రూ.15 బాటిల్ ధర రూ.1 తగ్గినట్లు తెలిపింది. ఇకపై రూ.14కే విక్రయిస్తున్నట్లు రైల్వే శాఖ వివరించింది. ఈ నెల 22వ తేదీ నుంచి దీనిని అమలు చేయాలని జనరల్ మేనేజర్‌లకు రైల్వే శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. లీటరు బాటిల్‌ను రూ.14కు, అర లీటరైతే రూ.9కి విక్రయించనున్నట్లు రైల్వే శాఖ వివరించింది.

స్మార్ట్ సిటీల్లో భద్రతా చర్యలు పెంచాలి

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా పెరుగుతున్న సైబర్ బెదిరింపుల దృష్ట్యా, స్మార్ట్ సిటీలలో సైబర్ భద్రతా విధానాలను తక్షణం బలోపేతం చేయాలని పట్టణ, గృహ నిర్మాణ శాఖలను కేంద్ర హోం శాఖ అప్రమత్తం చేసింది. సైబర్ భద్రతపై ఇటీవల జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలను పునరుద్ఘాటిస్తూ, ప్రతి స్మార్ట్ సిటీకి ఒక సాంకేతిక బృందంతో పూర్తిస్థాయి చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్(సీఐఎస్ఓ)ను నియమించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. డిజిటల్ మౌలిక సదుపాయాలను కాపాడటం, సైబర్ ప్రమాదాలను పర్యవేక్షించడం, జాతీయ భద్రతా ప్రోటోకాల్‌లకు అనుగుణంగా ఉండేలా చూసుకోవడం, దాడులను సకాలంలో ఎదుర్కోవడంలో సీఐఎస్ఓలు కీలక పాత్ర పోషిస్తారని తెలిపింది.

‘ముప్పడినాయకుడు’ ఎవరి మహాప్రధాని?

కాకతీయుల సామంతులు

చెరకురెడ్డి వంశం

కాకతీయ సేనానులు, సామంతుల్లో చెరకురెడ్డి వంశీయులు ప్రసిద్ధి చెందినవారు. వీరు రుద్రదేవుడు, మహాదేవుడు, గణపతిదేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుల కాలంలో సామంతులుగా పనిచేశారు. నల్గొండ జిల్లాలోని జమ్మలూరు, మహబూబ్‌నగర్ జిల్లాలోని అమరాబాద్, కర్నూలు జిల్లాలోని వేల్పూరు ప్రాంతాలను పాలించారు.

నల్గొండ జిల్లాలోని దేవరకొండ, నకిరేకల్ తాలూకాల్లో ఉన్న చెరకుపల్లి గ్రామాలు వీరి తొలి నివాసమని భావిస్తున్నారు. వీరి తొలి రాజధాని జమ్మలూరు. నల్గొండ జిల్లా తిరుమలగిరి మండలంలోని జలాలుపురమే జమ్మలూరు కావచ్చు. జలాలుపురంలో చెరకు బొల్లయ్యరెడ్డి తన వంశీయుల పేరుమీద నిర్మించిన కేతేశ్వర, కోటేశ్వర, మారేశ్వర, సూర్యదేవర ఆలయాలే ఇందుకు నిదర్శనం. వీరు 1158 నుంచి 1323 వరకు పరిపాలించారు. ఈ వంశానికి ఆద్యుడు కాటసేనాని(1080-1140). జలాలుపురం శాసనంలో ఇతడి ప్రస్తావన ఉంది. పొలవాస మేడరాజు,కొలనుపాక జగద్దేవుడు కాకతీయ రాజ్యంపై దండెత్తగా.. వీరిని ఓడించడంలో రెండో బేతరాజుకు కాటసేనాని తోడ్పడ్డాడు. యుద్ధంలో సహాయం చేసిన కాటసేనానికి బేతరాజు చెరకుపల్లి సహా 12 గ్రామాలను ఇచ్చాడు. చెరకుపల్లి ప్రాంతాన్ని పాలించినందువల్ల ఈ వంశీయులు చెరకు రెడ్లు అయ్యారు.

కాటసేనాని పెద్దకుమారుడు కేతసేనాని. ఇతడి మొదటి భార్యకు కాట, మార, ఎర్ర అనే ముగ్గురు కుమారులు. చెరకు రెడ్ల సైనిక సహకారానికి మెచ్చిన రుద్రదేవుడు వారికి గుండియపూండి, బెరపూడి, గొట్టిపల్లి, పసువల, తొర్రూరు గ్రామాలను ఇచ్చాడు. కేతసేనాని రెండో భార్యకు కాట, మార, బొల్ల అనే కుమారులు ఉన్నారు. కేతసేనాని, ఈ ముగ్గురు కుమారులు కందూరు చోడులను ఓడించడంలో రుద్రదేవుడికి సహకరించారు. అందువల్ల రుద్రదేవుడు వీరికి జమ్మలూరు రాజ్యమిచ్చి సామంతులుగా నియమించాడు. ఈ ముగ్గురిలో చివరివాడైన బొల్లయరెడ్డి ప్రసిద్ధుడు. తండ్రి తర్వాత ఇతడు జమ్మలూరు రాజ్యాధిపతి అయ్యాడు.

సంక్షోభంలో కూరుకుపోయిన కాకతీయ రాజ్యాన్ని రక్షించడంలో రేచర్ల రుద్రసేనానికి బొల్లయరెడ్డి సహాయం చేశాడు. అందుకే గణపతిదేవుడు సింహాసనం అధిష్ఠించగానే బొల్లయరెడ్డిని జమ్మలూరు రాజ్యంతోపాటు అమరాబాద్, వేల్పూరు రాజ్యాలకు సామంతుడిగా నియమించాడు. తర్వాత ఇతడి పెద్ద సోదరుడి కుమారులు, మనుమలు, మునిమనమలు ఈ రాజ్యాలను పాలించారు. వీరు ఈ ప్రాంతాల్లో 22 శాసనాలు వేయించారు. జలాలుపురం, కలువకొలను, అమరాబాద్, ఉడిమళ్ల, కూర్మెళ్ల తదితర ప్రాంతాల్లో దేవాలయాలను నిర్మించారు. వీరి శాసనాలు నాటి తెలుగు భాషా స్వరూపాన్ని తెలుపుతున్నాయి. వీరు శైవ మతాన్ని అవలంభించారు.

కాకతీయ రాజ్యంపై దండెత్తిన పొలవాస మేడరాజు, కొలనుపాక జగద్దేవుడిని ఓడించడంలో రెండో బేతరాజుకు కాటసేనాని తోడ్పడ్డాడు. యుద్ధంలో సహాయం చేసిన కాటసేనానికి బేతరాజు చెరకుపల్లి సహా 12 గ్రామాలను ఇచ్చాడు. చెరకుపల్లి ప్రాంతాన్ని పాలించినందువల్ల ఈ వంశీయులు చెరకు రెడ్లు అయ్యారు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర

మల్యాల వంశం

మల్యాల వంశీయులు కాకతీయులకు విధేయులుగా ఉన్నారు. ఎన్నో యుద్ధాల్లో పాల్గొని కాకతీయుల విజయ సాధనకు తోడ్పడ్డారు. వీరు దుర్జయ కులస్థులు. ఈ వంశానికి ఆద్యుడు దన్నసేనాని. కటుకూరు, కొండిపర్తి, బూదపూర శాసనాలు ఇతడిని కాకతీయ సేనానిగా పేర్కొంటున్నాయి. దన్నసేనానికి ఇద్దరు కుమారులు. పెద్దవాడైన సబ్బసేనాని సంకీసపుర రాజ్యాన్ని, రెండోవాడైన బాచసేనాని బూదపూర రాజ్యాన్ని పొందారు. సబ్బ సేనాని కుమారుడు కాటసేనాని. ఇతడికి ఇద్దరు కుమారులు. చిన్నవాడైన చౌండసేనాని ప్రసిద్ధుడు. ఇతడు గణపతిదేవుడి ఆజ్ఞ మేరకు దివిసీమపై దండెత్తి చోడియ రాజును ఓడించాడు. వెలనాటి పృథ్వీశ్వరుడి కోశాగారాన్ని గణపతిదేవుడికి అప్పగించాడు. విరియాల వంశానికి చెందిన మైలమను వివాహమాడి మల్యాల రాజ్యంతో పాటు విరియాల రాజ్యాన్ని కూడా పాలించాడు. చౌండసేనాని మల్యాల రాజ్య పాలకుడైనప్పటికీ ఓరుగల్లు దుర్గ రక్షణ కోసం ఉంచిన సైన్యాధ్యక్షుడిగా కొండపర్తిలో ఉండేవాడు. రాజ్యపాలనా వ్యవహారాలను ఇతడి అన్న పోతసేనాని చూసుకునేవాడు. బాచసేనాని కుమారుడు గుండ దండాధీశుడు కూడా ఈ వంశంలో ప్రసిద్ధుడు. ఇతడు గణపతిదేవుడు, రుద్రమదేవి కాలంలో సామంతుడిగా, దండనాయకుడిగా పనిచేశాడు. బూదపుర, వర్ధమానపుర ప్రాంతాలపై ఆధిపత్యం వహించి కృష్ణానది ఉత్తర ప్రాంతాలను పాలించాడు. ఇతడి భార్య గోన గన్నారెడ్డి సోదరి అయిన కుప్పాంబిక(కవయిత్రి). 1276లో ఈమె వేయించిన బూదపూర శాసనాన్ని బట్టి గుండ దండాధీశుడు అప్పటికే మరణించాడని తెలుస్తోంది. తర్వాత ఇతడి కుమారులు రాజ్యపాలన చేశారు.

విరియాల వంశం

కాకతీయ మొదటి బేతరాజుకు రాజ్యాన్ని ఇప్పించి కాకతీయ రాజ్యాన్ని నిలబెట్టింది వీరే. ఈ వంశీయులు వీరులైనప్పటికీ స్వతంత్ర పాలకులు కాలేదు. రాష్ట్ర కూటులు, కల్యాణీ చాళుక్యుల వద్ద సామంతులుగా, దండనాయకులుగా పనిచేశారు. వీరు కూడా దుర్జయ కులస్థులే. విరియాల వంశానికి ఆద్యుడు పోరంటి వెన్న సేనాని. ఇతడి తర్వాత ఎర్ర భూపతి, భీముడు రాష్ట్ర కూటసేనానులుగా పనిచేశారు. భీముడి కుమారుడైన ఎర్రనరేంద్రుడు విరియాల వంశంలో ప్రసిద్ధుడు. ఇతడి కాలంలోనే రెండో తైలపుడు రాష్ట్రకూటులను ఓడించి 973లో కల్యాణీ చాళుక్య రాజాన్ని స్థాపించాడు. ఎర్రనరేంద్రుడు ఇతడి సేనాని అయ్యాడు. ఆ సమయంలో ముదిగొండ చాళుక్యులు, తొలి కాకతీయులు పరస్పరం ఘర్షణ పడేవారు. అంతకు ముందే కాకతీయ నాలుగో గుండరాజు ముదిగొండ చాళుక్య బొట్టు బేతరాజును ఓడించి తమ పూర్వ రాజ్యమైన కొరవి సీమను ఆక్రమించాడు.

తైలపుడు చక్రవర్తి కాగానే బొట్టు బేతరాజు అతడిని ఆశ్రయించాడు. చక్రవర్తి ఆజ్ఞ మేరకు విరియాల ఎర్రనరేంద్రుడు కాకతీయ నాలుగో గుండరాజును సంహరించి చాళుక్యబొట్టు బేతరాజును కొరవి సీమకు రాజును చేశాడు. ఎర్రనరేంద్రుడి భార్య అయిన కామసాని సోదరుడే గుండరాజు. కామసాని తన భర్త సహకారంతో మేనల్లుడైన మొదటి బేతరాజు(గరుడ)కు రెండో తైలపుడి నుంచి అనుమకొండ రాజ్యాన్ని ఇప్పించింది. ఈ విధంగా విరియాల వంశం కాకతీయ రాజ్యాన్ని నిలబెట్టింది.

ఎర్రసేనాని(నరేంద్రుడు) తర్వాత ఇతడి వంశీయులైన సూరసేనాని, బేతన, రుద్రయ రాజు, సూరన్నపతి, మల్లచమూపతి, అన్నయ మొదలైనవారు సేనానులుగా పనిచేశారు. వీరిలో కొందరు కాకతీయుల దగ్గర పనిచేశారని బి.ఎన్.శాస్త్రి తెలిపారు. కానీ ఇందుకు ఆధారాలు లభించలేదు.

యాదవ రాజులు

తెలంగాణకు పశ్చిమ-ఉత్తరంగా ఉన్న ప్రాంతాన్ని దేవగిరి రాజధానిగా యాదవరాజులు పాలించేవారు. వీరు 9వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం వరకు అధికారంలో ఉన్నారు. కాకతీయుల కాలంలో హొయసాల, దేవగిరి బలమైన రాజ్యాలు. దేవగిరి యాదవరాజులు కొంతకాలం కాకతీయులకు పక్కలో బల్లెంలా ఉండేవారు. దేవగిరి యాదవ రాజ వంశానికి చెందిన ఒక శాఖ కాకతీయుల సామంతులుగా కొన్ని ప్రాంతాలను పాలించింది.

అద్దంకి శాఖకు చెందిన యాదవ రాజుల్లో మొదటి వాడు మొదటి సారంగధరుడు. ఇతడు కాకతీయ రుద్రదేవుడికి యుద్ధాల్లో తోడ్పడ్డాడు. ప్రతిఫలంగా కాకతీయులు ఇతడిని అద్దంకి రాజ్యానికి సామంతుడిగా నియమించారు. ఈ శాఖకు చెందిన మాధవ దేవుడు, సింగల దేవుడు, రెండో సారంగ దేవుడు వేయించిన శాసనాలను బట్టి వీరు గణపతి దేవుడికి సామంతులుగా ఉన్నారని తెలుస్తోంది.

దేవగిరి యాదవరాజు జైతుగీ(జైత్రపాలుడు) కాకతీయ రాజైన మహాదేవుడిని సంహరించాడు. సింఘన ఇతడి కుమారుడు. సింఘన మూడో కుమారుడైన సారంగపాణి దేవుడు తెలంగాణకు వచ్చి రుద్రమదేవి సామంతుడిగా పానగల్లు రాజధానిగా పరిసర ప్రాంతాలను పాలించాడు. ఇతడు వేయించిన పానగల్లు శాసనం(క్రీ.శ.1267) ద్వారా ఈ విషయాలు తెలుస్తున్నాయి. ఇతడి వంశీయులు పానగల్లు, సూర్యాపేట పరిసర ప్రాంతాలను పాలించారని పాతర్లపాడు శాసనం తెలుపుతోంది.

నాగ వంశస్థులు

ఈ వంశీయులు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలను పాలించారు. ఈ వంశంలోని కొందరు నల్గొండ జిల్లా, కోదాడ ప్రాంతాలను పాలించినట్టు అనంతగిరి శాసనం ద్వారా తెలుస్తోంది.

మాదిరి ప్రశ్నలు

1. పానగల్లు శాసన కాలం?
   1) 1263 2) 1267
   3) 1265 4) 1269
2. నతవాడి వంశ మూలపురుషుడు?
   1) దన్నసేనాని 2) పోరంటి వెన్న
   3) సారంగధరుడు 4) బేతరాజు
3. గణపతిదేవుడి సోదరి ‘మైలాంబ’ను వివాహమాడింది ఎవరు?
   1) వక్కడి మల్లరుద్రుడు 2) బుద్ధరాజు
   3) దుర్గరాజు 4) బేతరాజు
4. అనంతగిరి శాసనం ఏ వంశ పాలకుల గురించి తెలుపుతోంది?
   1) గోనవంశం 2) నాగవంశం
   3) వావిలాల వంశం 4) నతవాడి వంశం
5. 1259లో బూదపూర శాసనాన్ని వేయించింది ఎవరు?
   1) గోనబుద్ధ 2) గోన గన్నారెడ్డి
   3) గుండ దండాధీశుడు
   4) గోన విటయ
6. 1276లో గుండేశ్వరాలయాన్ని నిర్మించినవారు?
   1) గోనబుద్ధ 2) గోనగన్నారెడ్డి
   3) గుండ దండాధీశుడు 4) కుప్పాంబిక
7. కాయస్థ వంశ మూలపురుషుడు?
   1) బేతరాజు 2) గంగయ సాహిణి
   3) ఎర్రనరేంద్రుడు 4) సారంగధరుడు
8. తొలి కాకతీయులు అవలంభించిన మతం?
   1) బౌద్ధం 2) జైనం
   3) శైవం 4) వైష్ణవం
9. సమ్మక్క భర్త?
   1) మేడరాజు 2) గోవిందరాజు
   3) పగిడిద్దరాజు 4) జంపన్న
10. ‘ముప్పడినాయకుడు’ ఎవరి మహాప్రధాని?
   1) గణపతిదేవుడు 2) రుద్రదేవుడు
   3) రుద్రమదేవి 4) ప్రతాపరుద్రుడు
11. ప్రతాపరుద్రుడి కాలంలో నాయంకరుల సంఖ్య?
   1) 70 2) 75 3) 80 4) 85
12. కాకతీయుల కాలంలో ‘ఆయగార్లు’ ఏ విభాగ పాలకులు?
   1) స్థలాలు 2) సీమ
   3) గ్రామాలు 4) నాడులు
13. కాకతీయుల కాలంనాటి ‘ఆయగార్ల’ సంఖ్య?
   1) 10 2) 25 3) 12 4) 17
14. కాకతీయుల కాలంలో దేశీయ వాణిజ్యానికి ప్రధాన కేంద్రం?
   1) మంథెన 2) పిల్లలమర్రి
   3) ఓరుగల్లు 4) పేరూరు
15. కాకతీయుల కాలంలో విదేశీ వాణిజ్యానికి ప్రసిద్ధి చెందిన రేవు పట్టణం?
   1) మోటుపల్లి 2) మంథెన
   3) ఓరుగల్లు 4) పేరూరు
16. క్రీడాభిరామం రచయిత?
   1) ఏకామ్రనాథుడు
   2) పాల్కురికి సోమన
   3) ప్రతాపరుద్రుడు
   4) వినుకొండ వల్లభరాయుడు
17. కాకతీయుల కాలంలో ‘సమయములు’ అని వేటిని వ్యవహరించేవారు?
   1) వ్యాపార కేంద్రాలు 2) కుల సంఘాలు
   3) గ్రామాలు 4) నగరాలు
18. బౌద్ధమతం కాలక్రమంలో ఏ మతంలో కలిసి పోయిందని చరిత్రకారుల అభిప్రాయం?
   1) హిందూ 2) జైన
   3) వైష్ణవ 4) ఏదీకాదు
19. కిందివారిలో జైనమతాన్ని అవలంభించిన కాకతీయ రాజులు?
   1) మొదటి బేతరాజు, ప్రోలరాజు
   2) రుద్రదేవుడు, గణపతిదేవుడు
   3) రుద్రదేవుడు, ప్రతాపరుద్రుడు
   4) ప్రతాపరుద్రుడు, ప్రోలరాజు
20. కాకతీయల కాలంలో జైనమత కేంద్రం?
   1) హనుమకొండ 2) పానగల్లు
   3) జోగిపేట 4) కొలనుపాక
21. కాకతీయుల కాలంలో ప్రజాదరణ పొందిన శైవమత శాఖ?
   1) కాలాముఖ 2) వీరశైవం
   3) పాశుపతం 4) కాపాలికం

సమాధానాలు

1) 2 2) 4 3) 1 4) 2 5) 3
6) 4 7) 2 8) 2 9) 3 10) 4
11) 2 12) 3 13) 3 14) 3 15) 1
16) 4 17) 2 18) 1 19) 1 20) 3
21) 3

విద్యార్థి సామర్థ్యాన్ని సూచించేవి?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
ఎస్‌జీటీ - సైన్స్ మెథడాలజీ

విజ్ఞానశాస్త్ర బోధన లక్ష్యాలు

- సాధారణంగా ఉద్దేశాలు, గమ్యాలు, లక్ష్యా లు అనే పదాలను పర్యాయపదాలుగా వాడతారు.
- **గమ్యాలు:** విశాలమైన, దీర్ఘకాలిక అంతిమ ప్రయోజనాన్ని తెలిపేవి గమ్యాలు.
  ఉదా: విద్యకు పరమార్థం మోక్షం.
  - ఉపనిషత్తులు
- **ఉద్దేశాలు:** గమ్యాల నుంచి ఏర్పడినవి ఉద్దేశాలు. ఇవి గమ్యాల కంటే నిర్దిష్టమైనవే కాకుండా విద్యా దిశలను కూడా సూచి స్తాయి.
  ఉదా: విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్ర జ్ఞానం కలిగించడం.
- **లక్ష్యాలు:** స్వల్పకాలంలో చేరగలిగే గమ్యాలను లక్ష్యాలనవచ్చు.
  ఉదా: డీఈడీ పరీక్ష పాసవడం.

విజ్ఞానశాస్త్ర అధ్యయన విలువలు:
1. సామాజిక విలువలు
2. సాంస్కృతిక విలువలు
3. నైతిక విలువలు
4. వృత్తిపరమైన విలువలు
5. ఔపయోగిక విలువలు

సామాజిక విలువలు- రకాలు:
1. బౌద్ధిక విలువ 2. సృజనాత్మక విలువ 3. సౌందర్య విలువ.

విద్యా లక్ష్యాలు
↓
స్థాయిలవారీగా విద్యా లక్ష్యాలు
↓
సబ్జెక్టుల వారీగా విద్యా లక్ష్యాలు
↓
తరగతుల వారీగా విద్యా లక్ష్యాలు

విద్యా లక్ష్యాలను ఈ కింది విధంగా చూపొచ్చు
- **గాగ్నే అనే విద్యావేత్త సూచించిన వర్గీకరణ:** గాగ్నే అభ్యసనాన్ని వివిధ రకాలుగా విడమర్చి చెప్పారు. అవి..

సూచీ అభ్యసనం- ఉద్దీపన- ప్రతిస్పందన అభ్యసనం, భావనాభ్యసనం, సూత్రాల అభ్యసనం, సమస్యా పరిష్కారం. ఇవి సరళం నుంచి సంక్లిష్టం వరకు ఒక క్రమ పద్ధతిలో అమిరి ఉంటాయి.

- **బెంజిమన్ బ్లూమ్, క్రాత్‌హోల్, డేవిడ్ సూచించిన వర్గీకరణ:** వీరు విద్యా లక్ష్యాలను మూడు వర్గాలుగా విభజించారు. అవి..
  ఎ) జ్ఞానాత్మక రంగం
  బి) భావావేశ రంగం
  సి) మానసిక చలనాత్మక రంగం
- జ్ఞానాత్మక రంగంపై బెంజిమన్ బ్లూమ్, భావావేశ రంగంపై డేవిడ్.ఆర్. క్రాత్‌హోల్, మానసిక చలనాత్మక రంగంపై ఎలిబత్ సింప్సన్, ఆర్.హెచ్. దవే కృషి చేశారు.
- జ్ఞానాత్మక రంగం మెదడుకు, భావావేశ రంగం హృదయానికి, మానసిక చలనా త్మక రంగం మనసుకు, శరీరానికి సంబం ధించినవి.
- ఏ అంశం గురించి అయినా ఈ మూడు రంగాల్లో విద్యార్థులను అభివృద్ధి చేయాలి.

విజ్ఞాన శాస్త్రంలో లక్ష్యాలు - స్పష్టీకరణలు -వివరణలు

ఎ. జ్ఞాన రంగంలో లక్ష్యాలు:
- జ్ఞప్తికి తెచ్చుకోవడం • గుర్తించడం

లక్ష్యం-I
1. **జ్ఞప్తికి తెచ్చుకోవడం :** విద్యార్థి విజ్ఞానశాస్త్ర సంబంధమైన పదాలు, సత్యాలు, భావన లు, సూత్రాలు, నిర్వచనాలు, నియమాలు పద్ధతులు జ్ఞప్తికి తెచ్చుకొంటాడు.
   ఉదా: చంద్ర గ్రహణం అంటే ఏమిటి?
2. **గుర్తించడం:** విద్యార్థి విజ్ఞానశాస్త్ర సం బంధమైన సత్యాలు, భావనలు, సూత్రా లు, నియమాలు, పద్ధతులు గుర్తిస్తాడు.
   ఉదా: కుంభాకార, పుటాకార దర్పణాల్లో భేదాలను గుర్తించడం.

లక్ష్యం-II అవగాహన:
విద్యార్థి విజ్ఞానశాస్త్ర సంబంధమైన పదా లు, సత్యాలు, భావనలు మొదలైన వాటిని అవగాహన చేసుకుంటాడు.

స్పష్టీకరణలు:
- భావనలు, నియమాలు, సూత్రాలకు ఉదాహరణలిస్తాడు.
  ఉదా: సజీవులకు ఉదాహరణనిస్తాడు.
- వివిధ భావనలు, సూత్రాలు, నియమాలను వివరిస్తాడు.
- ఇచ్చిన వాక్యంలోని దోషాన్ని సవరించి సరి చేస్తాడు.
- వివిధ భావనలు, సూత్రాలు నియమా లను సరి చేస్తాడు.
- చిత్రపటాలకు, రేఖా పటాలకు, దత్తాంశాలకు వ్యాఖ్యానం రాస్తాడు.
- విజ్ఞాన సూత్ర సత్యాలను, భావాలను వర్గీకరిస్తాడు.
- సమస్యలను సాధిస్తాడు.
- విజ్ఞానశాస్త్ర పరికరాలను, రసాయనాలను ఎంపిక చేసుకుంటాడు.
- భౌతిక రాశులకు సరైన ప్రమాణాలు తెలుపుతాడు.
- శాస్త్ర సత్యాలు, భావనలను, ప్రక్రియలను సరిపోల్చుతాడు.

లక్ష్యం - III వినియోగం: విద్యార్థి తాను నేర్చుకున్న విజ్ఞానశాస్త్ర విజ్ఞానాన్ని పరిస్థితులకనుగుణంగా వినియోగిస్తాడు.

స్పష్టీకరణలు:
- భావనలు, సూత్రాలు, నియమాలు మొదలైన వాటిని విశ్లేషిస్తాడు.
- విద్యార్థులు నేర్చుకున్న జ్ఞానాన్ని నేరుగా వినియోగిస్తారు.
- శాస్త్ర ప్రక్రియలకు, దృగ్విషయాలకు కారణాలను తెలుపుతాడు.
- కారణానికి, ఫలితానికి మధ్య సంబం ధాన్ని ఏర్పరుస్తాడు.
- శాస్త్ర పరిశీలనలను వ్యాఖ్యానిస్తాడు.
- సామాన్యీకరణలను ప్రతిపాదిస్తాడు.
- సరైన ప్రయోగ విధానాలు, పరికరాలను సూచిస్తాడు.
- ప్రాగుక్తీకరించగలడు.
- దత్తాంశం ఆధారంగా నిర్ణయం తీసుకుంటాడు.

భావావేశ రంగం లక్ష్యాలు:
లక్ష్యం I: శాస్త్రీయ వైఖరుల అభివృద్ధి
లక్ష్యం II: అభిరుచి
లక్ష్యం III: అభినందన

మానసిక చలనాత్మక రంగ లక్ష్యాలు
లక్ష్యం I: చిత్రలేఖన నైపుణ్యం
లక్ష్యం II: హస్త నైపుణ్యాలు
లక్ష్యం III: పరిశీలన నైపుణ్యాలు
లక్ష్యం IV: అభివ్యంజన నైపుణ్యాలు
లక్ష్యం V: నివేదన నైపుణ్యాలు

విజ్ఞాన శాస్త్రం- సహ సంబంధం

సహ సంబంధం ఆవశ్యకత:
- జ్ఞానాన్ని సంయుక్తపరచడం
- సమర్థవంతమైన అభ్యసనం
- శ్రమ ఆదా
- అభ్యసన బదలాయింపు

సహ సంబంధం- రకాలు:
- సహజసిద్ధం
- కృత్రిమ సహ సంబంధం
- వ్యవస్థీకృత సహ సంబంధం
- విజ్ఞానశాస్త్రానికి విద్యా ప్రణాళికలోని ఇతర పాఠ్యవిషయాలకు సంబంధం
- విజ్ఞానశాస్త్రం- భాష
- విజ్ఞానశాస్త్రం - చరిత్ర
- విజ్ఞానశాస్త్రం - భౌగోళిక శాస్త్రం
- విజ్ఞానశాస్త్రం- గణితం
- విజ్ఞానశాస్త్రం - చిత్రలేఖనం
- విజ్ఞాన శాస్త్రం - చేతిపని
- విజ్ఞాన శాస్త్రం-దైనందిన జీవితానికి సంబంధం

విద్యా లక్ష్యాలు
- జ్ఞాన రంగం: జ్ఞానానికి సంబంధించిన వాటిని జ్ఞప్తికి తెచ్చుకోవడం, గుర్తించడం, మానసిక సామర్థ్యాలు, నైపుణ్యాలను అభివృద్ధి పరచడం.
- భావావేశ రంగం: ఆసక్తులు, విలువల్లో మార్పులు, అభినందనను పెంపొందించడం
- మానసిక చలనాత్మక రంగం: హస్తలాఘవ, మోటార్ నైపుణ్యాలు అభివృద్ధి చేయడం

బ్లూమ్ సూచించిన లక్ష్యాల వర్గీకరణ

శిశువు (ప్రవర్తన)

జ్ఞాన రంగం	భావావేశ రంగం	మానసిక చలనాత్మక రంగం
1. జ్ఞానం	1. గ్రహించడం	1. అనుకరణ
2. అవగాహన	2. ప్రతిస్పందించడం	2. హస్తలాఘువం
3. వినియోగం	3. విలువకట్టడం	3. సునిశితత్వం
4. విశ్లేషణ	4. వ్యవస్థాపనం	4. ఉచ్చారణ
5. సంశ్లేషణ	5. శీలస్థాపనం	5. స్వాభావీకరణం
6. మూల్యాంకనం		

గతంలో అడిగిన ప్రశ్నలు

1. విద్యార్థులు చేసే ప్రయోగాలకు కావాల్సిన పరికరాలను, వస్తు సామగ్రిని వారే తయారుచేసుకోవడాన్ని సూచించే విలువ? (డీఎస్సీ-2008)
   ఎ) క్రమశిక్షణ విలువ
   బి) ఉపయోగిత విలువ
   సి) సృజనాత్మక విలువ
   డి) వృత్తిపరమైన విలువ
2. అవగాహనలో ప్రవర్తనాత్మకమైన స్పష్టీకరణం ఎక్స్‌ట్రాపొలేషన్‌కు ఉదాహరణ? (డీఎస్సీ-2008)
   ఎ) కార్యనిర్వాహక సంబంధం తెలపడం
   బి) అన్వయం చేయడం, వర్ణించడం
   సి) పోల్చడం, తేడాలు చెప్పడం
   డి) ఒక పరిష్కారం నుంచి మరొక పరిష్కారానికి
3. సామర్థ్యాలను స్పష్టీకరించడంలో ఒక మౌలికాంశం? (డీఎస్సీ-2006)
   ఎ) అభ్యసన ఔచిత్యం బి) పరిస్థితులు
   సి) పరిసరాల అనుగుణ్యత
   డి) పాఠ్యాంశాలు
4. మానసిక చలనాత్మక రంగంలోని లక్ష్యాల క్రమం? (డీఎస్సీ-2006)
   ఎ) అనుకరణ, నిర్వహణ, సునిశితత్వం, సమన్వయం, స్వాభావీకరణం
   బి) అనుకరణ, ప్రతిస్పందన, విలువ, సమన్వయం, శీలస్థాపనం
   సి) గ్రహించడం, నిర్వహణ, సునిశితత్వం సమన్వయం, శంకుస్థాపన
   డి) గ్రహించడం, ప్రతిస్పందన, విలువ, సమన్వయం, స్వాభావీకరణం
5. ఇందులో ఒకటి మానసిక చలనాత్మక రంగంలోని లక్ష్యం? (డీఎస్సీ-2001)
   ఎ) పరిసరాల్లో ఉన్న వాటిపై ఆసక్తి ప్రదర్శించడం
   బి) శాస్త్ర సంబంధమైన భావనలు గుర్తించడం
   సి) పటాలు గీయడంలో నైపుణ్యం
   డి) శాస్త్ర జ్ఞానాన్ని వినియోగించడం
6. మన ప్రకృతి సంపదను, వనరులను సద్వినియోగం చేసుకోవడం అనేది శాస్త్రపరంగా ఏ విలువను పెంపొందిస్తుంది? (డీఎస్సీ-2001)
   ఎ) బౌద్ధిక విలువ బి) సౌందర్య విలువ
   సి) ఉపయోగిత విలువ డి) వృత్తి విలువ
7. విద్యార్థి గడించిన సామర్థ్యాలను సూచించేవి? (డీఎస్సీ-2001)
   ఎ) ఉద్దేశాలు బి) లక్ష్యాలు
   సి) నైతిక విలువలు డి) స్పష్టీకరణలు
8. విజ్ఞానశాస్త్రాన్ని ఇతర సబ్జెక్టులతో సహసంబంధం కలిగించడం? (డీఎస్సీ-2000)
   ఎ) కష్టం బి) సులువు
   సి) ఇవేవీ కావు డి) మౌలికమైంది
9. ప్రయోగాలు/ కృత్యాలు చేయడం దేనికి సంబంధించింది? (డీఎస్సీ-2000)
   ఎ) అవగాహన బి) జ్ఞానం
   సి) నైపుణ్యం డి) అభినందన
10. క్షేత్ర పర్యటన ఏ రంగంలోనిది? (డీఎస్సీ-1998)
   ఎ) జ్ఞానాత్మక రంగం
   బి) మానసిక చలనాత్మక రంగం
   సి) భావావేశ రంగం డి) పైవేవీ కావు
11. ‘విద్యార్థి నమ్మకంగా తన పరిశీలనలను నమోదు చేయడం’ ఏ ముఖ్య లక్షణాన్ని సూచిస్తుంది? (డీఎస్సీ-1994)
   ఎ) అవగాహన బి) వైఖరి
   సి) నైపుణ్యం డి) జ్ఞానం

సమాధానాలు

1) సి; 2) ఎ; 3) ఎ; 4) ఎ;
5) సి; 6) సి; 7) డి; 8) డి;
9) సి; 10) సి; 11) సి.

మాదిరి ప్రశ్నలు


1. విద్యా విషయక లక్ష్యాలను వర్గీకరించింది?
   ఎ) R.C. రాస్ బి) C.P.S. నాయర్
   సి) బ్లూమ్ డి) స్మిత్
2. ఎక్స్‌ట్రాపొలేషన్ దేనికి సంబంధించింది?
   ఎ) అనునాదం బి) అవగాహన
   సి) పరికల్పన డి) హేతుకీకరణ
3. 'Taxonomy of Educational Objectives'.. ఎవరి రచన?
   ఎ) బ్లూమ్ బి) థార్న్‌డైక్
   సి) అరిస్టాటిల్ డి) గాగ్నే
4. ఎత్తుకు, గురుత్వ త్వరణానికి సంబంధం తెలపడం ____
   ఎ) వినియోగం బి) జ్ఞానం
   సి) అవగాహన డి) సంశ్లేషణ
5. బొమ్మలు గీయడం ఏ రంగానికి చెందింది?
   ఎ) భావావేశ బి) జ్ఞానాత్మక
   సి) మానసిక చలనాత్మక డి) ఏదీకాదు
6. భావావేశ రంగాన్ని వివరించినవారు?
   ఎ) గేట్స్ బి) విలియమ్స్
   సి) క్రాత్‌హోల్ డి) బ్లూమ్

సమాధానాలు

1) సి; 2) బి; 3) ఎ; 4) సి; 5) సి; 6) సి.

ఇత్తడి ఏయే లోహాల మిశ్రమ లోహం?

ప్రకృతిలో బంగారం, ప్లాటినం లాంటి లోహాలు మాత్రమే స్వేచ్ఛాస్థితిలో లభిస్తాయి. మిగిలినవి ఆక్సైడ్‌లు, సల్ఫైడ్‌లు, కార్బొనేట్లు, బై కార్బొనేట్లు లాంటి సమ్మేళనాల రూపంలో లభిస్తాయి. వీటి నుంచి స్వచ్ఛమైన లోహాన్ని నిష్కర్షణ (వెలికితీసే పద్ధతి) చేసే ప్రక్రియల గురించి చర్చించేదే లోహశాస్త్రం.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం

లోహశాస్త్రం

ప్రకృతిలో లోహం లభించే వివిధ సమ్మేళనాలనే 'ఖనిజాలు' అంటారు. ఖనిజాలన్నింటిలో దేని నుంచి వ్యాపారాత్మకంగా లాభదాయకమైన పద్ధతిలో లోహాన్ని వెలికితీయగలమో దాన్ని 'ధాతువు' అంటారు. అంటే ఖనిజాలన్నీ ధాతువులు కావు. ఉదాహరణకు అల్యూమినియం ఖనిజాలు – కోరండం, బాక్సైట్, క్రయొలైట్. వీటిలో బాక్సైట్ నుంచి మాత్రమే వ్యాపార సరళిలో అల్యూమినియం లోహాన్ని ఉత్పత్తి చేస్తారు. కాబట్టి అల్యూమినియం ధాతువు బాక్సైట్. ధాతువులో ఉండే మలినాలను 'గాంగ్ లేదా 'మాట్రిక్స్' అంటారు.

కొన్ని లోహాల ముఖ్య ఖనిజాలు

లోహం	ఖనిజం
అల్యూమినియం	బాక్సైట్, కోరండం క్రయొలైట్
ఇనుము	హెమటైట్, మాగ్నటైట్, సిడిరైట్, లియొనైట్, ఐరన్ పైరెటీస్
రాగి (తామ్రం)	కాపర్ గ్లాన్స్, కాపర్ పైరెటీస్ మాలకైట్
సీసం (లెడ్)	గెలీనా, సెరలైట్
పాదరసం	సిన్నబార్
యురేనియం	పిచ్‌బ్లెండ్
జింక్	జింక్ బ్లెండ్ (స్ఫాలరైట్) కాలమైన్, జింకైట్ (ఫిలాసఫర్ ఊల్)

- ధాతువును గాలి లేకుండా బాగా వేడిచేసి బాష్పశీల మలినాలను తొలగించడాన్ని భస్మీకరణం (Calcination) అంటారు. ఉదాహరణకు లైమ్‌స్టోన్ ($CaCO_3$)ను వేడిచేస్తే విఘటనం చెంది CO_2 విడుదల చేస్తూ కాల్షియం ఆక్సైడ్‌ను ఏర్పరుస్తుంది.
- ధాతువును గాలి సమక్షంలో అధిక ఉష్ణోగ్రతలకు వేడి చేయడాన్ని భర్జనం (Roasti-ng) అంటారు.
- సాధారణంగా ధాతువు అనేది లోహం మాత్రమే కాకుండా రాళ్లు, ఇసుక, బంకమన్ను, మైకా, క్వార్ట్జ్ మొదలైన మలినాలతో కలిసి ఉంటుంది.
- ఒక ధాతువును ద్రవకారి (ద్రవీభవన ఉష్ణోగ్రత తగ్గించేది)ని కలిపి లేదా కలపకుండా అధిక ఉష్ణోగ్రత వద్ద వేడి చేయడం ద్వారా లేదా సల్ఫైడ్ ఖనిజాన్ని ద్రవస్థితిలో పొందడాన్ని 'ప్రగలనం' అంటారు.
- శుద్ధలోహం కంటే మిశ్రమలోహం ఉపయోగకర గుణాలు అధికం. ఉదాహరణకు స్వచ్ఛమైన బంగారానికి కొద్దిగా రాగిని కలిపితే దాని గట్టితనం పెరుగుతుంది.

మాదిరి ప్రశ్నలు

1. అత్యంత సాగే గుణం ఉన్న లోహం ఏది?
   1) వెండి 2) బంగారం
   3) రాగి 4) ఇనుము
2. కిందివాటిలో అల్యూమినియం ధాతువు ఏది?
   1) హెమటైట్ 2) సిన్నబార్
   3) గెలీనా 4) బాక్సైట్
3. జతపరచండి.

లోహం	ఖనిజం
ఎ) ఇనుము	1. గెలీనా
బి) రాగి	2. సిన్నబార్
సి) సీసం	3. మాగ్నటైట్
డి) మెర్క్యురీ	4. మాలకైట్

	ఎ	బి	సి	డి
1)	1	3	2	4
2)	3	1	4	2
3)	3	4	1	2
4)	2	4	3	1

4. ఇనుమును శుద్ధి చేసే బ్లాస్ట్ కొలిమిలో కార్బన్ మోనాక్సైడ్ సమక్షంలో ఐరన్ ఆక్సైడ్‌పై జరిగే ప్రక్రియ?
   1) ఆక్సీకరణం 2) క్షయకరణం
   3) జలవిశ్లేషణ 4) విద్యుద్విశ్లేషణ
5. బ్లాస్ట్ కొలిమిలో ఉపయోగించే గరిష్ఠ ఉష్ణోగ్రత?
   1) 500 °C 2) 1500 K
   3) 1500 °C 4) 750 °C
6. గుల్లబారి ఉండే ఇనుమును ఏమంటారు?
   1) పిగ్ ఐరన్ 2) స్పాంజ్ ఐరన్
   3) కాస్ట్ ఐరన్ 4) పోరస్ ఐరన్
7. లైమ్‌స్టోన్‌లో లభించే ప్రధాన ఖనిజం?
   1) మెగ్నీషియం 2) సోడియం
   3) కాల్షియం 4) బేరియం
8. పొటాషియంతో పాటు మెగ్నీషియం లభించే ఖనిజం?
   1) కార్నలైట్ 2) హెమటైట్
   3) మాగ్నసైట్ 4) మాగ్నటైట్
9. జతపరచండి.

ఎ) కార్బొనేట్ ఖనిజం	1. కార్నలైట్
బి) సల్ఫైడ్ ఖనిజం	2. పిచ్ బ్లెండ్
సి) ఆక్సైడ్ ఖనిజం	3. కాపర్ పైరెటీస్
డి) క్లోరైడ్ ఖనిజం	4. లైమ్ స్టోన్

	ఎ	బి	సి	డి
1)	2	1	3	4
2)	1	3	2	4
3)	4	3	2	1
4)	3	2	4	1

10. మోనోజైట్ ఇసుకలో ప్రధానంగా లభించేది?
    1) థోరియం 2) రేడియం
    3) ప్రొన్షియం 4) పొలోనియం
11. ఇనుము రకాలలో అత్యంత శుద్ధమైంది?
    1) పోత ఇనుము 2) చేత ఇనుము
    3) స్పాంజ్ ఇనుము 4) దుక్క ఇనుము
12. గాలి లేకుండా ధాతువును వేడిచేసే ప్రక్రియను ఏమంటారు?
    1) భర్జనం 2) భస్మీకరణం
    3) నిక్షాళనం 4) ప్రగలనం
13. భూ పటలంలో పుష్కలంగా లభించే లోహం ఏది?
    1) జింక్ 2) ఇనుము
    3) అల్యూమినియం 4) రాగి
14. తన ద్వారా విద్యుత్తును ప్రవహింపజేయ నివ్వనప్పటికీ (అథమ విద్యుత్ వాహకం) ఉష్ణాన్ని ప్రవహింపజేయనిచ్చేది (ఉష్ణవాహకం) ఏది?
    1) ఆస్బెస్టాస్ 2) మైకా (అభ్రకం)
    3) సెల్యులాయిడ్ 4) స్టీల్
15. స్టెయిన్‌లెస్ స్టీల్ వేటి మిశ్రమ లోహం?
    1) ఐరన్ 2) కార్బన్
    3) క్రోమియం 4) పైవన్నీ
16. ఇత్తడి (బ్రాస్) ఏయే లోహాల మిశ్రమ లోహం?
    1) జింక్, రాగి 2) నికెల్, ఐరన్
    3) నికెల్, జింక్ 4) నికెల్, రాగి
17. కంచు (బ్రాంజ్) వేటి మిశ్రమ లోహం?
    1) కాపర్, టిన్ 2) జింక్, రాగి
    3) నికెల్, జింక్ 4) ఐరన్, కార్బన్
18. సౌరశక్తి పానెల్‌లో ఉపయోగించే మూలకం ఏది?
    1) టైటానియం 2) ఐరన్
    3) సిలికాన్ 4) టిన్
19. గన్ మెటల్‌లో ఉండే లోహాలేవి?
    1) ఇనుము, నికెల్ 2) ఇనుము, తగరం
    3) రాగి, తగరం 4) రాగి, జింక్
20. పాదరసం ఒక అనుఘటకంగా ఉన్న మిశ్రమ లోహం?
    1) అమాల్గం 2) స్టీల్
    3) ఎమల్షన్ 4) పాలీమర్
21. మిశ్రమ లోహం అనేది?
    1) ద్రావణం 2) ఎమల్షన్
    3) కొల్లాయిడ్ 4) పాలీమర్
22. లోహంలో ధాతువుతో పాటు ఉండే మలినాలను ఏమంటారు?
    1) ఖనిజం 2) గాంగ్
    3) ద్రవకారి 4) ఫ్లక్స్
23. ఇనుము సల్ఫైడ్ ధాతువు ఏది?
    1) మాగ్నటైట్ 2) హెమటైట్
    3) ఐరన్ పైరెటీస్ 4) మాలకైట్
24. లోహ నిష్కర్షణలో ఉపయోగించే చార్జ్ అనేది?
    1) విద్యుదావేశ ఎలక్ట్రోడ్
    2) ధాతువు + కోక్
    3) ధాతువు + సున్నపురాయి + కోక్
    4) ధాతువు + సున్నపురాయి
25. చేత ఇనుములో ఉండే కార్బన్ శాతం?
    1) 0.1% 2) 0.2%
    3) 1% 4) 2%
26. కిందివాటిలో సిల్వర్ అనుఘటకంగా లేని మిశ్రమ లోహం ఏది?
    1) హార్న్ సిల్వర్ 2) జర్మన్ సిల్వర్
    3) రూబీ సిల్వర్ 4) స్టెర్లింగ్ సిల్వర్
27. హెల్మెట్ల తయారీలో వాడే మిశ్రమ లోహం?
    1) మాగ్నాలియం 2) క్రోమ్ స్టీల్
    3) మాంగనీస్ స్టీల్ 4) నికెల్ స్టీల్
28. ముడి ఖనిజంలో లోహంతో పాటు ఇసుక, రాళ్లు, బంకమన్ను మొదలైన మలినాలతో ఉండే మిశ్రమాన్ని ఏమంటారు?
    1) ఫ్లక్స్ 2) గాంగ్
    3) పోలింగ్ 4) లోహ మలం
29. జర్మన్ సిల్వర్‌లో ఉండే లోహాలేవి?
    1) కాపర్ 2) నికెల్
    3) జింక్ 4) పైవన్నీ
30. కిందివాటిలో కాయినేజ్ లోహాలు ఏవి?
    1) కాపర్ 2) బంగారం
    3) వెండి 4) పైవన్నీ
31. బ్లేడ్ల తయారీలో వాడే స్టీల్ ఏది?
    1) క్రోమ్ స్టీల్ 2) మాంగనీస్ స్టీల్
    3) ఇన్వార్ స్టీల్ 4) టంగ్‌స్టన్ స్టీల్
32. శస్త్ర చికిత్స సాధనాల తయారీలో ఉపయోగించే మిశ్రమ లోహం?
    1) స్టెయిన్‌లెస్ స్టీల్ 2) మాంగనీస్ స్టీల్
    3) నిక్రోమ్ 4) మాగ్నాలియం
33. ఉక్కు (స్టీల్) తుప్పు పట్టకుండా నిరోధించేది?
    1) నికెల్ 2) ఇనుము
    3) క్రోమియం 4) కార్బన్
34. స్టెయిన్‌లెస్ స్టీల్‌లో ఎంతశాతం క్రోమియం ఉంటుంది?
    1) 5–8 2) 12–20
    3) 10–15 4) 1–5
35. అయస్కాంతాల తయారీకి వాడే మిశ్రమ లోహం?
    1) స్టీల్ 2) నిక్రోమ్
    3) ఆల్నికో 4) స్టెయిన్‌లెస్ స్టీల్
36. ఎమాల్గం ఏర్పరచని లోహం ఏది?
    1) ఐరన్ 2) ప్లాటినం
    3) సోడియం 4) 1, 2
37. వంటపాత్రల తయారీకి వాడే స్టీలు ఏది?
    1) ఎక్కువ కార్బన్ ఉన్న స్టీల్
    2) ఎక్కువ క్రోమియం ఉన్న స్టీల్
    3) ఇన్వార్ స్టీల్
    4) ఎక్కువ నికెల్ ఉన్న స్టీల్
38. స్టెయిన్‌లెస్ స్టీల్ ఏ లోహాల మిశ్రమం?
    (పోలీస్ కానిస్టేబుల్–2011)
    1) ఇనుము + కార్బన్ + నికెల్
    2) ఇనుము + క్రోమియం + నికెల్
    3) ఇనుము + క్రోమియం + జింక్
    4) ఇనుము + లెడ్
39. ఫ్యూజులు, నిరోధక తీగల తయారీలో వాడే మిశ్రమం?
    1) నిక్రోమ్
    2) ఇన్వార్ స్టీల్
    3) బెల్ మెటల్
    4) కంచు
40. గేర్లు, బేరింగ్‌ల తయారీలో వాడే మిశ్రమ లోహం?
    1) గన్ మెటల్
    2) ఎలక్ట్రాన్
    3) మాగ్నాలియం
    4) బెల్ మెటల్

సమాధానాలు

1) 2; 2) 4; 3) 3; 4) 2; 5) 3; 6) 2; 7) 3; 8) 1; 9) 3; 10) 1; 11) 2; 12) 2; 13) 3; 14) 2; 15) 4; 16) 1; 17) 1; 18) 3; 19) 3; 20) 1; 21) 1; 22) 2; 23) 3; 24) 3; 25) 2; 26) 2; 27) 3; 28) 2; 29) 4; 30) 4; 31) 1; 32) 1; 33) 3; 34) 2; 35) 3; 36) 4; 37) 2; 38) 2; 39) 1; 40) 1.

Simple problem must have..

BANK EXAMS

REASONING

Reasoning based on logic contains of the following topics..

Statements And Assumptions:

Questions of this type are a regular feature of all the competitive examinations, these days. In these questions, a statement is followed by two or more assumptions. The candidate is required to assess the given statement and decide which of the given assumptions is implicit in the statement. To understand the pattern of these questions, it is very essential to know what the terms statement and assumption stand for. Whenever we communicate with others, we make several statements. Therefore, statement is a part of our speech or what we speak to others.

In the process of communication, most of the ideas remain unuttered. As a result, these ideas may not find expression in the statement. However, this unuttered message is very much implied in a statement. Implied, an assumption is something that can be supposed or assumed on the basis of a given statement.

Statements And Course Of Action:

Course of action is a decision which a person makes invariably in his life following a problem. In these questions a problem is given in the form of a statement and is followed by two or more decisions in the form of course of action.

For solving these questions, remember the following points:

1. Correct course of action should either lessen the problem or improve the situation created by the problem.
2. Simple problem must have simple course of action and not a complex one which may create more problems than to solve or reduce it.
3. Course of action should be feasible and should relate with the practical aspect of life

Cause and Effect:

Any occurrence of incident definitely has a cause behind it. The occurrence is called event and the reason behind this occurrence is its cause.

- **Principal Cause:** This is major condition that governs occurrence or non occurrence of an event. Though only its presence does not guarantee happening of that event (as event might need some more occurrences too) but its absence would definitely lead to non-occurrence of this event.
- **Immediate Cause:** This is the condition that triggers the event, so is an important cause that has just happened before occurrence of the event, and caused the event to happen.
- **Principal and Immediate cause:** Generally, examinations have questions to find principal and immediate cause. These are causes that are most proximate in time and one of the most important reasons for the occurrence of this 'event'.



Statements and Arguments:

Question based on statement and arguments are the common features of all competitive examinations. In these questions a statement is followed by two arguments. Candidates are required to distinguish between the strong and weak arguments. Generally, both the arguments are contrary to each other and refer to the positive and negative results of the action as mentioned in the statement. A strong argument is that which touches the practical and real aspect of the situation as described in the statement. A weak argument is very simple, superfluous, ambiguous and long drawn one.

Following points should be taken into consideration while choosing a strong argument.

1. A strong argument should give the realistic diagnosis while choosing a strong argument.
2. A strong argument should be the deep analysis of the topic dealt within the statement.
3. A strong argument should relate with the statement and be supported up by facts or established notations.
4. A strong argument should not be mere reiteration of the situation given in the statement.
5. **Statements and Inferences:** An inference is something which is not directly stated but can be inferred from the given facts.

Read the following information carefully and answer the given questions:

The convenience of online shopping is what I like best about it. Where else can you shop even at midnight wearing your night suit? You do not have to wait in a line or wait till the shop assistant is ready to help you with your purchases. It is a much better experience as compared to going to a retail store.
- A consumer's view

1. **Which of the following can be a strong argument in favour of retail store owners?**
   1) Online shopping portals offer a great deal of discounts which retail stores offer only during the sale season.
   2) One can compare a variety of products online which cannot be done at retail stores.
   3) Many online shopping portals offer the 'cash on delivery' feature which are sceptical about online payments.
   4) Many consumers prefer shopping at retail stores which are nearer to their houses.
   5) In online shopping the customer may be deceived as he cannot touch the product he is paying for.

A: 5; The argument in favour of the retail store owners should highlight short-comings or disadvantages of the online shopping and same is effectively done by the argument given in option (5).

2. **Which of the following can be inferred from the given information? (An inference is something that is not directly stated but can be inferred from the given information)**
   1) One can shop online only at night.
   2) Those who are not comfortable using computers can never enjoy the experience of online shopping.
   3) All retail stores provide shopping assistants to each and every customer.
   4) The consumer whose view is presented has shopped at retail stores as well as online.
   5) The consumer view is presented does not have any retail stores in her vicinity.

A: 4; The statement given by the consumer highlights the advantages of online shopping in comparison to shopping in a retail store. Therefore it can be inferred that the consumer has shopped at both retail stores and on online.

Read the following information carefully and answer the given question:

Many manufacturing companies are now shifting base to the rural areas of the country as there is a scarcity of space in urban areas. Analysts say that this shift will not have a huge impact on the prices of the products manufactured by these companies as only about 30% consumers live in urban areas.

3. **Which of the following may be a consequence of the given information?**
   1) The prices of such products will decrease drastically in the urban areas.
   2) People living in urban areas will not be allowed to work in such manufacturing companies.
   3) These manufacturing companies had set-ups in the urban areas before shifting base.
   4) Those who had already migrated to the urban areas will not shift back to rural areas.
   5) The number of people migrating from rural to urban areas in search of jobs may reduce .

A: 5; As the manufacturing companies are shifting their base to rural areas, the educated and eligible rural youth will get the jobs in rural areas thereby reducing the migration to urban areas.

Read the following information carefully and answer the given questions:

Despite repeated announcements that mobile phones were not allowed in the examination hall, three students were caught with their mobile phones.

A) Mobile phones nowadays have a lot of features and it is easy to cheat with their help.
B) The invigilator must immediately confiscate the mobile phones and ask the students to leave the exam hall immediately.
C) Mobile phones are very expensive and leaving them in bags outside the exam hall is not safe.
D) There have been incidents where students who left the exam hall early stole the mobile phones kept in the bags of the students who were writing the exam.
E) The school authorities must ask the students to leave their phones in the custody of the invigilator before the exam in order to avoid thefts of mobile phones.
F) None of the other students were carrying their phones in the exam hall.

4. **Which of the following among A, B, E and F may be the reason behind the school making such announcements before the exam?**
   1) Only B 2) Both B& E
   3) Only F 4) Only A
   5) Both E & F

A: 4; As the mobile phones have a lot of features, the students can cheat in the examination by getting the answers through the tools using internet and google search engines. This is the reason behind such announcement.

5. **Which of the following among A, B, D and F can be an immediate course of action for the invigilator?**
   1) Only B 2) Both A & D
   3) Only A
   4) Both D & F
   5) Only F

A: 1; As the most practical solution is asking the students to deposit the mobile phones with the invigilator or else confiscate the same whenever they enter.